

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 15 సంచిక: 282

సోమవారం 26-6-2023

SIMULTANEOUSLY PRINTED AT CHENNAI | DELHI | VIJAYAWADA | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



సుతీర్థ-ఐహిక జోడీకి టైటిల్

వరల్డ్ టేబుల్ టెన్నిస్ టోర్నీలో సత్తా చాటిన భారత క్రీడాకారులు
- 12లో



చిన్న పెట్టుబడి.. పెద్ద నిధిగా

స్మాల్‌క్యాప్ కంపెనీల్లో అధిక రాబడులు.. పొరపాటు జరిగితే పెట్టుబడికీ నష్టం
-13లో



- సత్యదేవుని సన్నిధిలో త్వరలో మాడ వీధులు
- నాలుగు వైపులా 60 అడుగుల వెడల్పున నిర్మాణం
- పలు నిర్మాణాలతో మారనున్న ఆలయ రూపురేఖలు
- రూ.20 కోట్లతో ప్రణాళిక

అన్నవరం: రత్నగిరిపై స్వయంభువుగా వెలసిన భక్తవరదుడు సత్యదేవుని సన్నిధి త్వరలో కొత్త శోభను సంతరించుకోనుంది. స్వామివారికి రథయాత్ర నిర్వహించేందుకు వీలుగా.. దేవస్థానం చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా ఆలయానికి నాలుగు వైపులా విశాలమైన మాడ వీధుల నిర్మాణానికి రంగం సిద్ధమవుతోంది. తిరుమల మాదిరిగానే స్థానిక సత్యదేవుని దివ్యక్షేత్రానికి నలువైపులా 60 అడుగుల వెడల్పున మాడ వీధుల నిర్మాణానికి ప్రణాళిక సిద్ధం చేశారు. దీంతో ఇప్పటి వరకూ ఇరుకుగా ఉన్న ఆలయ ప్రాంగణం మరింత విశాలం కానుంది.

కార్తీకం నాటికి..

అన్నవరం దేవస్థానంలో మొత్తం రూ.20 కోట్లతో కొత్తగా వివిధ నిర్మాణాలు చేపడుతున్నారు. ఇప్పటికే రత్నగిరికి వచ్చే భక్తులు సులభంగా రాకపోకలు సాగించేలా ఘాట్ రోడ్లు, వాహనాలు నిలిపేందుకు విశాలమైన పార్కింగ్ స్థలం, సీఆర్‌ఓ కార్యాలయం వద్ద కేశఖండనశాలతో పాటు పలు నిర్మాణాలు చురుకుగా జరుగుతున్నాయి. వచ్చే కార్తిక మాసం నాటికి నమూనా ఆలయం, ఘాట్ రోడ్లు, నాలుగు మాడ వీధుల నిర్మాణం పూర్తి చేయాలని నిర్ణయించినట్లు దేవస్థానం ఈఓ ఎస్ఎస్ చంద్రశేఖర్ అజాద్ 'సాక్షి'కి ఆదివారం తెలిపారు. ప్రస్తుతం దేవస్థానంలో రూ.10 కోట్లతో వివిధ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. జాతీయ రహదారిపై రూ.3.57 కోట్లతో స్వామివారి నమూనా ఆలయం నిర్మిస్తున్న విషయం తెలిసిందే. భక్తుల కోసం కొండ దిగువన రూ.2 కోట్లతో 4 షెడ్లు, స్వామివారి ఆలయం వద్ద నివేదన శాలకు ఒక షెడ్డు, తూర్పు రాజగోపురానికి దిగువన రెండు షెడ్లు నిర్మిస్తున్నారు.

మాడ వీధులు నిర్మిస్తారిలా..

సత్యదేవుని ఆలయం చుట్టూ నాలుగు మాడ వీధులను 60 అడుగుల వెడల్పున ఈశాన్యం, తూర్పు అధికంగా ఉండేలా నిర్మించనున్నారు. రామాలయం పక్క నుంచి 30 వీఐపీ సత్రం వరకు, అక్కడి నుంచి కేశఖండనశాల దిగువన ఘాట్ రోడ్డును కలుపుకుని మెయిన్ క్యాంటీన్ మీదుగా రామాలయం వరకూ ఈ మాడ వీధులు నిర్మిస్తారు. రామాలయం ఫ్లోరింగ్‌కు సమానంగా ఈ వీధుల నిర్మాణం చేపడతారు. కేశఖండన శాల ఘాట్ రోడ్డును 30 అడుగుల మేర ఎత్తు చేస్తారు.

మరిన్ని నిర్మాణాలు

- సత్యగిరి పక్కన చదును చేస్తున్న స్థలాన్ని 650 కార్లు పట్టేలా అభివృద్ధి చేస్తారు. ఇందుకోసం మల్టీ లెవెల్ పార్కింగ్ పద్ధతిలో శ్లాబ్ వేయనున్నారు.
- 30 వీఐపీ సత్రాన్ని త్వరలోనే కూల్చివేస్తారు. ఆ స్థలంలో భక్తులు విశ్రాంతి తీసుకునేందుకు ఏర్పాట్లు చేస్తారు.
- సీఆర్‌ఓ కార్యాలయం నుంచి భక్తులు నేరుగా పశ్చిమ రాజగోపురం వద్దకు చేరుకునేలా స్థలాన్ని చదును చేస్తారు.
- సీఆర్‌ఓ కార్యాలయం దిగువ నుంచి రెండో ఘాట్ రోడ్డుకు కొత్తగా 400 మీటర్ల పొడవున రోడ్డు వేస్తున్నారు. ఈ పనులు కార్తిక మాసం నాటికి పూర్తవుతాయి. ఈ రోడ్డు నుంచే భక్తుల వాహనాలను దిగువకు పంపిస్తారు.
- ఆగమ పాఠశాల ముందున్న స్థలాన్ని చదును చేసి, దాతలు ముందుకు వస్తే అతిథి గృహం నిర్మిస్తారు. దాతలు ముందుకు రాకపోతే మినీ శివసదన్ సత్రం నిర్మించాలని నిర్ణయించారు.
- ఆలయంలో ప్రదక్షిణ చేసే మార్గంలో సత్యదేవుని ఉత్సవమూర్తులు, వివిధ దేవతామూర్తుల వెండి విగ్రహాలను గోడలకు అతికించాలని ఆలోచిస్తున్నారు. దీని వలన ప్రదక్షిణ చేసే భక్తులు ఆ విగ్రహాలను దర్శించి, సంతృప్తి పొందే అవకాశం ఉంటుంది.
- సత్యదేవుని ప్రధానాలయానికి ఇరువైపులా ఉన్న మెట్లను విశాలం చేసే పనులు ప్రారంభించారు. దీనివలన రెండు వరుసలలో భక్తులు రాకపోకలు సాగించవచ్చు.

న్యూస్‌రీల్

ప్రవాసంలోకి ప్రిగోజిన్



బెలారస్ అధ్యక్షుడు మధ్యవర్తిత్వంతో రష్యాలో ప్రైవేటు సైన్యం 'వాగ్నర్' తిరుగుబాటు ముగిసింది. వాగ్నర్ చీఫ్ ప్రిగోజిన్ వెనక్కి తగ్గారు. ఉక్రెయిన్ యుద్ధంలో రష్యాకు మద్దతుగా ఉన్న బెలారస్‌కు ప్రిగోజిన్ పయనమయ్యారు. సైనికులను తిరిగి ఉక్రెయిన్ శిబిరాల్లోకి వెళ్లిపోవాలని ఆదేశించారు.
వివరాలు 6లో ▸

మణిపూర్‌లో సైన్యాన్ని చుట్టుముట్టిన మహిళలు



మణిపూర్‌లో మిలిటెంట్లను విడిపించుకునేందుకు పెద్ద సంఖ్యలో మహిళలు భద్రతా బలగాలను దిగ్బంధించారు. దీంతో రోజంతా ఉద్రిక్తత కొనసాగింది. చివరకు తమ అదుపులో ఉన్న మెయిటీ వర్గానికి చెందిన 12 మంది మిలిటెంట్లను భద్రతా బలగాలు విడిచిపెట్టాల్సి వచ్చింది.
వివరాలు 6లో ▸

'తీరం'పైనా ఇస్రో డేగ కన్ను!



దేశంలోకి అక్రమ చొరబాట్లను అడ్డుకునేందుకు నేవీ, కోస్ట్ గార్డ్‌లకు అవసరమైన ఉపగ్రహ పరిజ్ఞానాన్ని అందించేందుకు భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) సన్నద్ధమైంది. ఏపీ సహా దేశంలోని 13 తీరప్రాంత రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో మత్స్యకారుల బోట్లపై శాటిలైట్ టెర్మినళ్లు ఏర్పాటుకు ప్రణాళిక సిద్ధం చేస్తోంది.
వివరాలు 5లో ▸

ఉపాధికి స'పోర్టు'

మరింత మందికి భరోసా ఇచ్చేలా కాకినాడ యాంకరేజ్ పోర్టు విస్తరణ

ఇప్పటికే 30 వేల మందికి ఉపాధి కల్పన

- మరో 7 వేల మంది స్థానికులకు పనుల కల్పనే లక్ష్యంగా అడుగులు
- రూ.92 కోట్లతో అభివృద్ధి చేస్తున్న ఏపీ మారిటైమ్ బోర్డు
- జెట్టీ పొడవు 930 మీటర్ల నుంచి 1,190 మీటర్లకు విస్తరణ
- 5 మిలియన్ టన్నులకు పెరగనున్న పోర్టు సామర్థ్యం
- తక్కువ ఖర్చుతో రవాణాకు మరింత ఊపు
- సమయం ఆదా.. పెరగనున్న ఆదాయం


చురుగ్గా జరుగుతున్న కాకినాడ యాంకరేజ్ పోర్టు విస్తరణ పనులు

కాకినాడ నుంచి సాక్షి ప్రతినిధి
చంద్రశేఖర్ మైలవరపు

రాష్ట్రంలో వీలున్న చోటల్లా విస్తృతంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలను పెంపొందించడమే లక్ష్యంగా అడుగులు ముందుకు వేస్తోంది వైఎస్ జగన్ ప్రభుత్వం. ఇందులో భాగంగా కాకినాడ యాంకరేజ్ పోర్టు సామర్థ్యాన్ని పెంపొందించడం ద్వారా అదనంగా ఏడు వేల మందికి ఉపాధి కల్పించేందుకు శ్రీకారం చుట్టింది. బియ్యం, మొక్కజొన్న, సిమెంట్ వంటి ఉత్పత్తులను తక్కువ ఖర్చుతో విదేశాలకు సులభంగా ఎగుమతి చేసుకునే వెసులుబాటు ఉండటం ఈ పోర్టు ప్రత్యేకత. దీని పనితీరు ఇతర పోర్టులకు భిన్నంగా ఉంటుంది. ఇతర మోడరన్ పోర్టులతో పోలిస్తే ఇందులో మానవ వనరుల వినియోగం చాలా అధికం. డీప్ వాటర్ పోర్టుల్లో నేరుగా పోర్టు నుంచే సరుకు రవాణా చేసుకునే వీలుంటుంది. కానీ.. యాంకరేజ్ పోర్టులో ఓడలు సముద్రం మధ్యలో లంగరు వేసి ఉంటాయి. వాటి వద్దకు చిన్న పడవల్లో సరుకును తీసుకెళ్లి నింపుతారు. ఇందుకోసం భారీ స్థాయిలో మానవ వనరుల వినియోగం అవసరమవుతుంది. ప్రస్తుతం కాకినాడ యాంకరేజ్ పోర్టు ప్రత్యక్షంగా.. పరోక్షంగా 30 వేల మందికి ఉపాధి కల్పిస్తోంది. కానీ.. కొన్ని దశాబ్దాలుగా ప్రభుత్వ నిరాదరణకు గురైంది. యాంకరేజ్ పోర్టును విస్తరిస్తే
మిగతా 2వ పేజీలో ▶


కైరోలో ప్రధాని నరేంద్ర మోదీకి ఈజిప్ట్ అత్యున్నత రాష్ట్ర గౌరవమైన 'ఆర్డర్ ఆఫ్ ది నైలు' అవార్డును అందజేస్తున్న ఆ దేశ అధ్యక్షుడు అబ్దెల్

ఇండియా హీరో మోదీ

ప్రధానిపై ఈజిప్టులో ప్రవాస భారతీయుల ప్రశంసలు

ఈజిప్టు అధ్యక్షుడితో మోదీ కీలక చర్చలు.. ఒప్పందాలు

6లో

'ఇండియా హీరో నరేంద్ర మోదీ' అంటూ ఈజిప్టులో నివసిస్తున్న ప్రవాస భారతీయులు భారత ప్రధానిపై ప్రశంసల వర్షం కురిపించారు. ప్రధాని మోదీ అమెరికాలో 4 రోజుల అధికారిక పర్యటన ముగించుకొని శనివారం ఈజిప్టులో అడుగుపెట్టారు. గత 26 ఏళ్ల తర్వాత భారత ప్రధాని ఈజిప్టులో పర్యటిస్తుండడం ఇదే మొదటిసారి. కాగా, ఈజిప్టు అత్యున్నత పౌర పురస్కారం 'ఆర్డర్ ఆఫ్ ద నైలు'ను ఈజిప్టు అధ్యక్షుడు అబ్దెల్ ఫతా ఎల్-సీసీ ఆదివారం భారత ప్రధాని మోదీకి ప్రదానం చేశారు. ఇప్పటిదాకా ఈజిప్టు సహా 13 దేశాలు తమ అత్యున్నత పౌర పురస్కారాలతో మోదీని సత్కరించాయి.

ఐటీ కొలువులకు 'వింగ్స్'

- గ్రూప్ స్నాప్ ఫెస్ట్–2023 పేరుతో జాబ్ ఫెయిర్
- విశాఖలో 21, 22 తేదీల్లో నిర్వహించేందుకు ఏర్పాట్లు
- హాజరుకానున్న 40 ఐటీ, 10 ఫార్మా కంపెనీలు, 10 స్టార్టప్‌లు.. గ్రాడ్యుయేట్లు, ఐటీ, అనుబంధ కంపెనీల మధ్య బాండింగ్ ఏర్పడేలా కార్యక్రమం
- వెబ్‌సైట్, బ్రోచర్ ఆవిష్కరించిన ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్


జీఎస్ఎఫ్ పోస్టర్లతో మంత్రి అమర్‌నాథ్

5లో

గడపల్లో ఘన స్వాగతం

83,83,908 గృహాలను సందర్శించిన ఎమ్మెల్యేలు

- సీఎం జగన్ లేఖను అందిస్తూ ప్రజలతో మమేకం.. ప్రభుత్వం చేకూర్చిన మేలును వివరించి మరో ఇంటికి
- 9,316 సచివాలయాల సందర్శన పూర్తి
- ఒక్కో సచివాలయంలో రెండేసి రోజులు గడిపిన ఎమ్మెల్యేలు 85 మంది
- 150 రోజులకు పైగా గడప గడపకూ వెళ్లిన ఎమ్మెల్యేలు 40 మంది
- ఒక్కో సచివాలయం పరిధిలో రూ.20 లక్షల విలువైన పనుల గుర్తింపు
- ఇప్పటికే 6,554 పనులు పూర్తి.. మరో 37,725 పనులు అప్‌లోడ్
- పనితీరుపై ప్రజల్లో సంతృప్తి


- వివరాలు 2లో

ఏపీలా 'చదువుదాం'

మన విద్యా సంస్కరణలపై జాతీయ స్థాయిలో ప్రశంసలు

- ఆదర్శనీయమని కొనియాడిన పలు రాష్ట్రాల ప్రతినిధులు
- పుణె 'జన్ భాగీదారీ'లో ప్రత్యేక ఆకర్షణగా ఏపీ స్టాల్
- రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో పలు కార్యక్రమాలు
- అందరినీ బడి బాట పట్టించేలా పథకాలు.. విద్యా రంగం తీరును కళ్లకు కట్టినట్లు వివరించిన ఏపీ
- స్వయంగా పరిశీలించేందుకు త్వరలో పలు రాష్ట్రాల ప్రతినిధుల రాక


ఇటీవల పుణెలో జరిగిన 'జన్ భాగీదారీ' సదస్సులో ఏర్పాటు చేసిన ఏపీ స్టాల్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో కేవలం నాలుగేళ్లలోనే ప్రభుత్వ బడి రూపురేఖలు మారాయి. బడికి వచ్చే విద్యార్థుల మోముల్లో వెలుగు నిండింది. ప్రపంచంతో పోటీ పడేలా పాఠ్యాంశాలు, బోధనలో మార్పులు, టెక్నాలజీ వినియోగం, చదువు పట్ల ఆసక్తి పెంచేలా పథకాలు.. వెరసి విద్యా రంగంలో
మిగతా 2వ పేజీలో ▶

బంగాళాఖాతంలో అల్పపీడనం

బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడినట్లు వాతావరణ శాఖ తెలిపింది. వచ్చే 2 రోజుల పాటు రాష్ట్రంలో మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని పేర్కొంది. అల్పపీడనం వల్ల సముద్రం అలజడిగా ఉంటుందని విశాఖ తుపాన్ హెచ్చరికల కేంద్రం తెలిపింది.
3లో

అధికారంలోకి రాగానే లాక్కొచ్చి కొడతాం

- మా జోలికి వస్తే ఊరుకునేది లేదు.. తన్ని తరిమేస్తాం
- వైసీపీ ప్రభుత్వంపై, టీటీడీ శ్రీవాణి ట్రస్టుపై విచారణ
- మలికిపురం సభలో జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్

3లో

నిస్తేజం.. గందరగోళం!

- పవన్‌కళ్యాణ్ వైఖరితో జనసేన శ్రేణుల్లో అయోమయం
- వివాదాల సుడిగుండంలో వారాహి యాత్ర.. టీడీపీతో పొత్తు ప్రస్తావనతో పడిపోయిన గ్రాఫ్
- దానిని నిలబెట్టుకునే ఎత్తుగడతో బోల్తా
- సవాళ్లను స్వీకరించకుండా పలాయన మంత్రం
- అజెండా లేకుండానే ఉమ్మడి 'తూర్పు'న ముగింపు
- వ్యక్తిగత విమర్శలతో మసకబారిన అభిమానం

3లో

సిలోన్ కాందిశీకుల కల నెరవేరింది

- స్వాతంత్య్రం అనంతరం చీరాల వలస వచ్చిన సిలోన్ కాందిశీకులు
- 43 ఏళ్ల తరువాత వైఎస్ జగన్ ప్రభుత్వంలో ఇంటి పట్టాల పంపిణీ

5లో

మోదీ కాల్ మిస్సైన రాష్ట్రపతి ముర్ము

రాష్ట్రపతి పదవికి నామినేషన్ వేయాలని కోరేందుకు స్వయంగా ప్రధాని మోదీయే చేసిన కాల్‌ను ముర్ము మిస్సయినట్లు తాజాగా తెలిసింది.
6లో

క్లుప్తంగా...

28న కురుపాంలో సీఎం పర్యటన

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 28న పార్వతీపురం మన్యం జిల్లా కురుపాంలో పర్యటించనున్నారు. 28వ తేదీ ఉదయం 8 గంటలకు సీఎం జగన్ తాడేపల్లిలోని నివాసం నుంచి బయలుదేరి.. 10 గంటలకు చినమేరంగి పాలిటెక్నిక్ కాలేజ్ హెలీప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి కురుపాంలోని బహిరంగ సభ వేదిక వద్దకు చేరుకుంటారు. జగనన్న అమ్మ ఒడి పథకం నాలుగో ఏడాది నిధులు విడుదల చేసి.. ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారు. అనంతరం అక్కడి నుంచి బయల్దేరి తాడేపల్లిలోని నివాసానికి చేరుకుంటారు.

నేడు వైఎస్సార్ లా నేస్తం ఆర్థిక సాయం

- విడుదల చేయనున్న సీఎం జగన్
- మొదటి విడత కింద రూ.6.12 కోట్లు జమ

సాక్షి, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన 2,677 మంది యువ న్యాయవాదుల ఖాతాల్లో నెలకు రూ.5 వేల స్టైఫండ్ చొప్పున 2023–24 సంవత్సరానికి మొదటివిడత 'వైఎస్సార్ లా నేస్తం' ఆర్థిక ప్రోత్సాహకాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం తన క్యాంపు కార్యాలయం నుంచి బటన్ నొక్కి విడుదల చేయనున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి జూన్ వరకు (5 నెలలు) ఒక్కొక్కరికి రూ. 25 వేల చొప్పున మొత్తం రూ.6,12,65,000 జమ చేయనున్నారు. ప్రభుత్వం కొత్తగా లా గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన యువ న్యాయవాదులు వృత్తిలో నిలదొక్కుకునేలా మూడేళ్ల పాటు ఏడాదికి రూ.60 వేల చొప్పున రెండు దఫాల్లో చెల్లిస్తూ.. మొత్తం రూ.1.80 లక్షల ఆర్థిక సాయం అందిస్తోంది. తాజాగా విడుదల చేస్తున్న ఆర్థిక సాయంతో కలిపి ఇప్పటివరకు 5,781 మంది యువ న్యాయవాదులకు రూ.41.52 కోట్లు చెల్లించింది. న్యాయవాదుల సంక్షేమం కోసం అడ్వకేట్ జనరల్ ఆధ్వర్యంలో లా, ఫైనాన్స్ సెక్రటరీ సభ్యులుగా రూ.100 కోట్లతో 'అడ్వకేట్స్ వెల్ఫేర్ ట్రస్ట్'ను ఏర్పాటు చేసి.. న్యాయవాదులకు రుణాలు, గ్రూప్ మెడిక్లెయిమ్ పాలసీలు, తదితర అవసరాల కోసం ఇప్పటికే రూ.25 కోట్ల సాయం అందించింది. ఆర్థిక సాయం కోరే న్యాయవాదులు ఆన్‌లైన్‌లో sec&law@ap. gov.in ద్వారా/నేరుగా లా సెక్రటరీకి దరఖాస్తు చేసుకోవాలి. వైఎస్సార్ లా నేస్తం పథకానికి సంబంధించి న్యాయవాదుల ఇబ్బందులను అధిగమించేందుకు 1902 నంబర్‌ను అందుబాటులో ఉంచింది.

సీఎం రుణం తీర్చుకుంటాం


కాంట్రాక్ట్ లెక్చరర్లు, ఉద్యోగులు



థాంక్యూ సీఎం సర్ అంటూ ప్లకార్డులను ప్రదర్శిస్తున్న కాంట్రాక్ట్ లెక్చరర్లు, ఉద్యోగులు

శ్రీకాకుళం న్యూకాలనీ: తమ జీవితంలో మర్చిపోలేని గిఫ్ట్ ఇచ్చి మేలుచేసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రుణం తీర్చుకుంటామని కాంట్రాక్ట్ లెక్చరర్లు, కాంట్రాక్ట్ ఉద్యోగులు చెప్పారు. రాష్ట్రంలో కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సమ్మతించడంతోపాటు కేబినేట్‌లో తీర్మానం కూడా చేసిన నేపథ్యంలో 'థాంక్యూ సీఎం సర్' పేరిట శ్రీకాకుళంలో ఆదివారం కాంట్రాక్ట్ ఉద్యోగుల ఐక్యవేదిక జిల్లా ప్రజా ప్రతినిధులను సన్మానించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ థాంక్యూ సీఎం సర్, మీ మేలు మరువలేం సర్.. రావాలి జగన్.. మళ్లీ కావాలి జగన్ అంటూ నినాదాలు చేశారు. స్పీకర్ తమ్మినేని సీతారాం, రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు, మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం వల్లే సమస్యల పరిష్కారం : బొప్పరాజు



కడప కోటిరెడ్డి సర్కిల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సానుకూలంగా స్పందించడంవల్లే ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికుల సమస్యలు చాలావరకు పరిష్కారమయ్యాయని ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు కొనియాడారు. వైఎస్సార్ జిల్లా కడప నగరంలోని పాత కలెక్టరేట్‌లోగల రెవెన్యూ భవన్‌లో ఆదివారం నిర్వహించిన జోన్–4 ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమావేశానంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వంతో చర్చల ద్వారా అనేక అంశాలలో స్పష్టత లభించిందన్నారు. ఇక తమ డిమాండ్లను సానుకూలంగా పరిష్కరించడంలో ప్రత్యేక చొరవ చూపిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, సీఎస్‌కు బొప్పరాజు ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యమంత్రితో కలిసిన రోజు ఇన్నేళ్లపాటు ఉద్యోగుల సమస్యలు ఎందుకు పేరుకుపోవాలి? ఆయా శాఖల కార్యదర్శులతో నెలకు ఒకసారి కూర్చొని చర్చిస్తే పరిష్కారమవుతాయి కదా? అని తాము తెలిపిన వెంటనే ముఖ్యమంత్రి సహృదయంతో అర్థంచేసుకుని ఈనెల 23న కొన్నిశాఖల కార్యదర్శులతో సమావేశం ఏర్పాటుచేశారని.. 27, 30 తేదీల్లో మరికొన్ని శాఖల కార్యదర్శులతో సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారని చెప్పారు. ఇందుకు ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. 20 ఏళ్లుగా పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించడం సంతోషకరమన్నారు.

గడపల్లో ఘన స్వాగతం

83,83,908 గృహాలను సందర్శించిన ఎమ్మెల్యేలు

సాక్షి, అమరావతి: ఓట్లు దండుకుని మొహం చాటేసిన మనుషులనే ఇన్నాళ్లూ చూశాం! ఎన్నికలు ముగియగానే మేనిఫెస్టోను మాయం చేసి చెత్తబుట్ట పాలు చేసిన పార్టీల గురించే మాకు తెలుసు! అధికారం చేపట్టాక ప్రజా సమస్యలను గాలికి వదిలేసి గ్రామాల వైపు తిరిగి చూడని నేతల పాలనలో దశాబ్దాల పాటు నలిగిపోయాం! మళ్లీ ఎన్నికలు వస్తే గానీ మా గుమ్మం తొక్కని నాయకులతో విసిగిపోయాం! అలాంటిది.. చరిత్రలో తొలిసారిగా 99 శాతం హామీలను నెరవేర్చి చిరునవ్వుతో, ఆత్మవిశ్వాసంతో మా గుమ్మం వద్దకు వస్తున్న ప్రజా ప్రతినిధులను ఇప్పుడే చూస్తున్నాం..! ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందుతున్నాయా? ఇంకా ఏమైనా సమస్యలున్నాయా?.. ఆశీర్వదించండంటూ ఆత్మీయంగా గడప గడపనూ పలుకరిస్తున్న నాయకులను చూడటం ఇదే మొదటిసారి అని రాష్ట్ర ప్రజానీకం పేర్కొంటోంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమంతో ప్రతి గడప పులకరిస్తోంది. ఈ కార్యక్రమం ద్వారా ఈ నెల 20వతేదీ నాటికి ఎమ్మెల్యేలు 83,83,908 గృహాలను సందర్శించారు. ఆయా కుటుంబాలకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేకూర్చిన ప్రయోజనాలను వివరించి వారి ఆశీర్వాదాలను పొందారు. రాష్ట్రంలోని మొత్తం 15,004 గ్రామ, వార్డు సచివాలయాలకుగానూ ఇప్పటివరకు ఎమ్మెల్యేలు 9,316 సచివాలయాలను సందర్శించారు. గడప గడపకూ మన ప్రభుత్వంలో భాగంగా సచివాలయాల వారీగా పర్యటిస్తూ ఇళ్ల వద్దకు వెళ్లి ప్రజలను కలుసుకుంటున్న ఎమ్మెల్యేలు ఆయా కుటుంబాలకు ప్రభుత్వం చేకూర్చిన మేలును వివరిస్తూ పుస్తకాలను పంపిణీ చేస్తున్నారు. ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందుతున్నాయా? అని ఆరా తీస్తూ ఆయా కుటుంబాలతో టిక్ పెట్టిస్తున్నారు.

ప్రాధాన్యత పనులను గుర్తించి నిధులు

మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో 99 శాతం మేర వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇప్పటికే అమలు చేసింది. నవరత్నాల్లో భాగంగా కులమతాలు, రాజకీయాలతో సంబంధం లేకుండా అర్హులందరికీ పారదర్శకంగా, సంతృప్త స్థాయిలో ప్రయోజనాలను అందించింది. ఏటా సంక్షేమ క్యాలెండర్‌ను ముందుగానే ప్రకటించి ఆయా పథకాల కింద లబ్ధిదారులకు నేరుగా నగదు బదిలీ చేస్తోంది. ఈ క్రమంలో ప్రజా ప్రతినిధులంతా ఇళ్ల వద్దకు వెళ్లి ప్రజలను కలుసుకునేలా గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గతేడాది మే 11వ తేదీన ప్రారంభించింది. ఆయా కుటుంబాలకు ప్రభుత్వం చేకూర్చిన ప్రయోజనాలను వివరిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాసిన లేఖలను అందజేస్తున్నారు. ప్రతి ఎమ్మెల్యే సచివాలయాల పరిధిలో రెండు రోజుల పాటు పర్యటించడంతో పాటు స్థానికంగా ప్రజలకు అవసరమైన, ప్రాధాన్యత కలిగిన పనులను గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా మంజూరు చేస్తున్నారు. ఒక్కో సచివాలయం పరిధిలో రూ.20 లక్షల చొప్పున అత్యంత ప్రాధాన్యత పనులను గుర్తించి వెంటనే మంజూరు చేస్తున్నారు.

సచివాలయాలవారీగా నివేదికలు సిద్ధం

గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఈ నెల 20వతేదీ వరకు ఎంతమంది ఎమ్మెల్యేలు ఎన్ని రోజులు పాల్గొన్నారనే వివరాలతో సచివాలయాలవారీగా నివేదికను ప్రణాళికా శాఖ రూపొందించింది. ఇప్పటి వరకు ఎన్ని గృహాలను సందర్శించారు? సచివాలయాల వారీగా ఎన్ని ప్రాధాన్యత పనులను గుర్తించారు? ఎన్ని పనులకు నిధులు మంజూరు చేశారు? ఎన్ని ప్రారంభమయ్యాయి? ఎన్ని పనులు పూర్తి చేశారు? తదితర వివరాలను నివేదికలో పొందుపరిచారు.



చిలకలూరిపేటలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి విడదల రజిని



కుప్పం నియోజకవర్గం గుడిపల్లెలో మంత్రి పెద్దిరెడ్డికి మంగళహారతులిస్తున్న మహిళలు



అనకాపల్లి మండలం రేబాకలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో దివ్యాంగుడు శ్రీనివాస్‌తో మాట్లాడుతున్న మంత్రి అమర్‌నాథ్

సచివాలయాల్లో ఎన్ని రోజులు? (ఈనెల 20 వరకు)

- ఒక్కో సచివాలయంలో ఒక రోజు గడిపిన ఎమ్మెల్యేలు 9 మంది
- ఒక్కో సచివాలయంలో రెండేసి రోజులు గడిపిన ఎమ్మెల్యేలు 85 మంది
- ఒక్కో సచివాలయంలో మూడు రోజులు గడిపిన ఎమ్మెల్యేలు 46 మంది
- ఒక్కో సచివాలయంలో మూడు రోజులకు పైగా గడిపిన ఎమ్మెల్యేలు 11 మంది

ఎంత మంది.. ఎన్ని రోజులు వెళ్లారు? (ఈ నెల 20 వరకు)

- 150 రోజులకు పైగా గడప గడపకూ వెళ్లిన ఎమ్మెల్యేలు 40 మంది
- 121 – 150 రోజులు గడప గడపకూ వెళ్లిన ఎమ్మెల్యేలు 43 మంది
- 91 – 120 రోజులు గడప గడపకూ వెళ్లిన ఎమ్మెల్యేలు 38 మంది
- 61 – 90 రోజులు గడప గడపకూ వెళ్లిన ఎమ్మెల్యేలు 18 మంది
- 31 – 60 రోజులు గడప గడపకూ వెళ్లిన ఎమ్మెల్యేలు 11 మంది
- 1 – 30 రోజులు గడప గడపకూ వెళ్లిన ఎమ్మెల్యే 1

గడప గడపకూ ప్రాధాన్యత పనులు ఇలా (ఈనెల 20 వరకు)

- రూ.1,454.30 కోట్ల విలువైన 37,725 ప్రాధాన్యత పనులు అప్‌లోడ్
- రూ.1,342.68 కోట్ల విలువైన 34,767 పనులు మంజూరు
- రూ.1,179.06 కోట్ల విలువైన 31,346 పనులు ప్రారంభం
- రూ.251.22 కోట్ల విలువైన 6,554 పనులు పూర్తి

'జగనన్న సురక్ష' క్యాంపులు ఖరారు

- జూలై 1న తొలిరోజు 1,297 సచివాలయాల వద్ద నిర్వహణ
- మొత్తం 15,004 సచివాలయాల వద్ద నిర్దేశిత తేదీల్లో క్యాంపులు
- చివరిగా జూలై 31వతేదీతో క్యాంపులు పూర్తి
- వారం ముందే ఆయా సచివాలయాల పరిధిలో మైక్‌లో ప్రచారం, ఆన్‌లైన్‌లో టోకెన్లు జారీ
- ఇంటింటిని సందర్శించనున్న వలంటీర్లు
- నాలుగు రోజుల ముందు వాట్సాప్‌లో మెసేజ్‌లు
- టోకెను ఉన్నవారికి సర్వీసు చార్జీ మినహాయింపు



సాక్షి, అమరావతి: 'జగనన్న సురక్ష' కార్యక్రమంలో భాగంగా జూలై 1వతేదీన రాష్ట్రవ్యాప్తంగా 1,297 గ్రామ, వార్డు సచివాలయాల వద్ద మండల స్థాయి అధికారుల ఆధ్వర్యంలో ప్రత్యేక క్యాంపులు నిర్వహించనున్నారు. అర్హులు ఏ ఒక్కరూ మిగిలిపోకుండా ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి చేకూర్చేందుకు ప్రతి ఇంటినీ జల్లెడ పడుతూ ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లాంఛనంగా ప్రారంభించిన విషయం తెలిసిందే. ఈమేరకు ఏ సచివాలయం పరిధిలో ఎప్పుడు క్యాంపు నిర్వహిస్తారనే వివరాలను ఆయా జిల్లాల కలెక్టర్లు ఇప్పటికే తెలియజేశారు. తొలిరోజు జూలై 1వతేదీన 1,297 సచివాలయాల వద్ద ఈ క్యాంపులు ప్రారంభమవుతాయి. జూలై 3వతేదీన 410 సచివాలయాల వద్ద, నాలుగో తేదీన 934 సచివాలయాల వద్ద క్యాంపులు నిర్వహిస్తారు. ఇలా మొత్తం 15,004 సచివాలయాల వద్ద నిర్దేశిత తేదీల్లో క్యాంపులు జరుగుతాయి. జూలై 31వ తేదీతో ఈ క్యాంపుల నిర్వహణ పూర్తి కానుంది.

మైకులో ప్రచారం.. వాట్సాప్.. ఎస్సెమ్మెస్‌లు

ఏ సచివాలయం పరిధిలో ఏ తేదీన క్యాంపు జరుగుతుందన్న వివరాలను వారం రోజుల ముందే మైక్ ద్వారా ప్రచారం చేస్తారు. అదే రోజు వలంటీర్లు ఇంటింటి సందర్శన కార్యక్రమాన్ని చేపట్టి క్యాంపు వివరాలను వ్యక్తిగతంగా తెలియజేయడంతో పాటు అర్హులకు ఎలాంటి ధ్రువపత్రాలు అవసరమో ముందుగా తెలియజేస్తారు. క్యాంపు జరగటానికి నాలుగు రోజుల ముందు కూడా వలంటీర్ల ఆధ్వర్యంలో పనిచేసే వాట్సాప్ గ్రూపుల ద్వారా అందరికీ సమాచారం ఇస్తారు. దీంతోపాటు క్యాంపు నిర్వహణకు ఒక్క రోజు ముందు ఆయా సచివాలయాల పరిధిలో నమోదైన ఫోన్ నంబర్లకు ఎస్ఎంఎస్ ద్వారా కూడ సమాచారం చేరవేస్తారు. ఈ మేరకు క్యాంపుల నిర్వహణ, ఇంటింటికీ వలంటీర్ల సందర్శనకు సంబంధించి గ్రామ, వార్డు సచివాలయాల శాఖ స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్స్ (ఎస్‌వోపీ) రూపొందించి అన్ని జిల్లాలు, మండల స్థాయి అధికారులకు పంపింది.

ఏడు రోజుల ముందు ఆన్‌లైన్ టోకెన్లు..

సచివాలయాల వద్ద మండల స్థాయి అధికారుల ఆధ్వర్యంలో నిర్వహించే ఈ ప్రత్యేక క్యాంపులు సజావుగా కొనసాగేలా క్యాంపు నిర్వహణకు ఏడు రోజుల ముందు అర్జీదారుల నుంచి వినతుల స్వీకరణతో పాటు వరుస క్రమంలో టోకెన్లను జారీ చేస్తారు. ఈమేరకు ఏడు రోజుల ముందు ఆన్‌లైన్‌లో టోకెన్లు జారీ చేసేలా సచివాలయ ఉద్యోగులకు సాఫ్ట్‌వేర్ అందుబాటులో వస్తుంది. ఒక దరఖాస్తుదారుడు రెండు రకాల వినతులు అందజేస్తే సంబంధిత వ్యక్తికి రెండు టోకెన్లు జారీ చేస్తారు. ముందుగా టోకెన్లు నమోదు చేసుకున్న వారికి మాత్రమే క్యాంపుల్లో సర్వీసు చార్జీ మినహాయింపు ఉంటుందని గ్రామ, వార్డు సచివాలయాల శాఖ జారీ చేసిన ఎస్‌వోపీలో స్పష్టం చేసింది.

13 ప్రశ్నలతో వలంటీర్ల ఇంటింటి సర్వే..

ఈ కార్యక్రమంలో భాగంగా వలంటీర్ల ఇంటింటి సందర్శన సమయంలో ప్రతి ఇంటి నుంచి వివరాల సేకరణకు మొత్తం 13 రకాల ప్రశ్నలతో గ్రామ, వార్డుసచివాలయాల శాఖ యాప్‌ను సిద్ధం చేసింది. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి సంక్షేమ పథకాన్ని వారికి వివరించడంతోపాటు అర్హులు ఆయా పథకాలను పొందడంలో ఏవైనా సమస్యలు ఎదుర్కొంటున్నారా? అని పరిశీలిస్తారు. ప్రభుత్వం జారీచేసే వివిధరకాల ధ్రువీకరణ పత్రాల గురించి తెలియచేసిన వివరాలను యాప్‌లో నమోదు చేస్తారు.

టెండర్ల దశలో నూతన పీహెచ్‌సీల నిర్మాణం

- రాష్ట్రంలో కొత్తగా రూ.225.32 కోట్లతో 88 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు
- మండలానికి రెండు కేంద్రాల చొప్పున ఏర్పాటు
- ఇప్పటికే రూ.663.82 కోట్లతో 1,115 పీహెచ్‌సీల్లో 'నాడు–నేడు'

సాక్షి, అమరావతి: గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు సర్కార్ వైద్యం మరింత చేరువ చేయడంపై సీఎం జగన్ ప్రభుత్వం తొలి నుంచి ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తోంది. ఇందులో భాగంగా మండలానికి రెండు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (పీహెచ్‌సీ) లేదా ఒక పీహెచ్‌సీ, ఒక సీహెచ్‌సీ ఉండేలా చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా 88 కొత్త పీహెచ్‌సీలను ఏర్పాటుచేస్తున్నారు. ఈ భవనాల నిర్మాణం ప్రస్తుతం టెండర్ల దశలో ఉంది. వీటి ఏర్పాటుకోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.225.32 కోట్లు ఖర్చు చేస్తోంది.

ఇప్పటికే వైద్యుల నియామకం..

గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సంరక్షణా చర్యల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని ప్రారంభించిన విషయం తెలిసిందే. ఈ విధానంలో ప్రతి వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌ను పీహెచ్‌సీ వైద్యులు నెలలో రెండుసార్లు సందర్శించాల్సి ఉంటుంది. ఈ కార్యక్రమం అమలుకోసం కొత్త పీహెచ్‌సీలు ఏర్పాటవుతున్న చోట మెడికల్ ఆఫీసర్లను సైతం నియమించింది. ఒక్కో పీహెచ్‌సీకి ఇద్దరు చొప్పున 176 మంది వైద్యులను వైద్యశాఖ నియమించింది. వీరు గ్రామాల్లో ప్రజలకు వైద్యసేవలు అందిస్తున్నారు.

రూ.663.82 కోట్లతో 'నాడు–నేడు'

ఇప్పటికే రాష్ట్రంలో 1,142 పీహెచ్‌సీలు ఉన్నాయి. ప్రభుత్వాస్పత్రుల బలోపేతం కోసం ప్రభుత్వం తలపెట్టిన నాడు–నేడు కార్యక్రమంలో భాగంగా రూ.663.82 కోట్లతో 965 పీహెచ్‌సీలకు మరమ్మతులు, 150 చోట్ల కొత్త భవనాల నిర్మాణం చేపట్టారు. ఇప్పటికే 908 మరమ్మతులు, 56 కొత్త భవనాల నిర్మాణం పూర్తయింది. మిగిలిన నాడు–నేడు పనులను వచ్చే ఆగస్టు నెలాఖరు నాటికి పూర్తికానున్నాయి. ఇక 'నాడు–నేడు' పనుల అనంతరం పీహెచ్‌సీల్లో స్పష్టమైన మార్పు వచ్చింది. వైద్యులు, సిబ్బంది, రోగుల సదుపాయాలు మెరుగుపడ్డాయి. ప్రతి ఆస్పత్రిలో సిటిజన్ చార్ట్‌లు, సైన్‌బోర్డులు, రోగులు కూర్చోవడానికి కుర్చీలు, మరుగుదొడ్లు, ఓపీ, ఐపీ గదులు, లేబర్ ఆపరేషన్ థియేటర్ అన్ని హంగులతో సమకూరాయి. నాడు–నేడు కింద ప్రభుత్వం తీసుకున్న చర్యల ఫలితంగా 391 పీహెచ్‌సీలకు నేషనల్ క్వాలిటీ అష్యూరెన్స్ స్టాండర్డ్స్ (ఎన్‌క్వాష్) గుర్తింపు లభించింది. దేశంలోనే అత్యధిక పీహెచ్‌సీలకు ఎన్‌క్వాష్ గుర్తింపు ఉన్న రాష్ట్రంగా ఏపీ రికార్డు సాధించింది.

ఏపీలా 'చదువుదాం'

▶ మొదటి పేజీ తరువాయి

రాష్ట్రం రోల్ మోడల్‌గా నిలిచింది. ప్రజలకు మంచి చేయాలన్న ఆలోచన పాలకులకు ఉంటే ఎంతటి అద్భుతాలు చేయవచ్చో.. పేద పిల్లల జీవితాలను ఎంత అద్భుతంగా తీర్చిదిద్దవచ్చో ఆంధ్రప్రదేశ్‌లో పర్యటించి తెలుసుకోవాలని పలు రాష్ట్రాల ప్రభుత్వ ప్రతినిధులు సైతం ఆసక్తి చూపుతున్నారంటే ఎంతటి మార్పు వచ్చిందో ఇట్టే తెలుస్తోంది. జీ–20లో భాగంగా ఈ నెల 16 నుంచి 22 వరకు కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో 'జన్ భాగీదారీ' కార్యక్రమాన్ని పూణెలోని సావిత్రిబాయి పూలే విశ్వవిద్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లో విద్యా రంగంపై రాష్ట్ర ప్రభుత్వం పెడుతున్న ప్రత్యేక శ్రద్ధ చర్చకు వచ్చింది. నూతన విద్యా విధానాన్ని (ఎన్ఈపీ–2020) అనుసరించి ఫౌండేషనల్ స్కూల్ నిర్వహణపై దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాలు అమలు చేసే విధానాలను ఇక్కడ ప్రదర్శించారు. ఇందులో అన్ని విభాగాల్లోను ఆంధ్రప్రదేశ్ ముందుండడం విశేషం. రాష్ట్రం తరఫున ఏర్పాటు చేసిన స్టాల్.. కేంద్ర మంత్రులు, ఇతర రాష్ట్రాల విద్యా శాఖ ఉన్నతాధికారుల ప్రశంసలు అందుకుంది.

సాంకేతిక బోధన, విద్యా పథకాలపై ఆసక్తి

భారతదేశంలో పునాది నుంచి గణిత శాస్త్ర నైపుణ్యాలు పెంపొందించడం, తరగతిలో సాంకేతిక బోధన ఉండాలన్నది కేంద్ర ప్రభుత్వ లక్ష్యం. అందుకు అనుగుణంగా జన్ భాగీదారీ ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఇందులో ఆంధ్రప్రదేశ్ పాఠశాల విద్యాశాఖ– సమగ్ర శిక్షా విభాగం ప్రదర్శించిన 'ఎఫ్ఎల్ఎన్ నమూనా పాఠశాల' ఇతర రాష్ట్రాల విద్యా శాఖల ఉన్నతాధికారులను, విద్యా ప్రతినిధులు, విద్యార్థులు, తల్లిదండ్రులను ఎంతగానో ఆకట్టుకుంది. మన రాష్ట్రంలో పునాది అభ్యసన, గణిత శాస్త్ర నైపుణ్యాల అభివృద్ధి ద్వారా పూర్వ ప్రాథమిక స్థాయి నుంచి నాణ్యమైన విద్యను ఎలా అందిస్తున్నారో అధికారులు హాజరైన ప్రతినిధులకు వివరించారు. ప్రాథమిక విద్యార్థులకు అందిస్తున్న పిక్టోరియల్ డిక్షనరీ, ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్ ద్వారా డిజిటల్ బోధన అద్భుతమని ఉత్తరాఖండ్ విద్యా శాఖ ఉన్నతాధికారులు ప్రశంసించడమే కాకుండా ఏపీలో పర్యటించి మరిన్ని వివరాలు తెలుసుకోవాలని నిర్ణయించారు. మన రాష్ట్రంలో గిరిజన విద్యార్థుల కోసం రూపొందించిన మాతృ భాషాధారిత బహుభాష (సవర, కొండ, కువి, ఆదివాసీ ఒడియా, కోయ, సుగాలి) బైలింగ్వల్ పాఠ్య పుస్తకాలు అందజేయడాన్ని రాజస్థాన్ ప్రిన్సిపల్ సెక్రటరీ అభినందించడంతో పాటు ఏపీలో చేపట్టిన 'మనబడి నాడు–నేడు'పై ఆసక్తి చూపించారు.

ఏపీ భేష్ అంటూ ప్రశంసలు

రాష్ట్రంలో ప్రభుత్వం విద్యకు తొలి ప్రాధాన్యం ఇస్తూ అమలు చేస్తున్న అమ్మఒడి, విద్యాకానుక, జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన, డిజిటల్ బోధన, ఎనిమిదో తరగతి విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ఉచితంగా ట్యాబులు, బైజూస్ కంటెంట్, తరగతి గదుల్లో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెళ్లు, స్మార్ట్ టీవీల ఏర్పాటు వంటివి ఇతర దేశాల ప్రతినిధులను సైతం ఆకట్టుకున్నాయి. 'విద్యాకానుక' కింద విద్యార్థులకు ఉచిత పుస్తకాలు, యూనిఫారం, డిక్షనరీలు అందించడంపై ప్రశంసలు కురిపించారు. 'అమ్మ ఒడి' పథకం ద్వారా పాఠశాలల్లో 75 శాతానికి పైగా హాజరు నమోదవుతుండడాన్ని తెలుసుకున్న ఇతర రాష్ట్రాల అధికారులు, తల్లిదండ్రులు.. పేద, మధ్య తరగతి విద్యార్థులకు ఈ పథకం ఎంతో ఉపయుక్తమైందని అభిప్రాయపడ్డారు. 'ఫౌండేషనల్ స్కూల్' విధానాన్ని, బైలింగ్వల్ టెక్స్ట్ పుస్తకాల ముద్రణలో ఏపీ ప్రభుత్వ కృషిని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ అభినందించారు. మహారాష్ట్ర, ఒడిశా, అస్సాం, హరియాణా, ఛత్తీస్‌గఢ్, మిజోరం, మధ్యప్రదేశ్, పశ్చిమ బెంగాల్, నాగాలాండ్, గుజరాత్, పుదుచ్చేరి, కేరళ, తెలంగాణ రాష్ట్రాలతో పాటు కేంద్ర పాలిత ప్రాంతమైన అండమాన్ నికోబార్ దీవులు, డామన్ డయ్యూ.. దాద్రా నాగర్ హవేలీ నుంచి ఎస్సీఈఆర్టీ, డైట్ ప్రతినిధులు, స్పార్క్, ప్రథమ్ తదితర స్వచ్ఛంద సంస్థలు, పూణె–ఆంధ్రా సంఘం సభ్యులు ఆంధ్రప్రదేశ్ విద్యా విధానాల అమలుకు ముందుకు వచ్చాయి.

దేశ వ్యాప్తంగా మన సంస్కరణలు

నూతన జాతీయ విద్యా విధానాన్ని అనుసరించి దేశ వ్యాప్తంగా ఏర్పాటు చేసే 'ఫౌండేషనల్ స్కూల్' నిర్వహణలో మన రాష్ట్రం ముందు వరుసలో ఉండడం ఆనందంగా ఉంది. స్టాల్‌లో 'ఫౌండేషనల్ స్కూల్' నమూనా కూడా ఏపీ మాత్రమే ప్రదర్శించింది. మన విద్యా విధానాలు, సంస్కరణలు ఆదర్శప్రాయంగా ఉన్నాయని జన్ బాగీధారీ కార్యక్రమానికి హాజరైన ప్రతినిధులు అభినందించడం, తమ రాష్ట్రాల్లో అమలు చేస్తామనడం నిజంగా మన విజయమే.

– ఎస్.సురేష్‌కుమార్, పాఠశాల విద్యా శాఖ కమిషనర్

అంగన్వాడీ టీచర్లకు నైపుణ్య శిక్షణ

విద్యా సంస్కరణల్లో మన రాష్ట్రం ఇతర రాష్ట్రాలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది. నూతన జాతీయ విద్యా విధానం ప్రకారం ప్రతి అంగన్వాడీ టీచర్‌ను.. గ్రేడ్ 1, 2 టీచర్లను పూర్వ ప్రాథమిక శిశు సంరక్షణ విద్య బోధించడంలో నిష్ణాతులుగా తీర్చిదిద్దుతాం. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ వినూత్న కార్యక్రమాన్ని 2026 నాటికి పూర్తి చేస్తాం. ఆచార్య ఎన్జీ రంగా విశ్వవిద్యాలయం, ఎస్సీఈఆర్టీ, సమగ్ర శిక్ష సహకారంతో శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు అందజేస్తాం.

– బి.శ్రీనివాసరావు, సమగ్ర శిక్ష ఏపీ ఎస్పీడీ

ప్రజలకు విద్యుత్ ఆదా ఫ్యాన్లు

- సెప్టెంబర్ నుంచి సబ్సిడీపై పంపిణీ
- కేంద్రానికి చెందిన 'ఈఈఎస్ఎల్' సీఈవో విశాల్‌కపూర్ వెల్లడి



సాక్షి, అమరావతి: దేశ వ్యాప్తంగా విద్యుత్ ఆదా చేసే ఇంధన సామర్థ్య ఫ్యాన్లు అందించే కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నట్లు కేంద్ర విద్యుత్ శాఖకు చెందిన ఎనర్జీ ఎఫిషియన్సీ సర్వీసెస్ లిమిటెడ్ (ఈఈఎస్ఎల్) సీఈవో విశాల్‌కపూర్ ఆదివారం ఓ ప్రకటనలో వెల్లడించారు. ఏపీ సహా అన్ని రాష్ట్రాలకు బ్రష్ లెస్ డైరెక్ట్ కరెంట్(బీఎల్డీసీ) ఫ్యాన్లు సరఫరా చేయబోతున్నట్లు తెలిపారు. సెప్టెంబర్ నుంచి త్రీ స్టార్, ఫైవ్ స్టార్ రేటెడ్ ఫ్యాన్లను మార్కెట్ ధర కంటే అత్యంత తక్కువ ధరకే అందించాలని భావిస్తున్నట్టు పేర్కొన్నారు. సింగిల్ ఫేజ్ ఇండక్షన్ మోటార్లతో పనిచేస్తున్న సాంప్రదాయ ఫ్యాన్‌లు నిమిషానికి దాదాపు 70 నుంచి 80 వాట్‌ల విద్యుత్‌ను వినియోగిస్తాయని చెప్పారు. తాము అందించే ఫ్యాన్‌లు 35 వాట్ల విద్యుత్‌నే వినియోగిస్తాయని తెలిపారు. తద్వారా 50 శాతం విద్యుత్ వినియోగాన్ని ఆదా చేయవచ్చన్నారు. బీఎల్డీసీ ఫ్యాన్ల వాడడం వల్ల విద్యుత్ వాడకం తగ్గి.. వినియోగదారులకు డబ్బులు ఆదా అవుతాయన్నారు. కర్బన ఉద్గారాలను కూడా తగ్గించవచ్చన్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, టౌన్‌షిప్‌లు, ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్లు, కాలేజీలు, ఆస్పత్రులు, రిటైల్ వినియోగదారులకు సబ్సిడీపై ఫ్యాన్లు అందజేస్తామని తెలిపారు.

ఉపాధికి స'పోర్టు'

▶ మొదటి పేజీ తరువాయి

మరింత మందికి ఉపాధి లభిస్తుందన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అడుగులు ముందుకు వేశారు. సాగర్‌మాల పథకం కింద కాకినాడ యాంకరేజ్ పోర్టు సామర్థ్యాన్ని 4 మిలియన్ టన్నుల నుంచి 5 మిలియన్ టన్నులకు పెంచడం ద్వారా మరో 7 వేల మందికి ఉపాధి కల్పించనున్నారు.

అదనంగా జెట్టీ పొడవు 260 మీటర్లు పెంపు

కాకినాడ యాంకరేజ్ పోర్టును రూ.91.85 కోట్ల వ్యయంతో ప్రభుత్వం ఆధునికీకరించనుంది. ఈ నిధులతో సరుకు రవాణా బోట్లు నిలుపుకునే జెట్టీ పొడవు, కాల్వ లోతు, సరుకు లోడింగ్ పాయింట్లను పెంచడం, అంతర్గత రహదారుల నిర్మాణం వంటి పనులు చేపట్టనున్నారు. ప్రస్తుత యాంకరేజ్ పోర్టు జెట్టీ పొడవు 930 మీటర్లు ఉండగా.. దీనికి అదనంగా 260 మీటర్లు పెంచడం ద్వారా మొత్తం జెట్టీ పొడవును 1,190 మీటర్లకు పెంచనున్నారు. ఇంతకాలం జెట్టీల ద్వారా మానవుల సహాయంతో సరుకును లోడింగ్ అన్‌లోడింగ్ మాత్రమే చేసేవారు. ఇప్పుడు కొత్తగా 5 చోట్ల యంత్రాల సహాయంతో లోడింగ్ చేసేలా పాయింటన్లు ఆధునికీకరిస్తున్నారు.

కాలువ లోతు పెరిగేలా డ్రెడ్జింగ్

పోర్టులో బోట్లు నిలుపుకునే కాలువ పూడుకుపోవడంతో లోతు తగ్గింది. దీన్ని 2.5 మీటర్ల లోతు ఉండే విధంగా డ్రెడ్జింగ్ చేయడంతోపాటు పోర్టు నుంచి కాకినాడ జగన్నాథపురం వరకు ఉన్న వాణిజ్య కాలువ లోతును పెంచి గట్లను పటిష్టం చేయనున్నారు. పోర్టును అనుసంధానించే ప్రధాన రహదారితో పాటు, పోర్టు లోపల అంతర్గత రహదారులను అభివృద్ధి చేయనున్నారు.



పోర్టులో చురుగ్గా జరుగుతున్న పనులు

ఈ విస్తరణ పనుల టెండర్ దక్కించుకున్న సంస్థ వేగంగా పనులు చేపడుతోంది. పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నడిచే కాకినాడ యాంకరేజ్ పోర్టు 1,150 ఎకరాల్లో విస్తరించి ఉంది. ఈ పోర్టు విస్తరణ ద్వారా రాష్ట్ర ప్రభుత్వ ఆదాయం కూడా పెరగనుంది. 2022–23 సంవత్సరంలో యాంకరేజ్ పోర్టు 3.87 మిలియన్ టన్నుల సరుకు రవాణా చేయడం ద్వారా రూ.63 కోట్ల ఆదాయాన్ని ఆర్జించింది.

టర్న్ ఎరౌండ్ తగ్గించడమే లక్ష్యం

అత్యధికమందికి ఉపాధికల్పించే యాంకరేజ్ పోర్టు ఆధునికీకరణపై సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేకంగా దృష్టిసారించారు. బియ్యం, మొక్కజొన్న, సిమెంట్ వంటి ఎగుమతులకు అనుకూలంగా ఉండే ఈ పోర్టులో ఒక ఓడలో సరుకు నింపుకుని వెళ్లడానికి కనీసం 28 నుంచి 30 రోజులు (టర్న్ ఎరౌండ్ టైమ్)గా ఉంది. ఆధునికీకరణ చేయడం ద్వారా ఈ సమయాన్ని కనీసం 15 రోజులకు తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. టర్న్ ఎరౌండ్ సమయం సగానికి తగ్గించగలిగితే కాకినాడ యాంకరేజ్ పోర్టు ఎగుమతి సామర్థ్యం పెరగడమే కాకుండా ఎగుమతిదారులకు వ్యయం కూడా తగ్గుతుంది.

– కల్నల్ రవీంద్రనాథ్‌రెడ్డి, డిప్యూటీ సీఈవో, ఏపీ మారిటైమ్ బోర్డు

చిన్న ఎగుమతిదారులకు ప్రయోజనం

రాష్ట్ర ప్రభుత్వం పోర్టుల అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి సారించడంతో మన రాష్ట్రం సముద్ర వాణిజ్యానికి వేదికగా మారుతోంది. పురాతన కాలం నాటి కాకినాడ డీప్ వాటర్ పోర్టును ఆధునికీకరించడం స్థానిక ఎగుమతిదారులకు చాలా ప్రయోజనం కలిగిస్తుంది. డీప్ వాటర్ పోర్టులతో పోలిస్తే యాంకరేజ్ పోర్టుల్లో షిప్ ల్యాండింగ్ చార్జీలు చాలా తక్కువ. డీప్ వాటర్ చార్జీల్లో సగం వ్యయంతోనే సరుకులు ఎగుమతి చేయవచ్చు. ఇది చిన్న ఎగుమతిదారులకు ప్రయోజనం చేకూరుస్తుంది.

– రఘు, ప్రెసిడెంట్, కాకినాడ చాంబర్ ఆఫ్ కామర్స్

క్లుప్తంగా...

అక్టోబర్ 2న 'జగనన్నకు వందనం'

- సచివాలయాల ఎంప్లాయిస్ ఫెడరేషన్ నిర్ణయం
- ఫెడరేషన్ రాష్ట్ర నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నిక
- అధ్యక్షుడిగా మళ్లీ జానీ పాషా


జానీ పాషా

సాక్షి, అమరావతి/గాంధీనగర్ (విజయవాడసెంట్రల్): గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ ఏర్పడి నాలుగేళ్లు పూర్తవుతున్న సందర్భంగా అక్టోబర్ రెండో తేదీన రాష్ట్రవ్యాప్తంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలియజేసేందుకు 'జగనన్నకు వందనం' కార్యక్రమాన్ని నిర్వహిస్తామని సచివాలయాల ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జానీ పాషా తెలిపారు. విజయవాడలోని ఏపీఎన్జీవో భవన్‌లో ఆదివారం సచివాలయాల ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో 21 మంది సభ్యులతో రాష్ట్ర కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా మళ్లీ జానీ పాషా ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా పుట్టి రత్నం, ఉపాధ్యక్షులుగా ఎస్.హరి, కె.రామకృష్ణారెడ్డి, జి.హరీంద్ర, పీజే గణేష్‌కుమార్, కోశాధికారిగా బి.పుల్లారావు, కార్యనిర్వాహక కార్యదర్శులుగా ఎస్‌కే మహబూబ్ సుభానీ, టి.కోటేశ్వరరావు, కార్యదర్శులుగా ఎం.శాంతిసాగర్, డి.సురేష్‌బాబు, కె.విజయ్ మోహన్, బి.శ్వేత, సంయుక్త కార్యదర్శులుగా పి.శామ్యూల్, టి.తిరుమలయ్య, పి.హనుమేష్, కె.మురళీకృష్ణ, ప్రచార కార్యదర్శులుగా ఎం.ధనశేఖర్, ఆర్.జాన్, కార్యనిర్వాహక సభ్యులుగా టి.దీక్షిత్, ఎం.కోటేశ్వరరావు ఎన్నికయ్యారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు ఎన్.చంద్రశేఖర్ రెడ్డి, ఏపీఎన్జీవో అసోసియేషన్ నేతలు బండి శ్రీనివాసరావు, కేవీ శివారెడ్డి, విద్యాసాగర్ తదితరులు పాల్గొని నూతన కార్యవర్గాన్ని అభినందించారు.

మోదీ పాలనలో భారత్ ప్రతిష్ట పెరిగింది

కేంద్ర మంత్రి దేవుసిన్హ్ చౌహాన్



తిరుపతి గాంధీరోడ్డు: ప్రధాని నరేంద్రమోదీ అధికారం చేపట్టిన తర్వాత ప్రపంచంలో భారతదేశ ప్రతిష్ట పెరిగిందని కేంద్ర సమాచార, ప్రసారశాఖ మంత్రి దేవుసిన్హ్ జేసింగ్‌భాయ్ చౌహాన్ అన్నారు. మోదీ తొమ్మిదేళ్ల పాలనలో 'సేవ-సుపరిపాలన-పేదల సంక్షేమం' అనే అంశంపై తిరుపతిలో ఆదివారం నిర్వహించిన మేధావుల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. నరేంద్రమోదీ నీతి, అంకితభావం, సేవాదృక్పథంతో ప్రణాళికాబద్ధంగా పాలన సాగించడం వల్ల ప్రపంచమంతా భారత్ వైపు చూస్తోందని తెలిపారు. విశ్వవ్యాప్తంగా ప్రజల ప్రాణాలకు ముప్పుగా పరిణమించిన కోవిడ్‌కు వ్యాక్సిన్ కనిపెట్టడం వెనుక ప్రధాని విశేష కృషి చేశారని చెప్పారు. ఆర్థిక రంగ నిపుణుడైన మన్మోహన్‌సింగ్ ప్రధానిగా ఉన్న సమయంలో దేశం ఆర్థికంగా దెబ్బతిన్నదని, మోదీ పాలనలో భారతదేశం ఆర్థికంగా చాలా అభివృద్ధి సాధించిందని పేర్కొన్నారు. రామ జన్మభూమిని అభివృద్ధి చేయడంలో బీజేపీ ప్రభుత్వం తన మాట నిలుపుకుందన్నారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి కూడా కేంద్రం సహకారం అందిస్తోందని వివరించారు. అయితే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన స్వార్థం కోసం నిధులను దారి మళ్లిస్తున్నారని ఆరోపించారు. బీజేపీ నాయకులు, వివిధ రంగాలకు చెందిన నిపుణులు పాల్గొన్నారు.

అభివృద్ధే మా నినాదం... ప్రజలతోనే మా ప్రయాణం

- బీజేపీతో కలిసి యాత్ర చేస్తారా.. అని వారాహి యాత్ర చేసేవారిని ప్రశ్నించగలరా?
- మీడియాపై సోము వీర్రాజు ఫైర్



ఒంగోలు: 'అభివృద్ధే మా నినాదం. ప్రజలతోనే మా ప్రయాణం. అటువంటిది మేము వారాహితో కలిసి యాత్ర చేస్తామా... లేదా... అని అడగడం ఏంటీ...' అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు మీడియాపై మండిపడ్డారు. రాష్ట్రాన్ని బీజేపీ అభివృద్ధి చేసిందని, ప్రజలతో కలిసే తమ యాత్రలు, కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. ఆదివారం ఒంగోలు వచ్చిన సోము వీర్రాజు మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా వారాహితో కలిసి యాత్ర చేస్తారా.. అని మీడియా అడిగిన ప్రశ్నకు ఆయన స్పందిస్తూ 'మేము ఒకవైపు అభివృద్ధి చేస్తున్నాం. దానిని ప్రజలకు తెలిపేందుకు పెద్ద ఎత్తున సభలు పెడుతున్నాం. మరోవైపు వారాహితో కలిసి యాత్ర చేస్తారా.. అని మమ్మల్ని ప్రశ్నిస్తారా.. బీజేపీ ఇన్ని కార్యక్రమాలు చేస్తుంది కదా... బీజేపీతో కలిసి మీరు యాత్ర చేస్తారా... అని వారాహి యాత్ర చేసేవారిని అడగగలరా...' అని ఎదురు ప్రశ్నించారు. అదే విధంగా 'మీకు చేతనైతే బీజేపీ చేస్తున్న అభివృద్ధిని గురించి సోము వీర్రాజు చెప్పిన విషయాలపై టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబును ప్రశ్నించగలరా...' అని మండిపడ్డారు. ఆదివారం ఒక్కరోజే రాష్ట్రంలోని 927 మండలాల్లో బీజేపీ సభలు నిర్వహించిందని చెప్పారు. రాష్ట్రాభివృద్ధికి బీజేపీ ఏం చేసిందనేది ప్రజలకు వివరిస్తున్నామని తెలిపారు. తాము అద్భుతమైన రాష్ట్ర ప్రగతి కోసం రోడ్ మ్యాప్‌తో ముందుకు వెళుతున్నామని ఆయన చెప్పారు.

నిస్తేజం.. గందరగోళం!

పవన్ కళ్యాణ్ వైఖరితో జనసేన శ్రేణుల్లో అయోమయం

సాక్షి ప్రతినిధి, కాకినాడ: దశ, దిశ నిర్దేశం లేకుండానే ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ వారాహి యాత్ర ముగిసింది. తూర్పు సెంటిమెంట్‌గా ఈ నెల 14న అన్నవరం సత్యదేవునికి పూజలు నిర్వహించి, పవన్ ఈ యాత్రను ప్రారంభించారు. ఈ యాత్రలో పార్టీ నిర్దిష్ట అజెండా గురించి తన నాయకుడు వివరిస్తారని భావించిన ఆయన అభిమానులకు నిరాశే ఎదురైంది. కాకినాడ జిల్లా కత్తిపూడి మొదలు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురంలో ఆదివారం జరిగిన ముగింపు సభ వరకూ వరుసగా వివాదాలు మూటగట్టుకున్నారు. సహజంగా ఏ రాజకీయ పార్టీ అయినా ఇటువంటి యాత్రలు చేసేటప్పుడు పార్టీ విధానపరమైన ప్రణాళికలను ప్రజల ముందు ఉంచుతుంది. తమకు ఓటేస్తే ప్రజలకు ఏం చేయదలుచుకున్నారో అర్థమయ్యేలా వివరిస్తూ.. వారి మనసు చూరగొనే ప్రయత్నం చేస్తుంది. పవన్ అభిమానులు, ఆ పార్టీ నేతలు ఆయన నుంచి ఇవే ఆశించారు. కానీ అందుకు పూర్తి భిన్నంగా వన్‌మేన్ ఆర్మీ మాదిరిగా ఉమ్మడి తూర్పు గోదావరిలో పవన్ తన యాత్రకు ముగింపు పలికారు. పార్టీకి ఒక అజెండా అంటూ లేకపోవడం జనసేన నేతలకు రుచించ లేదు.

ద్వారంపూడి, ముద్రగడపై విమర్శలతో పెనుదుమారం

వారాహి యాత్రలో పవన్ వ్యాఖ్యలపై పెనుదుమారం రేగింది. రెండవ సారి గెలుపొందిన కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి వంటి నేతలే లక్ష్యంగా పవన్ ప్రసంగం సాగడం సొంత సామాజిక వర్గ నేతల నుంచే అసంతృప్తి వ్యక్తమైంది. అలాగే, కాపు ఉద్యమాన్ని ముందుండి నడిపించిన నేత ముద్రగడ పద్మనాభం లక్ష్యంగా పరోక్ష విమర్శలు చేయడం రాష్ట్ర స్థాయిలో పెను దుమారాన్నే రేపింది. అటు ద్వారంపూడి, ఇటు ముద్రగడ సంధించిన అనేక ప్రశ్నలకు, వచ్చే ఎన్నికల్లో పోటీపై విసిరిన సవాళ్లకు పవన్ సమాధానం చెప్పకుండానే తోకముడిచారనే విమర్శను మూటగట్టుకోవాల్సి వచ్చింది. గుండె ధైర్యం ఎక్కువని పదేపదే చెప్పుకునే ఆయన.. వారి సవాళ్లకు సరైన సమాధానం చెబుతారని ఎదురు చూశామని, తీరా చివరకు తలదించుకునేలా చేశారని ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు వాపోతున్నారు. ఒకపక్క జనసేనకు కులాల అంతరాలు లేవంటూనే మరోపక్క తన ప్రసంగాల్లో కులాల ప్రస్తావనతో యువతలో పవన్ భావోద్వేగాలు రెచ్చగొట్టిన తీరును మేధావి వర్గం తప్పు పడుతోంది. పవన్ వాడిన పదజాలంపై రాజకీయాల్లో మూడు దశాబ్దాల అనుభవం ఉన్న కాకినాడ ఎంపీ వంగా గీత 'రాజకీయాల్లోకి రావాలనుకునే యువతకు ఇదేనా మీరిచ్చే సందేశం' అంటూ చురకలు అంటించడం గమనార్హం.

అయినా.. మారలేదు

రీల్ లైఫ్‌కు, రియల్ లైఫ్‌కు చాలా తేడా ఉంటుందని చెబుతూనే ప్రసంగాలు, హావభావాల్లో ఫక్తు సినిమా స్టైల్‌ను ప్రదర్శించడంలో పవన్ ఔచిత్యాన్ని విజ్ఞులు ప్రశ్నిస్తున్నారు. తాను సీఎం అయ్యేందుకు సిద్ధంగా ఉన్నానని కత్తిపూడిలో చెప్పుకున్న పవన్.. పచ్చ మీడియా ఇంటర్వ్యూల్లో ఏదో అభిమానులు అలా అంటూంటే వారిని ఉత్సాహ పరిచేందుకు అలా మాట్లాడాననడం ఒక పార్టీకి నాయకత్వం వహించే నాయకుడి లక్షణమా అని వివిధ వర్గాలు ప్రశ్నిస్తున్నాయి. మార్పు రావాలని గొంతెత్తిన జనసేనాని తాను మారలేదనే విషయాన్ని వారాహి యాత్ర ద్వారా చెప్పకనే చెప్పారని ఆ వర్గాలు అంటున్నాయి. గోదావరి నేలను వదిలేది లేదని, ఈ జిల్లాలు రాజకీయ మార్పునకు నాంది పలుకుతాయని చెప్పిన పవన్.. వచ్చే ఎన్నికల్లో పోటీపై గత ఎన్నికల్లో మాదిరిగానే ఇప్పుడు కూడా పూటకో మాటతో అభిమానులను గందరగోళంలో పడేశారు.

ఆ పార్టీ నేతలే పెదవి విరుపు

మంగళగిరిలో తెలుగుదేశంతో పొత్తు అనగానే గోదావరి జిల్లాల్లో పవన్ గ్రాఫ్ పడిపోయింది. 80వ దశకంలో వంగవీటి మోహన్ రంగా హత్యోదంతం నుంచి.. కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం కుటుంబం పైన, కాపు సామాజికవర్గం పైన చంద్రబాబు ప్రభుత్వం సాగించిన దమనకాండను గుర్తుకు తెచ్చుకుని.. సామాజిక మాధ్యమాల్లో పలువురు పవన్ తీరును ఏకి పారేశారు. ఆ వ్యతిరేకతను తగ్గించుకునేందుకో లేక కాస్తో కూస్తో బలం ఉన్న గోదావరి జిల్లాల్లో బలప్రదర్శన ద్వారా పొత్తుల్లో సీట్లు పెంచుకునేందుకో వారాహి యాత్రను ఇక్కడి నుంచే ప్రారంభించి ఉంటారని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ యాత్రలో తమకు కనీస ప్రాధాన్యం ఇవ్వలేదని ఆ పార్టీ నేతలు పలువురు తీవ్ర ఆవేదనతో ఉన్నారు. పుష్కర కాలంగా పార్టీ కోసం లక్షల రూపాయలు తగలేసుకుంటున్న ఇన్‌చార్జిలకు సైతం వారాహిపై వేదిక పంచుకునే అవకాశం ఇవ్వకుండా దూరం పెట్టడంపై నిప్పులు చెరుగుతున్నారు. మొత్తంగా ఉమ్మడి 'తూర్పు'న వారాహి యాత్ర అనేక వివాదాలు, అసంతృప్తులతో ఆ పార్టీ అభిమానులకు తీవ్ర నిరాశ మిగిల్చింది.

14 ఏళ్లు సీఎంగా ఉండి.. పేదల కోసం ఏం చేశారు?

- 1,001వ రోజు దీక్షలో చంద్రబాబుకు బహుజన పరిరక్షణ సమితి నేతల ప్రశ్న


రిలే దీక్షలో బహుజన పరిరక్షణ సమితి నేతలు

తాడికొండ: ఇప్పుడు పేదలపై ప్రేమ ఒలకబోస్తున్న చంద్రబాబు 14 ఏళ్లు సీఎంగా ఉండి ఏం చేశారో చెప్పాలని బహుజన పరిరక్షణ సమితి నేతలు కోరారు. తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారం 1,001వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ చంద్రబాబు రైతులను నిలువునా ముంచి మూడు పంటలు పండే 29 గ్రామాల్లోని పొలాలను సర్వనాశనం చేసి కాంక్రీట్ జంగిల్స్‌గా మార్చి పత్తా లేకుండా పోయింది చాలక దొంగ నాటకాలాడుతున్నారని ధ్వజమెత్తారు. రాజధానికి భూములిచ్చిన రైతులకు సీఎం వైఎస్ జగన్ కౌలు పరిహారం కింద రూ.250 కోట్లు విడుదల చేయడం హర్షణీయమన్నారు. నాయకులు మాదిగాని గురునాథం, నూతక్కి జోషి, పులి దాసు, ఈపూరి ఆదాం, బేతపూడి సాంబయ్య, దళిత నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

అధికారంలోకి రాగానే లాక్కొచ్చి కొడతాం

మలికిపురం సభలో జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్



సాక్షి, అమలాపురం/మలికిపురం: 'నా ఒంటి మీద చేయి పడినా, ఒక్క రాయి పడ్డా, జనసైనికుల మీద చేయి పడ్డా.. ఆడపడుచుల మీద అత్యాచారాలు చేసినా పవన్ కల్యాణ్ చూస్తూ ఊరుకోడు. అధికారంలోకి వచ్చిన తర్వాత దాడులు చేసిన వారిని ఇళ్ల నుంచి లాక్కొచ్చి కొడతాం.. మా జోలికి వస్తే ఊరుకునేది లేదు.. తన్ని తరిమేస్తాం' అని జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ అన్నారు. వారాహి యాత్రలో భాగంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మెయిన్ రోడ్డులో ఆదివారం రాత్రి జరిగిన సభలో ఆయన మాట్లాడారు. 'బటన్ నొక్కితే రూ.10వేలు వెళ్తున్నాయి. చాలా సంతోషం. ప్రభుత్వాలు సామాన్యులకు మేలు చేయాలి. ఈ ప్రభుత్వంలో 30 శాతం మందికి పథకాలు వస్తే 70 శాతం మంది నష్టపోతున్నారు. నేను ఓటు బ్యాంకు రాజకీయాలు చేయను. అధికారంలోకి వస్తే అందరికీ మేలు చేస్తాను' అని చెప్పారు.

కోనసీమ అభివృద్ధి ఏదీ?

అపార వనరులున్నా కోనసీమ అభివృద్ధి చెందలేదని పవన్ కళ్యాణ్ అన్నారు. చమురు సంస్థల వల్ల స్థానికులు పలు రకాలుగా నష్టపోతున్నారని, గోదావరి జిల్లాల అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ ఉండాలని చెప్పారు. ఎన్ని పాదయాత్రలు చేస్తే ప్రయోజనమేమిటని, సఖినేటిపల్లి-నర్సాపురం వంతెన వచ్చిందా... అని ప్రశ్నించారు. రాజోలు బైపాస్ రోడ్డు పూర్తి చేయకపోతే జనసేన శ్రమదానం చేసి నిర్మిస్తుందని ప్రకటించారు. జనసేనకు అవకాశం ఇస్తే మెడలు వంచి పని చేయిస్తానని చెప్పారు. ఉభయ గోదావరి జిల్లాల్లో 34 స్థానాల్లో మరో పార్టీ గెలవకూడదని అన్నారు. జనసేన అధికారంలోకి వచ్చాక వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై, టీటీడీ శ్రీవాణి ట్రస్టుపై విచారణ తప్పదన్నారు.

రాజోలులో చిరు దీపం వెలిగించారు

2019లో ఓడిపోయినప్పుడు సర్వం కోల్పోయినట్టయ్యిందని, అయితే రాజోలులో మీరు ఇచ్చిన గెలుపు మరువలేనని పవన్ కళ్యాణ్ అన్నారు. అప్పుడు రాజోలులో వెలిగిన చిరు దీపం, నేడు అఖండ జ్యోతిలా వెలుగుతోందన్నారు. 'మీ ఎమ్మెల్యే పార్టీ వదిలి సొంత అవసరాల కోసం వెళ్లి నియోజకవర్గ అభివృద్ధిని మాత్రం వదిలేశారు' అని విమర్శించారు. అంతకు ముందు దిండిలో జరిగిన రాజోలు నియోజకవర్గ నేతల సమావేశంలో నాయకుల తీరుపై పవన్ అసంతృప్తి వ్యక్తంచేశారు. పార్టీ అభివృద్ధి కన్నా టికెట్ కోసం పైరవీలు ఎక్కువగా చేస్తున్నారన్నారు. కాగా, మలికిపురం సభ అనంతరం పవన్ నర్సాపురం వెళ్లారు.

'పశ్చిమ' నుంచే పోటీ చేయండి

జనసేన అధినేతకు హరిరామజోగయ్య సూచన

పాలకొల్లు సెంట్రల్: పశ్చిమగోదావరి జిల్లాలో ఏదో ఒక నియోజకవర్గం నుంచి పవన్‌కళ్యాణ్ పోటీచేయాలని కాపు సంక్షేమ సేన వ్యవస్థాపకుడు, మాజీ ఎంపీ చేగొండి హరిరామజోగయ్య సూచించారు. పాలకొల్లులోని ఆయన నివాసంలో ఆదివారం మీడియాతో మాట్లాడారు. జిల్లాలో నరసాపురం, భీమవరం, తాడేపల్లిగూడెం నియోజకవర్గాల్లో ఏదో ఒక నియోజకవర్గం నుంచి పోటీ చేస్తే అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామని జిల్లా ప్రజానీకం తరఫున చెబుతున్నట్టు తెలిపారు. కొణిదెల కుటుంబానికి నరసాపురం సొంత నియోజకవర్గమని.. దానిని కాపాడుకోవాలంటే ఇక్కడి నుంచే పోటీచేయాలని ప్రజలు కోరుకుంటున్నట్టు తెలిపారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో భీమవరం నుంచి పోటీ చేసి ఓడినా.. వచ్చే ఎన్నికల్లో మాత్రం ఇక్కడి నుంచి పోటీ చేస్తే అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామని అక్కడి ప్రజలు చెబుతున్నారని తెలిపారు. గతంలో ప్రజారాజ్యం పార్టీ తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో విజయం సాధించిందని, రానున్న ఎన్నికల్లో ఇక్కడి నుంచి పోటీ చేసినా గెలిచే అవకాశం ఉందన్నారు.

కన్నా.. నోరు అదుపులో పెట్టుకో

- ఇష్టానుసారం మాట్లాడితే చూస్తూ ఊరుకోం
- సీఎం చిటికెన వేలు గోటికి కూడా సరిపోవు
- నీ గురించి కన్నావారి తోటలో ఎవరినడిగినా చెబుతారు
- రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి మండిపాటు



సత్తెనపల్లి (ముప్పాళ్ల): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై, ఆయన కుటుంబంపై ఇష్టానుసారం మాట్లాడితే చూస్తూ ఊరుకోబోమని, నోరు అదుపులో పెట్టుకోవాలని మాజీ మంత్రి టీడీపీ నాయకుడు కన్నా లక్ష్మీనారాయణను రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు హెచ్చరించారు. తాము వైఎస్సార్‌సీపీ కార్యకర్తలమని, వైఎస్ రాజశేఖరరెడ్డి శిష్యులమని, జగన్‌మోహన్‌రెడ్డి అభిమానులమని.. నీలా పార్టీలు మారి, దగాలు చేసి డబ్బులు సంపాదించుకునే వ్యక్తులం కాదని మండిపడ్డారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. వంద మంది రాజారెడ్డిలు, పది మంది రాజశేఖరరెడ్డిలు కలిస్తే జగన్ అనే మాట వాస్తవమే అన్నారు. వైఎస్ రాజారెడ్డి మనుమడు జగన్ అని, ఇద్దరు ముఖ్యమంత్రులను అందించిన గొప్ప వ్యక్తి రాజారెడ్డి అని తెలిపారు. సీఎం జగన్ పార్టీలో చేరేందుకు ఎందుకు తాపత్రయపడ్డావని ప్రశ్నించారు. బీజేపీ వారు బెదిరిస్తే గుండె జబ్బు అంటూ ఆస్పత్రిలో చేరింది నిజం కాదా? అని నిలదీశారు. ఇలాంటి మీకు సీఎంను విమర్శించే అర్హతే లేదన్నారు. సీఎం జగన్ చిటికెన వేలు గోటికి కూడా సరిపోవని ధ్వజమెత్తారు.

నీ చరిత్ర తెలియనిది ఎవరికి?

'చంద్రబాబు డైరెక్షన్‌లో పని చేయటమే నీ పని. టీడీపీలోకి వెళ్లావు. పోటీ చేస్తావో పారిపోతావో చూద్దాం. నీ ఇన్‌చార్జ్ పని నువ్వు చేసుకో. అంతేకాని ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే మేము చంద్రబాబునాయుడు లాంటి వాళ్లం కాదని గుర్తుంచుకోవాలి. రేపల్లె నా ప్రాంతం. అక్కడే పుట్టాను.. అక్కడే పెరిగాను. అక్కడే ఐదేళ్లు ఎమ్మెల్యేగా పని చేశా. సత్తెనపల్లిలో పోటీ చేసి ఒక్కసారి ఓడిపోయి, మరోసారి 20 వేల పై చిలుకు ఓట్లతో విజయం సాధించాను. 12 ఏళ్లుగా ఇక్కడే ఉంటున్నాను. నా గురించి ఇక్కడి ప్రజలను అడిగి తెలుసుకో' అని మంత్రి అంబటి నిప్పులు చెరిగారు. నీ సంగతి గుంటూరులోని కన్నావారి తోటలో ఎవరిని అడిగినా చెబుతారని గుర్తుంచుకోవాలన్నారు. ఎన్నికల ఖర్చు కోసం పంపిన ఫండ్‌ను కూడా మింగేసిన చరిత్ర నీదని అందరికీ తెలిసిందేనన్నారు. నీ చరిత్ర గురించి నీ ఇంటి సందు మూల వద్ద ఉండే బోర్డులే చెబుతాయన్నారు. కాంగ్రెస్, బీజేపీ, టీడీపీ, చివరికి జనసేన మనోహర్‌తో కూడా చర్చలు జరిపిన చరిత్ర నీదేనని విమర్శించారు. చంద్రబాబును తిట్టిన నోటితోనే పాలాభిషేకం చేసిన నీకు వైఎస్ జగన్ గురించి మాట్లాడే నైతిక విలువలు లేవన్నారు.

రాజకీయ జీవితం నెల్లూరు నుంచే ముగించాలనుకుంటున్నా..

వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి



నెల్లూరు సిటీ: నెల్లూరు నగరం నుంచి 1983లో ఎమ్మెల్యేగా గెలిచి రాజకీయ జీవితాన్ని ప్రారంభించిన తాను... రాజకీయ జీవితానికి ముగింపు కూడా నెల్లూరు నుంచే జరగాలని కోరుకుంటున్నట్లు వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి చెప్పారు. నెల్లూరులోని తన నివాసంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు రానున్న ఎన్నికల్లో ఏ నియోజకవర్గం నుంచి పోటీచేయమంటే అక్కడినుంచి పోటీచేయడానికి సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. ఒకవేళ పోటీలో లేకుండా జిల్లాలోని నియోజకవర్గాల గెలుపు బాధ్యతలను తనపై పెట్టినా అందుకోసం పనిచేస్తానని తెలిపారు. చంద్రబాబునాయుడు ఇప్పుడు అవకాశం ఇస్తారా.. తరువాత ఇస్తారా.. అనేది ఆయన నిర్ణయమని పేర్కొన్నారు.

బంగాళాఖాతంలో అల్పపీడనం

- రెండ్రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం
- మత్స్యకారులు చేపల వేటకు వెళ్లొద్దు
- విశాఖ తుపాను హెచ్చరికల కేంద్రం సూచన
- ఈ నెలలో సాధారణం కంటే 33.5 శాతం తక్కువ వర్షపాతం నమోదు
- రుతుపవనాల రాక ఆలస్య ఫలితం



సాక్షి, అమరావతి/విశాఖపట్నం: వాయువ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడినట్లు వాతావరణ శాఖ తెలిపింది. దానికి అనుబంధంగా మరో ఉపరితల ఆవర్తనం ఒడిశా, పశ్చిమ బెంగాల్ తీరాల వరకు విస్తరించింది. దీని ఫలితంగా రాబోయే రెండ్రోజుల్లో ఇవి ఉత్తర ఒడిశా, జార్ఖండ్ మీదుగా కదిలే అవకాశముంది. వీటి ప్రభావం రాష్ట్రంపై పెద్దగా ఉండే అవకాశం లేకపోయినా ఓ మోస్తరు వర్షాలు పడతాయని భారత వాతావరణ శాఖాధికారులు (ఐఎండీ) ఆదివారం రాత్రి తెలిపారు. ప్రధానంగా ఉత్తరాంధ్రలో వర్షాలు పడే అవకాశం ఎక్కువగా ఉన్నట్లు పేర్కొన్నారు. మరోవైపు.. నైరుతి రుతుపవనాలు బలంగా ఉండడంతో ఈ నెల 29వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు కురుస్తాయని వారు తెలిపారు. కాగా, అల్పపీడనం ప్రభావంతో సముద్రం అలజడిగా ఉంటుందని మత్స్యకారులు చేపల వేటకు వెళ్లవద్దని విశాఖ తుపాను హెచ్చరికల కేంద్రం సూచించింది. ఇక ఆదివారం తూర్పుగోదావరి, శ్రీకాకుళం, గుంటూరు, నంద్యాల, పార్వతీపురం మన్యం జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. పైడిమెట్ట (తూర్పు గోదావరి)లో 5.9, ఆమదాలవలస (శ్రీకాకుళం)లో 4.1, రావెల (గుంటూరు)లో 4, జియ్యమ్మవలస (పార్వతీపురం మన్యం)లో 4, ముత్తాల (అనంతపురం)లో 3.4, జొన్నగిరి (కర్నూలు) 3.2 సెం.మీ.ల చొప్పున వర్షపాతం నమోదైంది.

రాష్ట్రంలో లోటు వర్షపాతం

నైరుతి రుతుపవనాల రాక ఆలస్యం ప్రభావం రాష్ట్రంపై స్పష్టంగా కనిపిస్తోంది. వీటి ఆగమనంలో జాప్యం జరగడంతో సకాలంలో వర్షాలు కురవక 20 జిల్లాల్లో లోటు వర్షపాతానికి దారితీసింది. నాలుగు జిల్లాల్లో సాధారణం, రెండు జిల్లాల్లో మాత్రమే అధిక వర్షపాతం నమోదైంది. జూన్ ఒకటి నుంచి మొదలైన నైరుతి రుతుపవనాల సీజనులో ఇప్పటి వరకు రాష్ట్రంలోకెల్లా అత్యల్పంగా నెల్లూరు జిల్లాలో సాధారణం కంటే 68.1 శాతం లోటు వర్షపాతం రికార్డయింది. ఆ జిల్లాలో 45.8 మి.మీ.ల వర్షపాతం నమోదు కావలసి ఉండగా ఇప్పటివరకు 14.6 మి.మీ.లు మాత్రమే వర్షం కురిసింది. అత్యధికంగా బాపట్ల జిల్లాలో సాధారణంకంటే 38.5 శాతం అధిక వర్షపాతం నమోదైంది. అక్కడ సాధారణ వర్షపాతం 58.2 మి.మీ.లకు గాను 81.2 మి.మీ.ల వర్షపాతం రికార్డయింది. ఇక సాధారణ వర్షపాతం నమోదైన జిల్లాల్లో కృష్ణా, పల్నాడు, శ్రీసత్యసాయి, చిత్తూరు జిల్లాలున్నాయి. ఈ సీజనులో ఇప్పటివరకు సగటున 84.2 మి.మీల వర్షపాతం కురవాల్సి ఉండగా, 56 మి.మీలు మాత్రమే కురిసింది.

టీడీపీ బస్సుయాత్రలో బాహాబాహీ

- పెనుకొండలో తన్నుకున్న బీకే, సవితమ్మ వర్గీయులు
- సవితమ్మను, ఆమె వర్గీయులను హెచ్చరించిన బీకే


పెనుకొండలో ఘర్షణ పడుతున్న మాజీ ఎమ్మెల్యే పార్థసారథి, సవితమ్మ వర్గీయులు

పెనుకొండ: శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ నియోజకవర్గంలో టీడీపీ నాయకుల వర్గపోరు తారస్థాయికి చేరింది. భవిష్యత్తుకు గ్యారెంటీ పేరిట చేపట్టిన బస్సుయాత్ర సందర్భంగా ఆదివారం మాజీ ఎమ్మెల్యే బీకే పార్థసారథి, పార్టీ నాయకురాలు సవితమ్మ వర్గీయులు పెనుకొండ పట్టణంలో బాహాబాహీకి దిగారు. నడిరోడ్డుపైనే తన్నుకున్నారు. బస్సుయాత్ర ఆదివారం శెట్టిపల్లి నుంచి వివిధ గ్రామాల మీదుగా పెనుకొండకు చేరుకుంది. స్థానిక మడకశిర సర్కిల్లోని ఎన్‌టీఆర్ విగ్రహానికి పూలమాల వేయడానికి ముందు సమీపంలోని టీడీపీ కార్యాలయం వద్ద సవితమ్మ వర్గీయులు బాణాసంచా కాలుస్తూ కేకలు వేశారు. దీంతో ఆగ్రహానికి లోనైన బీకే పార్థసారథి.. సవితమ్మ వర్గీయులను తీవ్రస్థాయిలో హెచ్చరించారు. 'పోటు పొడిచారు.. మీ కథ చూస్తా..' అంటూ హెచ్చరించారు. బస్సుయాత్రలో వెనుకనే ఉండి డ్రామాలాడుతోందంటూ సవితమ్మపై పరోక్షంగా మండిపడ్డారు. అనంతరం పార్టీ జిల్లా నేతలు ఎన్‌టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేయడానికి పైకి వెళ్లగానే.. బస్సు ముందు నిలబడి ఉన్న ఇరువర్గాలు కేకలు వేస్తూ బాహాబాహీకి దిగారు. గందరగోళం నెలకొంది. ఏం జరుగుతోందో అర్థంగాక కార్యకర్తలు ఆందోళనకు గురయ్యారు. పోలీసులు వెంటనే రంగప్రవేశం చేసి ఇరువర్గాలను చెదరగొట్టారు. అక్కడి నుంచి బస్సుయాత్ర అంబేడ్కర్ సర్కిల్‌కు వెళ్లగా సవితమ్మ వర్గీయులు మాత్రం కార్యాలయం వద్దే ఉండిపోయారు.

జర్నలిస్టు యూనియన్ నేత అంబటి ఆంజనేయులు మృతి

- హృద్రోగ సమస్యతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూత
- ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సంతాపం


అంబటి ఆంజనేయులు(ఫైల్)

గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): ఇండియన్ జర్నలిస్టు యూనియన్ (ఐజేయూ) స్టీరింగ్ కమిటీ సభ్యుడు, ఏపీయూడబ్ల్యూజే గౌరవ సలహాదారు అంబటి ఆంజనేయులు (78) గుండెపోటుతో మృతిచెందారు. హృద్రోగ సమస్యతో బాధపడుతున్న ఆయన ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేరారు. మూడ్రోజులుగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఏపీయూడబ్ల్యూజే అధ్యక్షుడిగా, ప్రధాన కార్యదర్శిగా సుదీర్ఘ కాలంపాటు సేవలు అందించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఏపీయూడబ్ల్యూజే విస్తరణకు విశేష కృషిచేశారు. ఆయన ప్రస్తుతం ఇండియన్ జర్నలిస్టు యూనియన్ స్టీరింగ్ కమిటీ సభ్యుడిగా ఉన్నారు. ఆయన ఆంధ్రప్రభ, ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లో ప్లాంట్ లెవల్ యూనియన్ అభివృద్ధికి ఎంతో కృషిచేశారు. ఆంధ్రప్రదేశ్ న్యూస్ పేపర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (ఏపీఎన్ఈఎఫ్) అధ్యక్షుడిగా వివిధ పత్రికల్లో ఎంప్లాయిస్ యూనియన్ ఏర్పాటుకు కృషిచేసి నాన్ జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ఎంతో పాటుపడ్డారు. మీడియా ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ఇండియా ట్రస్టీగా కూడా సేవలందించారు.

సీఎం జగన్ సంతాపం

ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ (ఐజేయూ) నాయకుడు అంబటి ఆంజనేయులు మృతికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంతాపం వ్యక్తంచేశారు. ఆంజనేయులు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ముఖ్యమంత్రి కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. మరోవైపు ఆంజనేయులు మృతిపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ జాతీయ మీడియా సలహాదారు దేవులపల్లి అమర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు.

ఐజేయూ, ఏపీయూడబ్ల్యూజే సంతాపం

అంబటి ఆంజనేయులు మృతికి ఐజేయూ అధ్యక్షుడు కె.శ్రీనివాస్‌రెడ్డి, ఏపీయూడబ్ల్యూజే అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఐవీ సుబ్బారావు, చందు జనార్దన్‌తో పాటు పలువురు ఐజేయూ కౌన్సిల్ సభ్యులు, ఏపీయూడబ్ల్యూజే నేతలు తమ ప్రగాఢ సంతాపం తెలిపారు.

నవరత్నాలతోనే బీసీల అభివృద్ధి

ఏపీ బీసీ సంఘం అధ్యక్షుడు డాక్టర్ మారేష్



పెనమలూరు: నవరత్నాలతోనే బీసీల అభివృద్ధి సాధ్యమని ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం అధ్యక్షుడు డాక్టర్ మారేష్ అన్నారు. కృష్ణా జిల్లా పెనమలూరు మండలం కానూరు సనత్‌నగర్‌లో ఆదివారం బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు వల్లభనేని మణికంఠ ఆధ్వర్యంలో జరిగిన బీసీ కుల సంఘాల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చట్టసభల్లో 50 శాతం బీసీలకు రిజర్వేషన్లు కల్పించాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీలకు రాజ్యాధికారంలో 65 శాతం వాటా ఇచ్చి మిగితా రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. ఎంపీ, మంత్రులు, ఎమ్మెల్యేలు, నామినేటెడ్ పోస్టుల్లో బీసీ కులాల వారికి తగిన ప్రాధాన్యం ఇచ్చారని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల్లో పేదరిక నిర్మూలనకు నవరత్నాలను అమలు చేసి అండగా నిలిచారని తెలిపారు. మణికంఠ మాట్లాడుతూ పెనమలూరు వేదికగా బీసీ గర్జన నిర్వహిస్తామని చెప్పారు. సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు వేమేల బేబీరాణి, సంఘం నేతలు భీమేష్, రమేష్ పాల్గొన్నారు.

చంద్రబాబును సీఎంను చేస్తే భారీగా సంక్షేమ పథకాలు: లోకేశ్

నాయుడుపేట(తిరుపతి జిల్లా): రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీలకు భారీగా సంక్షేమ పథకాలు అమలు చేస్తామని, వచ్చే ఎన్నికల్లో చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయాలని టీడీపీ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. యువగళం పాదయాత్రలో భాగంగా నాయుడుపేట గాంధీమందిరం వద్ద ఆదివారం రాత్రి జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీలకు పెద్ద పీట వేసింది టీడీపీయేనని చెప్పారు. ప్రతి ఇంటికీ నీటి కుళాయిలు ఏర్పాటు చేసి తాగునీరు పంపిణీ చేస్తామన్నారు. నియోజకవర్గంలో జాలర్ల చేపల వేటకు అనువుగా ఉండేందుకు పులికాట్ ముఖద్వారం తీయిస్తానని హామీ ఇచ్చారు. మైనారిటీలకు అందాల్సిన సంక్షేమ పథకాలను అందేలా చేస్తానన్నారు.

తెలంగాణ

నేడు మహారాష్ట్రకు కేసీఆర్

- బీఆర్ఎస్‌కు కొత్త ఊపు లక్ష్యంగా పర్యటన
- 500 వాహనాలతో కూడిన భారీ కాన్వాయ్

సాక్షి, హైదరాబాద్: మహారాష్ట్రలోనూ భారత్ రాష్ట్ర సమితి బలోపేతానికి అత్యంత ప్రాధాన్యతనిస్తున్న పార్టీ అధినేత, తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు రెండు రోజులపాటు ఆ రాష్ట్రంలో పర్యటించనున్నారు. సోమవారం రోడ్డు మార్గంలో భారీ కాన్వాయ్‌తో బయలుదేరి వెళ్లనున్న సీఎం.. తిరుగు ప్రయాణంలో ప్రత్యేక విమానంలో హైదరాబాద్‌కు చేరుకోనున్నారు. సోమవారం ఉదయం 10 గంటల సమయంలో సుమారు 500 వాహనాలు అనుసరిస్తుండగా 65వ నంబరు జాతీయ రహదారి మీదుగా మహారాష్ట్రకు కేసీఆర్ బయలుదేరతారు. హైదరాబాద్ నుంచి మొత్తం సుమారు 315 కిలోమీటర్ల రోడ్డు ప్రయాణానంతరం రాత్రి 10 గంటలకు షోలాపూర్‌కు చేరుకుంటారు. షోలాపూర్‌లో రాత్రి బస అనంతరం మంగళవారం ఉదయం స్థానికంగా అధిక సంఖ్యలో ఉండే తెలుగు ప్రజలతో పాటు వివిధ రంగాలు, వర్గాలకు చెందిన ప్రతినిధులతో కేసీఆర్ భేటీ అవుతారు. అనంతరం పండరీపూర్ పట్టణానికి చేరుకుని శ్రీ విఠల రుక్మిణీ మందిర్‌లో ప్రత్యేక పూజలు చేస్తారు. తర్వాత స్థానికంగా జరిగే బీఆర్ఎస్ సభలో ఎన్సీపీ దివంగత ఎమ్మెల్యే భరత్ భాల్కే కుమారుడు భగీరథ్ భాల్కే.. కేసీఆర్ సమక్షంలో పార్టీలో చేరతారు. మధ్యాహ్నానికి తుల్జాపూర్ చేరుకుని భవానీమాత మందిరంలో ప్రత్యేక పూజలు చేస్తారు. అనంతరం అక్కడికి సమీపంలోని ఉస్మానాబాద్ (దారాశివ్) ఎయిర్‌పోర్టుకు చేరుకుని, ప్రత్యేక విమానంలో మంగళవారం సాయంత్రానికి హైదరాబాద్‌కు వస్తారు.



ఇచ్చిపుచ్చుకోవడం లేనిదే అది ప్రేమా కాదు, స్నేహమూ అవదు.
– ప్లేటో

సాక్షి
సోమవారం, 26 జూన్ 2023

‘స్వేచ్ఛ’యను రెండక్షరములు...

‘స్వేచ్ఛ’ అంటే కేవలం రెండక్షరాలు కాదు, దిగంతాలను కొలిచే పక్షికి రెండు రెక్కలు; భూమండలాన్ని చుట్టే మనిషికి రెండు పాదాలు; స్వేచ్ఛ అంటే ఒక నిర్నిబంధమైన మాట; ఒక స్వతంత్రమైన చేత. హద్దులేని ఆకాశమూ, అంతులేని భూమండలమూ స్వేచ్ఛాసంచారానికి ప్రకృతి చేసిన ఏర్పాట్లు. ప్రకృతి నిఘంటువులో మొదటి మాటా, చివరి మాటా స్వేచ్ఛే! ఎగిరే పక్షిని ఏ వేటగాడి బాణమో పడగొట్టినప్పుడూ, నడిచే మనిషి కాళ్ళకు ఏ నిరంకుశపు సంకెళ్ళో పడినప్పుడూ, ఏ నిషేధాల కత్తుల బోనులోనో మాట బందీ అయినప్పుడూ అది అక్షరాలా ప్రకృతి మీద జులుము, ప్రకృతి ఏర్పాటు మీద దాడి. స్వేచ్ఛ రెక్క విరిచిన రోజు వచ్చి వెడుతూ, దాని విలువను మరోసారి గుచ్చి చెప్పింది.

చెరబడ్డప్పుడు తప్ప సాధారణ పరిస్థితుల్లో పూర్తిగా గుర్తించలేని విలువ స్వేచ్ఛ. అడవుల పాలైన ధర్మరాజుకు ఆ విలువ తెలుసు. మనిషికి ఆనందమిచ్చేది ఏదని యక్షుడు అడిగినప్పుడు ప్రవాసంలో కాకుండా స్వవాసంలో ఉండడమేనంటాడు. పరాయి పాలనలో వ్యథార్త జీవితాలు గడిపిన నిన్నమొన్నటి మన స్వాతంత్ర్య సమరయోధులకు, ఇతర బుద్ధిజీవులకే కాదు; సామాన్య జనానికి సైతం స్వేచ్ఛ విలువ తెలుసు. ‘స్వేచ్ఛ మన ఊపిరి’ అంటాడు మహాత్మాగాంధీ. ఊపిరి నిలుపుకోవడానికి ఎంత మూల్యమైనా చెల్లించవలసిందే. ‘ఎక్కడ మనసు నిర్భయమవుతుందో, ఎక్కడ తలెత్తుకుని ఉండగలమో, ఎక్కడ జ్ఞానం శృంఖలాబద్ధం కాదో, ఎక్కడ సంకుచితపు గోడలతో ప్రపంచం ముక్కముక్కలు కాదో, ఎక్కడ మాట సత్యపు లోతుల్లోంచి జాలువారుతుందో, ఎక్కడ శ్రమించే చేతులు పరిపూర్ణత వైపు బారలు చాచగలవో, ఎక్కడ హేతుత్వమనే స్వచ్ఛ ప్రవంతి దారి తప్పకుండా ఉంటుందో...’ అలాంటి స్వేచ్ఛాయుత ప్రపంచం కోసం విశ్వకవి టాగోర్ పరితపిస్తాడు. మానసిక స్వేచ్ఛనే నిజమైన స్వేచ్ఛగా బాబా సాహెబ్ అంబేడ్కర్ అభివర్ణిస్తాడు. సంకెళ్లలో లేకపోయినా స్వేచ్ఛాయుత చింతన లేనివాడు బానిసే తప్ప స్వతంత్రజీవి కాడనీ, జీవన్మృతుడనీ అంటాడు.

‘మనిషి పుట్టుకతో స్వేచ్ఛాజీవి, కానీ ప్రతిచోటా సంకెళ్ళలో చిక్కుకున్నా’డన్న రూసో నిర్వచనం ఎంతైనా నిజం. స్వేచ్ఛా, మనిషీ కలిసే పుట్టారు. ఆధిపత్యాలు, అంకుశాలు, అణచివేతలు తర్వాత వచ్చాయి. దేశాల హద్దులూ, వీసాల నిర్బంధాలూ లేని కాలంలో మనిషి స్వేచ్ఛగా భూమండలమంతా కలయదిరిగాడు. అందుకే ప్రపంచంలోని ప్రతి తావూ అతని చిరునామా అయింది. సంస్కృతీ, నాగరికతలను సంతరించుకున్న తర్వాతా; భాషాభేదాలూ, ప్రాంతాల తేడాలూ, జాతీయతా వాదాలూ పొటమరించిన తర్వాతా అతని స్వేచ్ఛాగమనానికి అడ్డుగోడలు లేచాయి. అదొక విచిత్ర వైరుధ్యం. వేల సంవత్సరాల క్రితం జరిగిన జన్యుపరివర్తన కారణంగా గొంతుముడి వీడి మనిషి మాట్లాడగలిగిన దశకు చేరాడంటారు. అప్పుడు తన ఆనందోద్వేగాలను ఎంత స్వేచ్ఛగా గొంతెత్తి ప్రకటించుకుని ఉంటాడో! క్రమంగా తన మాటను రకరకాల నిషేధాలూ, నిర్బంధాల కత్తివేటూ భయపెట్టినప్పుడు స్వేచ్ఛనుడిగి మూగవోయిన దుఃఖచరిత్ర అతనిది.

పురాణకాలం నుంచి నవీనకాలం వరకూ ఏ ఘట్టంలోనూ స్వేచ్ఛారాహిత్యంతో రాజీపడని ధిక్కారచరిత్రా అతనికుంది. తన సహజస్వేచ్ఛపై అత్యాచారం శ్రుతిమించిన ప్రతిసారీ అగ్గిరవ్వ అయ్యాడు. చండశాసనం ఉన్నచోట దాని అతిక్రమణా ఉండితీరుతుందనడానికి రామాయణమే సాక్ష్యం. హనుమంతుడు సీతను చూసొచ్చిన తర్వాత సంబరం పట్టలేకపోయిన వానర సమూహం కిష్కింధలోని మధువనంలోకి జొరబడి అక్కడి తేనెతో విందు చేసుకుని, మత్తిల్లి వనాన్ని ధ్వంసం చేస్తారు. ఆ క్షణంలో వారిలో పురివిప్పిన స్వేచ్ఛాసహజాతం చండశాసనుడైన తమ ఏలిక సుగ్రీవుడు దండిస్తాడన్న భయాన్ని కూడా జయించింది.

పీడనకూ, పెత్తనానికీ గురవుతున్నాసరే తమ సహజసిద్ధమైన స్వేచ్ఛాదాహాన్ని తీర్చుకునేందుకు మనిషి అవకాశాలు వెతుక్కుంటూనే ఉంటాడు. ఆ మేరకు పెత్తందార్లకూ, పీడితులకూ మధ్య రాజీ ఏర్పాట్లు కూడా ఉండేవి. ఈ సందర్భంలో ప్రసిద్ధ పాత్రికేయుడు, రచయిత రాంభట్ల కృష్ణమూర్తి తన ‘సొంతకథ’లో ‘వాలకం’ అనే ప్రదర్శన రూపాన్ని ప్రస్తావిస్తారు. గౌరమ్మ సంబరాలప్పుడు కొంతమంది గ్రామస్తులు ఊళ్ళోని మోతుబరుల వేషంకట్టి వారి నడకను, నడవడిని అనుకరిస్తూ పాటల రూపంలో వారిపై ఆక్షేపణను చాటుకోవడమే ‘వాలకం’. ఒక్కోసారి ఆగ్రహించి మోతుబరులు దేహశుద్ధి చేయడం గురించీ ఆయన రాస్తారు. ఈ శతాబ్ది ప్రారంభంలో ఇలాంటి ప్రదర్శన అమెరికాలోనూ ఉండేదనీ, దానిని వాడెవిల్ అంటారనీ, చార్లీ చాప్లిన్ ఇందులో ప్రసిద్ధుడనీ ఆయన అంటారు. పురాతన సుమేరు సమాజంలో జనం ఎలాంటి నిర్బంధాలూ, నిబంధనలూ లేని స్వేచ్ఛను అనుభవించడానికి ఏటా వారం రోజులు కేటాయించేవారు.

అలాగని స్వేచ్ఛ అంటే ఎలాంటి అదుపాజ్ఞలూ లేని ఇచ్ఛావిహారం కాదు. సమష్టి శ్రేయస్సు కోసం స్వీయ నియంత్రణలో ఉంచుకోవలసిన బాధ్యత కూడా! పాలకులు, పాలితుల వ్యవహారణలో ఎక్కడ తూకం తప్పినా దెబ్బతగిలేది స్వేచ్ఛకే! నిరంతర అప్రమత్తతే స్వేచ్ఛకు చెల్లించే మూల్యం.

అందుకే ఎప్పటికీ ఆయన ‘గురు’

కామెంట్



కరణ్ థాపర్

1960లలో డూన్ స్కూలు అసమాన ప్రతిభ కలిగిన తన విద్యార్థుల కంటే, ఆ విద్యార్థులలోని క్రీడాకారులకే ఎక్కువ విలువ ఇచ్చింది. ఒక్కసారైనా క్రికెట్ బ్యాట్‌ను ఊపని, ఫుట్‌బాల్‌ను లాగిపెట్టి తన్నని విద్యార్థికి ప్రాముఖ్యం దక్కక పోవడం స్పష్టంగా కనిపించేది. ఇందుకు భిన్నంగా 99 ఏళ్ల వయసులో కన్నుమూసిన ‘గురు’ క్రీడాప్రతిభల కంటే కళాత్మక నైపుణ్యాలు గొప్పవనే భావనను విద్యార్థులలో కలిగించడానికి అనేక మార్గాలను కనిపెడుతుండేవారు. విద్యార్థులు ఆయన వద్ద పాఠ్యాంశంగా చదివిన సబ్జెక్టు భౌగోళిక శాస్త్రమే అయినప్పటికీ, వారు నేర్చుకున్న కొన్ని అత్యుత్తమమైన జీవిత పాఠాలు ఆయన బోధించినవే. ఇలా చేయమని గురు ఎప్పుడూ ఎవరికీ చెప్పలేదు. అయితే ఆయనొక ఉదాహరణగా కనిపించేవారు.

మేము ఆయన్ని ‘గురు’ అని పిలుచుకోవడం ఆపేక్షతోనే అయినప్పటికీ నిజానికి ఆయనకు అదే కచ్చితమైన మాట. విశ్వగురు అనడం ఫ్యాషన్ ఈ రోజుల్లో. కానీ ఆయన నిజమైన, అంకితభావం కలిగిన, శ్రద్ధాబద్ధుడైన ఉపాధ్యాయుడు. కావాలంటే మీరు ఆయన్ని భారతీయ ‘మిస్టర్ చిప్స్’ అనుకోవచ్చు. డూన్ స్కూల్ అబ్బాయిలకు ‘గురు’ అనే పేరుతోనే గురుదయాళ్ సింగ్ తెలుసు. గురు అన్నది ఆయన పేరుకు సముచితమైన నామకరణ. గత నెలలో ఆయన కన్ను మూసినప్పుడు కూడా అదే పేరుతో మాకు స్మరణీయం అయ్యారు.

నేను గురును మొదటిసారి కలిసినప్పుడు నా వయసు పదేళ్లు. జైపూర్ హౌస్ ‘హౌస్ మాస్టర్’ ఆయన. పొడవాటి మనిషి. నా వయసుకు ఇంకా పొడవుగా, భారీగా కనిపించారు. అయితే ఆయన చిరునవ్వుతో నా భయాలు, ఆందోళనలు అన్నీ తుడిచిపెట్టుకు పోయాయి. ఆయన నవ్వినప్పుడు నేనూ పెద్దపెట్టున నవ్వాను. నవ్వును ఆపుకోలేకపోయాను.

ఆయన వద్ద పాఠ్యాంశంగా నేను చదివిన సబ్జెక్టు భౌగోళిక శాస్త్రమే అయినప్పటికీ, నేను నేర్చుకున్న కొన్ని అత్యుత్తమమైన జీవిత పాఠాలు సైతం ఆయన బోధించినవే. ఆ కొన్నింటిలో మొదటిది అతి కష్టమైనది మాత్రమే కాకుండా, అసలు నేనేమిటన్న దాన్ని నాకు బహిర్గతం చేసినది కూడా!

1960లలో డూన్ స్కూలు అసమాన ప్రతిభ కలిగిన తన విద్యార్థుల కంటే, ఆ విద్యార్థులలోని క్రీడాకారులకే ఎక్కువ విలువ ఇచ్చింది. దీనర్థం ఒక్కసారైనా క్రికెట్ బ్యాట్‌ను ఊపని, ఫుట్‌బాల్‌ను లాగిపెట్టి తన్నని విద్యార్థికి ప్రాముఖ్యం దక్కక పోవడం అన్నది స్పష్టంగా కనిపించేదని! నేను నటనలో, వాదోపవాద చర్చలలో ముందుండే వాడిని. అలాగే, ఆఖరు నిమిషంలో చదివి మార్కుల్ని అదరగొట్టేయడంలో కూడా. కానీ నేను ఆటల్లో లేకపోవడం వల్ల నాలోని ఈ నైపుణ్యాలు చిన్నచూపునకు గురయ్యేవి.

అయితే గురు, క్రీడా ప్రతిభల కంటే కళాత్మక నైపుణ్యాలు గొప్పవనే భావనను నాలో కలిగించడానికి అనేక మార్గాలను కనిపెడుతుండేవారు. నేను పాల్గొన్న చర్చల్లోని నా తెలివైన మాటల్ని గుర్తు చేసుకునేవారు. అదొక ప్రశంసలా ఉండేది నాకు. లేదా చర్చావేదిక మీద అలా స్తంభించిపోయిన నా భంగిమ గురించి మాట్లాడుతూ నవ్వేసేవారు. పైకి అది సున్నితమైన ఎగతాళిగా ఉన్నప్పటికీ నిన్ను నేను శ్రద్ధగా గమనిస్తున్నాను సుమా అనే ఒక అంతర్లీనత కూడా ఆయనలో వ్యక్తం అయి, నేనొక ప్రత్యేకమైన వ్యక్తినన్న భావన నాలో కలిగించేది. జూనియర్స్ క్రికెట్‌లో నేను అత్యుత్తమంగా ఆడినప్పటికీ ఆయన ఉద్దేశం ప్రకారం నా చివరి ఏడాదిలో నేను ‘హౌస్ కెప్టెన్’ అవడానికి తగిన కారణం మాత్రం నాలోని ఆ కళాత్మక నైపుణ్యాలే! ఎందుకంటే, క్రికెట్ గ్రౌండ్‌లో నేనొక్కడినే ఉన్న వైపు నేరుగా వచ్చి నా చేతుల్లో పడిన బంతిని కూడా నేను క్యాచ్ పట్టలేకపోయాను.



గురుదయాళ్ సింగ్

ఆ విధంగా గురు, డూన్ స్కూల్ తానుగా ఎప్పటికీ నాకు అందించని విశ్వాసాన్ని నాలో కలిగించారు. నాలోని ప్రతిభ, నైపుణ్యాలతో సమానంగా, నా పరిమితుల్నీ నేను గుర్తించేలా; నా అపజయాల్ని, వైఫల్యాలను, తప్పుల్ని నేను ఎదుర్కొనేలా నేను ఎదగడానికి గురు తోడ్పడ్డారు. పడిపోతే పైకి లేచి, ముందుకు సాగిపోవడం ఎలాగో నేర్పించారు. అది నాకు ముఖ్యమైన పాఠం. ఎందుకంటే జీవితంలో తరచు నేను పొరపాట్లు చేసి పడిపోతుంటాను.

ఏళ్ల తర్వాత నేను పెద్దవాడిని అయినప్పుడు గురు నాకు చెప్పిన మరొక పాఠాన్ని గుర్తుకు చేసుకున్నాను. తప్పు చేసిన వారిని శిక్షించడం అన్నదొక్కటి మాత్రమే ఉత్తమ మార్గం కాదు. తప్పును మన్నించడం అన్నది ఉత్తమమైన మార్గం అయ్యే సందర్భాలు కూడా ఉంటాయి అంటారు గురు. గురు స్వయంగా ఈ సూత్రాన్ని పాటించిన సందర్భాలు అనేకం ఉన్నాయి. మొండితనాన్ని, అబద్ధాలను, ఉద్దేశపూర్వకమైన తెలివితక్కువ వేషాలను ఆయన భరించారు. నా తప్పులన్నీ ఆయనకు తెలుసు. అయినా ఆ తప్పుల్ని పోనిచ్చేవారు. అయితే ఆయన ముఖభావాలను బట్టి, నేను మరికొంత మెరుగ్గా ఉండాలని ఆయన ఆశిస్తున్నట్లు గ్రహించేవాడిని. ఏమీ తెలియని టీనేజ్‌లో ఉన్నప్పటికీ ఆ గ్రహింపు నాకు బాధను కలిగించేది. గురు దృష్టిలో గొప్పగా ఉండటం కన్నా నాకు వేరేదీ అక్కర్లేకపోయేది. అందుకే ఆయన అనిష్టత నా మనసును పిండేసినట్లుగా ఉండేది. ఆ మాత్రం శిక్ష సరిపోతుందని గురుకు తెలుసు.

ఇతరులు తప్పు చేసినప్పుడు నేను ఈ పాఠాన్ని గుర్తు చేసుకోవడానికి ప్రయత్నిస్తాను. కానీ అదంత తేలికగా ఉండదు. అందుకు వివేకం, నిగ్రహం రెండూ కావాలి. గురుకు ఆ రెండూ ఉన్నాయి. నాకు తరచు అవి రెండూ ఉండవు. నేను సరిగా నేర్చుకోని ఒక పాఠం ఇది.

మూడవ పాఠం, నేనింకా సాధన చేస్తూనే ఉన్నానని చెప్పడానికి సంతోషిస్తున్నాను. అది సులభమైనది. కొద్దిపాటి మర్యాదల పాటింపుతో స్పష్టమైన వ్యత్యాసాలను మీరు చూపగలుగుతారు. గదిలోకి ప్రవేశించగానే అక్కడ ఉన్న అందరినీ పలకరించండి. ‘దయచేసి’, ‘ధన్యవాదాలు’ అని చెప్పడాన్ని ఎప్పుడూ విస్మరించకండి.

ఇలా చేయమని గురు స్పష్టంగా నాకెప్పుడైనా చెప్పి ఉంటారని నేను అనుకోను. అయితే ఆయనొక ఉదాహరణగా ఎల్లవేళలా ప్రతి ఒక్కరికీ కనిపించేలా ఉంటారు. జాగ్రత్తగా గమనించవలసింది ఆయన పెంపొందించిన సత్ప్రవర్తన, ఆయన పట్ల మనలో ఉన్న గౌరవ భావన ఆయన్ని మనం అనుకరించేలా చేస్తాయన్నది. ప్రత్యక్షంగా ఆయన ప్రబోధించని విలువలకు మనమంతా అలవాటు అవుతాం. అనుకరణ ద్వారానే నేను నేర్చుకున్నాను.

నా జీవితాన్ని వెనక్కు తిరిగి చూసుకుంటే నాపై గురు ముద్ర పొరపాటున పడినట్లుగా అనిపించదు. వాటర్లూ యుద్ధంలో బ్రిటన్ గెలుపు ఈటన్ (పాఠశాలల) ఆట మైదానాల వల్ల సాధ్యమయిందేమో నాకు తెలియదు కానీ నాలోని మనిషిని మలిచింది మాత్రం కచ్చితంగా జైపూర్ హౌస్ ‘హౌస్ మాస్టర్’ అనే చెప్పగలను. అందుకే ఎప్పటికీ ఆయన నా ‘గురు’.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్



సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల ‘మనసులోని మాట’లు తాజాగా ఇలా...!

ఎవరు అడిగారు?



ఆయన హిందీకి పరిమితం అవాల్సింది. ‘రాజకీయ శాస్త్రం’లో ఎం.ఎ. చేసినవారికైనా టెలీప్రాంప్టర్‌లో ఇంగ్లీష్‌ను చూసి చదవడం కష్టంగానే ఉంటుంది. ‘విశ్వగురు’ అయినంత మాత్రాన, రాని ఇంగ్లీష్‌ను మాట్లాడాలని ఉందా? (అమెరికాలో మోదీ ప్రసంగం గురించి)

– ప్రశాంత్ భూషణ్, యాక్టివిస్టు

కథ అడ్డం తిరిగింది



రష్యాలో అంతర్యుద్ధం మొదలైందనీ, పుతిన్ బంకర్‌లో దాక్కున్నాడనీ విన్నాను! పుతిన్‌ను అభిమానించే ఇండియన్ మీడియా నుంచైతే దీనిపై ఒక్క వార్తా కథనం కూడా రాలేదు. అదలా ఉంచితే, ప్రతి హిట్లర్‌కూ అంతిమంగా దుర్గతి తప్పదు.

– కాకా ‘ఆరామ్‌దేవ్’, పేరడిస్ట్

ప్రజాస్వామ్యమా వర్ధిల్లు



మెడికల్, ఇంజినీరింగ్ కాలేజీలలో అజ్మల్ ఫౌండేషన్ నుంచి వచ్చిన వారి ఆధిక్యం ఉండటం మంచిది కాదని బహిరంగ సభలో వ్యాఖ్యానించిన అస్సాం ముఖ్యమంత్రి హిమంత శర్మకు సమాధానం ఇచ్చేవారు తమ ప్రతి వాక్యంలో ‘ప్రజాస్వామ్యం’ అనే మాట ఉండేలా పదే పదే పలుకుతూ ఉండండి.

– రాణా అయూబ్, జర్నలిస్ట్

ఎగతాళి తగదు



మమతా బెనర్జీ మాట్లాడే హిందీని ఎగతాళి చేసినా పట్టించుకోని వారు... మోదీ ఇంగ్లీష్‌ను ట్రోల్ చేస్తే సహించలేకపోవడం విడ్డూరంగా ఉంది. ఇతర ప్రాంతాలకు వెళ్లినప్పుడు ఎవరైనా సరే తమకు రాని భాషను మాట్లాడక తప్పని పరిస్థితి తలెత్తడం సహజమే కదా!

– షోయబ్ డ్యానియల్, పొలిటిక్ ఎడిటర్

ఇదొక తీరు



మనం గుర్తుంచుకోవాల్సింది ఏమిటంటే– నిజ జీవితంలో జనాన్ని కలిసినప్పుడు వాళ్లు అంత చెడ్డగా ఏమీ ఉండరు, ఇక్కడ ట్విట్టర్‌లో ఉన్నట్టుగా. ట్విట్టర్ అనేది చాలావరకూ మన చెడ్డ పార్శ్వం. కఠినంగా, అసహ్యకరంగా ధ్వనించే కొందరు జనాల తర్కంలేనితనానికి చాలాసార్లు ఆశ్చర్యపోతుంటాను.

– అభినందన్ సేఖరీ, జర్నలిస్ట్

అది మరింత ప్రమాదం



సృష్టిలోని చెత్త మనుములుగా కొందరిని ద్వేషించమని చెప్పే గ్రంథాన్ని లేదా దైవాన్ని విశ్వసించే సమూహాన్ని పునర్ విద్యావంతులను చేయాలి. వారిలో మానవీయ విలువల్ని పాదుకొల్పాలి. లేదంటే ఆ సమూహం తమను తాము ప్రత్యేక హక్కులు కలిగినవారిగా పరిగణించుకుంటుంది.

– నీరజ్ అత్రి, రచయిత

ఏమీ మారలేదన్నమాట!



అరుణ్ శౌరీ 1994లో రాసిన ‘మిషనరీస్ ఆఫ్ ఇండియా’ పుస్తకాన్ని మీరు తప్పక చదవాలి. భవిష్యత్ పరిణామాల బీజాక్షరాలను కలిగి ఉన్న ఈ 300 పేజీల పుస్తకాన్ని చదివేందుకు నెల రోజులు కేటాయించుకుని, రోజుకు 1–15 పేజీలు చొప్పున పూర్తి చేయండి. ఇందులోని ప్రతి పదం వర్తమానానికీ తగినది.

– సాయి దీపక్ జె., న్యాయవాది

అరుదైన బహిష్కరణ ఘటన

అభిప్రాయం



తడకమళ్ల మురళీధర్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టం–2014 ప్రకారం, తెలంగాణ రాష్ట్రం 2014, జూన్ 2న ఏర్పడినా, రాష్ట్ర హైకోర్టు, దిగువ కోర్టుల న్యాయమూర్తుల విభజన మాత్రం అప్పుడే జరగలేదు. ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాలు ఏర్పడినప్పుడు హైకోర్టుల విభజన రాష్ట్రాలతో పాటు జరిగింది. ఉమ్మడి సబార్డినేట్ కోర్టుల న్యాయమూర్తుల విభజన, కేటాయింపుల నిమిత్తం 2016లో ఉమ్మడి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి... కొందరు హైకోర్టు న్యాయమూర్తులతో ఒక కమిటీ ఏర్పాటు చేశారు. ఆ విభజన కమిటీ పొందుపరచిన మార్గదర్శకాల కనుగుణంగా ఉమ్మడి హైకోర్టు దిగువ కోర్టుల న్యాయమూర్తుల నుండి ఆప్షన్లు అడిగింది. వయస్సు తక్కువగా ఉండి, సీనియర్లుగా ఉన్నటువంటి ఆంధ్రప్రదేశ్ నేటివిటీకి చెందిన న్యాయమూర్తులు తెలంగాణ రాష్ట్రానికి ఆప్షన్లు పెట్టుకున్నారు.

ఈ ఆప్షన్‌లను ఉమ్మడి హైకోర్టు యథాతథంగా ఖరారు చేస్తూ 2016 మే నెలలో ప్రొవిజనల్ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో తెలంగాణ న్యాయమూర్తుల్లో అసంతృప్తి రగిలింది. ఆ ఆప్షన్లు అమలు చేస్తే కొంతకాలానికి తెలంగాణలో జిల్లా జడ్జీలుగా, హైకోర్టు న్యాయమూర్తులుగా మొత్తం ఆంధ్ర నేటివిటీ వారే ఉంటారనే దృక్పథంతో, తెలంగాణ న్యాయమూర్తుల సంఘ ప్రతినిధులు ప్రధాన న్యాయమూర్తినీ, ఇతర సీనియర్ న్యాయమూర్తులనూ కలిసి హైకోర్టు తీసుకునే నిర్ణయం వల్ల వివక్ష జరుగుతుందనీ, ప్రొవిజనల్ కేటాయింపులు రద్దు చేయాలనీ వినతి పత్రాలు ఇచ్చారు. నిర్ణయంలో ఎటువంటి మార్పు ఉండదని ప్రధాన న్యాయమూర్తి తేల్చటంతో, తప్పనిసరి పరిస్థితుల్లో ఎక్కడా జరుగని రీతిలో దాదాపు 200 మంది తెలంగాణ నేటివిటీ న్యాయమూర్తులు నిరసనగా విధులను బహిష్కరించి మూకుమ్మడిగా సెలవు పెట్టారు. వీరికి తెలంగాణ న్యాయశాఖ ఉద్యోగులు తోడయ్యారు. తెలంగాణ న్యాయవాదులు, రాజకీయ నాయకుల మద్దతు ప్రకటనలతో తెలంగాణ రాష్ట్రం ఏకమైంది. విధులను బహిష్కరించి మూకుమ్మడి సెలవులు పెట్టడం ప్రవర్తనా నియమావళికి విరుద్ధంగా భావించి ఉమ్మడి హైకోర్టు 11 మంది తెలంగాణ న్యాయమూర్తుల సంఘ ప్రతినిధులనూ, ఆరుగురు న్యాయశాఖ ఉద్యోగుల సంఘ ప్రతినిధులనూ 2016 జూన్ 28, 29 తేదీల్లో సస్పెండ్ చేసింది. తెలంగాణ న్యాయమూర్తుల సంఘం ప్రతినిధులు ఆనాటి గవర్నర్ నరసింహన్‌ను కలిసి ప్రొవిజనల్ కేటాయింపుల్లో జోక్యం చేసుకోవలసిందిగా కోరారు. అందుకు ఒప్పుకోని గవర్నర్ వెంటనే విధుల్లో చేరాల్సిందిగా సూచన చేశారు. దాదాపు నెలరోజులు గడచిన పిదప సంఘాల ప్రతినిధులు నిరసనను ఉపసంహరించుకున్నట్లు తెలుపడంతో, హైకోర్టు అందరి సస్పెన్షన్ ఎత్తివేసింది. అప్పటికి ఆ అంకం ముగిసింది.


ఈ వ్యవహారానికి ముందే తెలంగాణ న్యాయమూర్తుల సంఘం సుప్రీంకోర్టు ముందు ఒక రిట్ పిటిషన్ 2015లో వేస్తూ న్యాయమూర్తుల విభజన, కేటాయింపులు నేటివిటీ ఆధారంగా జరపాలని ఆదేశాలు ఇవ్వాల్సిందిగా కోరింది. 2014 రాష్ట్ర విభజన సమయంలో కేంద్ర న్యాయశాఖ మంత్రిగా ఉన్నటువంటి సల్మాన్ ఖుర్షీద్ తెలంగాణ న్యాయమూర్తుల సంఘం తరఫున వాదనలు వినిపించారు. సుప్రీంకోర్టు ఆగస్టు 2018లో తీర్పిస్తూ రెండు నెలల్లోగా విభజన, కేటాయింపుల తంతు ముగించాలని ఉత్తర్వులిచ్చింది. తెలంగాణ న్యాయమూర్తుల సంఘం వేసిన ఆ కేసులోని ఆదేశాలను శిరసావహిస్తూ రెండు రాష్ట్రాల మధ్య న్యాయమూర్తుల విభజన, కేటాయింపులతో పాటు ఉమ్మడి హైకోర్టు విభజన కూడా 2018 డిసెంబర్ 31 నాటికి ఒక కొలిక్కి వచ్చింది. కానీ మొదట నిర్ణయించిన ప్రొవిజనల్ కేటాయింపుల్లో హైకోర్టు ఎటువంటి మార్పులూ చేయలేదు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన నాలుగున్నర సంవత్సరాల పిదప, సుప్రీం ఉత్తర్వుల మేరకు హైకోర్టు విభజన, సబార్డినేటు న్యాయమూర్తుల విభజన జరిగింది.

జూన్ 26 నాడు 200 మంది న్యాయమూర్తులు క్రమశిక్షణ పాటిస్తూ అమరవీరుల స్తూపానికి నివాళులర్పించి మౌనం పాటిస్తూ రాజ్ భవన్‌కు వెళ్ళి గవర్నర్‌కు వినతి పత్రం ఇస్తే, కొన్ని ప్రసార మాధ్యమాలు వక్రీకరించి న్యాయమూర్తులు కోర్టు బయట ఆందోళన చేపట్టినారనీ, పోలీసువారు ఆందోళనకారులను బలవంతంగా తొలగించినారనీ కథనాలు ఇచ్చి తృప్తి పడ్డాయి. రాజ్ భవన్‌కు వెళ్లే దారిలో నినాదాలు చేశారని కూడా కొన్ని పత్రికలు ఊహాగానాలు వండి వార్చాయి. ఏది ఏమైనా ఇప్పటిదాకా దేశంలోని ఏ రాష్ట్రంలో కూడా న్యాయమూర్తులు విధులు బహిష్కరించిన దాఖలాలు లేవు. ఈ ఘటనకు ఏడేళ్లు నిండాయి. ఇదే మొదటిది, చివరిదిగా ఉండాలని కోరుకుందాం.

వ్యాసకర్త విశ్రాంత జిల్లా జడ్జి । 98485 45970

డ్రగ్స్ ఉత్పాతాన్ని కలిసికట్టుగా అరికడదాం!

సందర్భం



బండారు దత్తాత్రేయ

మాదకద్రవ్యాల దుర్వినియోగ సమస్య ప్రపంచవ్యాప్తంగా తీవ్రంగా ఉంది. మాదకద్రవ్యాల దుర్వినియోగానికి గురైన బాధితులు కుటుంబ, సామాజిక ఒంటరితనానికీ, తిరస్కరణకూ గురవుతున్నారనేది భయంకరమైన వాస్తవం. ఇది వారికి ఎంతో మానసిక, శారీరక బాధలను కలిగిస్తుంది. వారికి కావాల్సిన సహాయం కూడా అందకుండా పోతుంది. ఇది వారి జీవితాన్నీ, వారి కుటుంబ సభ్యుల జీవితాన్నీ దుర్భరంగా మారుస్తుంది. అందువల్ల మానవ హక్కులపై, కరుణపై దృష్టి సారించే ఔషధ విధానాల కోసం ప్రజా కేంద్రక విధానం అవసరం. మాదకద్రవ్యాల దుర్వినియోగానికి గురైన బాధితులకు సామాజికపరంగా, భావోద్వేగపరంగా సహాయం చేయడం, అదే సమయంలో పెరుగుతున్న మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై ప్రభావవంతమైన చెక్ పెట్టడం నిజంగా చాలా పెద్ద పని. కానీ అది అసాధ్యమైన ప్రతిపాదన కాదు.

ఈ సంవత్సరం ప్రపంచ మాదక ద్రవ్యాల దినం మాదకద్రవ్యాలను ఉపయోగించే వ్యక్తులపై, వారి కుటుంబాలపై వివక్షకు సంబంధించిన ప్రతికూల ప్రభావం గురించి అవగాహన పెంచాలని పిలుపునిస్తోంది. మాదక ద్రవ్యాలను ఉపయోగించే వ్యక్తులలో ఎయిడ్స్, హెపటైటిస్ మహమ్మారి గురించి అవగాహనను పెంచాలి. మాదక ద్రవ్యాల సంబంధిత నేరాలకు విధించే జైలు శిక్షకు ప్రత్యామ్నాయాల కోసం కమ్యూనిటీ ఆధారిత చికిత్స, సేవలు వంటివాటిని అందించడం; గౌరవప్రదమైన, వివక్షారహితమైన భాషను ప్రదర్శించే వైఖరులను ప్రోత్సహించడం ద్వారా డ్రగ్స్ వ్యసనపరులపై వివక్షను ఎదుర్కోవాలి.

పబ్‌లలో నిషేధిత పదార్థాలను వినియోగిస్తూ పట్టుబడుతున్న సంపన్న, ఉన్నత, మధ్యతరగతి కుటుంబాల పిల్లల గురించి మనం తరచుగా చదువుతూ, వింటూ ఉంటాం. డ్రగ్స్ వినియోగం నివారణకు లైసెన్సింగ్ ప్రక్రియను కఠినం చేయాలి. అటువంటి సంస్థల లైసెన్సు తొలగించడాన్ని వేగవంతం చేయాలి.

మాదకద్రవ్యాల దుర్వినియోగాన్ని అరికట్టడంలో సమాజానికి ముఖ్యమైన పాత్ర ఉన్నట్లు నేను భావిస్తున్నాను. డ్రగ్స్ సరఫరా చేసేవారిని సమాజం బహిష్కరించాలి. తమ పిల్లలతో ఎలా వ్యవహరించాలి, మాదకద్రవ్యాల దుర్వినియోగం నుండి వారిని ఎలా దూరంగా ఉంచాలనే దానిపై తల్లిదండ్రులకు కూడా సలహా ఇవ్వాలి. మాదకద్రవ్యాల దుర్వినియోగ వ్యతిరేక పోరాటంలో బలమైన కుటుంబ విలువలు మనకు ఆస్తి. ఇల్లు, పాఠశాల, ప్రార్థనా స్థలం అనేవి విలువ ఆధారిత సామాజిక వ్యవస్థను నిర్మించడంలో మూడు కీలక భాగాలు.

డ్రగ్ సరఫరాదారులపై నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో కఠినంగా వ్యవహరించాలి. మాదకద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టడానికి ప్రత్యేకించి పెద్ద నగరాలలో, సరిహద్దు ప్రాంతాలలో, హాని కలిగించే ప్రాంతాల్లో సమర్థమైన నిఘాను పెంచడంలో పోలీసు బలగాలతో సహా



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఏజెన్సీల మధ్య మెరుగైన సమన్వయం ముఖ్యం.

మాదక ద్రవ్యాల వినియోగం గురించి 2018లో ఎయిమ్స్, ఘాజియాబాద్‌లోని నేషనల్ డ్రగ్ డిపెండెన్స్ ట్రీట్‌మెంట్ సెంటర్ జాతీయ సర్వే చేశాయి. దీని ప్రకారం, మద్యం, గంజాయి, ఓపియాయిడ్లు, మత్తుమందులు, కొకైన్, ఏటీఎస్, హ్యాలూసినోజెన్‌ల బారినపడుతున్న చిన్నారులు, 10–17 ఏళ్ల వారు 6.06 శాతం అని అంచనా వేశారు. 18 నుంచి 75 సంవత్సరాల మధ్య వయసు వారిలో 24.71 శాతం మంది మాదకద్రవ్యాల దుర్వినియోగానికి పాల్పడినట్లు కనుగొన్నారు.

కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ మాదక ద్రవ్యాల డిమాండ్ తగ్గింపు కోసం జాతీయ కార్యాచరణ ప్రణాళిక (ఎన్‌ఏపీడీడీఆర్) అమలు చేయడం సంతోషించదగిన విషయం. దీని కింద డ్రగ్స్ నివారణ విద్యను, జాగరూకతను పెంపొందించడానికి రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర పాలిత ప్రాంతాల పాలనా యంత్రాంగాలకు ఆర్థిక సహాయం అందించబడుతుంది. నైపుణ్యాభివృద్ధి, వృత్తి శిక్షణతోపాటు మాదకద్రవ్యాల వ్యసనపరులకు జీవనోపాధికి మద్దతు కల్పించబడింది. 2021–22లో ఎన్‌ఏపీడీడీఆర్ కింద 2,85,559 మంది లబ్ధిదారులు ఉన్నారు.

అదేవిధంగా, నషా ముక్త్ భారత్ అభియాన్ (ఎన్‌ఎమ్‌బీఏ) పథకాన్ని ఆగస్టు 2020లో ప్రారంభించారు. దీని కింద ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ప్రభావితమయ్యే మహిళలు, పిల్లలు, విద్యా సంస్థలు, పౌర సమాజ సంస్థలు మొదలైన వాటాదారుల భాగస్వామ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టారు. క్షేత్రస్థాయిలో చేపట్టిన వివిధ కార్యక్రమాల ద్వారా ఇప్పటి వరకు 12 కోట్ల మంది ప్రజలకు చేరువయ్యారు. నాలుగు వేలకు పైగా యువ మండలాలు, నెహ్రూ యువ కేంద్రాలు (ఎన్‌వైకేలు), ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు, యూత్ క్లబ్‌లను కూడా ఎన్‌ఎమ్‌బీఏతో అనుసంధానించారు. అంగన్‌వాడీ కేంద్రాలు, ఆశా వర్కర్లు, ఏఎన్‌ఎమ్‌లు, మహిళా మండలాలు, మహిళా ఎస్‌హెచ్‌జీల రూపంలో విస్తృత సామాజిక బృందాలను చేరుకోవడంలో 2.05 కోట్ల మంది మహిళల సహకారం కూడా చాలా ముఖ్యమైనది. ఈ పథకం కింద దేశవ్యాప్తంగా ఇప్పటి వరకు 1.19 లక్షల విద్యా సంస్థలు విద్యార్థులు, యువతకు మాదక పదార్థాల వినియోగానికి వ్యతిరేకంగా అవగాహన కల్పించేందుకు కార్యకలాపాలు నిర్వహించాయి.

బాధితులను సామాజికంగా ఒంటరిగా ఉంచే బదులు, వారు తమ తప్పులను గుర్తించి సాధారణ జీవితానికి తిరిగి వచ్చేలా కరుణతో, సహాయ దృష్టితో వారిని చేరుకోవాలి. ఆరోగ్యకరమైన, సంపన్నమైన, శాంతియుత భవిష్యత్తు కోసం మాదకద్రవ్యాల దుర్వినియోగ ముప్పును అంతం చేయాలి.

వ్యాసకర్త హరియాణా గవర్నర్
(నేడు ‘వరల్డ్ డ్రగ్ డే’)

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, ఆషాఢ మాసం, **తిథి:** శు.అష్టమి రా.9.34 వరకు, తదుపరి నవమి, **నక్షత్రం:** ఉత్తర ఉ.9.28 వరకు, తదుపరి హస్త, **వర్జ్యం:** సా.6.28 నుండి 8.10 వరకు, **దుర్ముహూర్తం:** ప.12.27 నుండి 1.21 వరకు, తదుపరి ప.3.04 నుండి 3.56 వరకు, **అమృతఘడియలు:** తె.4.44 నుండి 6.26 వరకు (తెల్లవారితే మంగళవారం); **రాహుకాలం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **యమగండం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **సూర్యోదయం:** 5.31, **సూర్యాస్తమయం:** 6.34.

క్లుప్తంగా...

జూలైలో తిరుమలలో విశేష ఉత్సవాలు ఇవే...

తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయంలో జూలై నెలలో విశేష ఉత్సవాల వివరాలను టీటీడీ పీఆర్‌ఓ విభాగం ఆదివారం ఒక ప్రకటనలో వెల్లడించింది. జూలై 1న శని త్రయోదశి, 3న ఆషాఢ పూర్ణిమ, వ్యాస పూజ, గురుపూర్ణిమ, 13న సర్వఏకాదశి, 15న శని త్రయోదశి, 17న శ్రీవారి ఆణివార ఆస్థానం, 22న ఆండాళ్ తిరువాడిపురం శాత్తుమొర, శ్రీవారు పురిశైవారి తోటకు వేంచేయడం, 30న నారాయణగిరిలో ఛత్రస్థాపనోత్సవం ఉంటాయని తెలిపింది. కాగా, తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. శనివారం అర్ధరాత్రి వరకు 83,889 మంది స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీల్లో రూ.3.10 కోట్లు సమర్పించుకున్నారు. టైం స్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని భక్తులకు దర్శనానికి 24 గంటలు పడుతోంది.

శ్రీవారిని దర్శించుకున్న తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి


ఆలయం ఎదుట తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సాంబశివరావు

తిరుమల శ్రీవారిని ఆదివారం తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సాంబశివరావు నాయుడు దర్శించుకున్నారు. శ్రీవారి దర్శనానంతరం ఆయనకు ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించారు. సినీ గాయని సునీత, ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్ కూడా శ్రీవారిని దర్శించుకున్నారు.

ఏపీ హజ్ యాత్రికులకు ఏర్పాట్లపై దృష్టి పెట్టండి

- కౌన్సిల్ జనరల్ ఆఫ్ ఇండియాను కోరిన ఏపీ హజ్ కమిటీ చైర్మన్ లాజమ్


కౌన్సిల్ జనరల్ ఆఫ్ ఇండియా మహమ్మద్ షాహిద్ ఆలంను కలిసిన ఏపీ హజ్ కమిటీ చైర్మన్ బీఎస్ గౌస్ లాజమ్ బృందం

సాక్షి, అమరావతి: మక్కా నగరానికి ఆంధ్రప్రదేశ్ నుంచి వచ్చిన హజ్ యాత్రికులకు రవాణా, వసతి ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టిపెట్టాలని కౌన్సిల్ జనరల్ ఆఫ్ ఇండియా మహమ్మద్ షాహిద్ ఆలంను ఏపీ హజ్ కమిటీ చైర్మన్ బీఎస్ గౌస్ లాజమ్ కోరారు. సౌదీ అరేబియాలోని మక్కా నగరంలో ఉన్న కౌన్సిల్ జనరల్ ఆఫ్ ఇండియా కార్యాలయాన్ని గౌస్ లాజమ్ బృందం ఆదివారం సందర్శించింది. సోమవారం నుంచి ప్రారంభమయ్యే మీనా, అరాఫత్, ముజ్‌దలిఫా, జైమరాత్ నందు దాదాపు 30 లక్షల మంది హజ్ యాత్రికులు పాల్గొనే అవకాశం ఉన్నందున ఏర్పాట్లపై చర్చించారు. షాహిద్ ఆలం మాట్లాడుతూ విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్ సాధించి చక్కని ఏర్పాట్లతో విజయవంతంగా హజ్ యాత్రకు పంపించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం అభినందనీయమని అన్నారు. గౌస్ లాజమ్ వెంట ఇబాదుల్లా, హుస్సేని, పుంగనూరు ఖాదర్ ఉన్నారు.

టీఎస్ఆర్టీసీ బస్సు బోల్తా

- ఇద్దరికి స్వల్పగాయాలు
- ప్రకాశం జిల్లాలో ప్రమాదం


రహదారిపై అడ్డంగా తిరిగిన బస్సు

పుల్లలచెరువు: ప్రకాశం జిల్లా పుల్లలచెరువు మండలం మురికిమళ్ల సమీపంలో రాష్ట్ర రహదారిపై ఆదివారం తెలంగాణ రాష్ట్ర రోడ్డురవాణా సంస్థ (టీఎస్ఆర్టీసీ) బస్సు బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. హైదరాబాద్ నుంచి 24 మంది పెద్దలు, ఇద్దరు పిల్లలతో ప్రకాశం జిల్లా మార్కాపురానికి వస్తున్న హైదరాబాద్–1 డిపో బస్సు డ్రైవర్ ఎదురుగా వస్తున్న మోటర్ సైకిల్‌ను తప్పించే ప్రయత్నంలో సడన్ బ్రేక్ వేశారు. దీంతో అదుపు తప్పిన బస్సు రహదారికి అడ్డంగా బోల్తాపడింది. ఇద్దరు ప్రయాణికులు స్వల్పంగా గాయపడ్డారు. బస్సు డ్రైవర్ ముందు అద్దాన్ని పగులగొట్టి దానిద్వారా ప్రయాణికులను బయటకు పంపారు. ప్రయాణికులు వేర్వేరు వాహనాల్లో గమ్యస్థానాలకు వెళ్లిపోయారు. పుల్లలచెరువు ఎస్‌ఐ శ్రీహరి సిబ్బందితో వెళ్లి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

ఐటీ కొలువులకు 'వింగ్స్'

సాక్షి, విశాఖపట్నం: ఆంధ్రప్రదేశ్‌లో అతిపెద్ద నగరంగా విశాఖపట్నం భాసిల్లుతోంది. త్వరలో కార్యనిర్వాహక రాజధానిగా కూడా ప్రత్యేకతను సంతరించుకోనున్న విశాఖపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఐటీ హబ్‌గా నగరాన్ని అభివృద్ధి చేసేందుకు వడివడిగా అడుగులు ముందుకేస్తోంది. ఈ నేపథ్యంలోనే బీచ్ ఐటీ కాన్సెప్ట్‌ని ప్రమోట్ చేస్తోంది. దీంతో దిగ్గజ సంస్థలు విశాఖ వైపు ఆసక్తి కనబరుస్తున్నాయి. దీంతో ఐటీ సంస్థల్లో యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగావకాశాలు కల్పించడానికి ప్రభుత్వం నడుంబిగించింది. ఇందులో భాగంగా ప్రభుత్వ సహకారంతో విశాఖలో జాబ్ ఫెయిర్ నిర్వహణకు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. జూలై 21, 22 తేదీల్లో గ్రూప్ స్నాప్ ఫెస్ట్–2023 పేరుతో జరిగే ఈ కార్యక్రమానికి దిగ్గజ ఐటీ, ఐటీ అనుబంధ సంస్థలు హాజరుకానున్నాయి. దీనికి సంబంధించిన బ్రోచర్, వెబ్‌సైట్‌ని విశాఖలో ఐటీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఆదివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఐటీ ఏజెన్సీస్ (ఎపిటా), వి ఇన్ఫో టెక్నాలజీస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

త్వరలో దిగ్గజ సంస్థల కార్యకలాపాలు..

ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో దాదాపు 300కి పైగా ఐటీ కంపెనీలుండగా.. ఇందులో 80 శాతం వరకు విశాఖ కేంద్రంగానే కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. ఈ నెల 28న దిగ్గజ ఐటీ సంస్థ ఇన్ఫోసిస్.. డెవలప్‌మెంట్ సెంటర్‌ని ప్రారంభించనుంది. ఇదే బాటలో టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్), విప్రో కూడా పయనించనున్నాయి. ఈ నేపథ్యంలో.. రాష్ట్రంలో ఉన్న గ్రాడ్యుయేట్స్‌కు, ఐటీ, ఐటీ అనుబంధ సంస్థలకు మధ్య బాండింగ్ ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కొత్త కాన్సెప్ట్ తీసుకొస్తోంది. ఎపిటా, రాష్ట్ర ఐటీ విభాగం సహకారంతో వి ఇన్ఫో టెక్నాలజీస్ ఆధ్వర్యంలో గ్రూప్ స్నాప్ ఫెస్ట్–2023ని నిర్వహించనుంది. ఐటీ, ఐటీ అనుబంధ రంగ కంపెనీలకే కాకుండా.. ఫార్మా సంస్థలు, స్టార్టప్ సంస్థలకు ఏ విధమైన నైపుణ్యాలున్న మానవ వనరులు అవసరం?.. ఉద్యోగ అవకాశాలు పొందాలంటే ఎలాంటి కోర్సులు చేయాలి? టెక్నాలజీని ఎలా అందిపుచ్చుకోవాలి వంటి అంశాలను గ్రాడ్యుయేట్స్‌తో పాటు 10వ తరగతి, ఇంటర్ విద్యార్థులకు వివరించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం. 'స్ప్రెడ్ యువర్ వింగ్స్' అనే పేరుతో రెండు రోజుల పాటు విద్యార్థులకు అవగాహన కల్పించనున్నారు. అలాగే ఈ కార్యక్రమానికి హాజరైన యువత నుంచి సీవీలు తీసుకొని.. అక్కడే ప్రముఖ కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నాయి. ఎంపికైన వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నాయి. జాబ్ ఫెయిర్‌కు టెక్ మహీంద్ర, టీసీఎస్, ఎల్ అండ్ టీ, కాన్సెంట్రిక్స్, కాండ్యుయెంట్, చెగ్, డబ్ల్యుఎన్ఎస్, సెయింట్, పాత్రా, ఫ్లూయెంట్ గ్రిడ్, పల్సస్ వంటి 40 వరకూ ఐటీ, అనుబంధ కంపెనీలు, ఫైజర్, అరబిందో వంటి 10 ఫార్మా సంస్థలు, 54 యూనివర్సిటీలు, కళాశాలలతో పాటు 10 స్టార్టప్ కంపెనీలు హాజరు కానున్నాయి.

విశాఖ ఐటీలో అపార అవకాశాలు..



విశాఖ ఐటీలో అపార అవకాశాలున్నాయి. కానీ.. వాటిని ఎలా అందిపుచ్చుకోవాలన్న అంశంపై గ్రాడ్యుయేట్స్‌కు సందేహాలున్నాయి. ఐటీ సంస్థలకు కూడా మానవవనరుల కొరత ఉంది. వాటిని తీర్చేందుకు ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వ సహకారంతో నిర్వహిస్తున్నాం. విశాఖ నగరంలో ఉన్న ఐటీ కంపెనీల గురించి అందరికీ తెలియజేయడం ఒక లక్ష్యం కాగా.. వాటిలో ఉపాధి అవకాశాలను ఇక్కడి యువతకు కల్పించడాన్ని మరో లక్ష్యంగా నిర్దేశించుకున్నాం. రెండు రోజులపాటు జరిగే ఈ కార్యక్రమంలో ప్రతి సంస్థ 15 నిమిషాల పాటు విద్యార్థులతో అనుసంధానమవుతుంది. తమ సంస్థ గురించి తెలియజేయడమే కాకుండా.. అందులో ఉద్యోగం సాధించేందుకు ఎలాంటి అర్హతలు కావాలో అవగాహన కల్పిస్తాయి. ప్రభుత్వం బీచ్ ఐటీ విధానం తీసుకొచ్చాక విశాఖలో పరిస్థితులు మెరుగుపడుతున్నాయి.

– సాయికుమార్, సీఈవో, వి ఇన్ఫో టెక్నాలజీస్

సిలోన్ కాందిశీకుల కల నెరవేరింది

- సముద్రాలు దాటివచ్చి చీరాలలో స్థిరపడిన శ్రీలంక వాసులు
- స్వాతంత్య్రం అనంతరం చీరాల వలస వచ్చిన సిలోన్ కాందిశీకులు
- 43 ఏళ్ల తరువాత వైఎస్ జగన్ ప్రభుత్వంలో ఇంటి పట్టాల పంపిణీ


ఇళ్ల పట్టాలు అందిస్తున్న ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, కలెక్టర్

చీరాల: వారంతా శ్రీలంకలో బతకలేక.. ప్రాణాలకు తెగించి సముద్ర మార్గంలో తమిళనాడుకు వలస వచ్చారు. జీవనోపాధి కోసం వచ్చిన కాందిశీకులకు వసతులు, ఉపాధి కష్టంగా మారింది. దీంతో అప్పటి కేంద్ర ప్రభుత్వం శ్రీలంక కాందిశీకులకు ఉపాధి కల్పించేందుకు చర్యలు చేపట్టింది. అప్పట్లో అనేక ప్రాంతాల్లో ప్రభుత్వ ఆధ్వర్యంలో వివిధ పరిశ్రమలు ఏర్పాటు చేసి కాందిశీకులకు ఉపాధి కల్పించింది. కాగా.. 1980లో చీరాల ప్రాంతంలోని వేటపాలెం మండలం దేశాయిపేట వద్ద కేంద్ర ప్రభుత్వం నూలు మిల్లు ఏర్పాటు చేసింది. ఆ మిల్లులో పనుల కోసం దాదాపు 200 శ్రీలంక కాందిశీక కుటుంబాలను చీరాల తరలించారు. నూలు మిల్లు పక్కనే 10 ఎకరాలు స్థలాన్ని కేటాయించి కాందిశీకులకు కాలనీ కట్టించి ఇళ్లు కేటాయించారు. ఆ కాలనీలో కాందిశీకులు నివాసం ఉంటూ నూలు మిల్లులో పనులు చేసుకుంటూ జీవించేవారు. నూలు మిల్లులు నష్టాల పాలవడంతో వాటన్నింటినీ మూసివేశారు. 2000 సంవత్సరంలో చీరాల నూలు మిల్లు కూడా మూతపడింది. అప్పటినుంచి కాందిశీకులు ఈ ప్రాంతంలోనే ఉంటూ వివిధ పనులు చేసుకుంటున్నారు.

కాందిశీకుల కల నెరవేర్చిన జగన్

దేశాయిపేటలో నిర్మించిన సిలోన్ కాలనీలో ఇళ్లలో నివాసం ఉంటున్న కాందిశీకులకు ఆ ఇళ్లపై ఎటువంటి హక్కు లేకుండా పోయింది. దీంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం సిలోన్ కాలనీలో నివాసం ఉంటున్న కాందిశీకులందరికీ ఇంటి పట్టాలు అందజేశారు. దీంతో వారికి ఆ ఇళ్లపై సంపూర్ణ హక్కు లభించింది. దీంతో కాలనీ వాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పట్టాలు ఇవ్వడం ఆనందంగా ఉంది

శ్రీలంక నుంచి చీరాల వచ్చి స్థిరపడిన కాందిశీకులకు 42 ఏళ్ల తరువాత సొంత గూడు ఏర్పాటుకు పట్టాలు ఇవ్వడం సంతోషంగా ఉంది. సిలోన్ కాలనీలో అన్ని మౌలిక వసతులు కల్పించాం. కాలనీ అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తా.

– కరణం బలరాం, ఎమ్మెల్యే, చీరాల

ఇళ్ల పట్టాలు ఇచ్చారు



43 ఏళ్ల కిందట ఈ ప్రాంతానికి వలస వచ్చాం. అప్పటి నుంచి కేంద్ర ప్రభుత్వం కేటాయించిన సిలోన్ కాలనీలో ఉంటున్నాం. ఆ ఇళ్లపై మాకు పూర్తి హక్కులు లేకుండా పోయాయి. ఈ ప్రభుత్వం వాటికి పట్టాలు మంజూరు చేసింది.

– ఎం.శివనాడియన్, సిలోన్ కాలనీ

అన్ని సౌకర్యాలు ఉన్నాయి



సిలోన్ కాలనీలో 200 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. నూలుమిల్లు మూసివేసిన తరువాత ఈ ప్రాంతంలోనే వివిధ పనులు చేసుకుంటూ ఇక్కడే స్థిరపడిపోయాం. కాలనీలో ప్రస్తుతం అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశారు.

– ఎం.సత్యవేలు, సిలోన్ కాలనీ

'తీరం'పైనా ఇస్రో డేగ కన్ను!

- అక్రమ చొరబాట్లను అడ్డుకునేందుకు కార్యాచరణ
- మత్స్యకారులకు వాతావరణ సమాచారం, తుపాన్ హెచ్చరికలు
- మత్స్యకార బోట్లపై శాటిలైట్ టెర్మినళ్ల ఏర్పాటుకు నిర్ణయం
- ఏపీతో సహా తీరప్రాంత రాష్ట్రాల్లో లక్ష టెర్మినళ్ల ఏర్పాటుకు సన్నద్ధం



సాక్షి, అమరావతి: దేశ తీరప్రాంత భద్రతకు నేను సైతం అంటోంది భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో). అక్రమ చొరబాట్లను అడ్డుకునేందుకు నేవీ, కోస్ట్ గార్డ్‌లకు ఉపగ్రహ పరిజ్ఞానాన్ని అందించేందుకు సన్నద్ధమైంది. ప్రధానంగా మత్స్యకారుల భాగస్వామ్యంతో తీరప్రాంతం నుంచి అక్రమ చొరబాట్లను అడ్డుకునేందుకు కార్యాచరణ ప్రణాళికను రూపొందించింది. మత్స్యకారులకు వాతావరణ సమాచారం, తుఫాన్ హెచ్చరికలు తెలపడానికి కూడా ఈ విధానం ఉపయుక్తంగా ఉంటుంది. ఏపీతో సహా దేశంలోని 13 తీరప్రాంత రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో మత్స్యకారుల బోట్లపై శాటిలైట్ టెర్మినళ్ల ఏర్పాటునకు ఇస్రో ప్రణాళిక సిద్ధం చేస్తోంది. ఇస్రోకు చెందిన 'న్యూ స్పేస్ ఇండియా' మొబైల్ శాటిలైట్ సర్వీసెస్(ఎంఎస్ఎస్) పేరుతో ఈ ప్రాజెక్టును రూపొందించింది. మొదటి దశలో దేశంలో లక్ష మత్స్యకార బోట్లపై శాటిలైట్ టెర్మినళ్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఏపీతో పాటు తమిళనాడు, ఒడిశా, పశ్చిమ బెంగాల్, కేరళ, కర్ణాటక, గోవా, మహారాష్ట్ర, గుజరాత్, పాండిచ్చేరి, అండమాన్ నికోబార్, లక్షద్వీప్, డామన్ డయ్యూలలోని మత్స్యకార బోట్లపై వాటిని ఏర్పాటు చేస్తారు. పొడవైన తీరప్రాంతం ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో 10 వేల బోట్లపై వాటిని ఏర్పాటు చేయాలని సూత్రప్రాయంగా నిర్ణయించింది. ఇందుకోసం ఈ 13 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో తీరప్రాంత సమీపంలో ఇస్రో ప్రత్యేకంగా 9ఎం/11ఎం సి-బాండ్ గ్రౌండ్ స్టేషన్లను హబ్ బేస్‌బాండ్ వ్యవస్థతో ఏర్పాటు చేస్తారు. అనంతరం మత్స్యకార బోట్లపై శాటిలైట్ టెర్మినళ్లు ఏర్పాటు చేస్తారు. ఈ మత్స్యకార బోట్లను ఆయా రాష్ట్రాల గ్రౌండ్ స్టేషన్లతో అనుసంధానిస్తారు. ఇస్రో ఇటీవల ప్రయోగించిన నావిక్ ఉపగ్రహ పరిజ్ఞానంతో ఈ ప్రాజెక్టు పనిచేస్తుంది. దీంతో మన దేశ మత్స్యకార బోట్ల కదలికలను ఎప్పటికప్పుడు గ్రౌండ్ స్టేషన్లోని మానిటర్ ద్వారా పర్యవేక్షించొచ్చు.

పరస్పర సమాచార మార్పిడికి అవకాశం

ఎంఎస్ఎస్ ప్రాజెక్టు అటు భద్రత బలగాలకు, ఇటు మత్స్యకారులకు ఉపయుక్తంగా ఉంటుంది. ఈ ప్రాజెక్టు రెండు వైపుల నుంచి సమాచార మార్పిడికి అవకాశం కల్పిస్తుంది. అంటే సముద్రంలో వేటకు వెళ్లిన బోట్లలో ఉన్న మత్స్యకారులు, ఒడ్డున ఉన్న గ్రౌండ్ స్టేషన్లోని అధికారులు పరస్పరం సంభాషించుకోవచ్చు. సముద్రంలో అక్రమ చొరబాటుదారులుగానీ అనుమానాస్పద కదలికలను గానీ గమనిస్తే మత్స్యకారులు వెంటనే గ్రౌండ్ స్టేషన్‌లో ఉన్న అధికారులకు సమాచారం అందించేందుకు అవకాశం ఉంటుంది. ఇక గ్రౌండ్ స్టేషన్లో ఉన్న అధికారులు వాతావరణ సమాచారం, తుఫాన్ హెచ్చరికలు వంటి సమాచారాన్ని సముద్రంలో ఉన్న మత్స్యకారులకు ఎప్పటికప్పుడు అందించేందుకు వీలుంటుంది. పొరుగు దేశాల సముద్ర జలాల్లోకి ప్రవేశించకుండా అప్రమత్తం చేయొచ్చు. ఈ ప్రాజెక్ట్‌పై తీరప్రాంత రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ప్రభుత్వాలతో కలిసి ఇస్రో త్వరలోనే మత్స్యకారులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనుంది.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురి దుర్మరణం

- 13 మందికి గాయాలు
- కర్నూలు జిల్లాలో లారీ ఢీకొని బోల్తాపడిన బొలెరో ట్రాలీ వాహనం


ప్రమాదంలో నుజ్జునుజ్జు అయిన బొలెరో ట్రాలీ వాహనం

కోడుమూరు రూరల్: కర్నూలు జిల్లా కోడుమూరు సమీపంలోని పెట్రోలు బంకు వద్ద శనివారం రాత్రి బొలెరో ట్రాలీ వాహనాన్ని లారీ ఢీకొట్టిన ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు దుర్మరణం పాలయ్యారు. ఈ ప్రమాదంలో 13 మంది గాయపడ్డారు. కర్నూలు జిల్లా హొళగుంద మండలంలోని కొత్తపేట, నెరణికి తండా, హరికెర, ఆలూరు మండలంలోని కురుకుందలకు చెందిన వీరేష్ (35), మల్లయ్య (55), ముత్తయ్య (34), నీలకంఠనాయక్, బోయ అంపయ్య, బోయ రంగయ్య, బోయ ఈరన్న, బోయ ప్రసాద్, బోయ రాముడు, బోయ వీరేష్, బోయ బుడ్డప్ప, బోయ మహేష్, వీరేష్, గాది లింగయ్య, రవి, శేఖర్.. మొత్తం 16 మంది శనివారం రాత్రి బొలెరో ట్రాలీ వాహనంలో తెలంగాణలో అడవిపందుల వేటకు బయలుదేరారు. వీరిలో బోయ అంపయ్య వాహనం నడుపుతున్నాడు. కోడుమూరు పెట్రోలు బంకు వద్ద బొలెరో వాహనాన్ని.. శ్రీశైలం నుంచి మంత్రాలయం వైపు వెళుతున్న లారీ బలంగా ఢీకొట్టింది. దీంతో బొలెరో బోల్తాపడి అందులోని వారంతా చెల్లాచెదురుగా పడిపోయారు. వీరిలో ముత్తయ్య, మల్లయ్య తీవ్రగాయాలతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. బొలెరో వాహనంలోని 12 మంది, లారీ డ్రైవర్ నరసప్ప, అతడి కుమారుడు రాముడు గాయపడ్డారు. కోడుమూరు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన వారిని 108 వాహనాలు, పోలీస్ సేఫ్టీ వాహనంలో కోడుమూరు, కర్నూలు ప్రభుత్వాస్పత్రులకు తరలించారు. ఆలూరు మండలం కురుకుందకు చెందిన వీరేష్ కర్నూలు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్‌ను కోడుమూరు పోలీసులు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

తిరుపతి ఎస్వీ గోశాలలో 'సరోగసి' దూడ జననం

- దేశంలో తొలిసారిగా పిండమార్పిడి పద్ధతిలో పుట్టిన సాహివాల్ దూడ పద్మావతి
- దేశీయ గోవుల అండాలతో ఐవీఎఫ్ పద్ధతిలో పిండాల అభివృద్ధి
- టీటీడీ ఈవో ఎ.వి.ధర్మారెడ్డి


ఒంగోలు ఆవుకు సరోగసి ద్వారా జన్మించిన సాహివాల్ దూడ

తిరుపతి రూరల్: దేశంలో తొలిసారిగా పిండమార్పిడి (సరోగసి) పద్ధతిలో ఒంగోలు ఆవుకు సాహివాల్ దూడ జన్మించినట్లు టీటీడీ ఈవో ఎ.వి.ధర్మారెడ్డి తెలిపారు. ఆయన ఆదివారం తిరుపతిలోని ఎస్వీ గోశాలలో మీడియాతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.ఎస్.జవహర్‌రెడ్డి సూచనలతో టీటీడీ, ఎస్వీ పశువైద్య విశ్వవిద్యాలయం సంయుక్తంగా దేశవాళీ గోజాతులను అభివృద్ధి చేయాలని గత ఏడాది ఎంవోయూ కుదుర్చుకున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా టీటీడీ పరిధిలోని తిరుపతి ఎస్వీ గో సంరక్షణశాలలో మేలుజాతి ఆవుల అండాలు సేకరించి, ఎస్వీ పశువైద్య విశ్వవిద్యాలయంలోని ఐవీఎఫ్ ల్యాబ్‌లో కృత్రిమంగా పిండాలను అభివృద్ధి చేశారని చెప్పారు. వీటిని టీటీడీ గోశాలలోని ఆవులలో ప్రవేశపెట్టి దేశంలోనే తొలిసారిగా విజయం సాధించినట్లు తెలిపారు. ఈ ప్రక్రియలో శనివారం రాత్రి ఒంగోలు ఆవుకు జన్మించిన సాహివాల్ దూడకు పద్మావతి అని నామకరణం చేసినట్లు చెప్పారు. తిరుమల శ్రీవారి ఆలయంలో ధూపదీప నైవేద్యాలకు, నిత్య కైంకర్యాలకు అవసరమైన పాలు, పెరుగు, వెన్న, నెయ్యి కోసం దాతలు ఇప్పటికే 200 దేశీయ గోవులను దాతలు సమకూర్చారని, మరో 300 గోవులను సమకూర్చేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు.

ఐదేళ్లలో 324 సాహివాల్ గోజాతి దూడల ఉత్పత్తి

ఎస్వీ పశువైద్య విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ పద్మనాభరెడ్డి మాట్లాడుతూ సరోగసి పద్ధతిలో రానున్న ఐదేళ్లలో 324 మేలు రకమైన సాహివాల్ గోజాతి దూడలను ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. దీన్లోభాగంగా పిండమార్పిడి చేసిన ఆవుల్లో ఇప్పటివరకు 11 గర్భం దాల్చినట్లు చెప్పారు. ఒక ఆవు శనివారం రాత్రి సాహివాల్ పెయ్యదూడకు జన్మనిచ్చిందన్నారు. రానున్న రోజుల్లో మరో పది సాహివాల్ దూడలు జన్మించనున్నాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జేఈవో సదా భార్గవి, గో సంరక్షణ ట్రస్ట్ సభ్యులు రామ్‌సునీల్‌రెడ్డి, గో సంరక్షణశాల డైరెక్టర్ హరినాథరెడ్డి, ఎస్వీ పశువైద్య విశ్వవిద్యాలయం డీన్ వీరబ్రహ్మయ్య, వెంకట్‌నాయుడు పాల్గొన్నారు.

బెలూన్ శాటిలైట్ ప్రయోగం అభినందనీయం

- ఆర్‌సీఈ డీఆర్‌డీవో శాస్త్రవేత్త పి.అనిల్‌కుమార్


అంతరిక్షంలోకి వెళుతున్న ఉషారామా బెలూన్ శాటిలైట్

ఉంగుటూరు(గన్నవరం): విద్యార్థులు సృజనాత్మకతంగా ఆలోచించి బెలూన్ శాటిలైట్‌ను రూపొందించి ప్రయోగించడం అభినందనీయమని ఆర్‌సీఈ డీఆర్‌డీఓ శాస్త్రవేత్త పి.అనిల్‌కుమార్ అన్నారు. చెన్నై స్పేస్ కిడ్స్ సహకారంతో కృష్ణా జిల్లా ఉంగుటూరు మండలం తేలప్రోలులోని ఉషారామ ఇంజినీరింగ్ కళాశాల కార్యదర్శి సుంకర అనిల్ కుమారుడు అక్షయ్ నేతృత్వంలో 25 మంది విద్యార్థులు కలిసి రూపొందించిన ఉషారామ బెలూన్ శాటిలైట్(ఎస్ఎస్ఎల్‌వీ–19)ను ఆదివారం విజయవంతంగా ప్రయోగించారు. ఉపగ్రహాల పనితీరు గురించి విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ఈ శాటిలైట్‌ను రూపొందించారు. ఈ సందర్భంగా కాలేజీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పి.అనిల్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు కొత్త ఆలోచనలతో సమాజానికి ఉపయోగపడే నూతన ఆవిష్కరణలు చేయాలని ఆకాంక్షించారు. జేఎన్‌టీయూకే డీఈ డాక్టర్ బాలకృష్ణ, ఏపీ ఫైబర్‌నెట్ చైర్మన్ పి.గౌతమ్‌రెడ్డి, కళాశాల చైర్మన్ సుంకర రాంబ్రహ్మం, కార్యదర్శి అనిల్, డైరెక్టర్ రాజశేఖర్, ప్రిన్సిపాల్ జీవీకేఎస్వీ ప్రసాద్ పాల్గొన్నారు.

రూ.300 కోట్లతో అటవీ అభివృద్ధికి ప్రతిపాదనలు

పీసీసీఎఫ్ మధుసూదన్‌రెడ్డి


హార్సిలీహిల్స్‌లో పీసీసీఎఫ్ మధుసూదన్‌రెడ్డి

బి.కొత్తకోట/కురబలకోట: రాష్ట్రంలో అటవీ అభివృద్ధి పనులకు రూ.300 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు రాష్ట్ర ప్రిన్సిపల్ చీఫ్ కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ (పీసీసీఎఫ్) వై.మధుసూదన్‌రెడ్డి చెప్పారు. ఆయన ఆదివారం అన్నమయ్య జిల్లా హార్సిలీహిల్స్‌లో విలేకరులతో మాట్లాడారు. అటవీశాఖలో 1,500 పోస్టుల భర్తీ కోసం ప్రతిపాదించామన్నారు. పట్టుబడిన ఎర్రచందనం 310 టన్నులు వేలం వేయగా రూ.170 కోట్ల ఆదాయం వచ్చిందని తెలిపారు. మరో ఐదువేల టన్నుల ఎర్రచందనం విక్రయించేందుకు గ్లోబల్ టెండర్లు పిలవనున్నామని, దీనిద్వారా ప్రభుత్వానికి రూ.రెండువేల కోట్ల వరకు వచ్చే అవకాశం ఉందని చెప్పారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో వంద నగరవనాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అవకాశాన్ని బట్టి ఇంకా ఎక్కువ ఏర్పాటు చేసే అవకాశం ఉందన్నారు. మదనపల్లె, చిత్తూరు, పలమనేరు, తిరుపతి, కోడూరు వంటి ప్రాంతాల్లో కూడా వీటిని ఏర్పాటు చేస్తామని తెలిపారు. అంతకుముందు ఆయన హార్సిలీహిల్స్‌లో పర్యాటకులు, సందర్శకులకు సౌకర్యవంతంగా చేపట్టాల్సిన అభివృద్ధి, వసతి సౌకర్యాలను పర్యవేక్షించారు. స్టడీ సెంటర్, మానస సరోవరం సందర్శించారు. మానస సరోవరంలో బోటింగ్ ఏర్పాట్లలో భాగంగా తొలుత ప్రయోగాత్మకంగా పరిశీలించాలని అధికారులకు సూచించారు. పర్యాటకులు, చిన్నపిల్లలతో మాట్లాడి ఇంకా ఏయే వసతులు అవసరమనే వివరాలు తెలుసుకున్నారు.

వైభవంగా ముగిసిన కళాసమ్మేళనం

- నాలుగు రికార్డులు నెలకొల్పిన నాట్య కళాకారులు



విజేతలకు అవార్డులు ప్రదానం చేస్తున్న యశోద ఠాకూర్ తదితరులు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): కళాసమ్మేళనం–2023 పేరుతో రాజమహేంద్రవరంలో నాలుగు రోజుల పాటు నిర్వహించిన జాతీయ సంగీత, నృత్య పోటీలు ఆదివారం ముగిశాయి. రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ, శ్రీరాధాకృష్ణ ట్రస్టు, శ్రీరాధాకృష్ణ సంగీత, నృత్య కళాక్షేత్రం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో.. 22వ తేదీన 101 మంది నృత్య కళాకారులు నిర్విరామంగా 14 గంటల 2 నిమిషాల 2 సెకెన్ల పాటు నర్తించి భారత్ వరల్డ్ రికార్డ్స్, జీనియస్ బుక్ వరల్డ్ రికార్డ్స్, గోల్డెన్ స్టార్ రికార్డ్స్, వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సాధించారు. గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ నుంచి ఇంకా ధ్రువీకరణ రావాల్సి ఉందని నిర్వాహకులు తెలిపారు. ఈ పోటీల్లో మొత్తం 756 మంది కళాకారులు పాల్గొన్నట్లు చెప్పారు. కూచిపూడి, ఆంధ్రనాట్యం, జానపదం, శాస్త్రీయ సంగీతంలో గాత్రం, ఇన్‌స్ట్రుమెంటల్ మ్యూజిక్, లైట్ మ్యూజిక్, సెమీ క్లాసిక్ విభాగాల్లో 100 మందిని విజేతలుగా ప్రకటించారు. పది మందికి స్పెషల్ జ్యూరీ అవార్డులు ప్రదానం చేశారు. ప్రముఖ నాట్య కళాకారిణి శోభానాయుడు ప్రథమ శిష్యురాలైన డాక్టర్ యశోదా ఠాకూర్ ఈ అవార్డులను అందజేశారు. కార్యక్రమంలో శ్రీరాధాకృష్ణ సంగీత, నృత్య కళాక్షేత్ర వ్యవస్థాపకుడు జీబీ నారాయణ, గోరుగంతు ఉమా జయశ్రీ, పోతిన శ్రీనివాస్, కుశల్ భట్టాచార్య, తాళ్లపాక సందీప్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

దేశంలోనే తొలిసారిగా కుంగుబాటుకు శస్త్రచికిత్స!

ముంబై: ముంబై వైద్యులు తొలిసారిగా కుంగుబాటుకు శస్త్రచికిత్స నిర్వహించారు. 2017లో మానసిక ఆరోగ్యచట్టం అమల్లోకి వచ్చిన తర్వాత దేశంలో జరిగిన తొలి డిప్రెషన్ సర్జరీ ఇదేకావడం విశేషం. ఆస్ట్రేలియాకు చెందిన ఓ మహిళ గత 26 ఏళ్లుగా డిప్రెషన్‌తో బాధపడుతోంది. మహారాష్ట్ర మెంటల్ హెల్త్ బోర్డు అనుమతితో జస్‌లోక్ ఆస్పత్రిలో న్యూరోసర్జన్ డాక్టర్ పరేఖ్ దోషి నేతృత్వంలోని వైద్య బృందం ఆమెకు శస్త్రచికిత్స నిర్వహించింది. దీనిని డీప్ బ్రెయిన్ స్టిమ్యులేషన్ (డీబీఎస్) సర్జరీ అని అంటారు. పార్కిన్‌సన్స్ దగ్గర్నుంచి నరాల వ్యవస్థలో లోపాల కారణంగా తలెత్తే వివిధ రకాల వ్యాధులకి డీబీఎస్ శస్త్రచికిత్స ద్వారా నయం చేస్తారు.

75 గ్రామాలకు స్వాతంత్ర్యయోధుల పేర్లు

అగర్తలా: తమ రాష్ట్ర సరిహద్దుల్లో ఉన్న 75 గ్రామాల పేర్లను మార్చాలని త్రిపుర రాష్ట్ర ప్రభుత్వం తాజాగా నిర్ణయించింది. భారతదేశ స్వాతంత్ర్య పోరాటంలో అసువులు బాసిన త్యాగధనుల పేర్లను ఆ 75 గ్రామాలకు పెట్టాలని నిర్ణయించింది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు పూర్తయి ఆజాదీ అమృతోత్సవాలను జరుపుకుంటున్న వేళ పేర్ల మార్పిడి ప్రాజెక్టుని చేపట్టింది. జూలైలో మొదలు పెట్టి ఆగస్టు 15కల్లా పూర్తి చేస్తామని సమాచార, సాంస్కృతిక శాఖ కార్యదర్శి పి.కె. చక్రవర్తి చెప్పారు. రాష్ట్రంలోని ఎనిమిది జిల్లాల్లో ఉన్న సరిహద్దుల్లో 75 గ్రామాలను స్వాతంత్ర్య సమరయోధుల్ని గుర్తించే పనిని జిల్లా అధికార యంత్రాంగం చేస్తోందన్నారు.

పరమ చెత్త కుక్క..!



కాలిఫోర్నియా: చైనా జాతికి చెందిన ఒక కుక్క ప్రపంచంలో పరమ చెత్తగా, అందవిహీనంగా కనిపించే కుక్కగా కిరీటం సాధించింది. ప్రతీ ఏడాది అమెరికాలోని కాలిఫోర్నియాలో జరిగే అందవిహీనమైన శునకాల పోటీలో స్కూటర్ అనే పేరు ఉన్న ఏడేళ్ల వయసు శునకానికి ఈ పురస్కారం దక్కింది. అవార్డు కింద ఒక ట్రోఫీ, 1500 డాలర్ల బహుమానాన్ని ఆ కుక్కని పెంచుతున్న యజమానురాలికి ఇచ్చారు. కుక్కల పెంపకం, వాటిలో లోపాలున్న ప్రేమను పంచడం, జంతుప్రేమపై అవగాహన పెంచడం కోసం సానొమా -మారిన్ ఫెయిర్‌లో ఈ పోటీలు జరుగుతూ ఉంటాయి.

హలో.. ఆస్ట్రోనాట్..!

- రూపుదిద్దుకున్న మాట్లాడే అంతరిక్ష నౌకలు
- వ్యోమగాములకు ఎంతో ఉపయోగకరం
- ఏఐ ఆధారిత సమాచార వ్యవస్థతో సాధ్యం
- ఇంటర్‌ఫేస్‌ను అభివృద్ధి చేసిన 'నాసా' ఇంజనీర్లు



అంతరిక్షంలో విధినిర్వహణలో ఉండే వ్యోమగాములు ఇకపై తమకు ఏదైనా సమాచారం, సాయం కావాలంటే భూమిపై అంతరిక్ష పరిశోధనా కేంద్రాన్ని సంప్రదించాల్సిన అవసరం లేదు. తాము ప్రయాణిస్తున్న అంతరిక్ష నౌకను అడిగితే చాలు.. కావాల్సిన సమాచారం దొరుకుతుంది. అది కూడా సంభాషణల రూపంలోనే. కృత్రిమ మేధ(ఏఐ) ఆధారిత చాట్‌బాట్ చాట్‌జీపీటీ తరహాలో పనిచేసే ఇంటర్‌ఫేస్‌ను అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ 'నాసా' ఇంజనీర్లు అభివృద్ధి చేశారు. ఇతర గ్రహాలపై అన్వేషణ కోసం వెళ్లే వ్యోమగాములు తాము ప్రయాణించే అంతరిక్ష నౌకలతో సంభాషించడానికి ఈ ఇంటర్‌ఫేస్ ఉపయోగపడుతుందని చెబుతున్నారు. వ్యోమగాములకు అంతరిక్ష నౌకలు తగిన సలహాలు సూచనలు ఇచ్చేందుకు వీలుంటుందని పరిశోధకులు పేర్కొంటున్నారు. అంతేకాకుండా భూమిపై ఉండే మిషన్ కంట్రోలర్లు ఇతర గ్రహాలపై పనిచేసే ఏఐ ఆధారిత రోబోలతో సులభంగా మాట్లాడొచ్చని అంటున్నారు.

ఇది సైన్స్ ఫిక్షన్ కాదు

చంద్రుడిపైకి వ్యోమగాములను పంపించేందుకు నాసా ఇప్పటికే ప్రణాళిక సిద్ధం చేసింది. చంద్రుడి కక్ష్యలో 'లూనార్ గేట్‌వే' పేరిట ఒక అంతరిక్ష కేంద్రాన్ని సైతం నిర్మించాలని భావిస్తోంది. ఈ స్పేస్ స్టేషన్‌లో ఏఐ ఆధారిత ఇంటర్‌ఫేస్ సేవలు ఉపయోగించుకోవాలని నాసా నిర్ణయానికి వచ్చినట్లు ఇంజనీర్ డాక్టర్ లారిస్సా సుజుకీ చెప్పారు. అంతరిక్ష నౌకలతో నేరుగా సంభాషించడం, వాటి నుంచి వెనువెంటనే ప్రతిస్పందనలు అందుకోవడమే దీని ఉద్దేశమని వివరించారు. అంతరిక్షంలో గమనించిన విషయాలను సంభాషణల రూపంలో భూమిపైకి చేరవేస్తాయని, ప్రమాదాలు ఎదురైనప్పుడు హెచ్చరికలు జారీ చేస్తాయని అన్నారు. ఇది సైన్స్ ఫిక్షన్ ఎంతమాత్రం కాదని స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో అంతరిక్ష నౌకల్లో కృత్రిమ మేధ ఆధారిత గ్రహాంతర సమాచార వ్యవస్థను నిక్షిప్తం చేయడం తప్పనిసరి అవుతుందని వెల్లడించారు. అంతరిక్ష నౌకలతో సంబంధాలు తెగిపోయినప్పుడు, వాటిలో లోపాలు తలెత్తినప్పుడు, పనిచేయకుండా పోయినప్పుడు, ఇంజనీర్లను అంతరిక్షంలోకి పంపించలేమని చెప్పారు. ఏఐ ఆధారిత సంభాషణ వ్యవస్థతో అంతరిక్ష నౌకల్లోని లోపాలు వెంటనే తెలిసిపోతాయని వివరించారు. ఇలాంటి కమ్యూనికేషన్ వ్యవస్థను అంతరిక్ష వాహనాల్లో అమర్చడం ద్వారా ఇతర గ్రహాలపై ఉండే ఖనిజ లవణాలు, వాతావరణ పరిస్థితులు గురించి కచ్చితమైన సమాచారం పొందవచ్చని డాక్టర్ లారిస్సా సుజుకీ అభిప్రాయపడ్డారు.

-సాక్షి, నేషనల్ డెస్క్

రాష్ట్రపతి ముర్ముకు మిస్డ్‌కాల్

- రాష్ట్రపతి అభ్యర్థిత్వం కోసం ప్రధాని కార్యాలయం నుంచి ఫోన్
- ఫోన్ ఎక్కడో వదిలేసి రిసీవ్ చేసుకోలేని వైనం
- కొత్త పుస్తకంలో వెల్లడైన ఆసక్తికర విషయాలు



న్యూఢిల్లీ: సెల్‌ఫోన్‌ను వాడే అలవాటు అంతగా లేని ద్రౌపదీ ముర్ము.. జీవితంలో అత్యంత ముఖ్యమైన ఫోన్‌కాల్‌ను మిస్సయ్యారు..! ప్రధానమంత్రి కార్యాలయం నుంచి వచ్చిన పిలుపు అది. రాష్ట్రపతి పదవికి ఎన్‌డీఏ అభ్యర్థిగా నామినేషన్ వేయాలని ఆమెను కోరేందుకు స్వయంగా ప్రధాని మోదీయే చేసిన కాల్ అది..! 'ద్రౌపదీ ముర్ము: ఫ్రం ట్రైబల్ హింటర్ ల్యాండ్స్ టూ రైజినా హిల్' పేరుతో జర్నలిస్ట్ కస్తూరి రే రాసిన తాజా పుస్తకంలో 2022 జూన్ 21న జరిగిన ఘటన సహా పలు వివరాలున్నాయి. పలు ఇంటర్వ్యూలు, విశ్లేషణల ఆధారంగా ముర్ము జీవితంలో ఘటనల క్రమాన్ని స్కూల్, కాలేజీ రోజులవరకు టీచర్ నుంచి సామాజిక కార్యకర్తగా, అటునుంచి కౌన్సిలర్..మంత్రి..గవర్నర్..దేశ మొట్టమొదటి గిరిజన మహిళా రాష్ట్రపతి వరకు సాగిన ఆమె ప్రస్థానాన్ని అందులో ప్రస్తావించారు. గతేడాది జూన్ 21న ఒడిశా రాజధాని భువనేశ్వర్‌కు 275 కిలోమీటర్ల దూరంలోని తన మారుమూల స్వగ్రామం ఉపర్‌బేడలో ముర్ము ఉన్నారు. బీజేపీ ఎన్‌డీఏ రాష్ట్రపతి అభ్యర్థి ముర్ము అని తెలిసినా అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. దీని కోసం అందరూ ఉత్కంఠతో ఎదురు చూస్తున్న సమయమది. అయితే, ముర్ము స్వగ్రామంలో కరెంటు కట్ అమలవుతోంది. బయట జరుగుతున్న ఇలాంటి విషయాలేవీ ఆమెకు తెలియవు. మొబైల్‌ను ఎక్కువగా వాడే అలవాటు లేని ముర్ము, దాన్ని ఎక్కడో ఉంచారు. ప్రధాని కార్యాలయం నుంచి వచ్చిన ఫోన్ సహా ప్రముఖ వ్యక్తుల నుంచి వచ్చిన అనేక ఫోన్‌కాల్స్‌ను ఆమె రిసీవ్ చేసుకోలేకపోయారు. చివరికి పీఎంఓ అధికారులు ముర్ము మాజీ ఓఎస్‌డీ, రాయ్‌రంగ్‌పూర్‌లో ఉంటున్న బికాశ్ చంద్ర మహంతకు ఫోన్ చేశారు. ఆయన ఆగమేఘాల మీద తన మెడికల్ షాపును మూసేసి ముర్ము ఇంటికి చేరుకున్నారు. ఫోన్ ఆమె చేతికందించారు. దీంతో ప్రధాని మోదీతో ఆమె నేరుగా మాట్లాడగలిగారు. ఆ తర్వాతే ఆమె అభ్యర్థిత్వంపై అధికారిక ప్రకటన వెలువడింది.

ఇండియా హీరో మోదీ

- ఆయన నాయకత్వంలో భారత్‌లో అద్భుత ప్రగతి
- ప్రధానిపై ఈజిప్టులో ప్రవాస భారతీయుల ప్రశంసలు
- ఈజిప్టు అధ్యక్షుడితో మోదీ కీలక చర్చలు, ఒప్పందాలు



కైరోలోని హెలియోపోలిస్ కామన్‌వెల్త్ యుద్ధ స్మారకం వద్ద నివాళులర్పిస్తున్న ప్రధాని మోదీ

కైరో: 'ఇండియా హీరో నరేంద్ర మోదీ' అంటూ ఈజిప్టులో నివసిస్తున్న ప్రవాస భారతీయులు భారత ప్రధానిపై ప్రశంసల వర్షం కురిపించారు. అమెరికా కాంగ్రెస్ ఉభయ సభల సంయుక్త సమావేశంలో మోదీ చరిత్రాత్మక ప్రసంగం అద్భుతంగా ఉందంటూ కొనియాడారు. మోదీ నాయకత్వంలో ఇండియా అభివృద్ధి పథంలో దూసుకెళ్తోందని హర్షం వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ అమెరికాలో నాలుగు రోజుల అధికారిక పర్యటన ముగించుకొని శనివారం ఈజిప్టులో అడుగుపెట్టారు. గత 26 ఏళ్ల తర్వాత భారత ప్రధాని ఈజిప్టులో పర్యటిస్తుండడం ఇదే మొదటిసారి. రాజధాని కైరోలో మోదీకి ఘన స్వాగతం లభించింది. ఆదివారం ఆయన వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. రిట్జ్ కార్ల్‌టన్ హోటల్‌లో ప్రవాస భారతీయులతో సమావేశమయ్యారు. ఇండియా హీరో(కథానాయకుడు) మీరే నంటూ వారు ప్రశంసించగా మోదీ ప్రతిస్పందించారు. అందరికీ హీరో ఇండియా అని బదులిచ్చారు. ప్రజలంతా కష్టపడి పనిచేస్తున్నారని, అందుకే మన దేశం అభివృద్ధి సాధిస్తోందని అన్నారు. దేశ ప్రగతిలో ప్రవాస భారతీయుల కృషి ఎంతో ఉందని చెప్పారు. దేశ విజయంలో వారికి సైతం వాటా దక్కుతుందన్నారు. అనంతరం దావూదీ బోహ్రా వర్గం ముస్లింలతో నరేంద్ర మోదీ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. గుజరాత్‌లోని దావూదీ బోహ్రా ముస్లింలతో ఆయనకు సన్నిహిత సంబంధాలున్నాయి. ఈజిప్టులో ప్రవాస భారతీయులు తనకు ఘన స్వాగతం పలికారని ప్రధాని మోదీ ట్వీట్ చేశారు. వారి ఆప్యాయత తన హృదయాన్ని కదిలించిందని పేర్కొన్నారు. ఈజిప్టువాసులు సైతం భారతీయ సంప్రదాయ దుస్తులు ధరించి తనకు స్వాగతం పలికారని వెల్లడించారు. భారత్–ఈజిప్టు దేశాలు సంప్రదాయాలను సైతం పంచుకుంటున్నాయని వివరించారు.

అల్–హకీం మసీదు, గ్రేట్ పిరమిడ్ల సందర్శన

ఈజిప్టులో 11వ శతాబ్దం నాటి చరిత్రాత్మక అల్–హకీం మసీదును ప్రధాని మోదీ సందర్శించారు. ఈజిప్టులో మొదటి ప్రపంచ యుద్ధంలో భారతీయ సైనికులు చేసిన ప్రాణత్యాగాలకు గుర్తుగా నిర్మించిన హెలియోపోలిస్ కామన్‌వెల్త్ వార్ మెమోరియల్‌ను సందర్శించి, ఘనంగా నివాళులర్పించారు. ఇక్కడి సందర్శకుల పుస్తకంలో సంతకం చేశారు. ఈజిప్టులో జరిగిన మొదటి ప్రపంచ యుద్ధంలో 3,799 మంది భారతీయ సైనికులు అమరులయ్యారు. ప్రపంచ అద్భుతాల్లో ఒకటైన గిజా గ్రేట్ పిరమిడ్లను మోదీ సందర్శించారు. కైరో నగర శివార్లలో గిజా నెక్రోపోలిస్ అనే ప్రాంతంలో ఈ పిరమిడ్లు ఉన్నాయి. ''కైరో అల్–హకీం మసీదును సందర్శించడం ఆనందంగా ఉంది. ఈజిప్టు ఘనమైన వారసత్వానికి, సంస్కృతికి ఈ మసీదు దర్పణం పడుతోంది'' అని మోదీ ట్వీట్ చేశారు.

అవగాహనా ఒప్పందాలపై సంతకాలు


వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత పెంపొందించుకొనే దిశగా భారత్, ఈజిప్టు మరో అడుగు వేశాయి. భారత ప్రధాని మోదీ, ఈజిప్టు అధ్యక్షుడు అబ్దెల్ ఫతా ఎల్–సీసీ ఆదివారం చర్చలు జరిపారు. ప్రాంతీయ, అంతర్జాతీయ పరిణామాలపై అభిప్రాయాలు పంచుకున్నారు. ఇరువురు నేతలు నాలుగు అవగాహనా ఒప్పందాల(ఎంఓయూ)పై సంతకాలు చేశారని భారత విదేశాంగ కార్యదర్శి వినయ్ క్వాత్రా చెప్పారు. ఇందులో వ్యూహాత్మక భాగస్వామ్యానికి సంబంధించిన ఒప్పందం ఉందన్నారు. వ్యవసాయం, అనుబంధ రంగాలు, ప్రాచీన, పురావస్తు కట్టడాల పరిరక్షణ, 'కాంపిటీషన్ లా'కు సంబంధించిన మరో మూడు ఒప్పందాలపై సంతకాలు చేశారని తెలిపారు.

మోదీకి 'ఆర్డర్ ఆఫ్ ద నైలు' ప్రదానం

ఈజిప్టు అత్యున్నత పౌర పురస్కారం 'ఆర్డర్ ఆఫ్ ద నైలు'ను ఈజిప్టు అధ్యక్షుడు అబ్దెల్ ఫతా ఎల్–సీసీ ఆదివారం భారత ప్రధాని నరేంద్ర మోదీకి ప్రదానం చేశారు. ఈజిప్టు సహా ఇప్పటిదాకా 13 దేశాలు తమ అత్యున్నత పౌర పురస్కారాలతో మోదీని సత్కరించాయి. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, పాలస్తీనా, అఫ్గానిస్తాన్, సౌదీ అరేబియా, మాల్దీవ్స్, రష్యా, బహ్రెయిన్, పపువా న్యూగినియా, ఫిజీ, రిపబ్లిక్ ఆఫ్ పాలౌ, భూటాన్ తదితర దేశాల నుంచి ఆయన ఈ పురస్కారాలు స్వీకరించారు. తనకు ఆర్డర్ ఆఫ్ ద నైలు పురస్కారం ప్రదానం చేసిన ఈజిప్టు ప్రభుత్వానికి, ప్రజలకు మోదీ ట్విట్టర్‌లో కృతజ్ఞతలు తెలియజేశారు. భారత్ పట్ల ఈజిప్టు ప్రజల ఆప్యాయత అనురాగాలకు ఇదొక నిదర్శనమని పేర్కొన్నారు.



ఈజిప్టులోని గిజా పిరమిడ్ వద్ద మోదీ



ప్రఖ్యాత అమర్‌నాథ్ గుహాలయంలో ఏర్పడిన మంచు స్ఫటిక లింగం. జూలై ఒకటో తేదీన పహల్గామ్ నుంచి అమర్‌నాథ్ యాత్ర మొదలవుతోంది.

ఎల్‌ఓసీ వెంట చైనా దుశ్చర్య

న్యూఢిల్లీ: భారత్, పాకిస్తాన్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే) సరిహద్దు అయిన నియంత్రణ రేఖ(ఎల్‌ఓసీ) వెంట పాకిస్తాన్ సైన్యం రక్షణపరమైన మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తోంది. ఈ పనులకు పొరుగున ఉన్న దాని మిత్రదేశం చైనా సహకరిస్తోందని భారత ప్రభుత్వ అధికారులు వెల్లడించారు. డ్రోన్లు, కమ్యూనికేషన్ టవర్లను పాకిస్తాన్‌కు చైనా అందజేస్తోందని చెప్పారు. భూగర్భ కేబుళ్లను ఏర్పాటు చేస్తోందని తెలిపారు. పీఓకేలో చైనా స్థావరాలు పెరుగుతున్నాయని, వాటి రక్షణ కోసం పాక్ సైన్యానికి సాయం అందిస్తోందని అన్నారు. చైనా నుంచి దిగుమతి చేసుకున్న 155 ఎంఎం ఎస్‌హెచ్–15 శతఘ్నులను ఎల్‌ఓసీ వద్ద పాక్ మోహరించిందని పేర్కొన్నారు. పాక్ సైనిక పోస్టుల వద్ద చైనా సైనికాధికారులు తరచుగా కనిపిస్తున్నారని తెలియజేశారు. ఇదిలా ఉండగా, ఈ మొత్తం వ్యవహారంపై భారత సైన్యం ఇంకా అధికారికంగా స్పందించలేదు. తన ప్రయోజనాల కోసం చైనా చేస్తోందని నిపుణులంటున్నారు.

ఒబామా వ్యాఖ్యలపై సీతారామన్ మండిపాటు



న్యూఢిల్లీ: భారత ప్రభుత్వం మైనారిటీల హక్కుల్ని కాపాడలేకపోతే, ఆ దేశం ఎప్పటికైనా విడిపోయే ప్రమాదం ఉందంటూ అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా ఇటీవల ఓ ఇంటర్వ్యూలో చేసిన వ్యాఖ్యలను కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ తీవ్రంగా తప్పుబట్టారు. 'ఒబామా హయాంలోనే అమెరికా.. సిరియా, యెమెన్, సౌదీ అరేబియా, ఇరాక్ తదితర ఆరు ముస్లిం మెజారిటీ దేశాలపై వేలాది బాంబులు వేసిందని ఆరోపించారు. ఇది నిజం కాదా? అటువంటి వ్యక్తి ఇలాంటి ఆరోపణలు చేస్తే నమ్మేదెవరు?' అని ఆమె ప్రశ్నించారు. ప్రధాని మోదీని ఓవైపు ముస్లిం మెజారిటీ దేశాలు కీర్తిస్తుంటే మరోవైపు అమెరికా మాజీ అధ్యక్షుడు భారత్‌లోని ముస్లింల గురించి ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని నిర్మలా ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రధాని నరేంద్ర మోదీ 13 దేశాల నుంచి అత్యున్నత పౌర పురస్కారాలు అందుకున్నారు, అందులో ఆరు ముస్లిం మెజారిటీ దేశాలని ఆమె గుర్తుచేశారు.

సైన్యాన్ని చుట్టుముట్టిన మహిళలు

- మిలిటెంట్లకు రక్షణ కవచంగా మారిన మెయిటీ మహిళలు
- 12 మంది మిలిటెంట్లను విడిచిపెట్టిన సైన్యం
- మణిపూర్‌లోని తూర్పు ఇంఫాల్‌లో ఘటన



ఇంఫాల్: మణిపూర్‌లో శాంతి నెలకొల్పేందుకు యత్నిస్తున్న సైన్యానికి స్థానికంగా ఓ వర్గం మహిళల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతోంది. మిలిటెంట్లను విడిపించుకునేందుకు పెద్ద సంఖ్యలో మహిళలు ఆర్మీని దిగ్బంధించారు. దీంతో రోజంతా ఉద్రిక్తత కొనసాగింది. చివరికి, ఆర్మీ తమ అదుపులో ఉన్న మెయిటీ వర్గం మిలిటెంట్లను విడిచిపెట్టాల్సి వచ్చింది. ఈ ఘటన తూర్పు ఇంఫాల్ జిల్లా ఇథమ్ గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. భద్రతా బలగాలు శనివారం ఉదయం గ్రామంలో సోదాలు జరిపి 12 మంది మిలిటెంట్లను అదుపులోకితీసుకున్నాయి. విషయం తెల్సుకున్న సుమారు 1,200 మంది మెయిటీ వర్గం మహిళలు సైనికులను చుట్టుముట్టారు. మిలిటెంట్లను వదిలేయాలని భీష్మించారు. సాయంత్రం వరకు ఇదే ప్రతిష్టంభన కొనసాగింది. చివరికి బలగాలు మిలిటెంట్లను వదిలేశాయి. వారి నుంచి స్వాధీనం చేసుకున్న ఆయుధాలను, మందుగుండును మాత్రం తీసుకెళ్లామని ఆర్మీ తెలిపింది. రాష్ట్రంలో నెలకొన్న సున్నిత పరిస్థితుల దృష్ట్యా, బలప్రయోగంతో కలిగే నష్టాన్ని, గ్రామస్తుల భద్రతను దృష్టిలో ఉంచుకుని, మానవతా దృక్పథంతో మిలిటెంట్లను స్థానిక నేతకు అప్పగించినట్లు ఆర్మీ తెలిపింది. ఆర్మీ విడిచిపెట్టిన వారిలో మెయిటీ వర్గం కేవైకేఎల్ గ్రూపునకు చెందిన స్వయం ప్రకటిత లెఫ్టినెంట్ కల్నల్ మొయిరంగ్‌థెమ్ తంబా అలియాస్ ఉత్తమ్ ఉన్నాడు. ఇతడికి పలు హింసాత్మక ఘటనలతో సహా 2015లో '6 డోగ్రా యూనిట్'పై దాడితో సంబంధముంది. ఈ గ్రూప్ మయన్మార్ నుంచి మణిపూర్‌లోకి చొరబడినట్లు ఆర్మీ తెలిపింది. గ్రామంలోకి అదనపు బలగాల ప్రవేశాన్ని ఆలస్యం చేసేందుకు ఆ మార్గంలోని కొన్ని వంతెనల వద్ద అడ్డంకులు కల్పించారంది. కాగా, మణిపూర్ సీఎం బీరేన్ సింగ్ ఆదివారం ఢిల్లీలో హోం మంత్రి అమిత్‌షాను కలిశారు. రాష్ట్రంలో నెలకొన్న తాజా పరిస్థితులను వివరించారు.

కేదార్‌నాథ్ యాత్రకు తాత్కాలిక బ్రేక్

రుద్రప్రయాగ: ఉత్తరాఖండ్‌లో భారీ వర్షాలు కురుస్తూ ఉండడంతో కేదార్‌నాథ్ యాత్రను తాత్కాలికంగా నిలిపివేశారు. రుద్రప్రయాగ జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వరదలు ముంచెత్తడంతో సోనప్రయాగ్ దగ్గర యాత్రను నిలిపివేసినట్లు ఉత్తరాఖండ్ ప్రభుత్వం ప్రకటించింది. తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకు కేదార్‌నాథ్‌కు ప్రయాణాల్ని ఆపేయాలని స్పష్టం చేసింది. మరోవైపు రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తూ ఉండడంతో ముఖ్యమంత్రి పుష్కర్ ధామి ఆదివారం రాష్ట్ర విపత్తు నిర్వహణకు చెందిన కంట్రోల్ రూమ్‌ను సందర్శించారు.

బెంగాల్‌లో రెండు గూడ్స్ రైళ్లు ఢీ

కోల్‌కతా: రెండు గూడ్స్ రైళ్లు ఢీకొన్న ఘటనలో 8 బోగీలు పట్టాలు తప్పాయి. ప్రాణనష్టం జరగలేదని, ఎవరూ గాయపడలేదని ఆగ్నేయ రైల్వే అధికారులు తెలిపారు. పశ్చిమబెంగాల్‌లోని బంకురా జిల్లా ఓండా వద్ద ఆదివారం ఉదయం ఈ ప్రమాదం చోటుచేసుకుంది. దీంతో ఆద్రా డివిజన్‌లోని మిడ్నపూర్–ఆద్రా సెక్షన్‌లో 4 గంటలపాటు 20 వరకు రైళ్ల రాకపోకలపై ప్రభావం పడింది. ఘటన ప్రాంతంలో తక్షణమే పనులు చేపట్టి ఉదయం 8.30 గంటలకల్లా రాకపోకలను పునరుద్ధరించామన్నారు. గూడ్స్ రైలు డ్రైవర్ సిగ్నల్‌ను గమనించకుండా లూప్‌లైన్‌లోకి పోనివ్వడం వల్లే ప్రమాదం జరిగినట్లు ప్రాథమికంగా తెలుస్తోందని చెప్పారు.

62 ఏళ్ల తర్వాత..!

న్యూఢిల్లీ/ముంబై: దేశ రాజధాని ఢిల్లీ, వాణిజ్య రాజధాని ముంబైలను 62 ఏళ్ల తర్వాత రుతుపవనాలు ఒకేసారి ఆదివారం తాకాయి. రెండు నగరాలపైకి ఇలా ఒకేసారి వ్యాపించడం 1961 జూన్ 21వ తేదీ తర్వాత ఇదే మొదటిసారని భారత వాతావరణ శాఖ(ఐఎండీ) తెలిపింది. ఢిల్లీకి ముందుగా ఊహించిన దాని కంటే రెండు రోజులు ముందు రాగా, ముంబైకి మాత్రం రెండు వారాలు ఆలస్యంగా చేరుకున్నాయని వివరించింది. హరియాణా, చండీగఢ్, ఢిల్లీలపై రుతుపవనాలు చురుగ్గా కదులుతున్నాయని పేర్కొంది. రుతుపవనాలు మహారాష్ట్రలోని మిగతాప్రాంతాలు, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, ఢిల్లీ, గుజరాత్‌లోని కొన్ని ప్రాంతాలు, రాజస్తాన్, హరియాణా, ఉత్తరాఖండ్, హిమాచల్‌ప్రదేశ్, జమ్మూకశ్మీర్, లద్దాఖ్‌వైపు కదులుతున్నాయని వివరించింది. రానున్న రెండు రోజుల్లో మిగతా ప్రాంతాలకూ విస్తరించేందుకు అనువైన పరిస్థితులున్నాయని తెలిపింది. సాధారణంగా రుతు పవనాలు కేరళను జూన్ 1న, ముంబైని జూన్ 11న, ఢిల్లీని జూన్ 27న తాకుతాయి.

అమెరికాలో కాల్పులు.. ఇద్దరి మృతి

మిషిగన్: అమెరికాలో కాల్పుల మోత ఆగట్లేదు. తాజాగా జరిగిన కాల్పుల ఘటనలో ఇద్దరు చనిపోగా మరో 12 మంది గాయపడ్డారు. మిషిగన్‌లోని సగినాలో శనివారం అర్ధరాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. సోషల్ మీడియా స్పాన్సర్ చేస్తున్న స్ట్రీట్ పార్టీలో 200 మందికి పైగా పాల్గొన్నారు. అకస్మాత్తుగా పలు వైపుల నుంచి కాల్పులు జరిగాయి. ఈ ఘటనలో ఇద్దరు మరణించగా మరో 12 మంది గాయపడ్డారు. కాల్పుల ఘటనపైదర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ప్రవాసంలోకి ప్రిగోజిన్

- టీ కప్పులో తుఫాన్‌లా సమసిన రష్యా సంక్షోభం
- ప్రిగోజిన్, వాగ్నర్ సైనికులపై కేసులు వెనక్కి

మాస్కో: రష్యాలో ప్రైవేటు సైన్యం తిరుగుబాటు ముగిసింది. సైనిక నాయకత్వంపై తిరుగుబాటు బావుటా ఎగరేసి కొద్ది గంటల సేపు అల్లకల్లోలం సృష్టించిన ప్రైవేటు సైన్యం సంస్థ వాగ్నర్ చీఫ్ యెవెగినీ ప్రిగోజిన్ వెనక్కి తిరిగారు. ఉక్రెయిన్ యుద్ధంలో రష్యాకు మద్దతుగా ఉన్న బెలారస్‌కు ప్రవాసం వెళ్లాలని ప్రయాణమయ్యారు. అయితే ఆయన బెలారస్ చేరుకున్నారో లేదో అన్న దానిపై అధికారికంగా ఎలాంటి సమాచారం లేదు. సైనికులంతా ఎక్కడివారు అక్కడికే ఉక్రెయిన్ శిబిరాల్లోకి వెళ్లిపోవాలని ఆదేశించారు. బెలారస్ అధ్యక్షుడు మధ్యవర్తిత్వంతో ఈ సంక్షోభం టీ కప్పులో తుపానులా సమసిపోయింది. ఒప్పందం ప్రకారం ప్రిగోజిన్‌పై పెట్టిన కేసులన్నింటినీ వెనక్కి తీసుకున్నట్లు రష్యా ప్రభుత్వం ప్రకటించింది. ప్రిగోజిన్‌తో పాటు తిరుగుబాటులో పాల్గొన్న వాగ్నర్ సైనికులపై ఎలాంటి విచారణ జరపబోమని స్పష్టం చేసింది. వాగ్నర్ సైనికుల్ని కాంట్రాక్ట్ పద్ధతిలో సైన్యంలోకి తీసుకుంటామని రష్యా రక్షణ శాఖ ఆఫర్ ఇచ్చింది.

రక్తపాతం వద్దు అనే..

ప్రిగోజిన్‌ను దేశద్రోహి, వెన్నుపోటుదారుడు అని అభివర్ణించిన రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ అనూహ్యంగా ప్రిగోజిన్, అతని సైన్యాన్ని వదిలేయడంపై సర్వత్రా చర్చ జరుగుతోంది. ఒకవైపు ఉక్రెయిన్‌తో పూర్తి స్థాయిలో తలబడలేక అంతర్జాతీయంగా ఉన్న పరువును పోగొట్టుకున్న పుతిన్ ఇప్పుడు అంతర్గత సంక్షోభాలను తట్టుకునే స్థితిలో లేరని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ''దేశంలో రక్తపాతం జరగకుండా చూడాలని, అంతర్గత పోరు కొనసాగితే ఎలాంటి ఫలితాలు వస్తాయన్న ఆందోళన కూడా ఆయనలో ఉంది. ప్రస్తుత పరిస్థితుల్లో పుతిన్ ఎంత బలహీనంగా మారిపోయారంటే ఎలాంటి రిస్క్ చేయలేకపోతున్నారు''అనే విశ్లేషణలు వినబడుతున్నాయి. మరోవైపు తిరుగుబాటు జరిగిన మర్నాడే రష్యా విదేశాంగ శాఖ ఉప మంత్రి ఆండ్రూ చైనా పర్యటనకు వెళ్లారు. చైనా విదేశాంగ మంత్రి కిన్ గాంగ్‌తో తాజా పరిణామాలపై చర్చించనున్నట్టు తెలుస్తోంది. ఉక్రెయిన్ యుద్ధం విషయంలో రష్యాకు చైనా మద్దతుగా ఉన్న విషయం తెలిసిందే.

రష్యా రక్షణ వ్యవస్థపై నీలినీడలు

ప్రిగోజిన్ తిరుగుబాటుతో రష్యా రక్షణ వ్యవస్థలో ఉన్న డొల్లతనం బయటపడింది. వాగ్నర్ గ్రూప్ సైనికులు రాత్రికి రాత్రి కొన్ని గంటల వ్యవధిలో రోస్తావో నగరంలోకి ఎలాంటి ఆటంకం లేకుండా ప్రవేశించారు. ప్రభుత్వ సైనికులతో ఘర్షణలు చెలరేగాయి. ఈ సమయంలో వాగ్నర్ సైనికులు చేసిన దాడుల్లో 39 మంది పైలెట్లు మరణించినట్లు తెలుస్తోంది.



రోస్తోవ్‌లో ప్రిగోజిన్‌తో స్థానికుడి సెల్ఫీ

అమెరికాకి ముందే తెలుసు

రష్యాపై ప్రిగోజిన్ తిరుగుబాటు చేస్తారని అమెరికా నిఘా సంస్థలు ముందే పసిగట్టాయని వాషింగ్టన్ పోస్ట్, న్యూయార్క్ టైమ్స్ కథనాలు ప్రచురించాయి. జూన్ మధ్యలో ప్రిగోజిన్ రష్యాపై తిరుగుబాటు చేయడానికి సన్నాహాలు చేస్తున్నట్టుగా నిఘా సంస్థలకు సమాచారం అందింది. వారం క్రితం నిర్ధారణగా తెలిసింది. తిరుగుబాటుకు ఒక్క రోజు ముందే రష్యాలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొంటాయని అమెరికా ప్రభుత్వానికి నిఘా సంస్థలు నివేదిక ఇచ్చాయి. పుతిన్‌కు ఒకరోజు ముందే తిరుగుబాటు విషయం తెలుసని అమెరికా మీడియా అంటోంది. రష్యాలో పరిస్థితులపై అమెరికా అధ్యక్షుడు జోసెఫ్ బైడెన్ ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నారు. బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ అధినేతలతో బైడెన్ ఫోన్‌లో మాట్లాడారు. తమ మద్దతు ఎప్పటికీ ఉక్రెయిన్‌కే ఉంటుందని పునరుద్ఘాటించారు. రష్యాలో తిరుగుబాటు జరిగినంత మాత్రాన తమ వైఖరిలో ఎలాంటి మార్పు ఉండబోదని అమెరికా విదేశాంగ శాఖ ప్రతినిధి మాథ్యూ మిల్లర్ స్పష్టం చేశారు.

కిడ్నాప్ అనుమానంతో డ్రైవర్‌పై కాల్పులు

టెక్సాస్: ఉబర్ డ్రైవర్ తనను కిడ్నాప్ చేస్తున్నాడన్న అనుమానంతో అమెరికాకు చెందిన ఒక మహిళ దారుణానికి దిగింది. మెక్సికోకు తనను తీసుకువెళుతున్నాడని భయపడి డ్రైవర్‌పై కాల్పులు జరిపింది. ఈ కాల్పుల్లో తీవ్రంగా గాయపడిన డ్రైవర్ ఆస్పత్రిలో మృతిచెందాడు. టెక్సాస్‌కు చెంది ఫోబె కోపాస్ (48) తన ప్రియుడి దగ్గరికెళ్లేందుకు ఉబర్ క్యాబ్ బుక్ చేసుకుంది. కారు ఎక్కాక ఫోన్‌లో ఏదో మాటల్లో పడిపోయిన ఆమె ఆ తర్వాత హఠాత్తుగా పరిసరాలను చూసి తనను మెక్సికోకి తీసుకువెళుతున్నారని అనుమానపడింది. వెంటనే తన బ్యాగ్‌లో ఉన్న తుపాకీతో డ్రైవర్ డేనియల్ పియేడ్రాపై కాల్పులు జరిపింది. ఈ కాల్పుల్లో మెడకు తీవ్ర గాయాలైన అతను రక్తపు మడుగులో పడిపోయాడు. ఈ విషయాన్ని ఆమె స్వయంగా పోలీసులకు సమాచారం ఇచ్చింది. పోలీసుల విచారణలో ఆ డ్రైవర్ కిడ్నాప్ చేయడానికి ప్రయత్నించినట్టు ఎలాంటి ఆధారాలు లభించలేదు. అందుకే ఆమెపై హత్య కేసు నమోదు చేశారు. ఉబర్ ఈ ఘటనను తీవ్రంగా ఖండించింది. ఇలాంటి హింసను సహించలేమంటూ ఫోబె మళ్లీ ఉబర్ సేవలు వినియోగించుకోకుండా నిషేధం విధించింది.



హరియాణాలోని పంచకులలో ఘగ్గర్ నదిలో వరదలో కొట్టుకుపోతున్న కారును అడ్డుకుంటున్న గ్రామస్తులు. ఈ ఘటనలో కారులోని ఒక మహిళను ఎట్టకేలకు వారు కాపాడారు.

బస్సు-కారు ఢీ

• ఐదుగురు దుర్మరణం

సాక్షి,చెన్నై: తిరుచ్చి మనపారై వద్ద ఆదివారం ప్రభుత్వ బస్సు, కారు ఢీకొన్న ప్రమాదంలో ఐదుగురు దుర్మరణం చెందారు. మరో 20 మంది గాయపడ్డారు. తిరుచ్చి నుంచి ఆదివారం సాయంత్రం దిండుగల్‌కు ప్రభుత్వ బస్సు ప్రయాణికులతో బయలుదేరింది. కల్‌కోత్తనూరు వద్ద వెళుతుండగా ఎదురుగా వస్తున్న కారు, బస్సు ఢీకొన్నాయి. అతివేగంగా ఢీకొనడంతో రోడ్డు పక్క గుంతలో బస్సు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఐదుగురు మృతిచెందారు. గాయపడ్డ 20 మందిలో ఐదుగురిని తిరుచ్చి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మరో 15 మంది మనపారై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు విస్తృతం చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

న్యూస్‌రీల్

అతిథి మర్యాదలు వద్దు

– జిల్లా కోర్టుకు హైకోర్టు ఆదేశాలు

సాక్షి, చెన్నై: అధికారిక, వ్యక్తిగత కార్యక్రమాల నిమిత్తం జిల్లాలకు వచ్చే న్యాయమూర్తులను ఆహ్వానించే విధంగా అతిథి మర్యాదను ఇక పక్కన పెట్టాలని జిల్లా కోర్టుల్లోని న్యాయమూర్తులు, సిబ్బందికి హైకోర్టు రిజిస్ట్రార్ ఆదేశాలు జారీ చేశారు. న్యాయమూర్తులు వస్తున్న సమాచారంతో జిల్లాల సరిహద్దుల్లో, రోడ్లపై వేచి ఉండి వారిని ఆహ్వానించే విధంగా కార్యక్రమాలను నిర్వహించ వద్దు అని సూచించారు. అధికారిక కార్యక్రమాలకు హాజరయ్యే న్యాయమూర్తులను సంబంధిత ప్రొటోకాల్ సిబ్బంది మాత్రం ఆహ్వానించి, వారు బసచేసే అతిథి గృహాలకు తీసుకెళ్లాలని పేర్కొన్నారు. పదోన్నతులు, బదిలీల కోసం న్యాయమూర్తుల ఇళ్ల వద్దకు వెళ్లి కలవడం వంటి చర్యలు మానుకోవాలని హితవు పలికారు. అలాగే, జ్ఞాపికల ప్రదానం, శాలువలు కప్పడం వంటి వాటికి స్వస్తి పలకాలని ఆదేశించారు. విధుల సమయంలో జిల్లా కోర్టుల్లోని న్యాయమూర్తులు అనవసరంగా బయటకు రాకూడదని సూచించారు. ఒకవేళ బయటకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిన పక్షంలో నల్లకోటు, టై ధరించ వద్దని ఆదేశించారు.

సీఎం రంగస్వామి ఇల్లు ముట్టడి

సాక్షి, చెన్నై: పుదుచ్చేరి సీఎం రంగస్వామి ఇంటిని ఆదివారం ఉపాధ్యాయులు ముట్టడించారు. విద్యాశాఖా మంత్రిని కలవాలని ఆయన సలహా ఇవ్వడంతో నిరాశతో ఉపాధ్యాయులు వెనుదిరిగారు. పుదుచ్చేరిలో 2023–24 సంవత్సరానికిగాను ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియకు సంబంధించిన మార్గదర్శకాలను విద్యాశాఖ శనివారం విడుదల చేసింది. బదిలీ ప్రక్రియను విద్యాశాఖ చేపట్టే రీతిలో అనేక అంశాలు మార్గదర్శకాలలో ఉండడం ఉపాధ్యాయులలో ఆగ్రహాన్ని రేపింది. దీంతో ఆ మార్గదర్శకాలను నిలుపుదల చేయలని కోరుతూ రెండు వందల మంది ఉపాధ్యాయులు సీఎం రంగస్వామి ఇంటిని హఠాత్తుగా ముట్టడించారు. లాస్‌పేటలోని సీఎం ఇంటి పరిసరాలలో ఇటీవల కాలంగా భద్రతను పెంచారు. అయితే, సీఎంను కలిసేందుకు వచ్చినట్టు పేర్కొన్న ఉపాధ్యాయులు హఠాత్తుగా ఇంటిముందు బైటాయించి నినాదాలు హోరెత్తించారు. బయటకు వచ్చిన సీఎం రంగస్వామి ఉపాధ్యాయులను బుజ్జగించారు. ఈ వ్యవహారంపై విద్యాశాఖా మంత్రిని కలిసి పరిష్కరించుకోవాలని ఆయన సలహా ఇవ్వడంతో నిరాశతో ఉపాధ్యాయులు అక్కడి నుంచి వెనుదిరిగారు.

లండన్‌లో అనుమానాస్పదస్థితిలో కోవై విద్యార్థి మృతి


జీవన్ (ఫైల్)

సాక్షి, చెన్నై : లండన్‌లో చదువుకుంటున్న కోయంబత్తూరు విద్యార్థి అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన సమాచారం ఆదివారం కుటుంబీకులకు చేరింది. దీంతో మృతదేహం కోసం కుటుంబీకులు ఎదురుచూస్తున్నారు. నీలగిరి జిల్లా ఊటీకి చెందిన శివకుమార్ కోయంబత్తూరు జిల్లా నరసింహనాయకన్ పాళయంలో నివాసం ఉన్నారు. ఆయన కుమారుడు జీవన్(25) గత ఏడాది లండన్‌లో ఇంటర్నేషనల్ బిజినెస్ కోర్సు చదివేందుకు వెళ్లాడు. అక్కడి హుస్టన్ వర్సిటీలో చదువుతున్నాడు. ఈ పరిస్థితులలో రెండు రోజుల క్రితం లైబ్రరీకి వెళ్లిన జీవన్ కనిపించకుండాపోయాడు. అతడి కోసం గాలించారు. పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ సమయంలో జీవన్ తీవ్ర గాయాలతో బర్మింగ్‌హాం కాలువలో పడి ఉండడంతో ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. లైబ్రరీకి వెళ్లిన జీవన బర్మింగ్‌హాం కాలువలో గాయాలతో పడి ఉండడం అనుమానాలకు దారి తీసింది. అతడి మరణ సమాచారాన్ని ఆదివారం వేకువజామున లండన్‌లోని అధికారులు భారత రాయబార కార్యాలయం వర్గాల ద్వారా కుటుంబీకులకు తెలియజేశారు. దీంతో అతడి కుటుంబం శోకసంద్రంలో మునిగింది. జీవన్ మృతదేహాన్ని కోయంబత్తూరుకు తీసుకొచ్చేందుకు ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వానికి కుటుంబీకులు విజ్ఞప్తి చేశారు.

స్మార్ట్ క్లాస్ రూమ్‌లకు ఆర్థిక చేయూత


ప్రసంగిస్తున్న అభిషేక్ మురళి

సాక్షి, చెన్నై: పాఠశాలలలో స్మార్ట్ క్లాస్ రూమ్‌ల ఏర్పాటుకు ఆర్థికంగా చేయూతను అందించేందుకు రోటరీ క్లబ్ ఆఫ్ మద్రాసు నెక్స్‌జెన్ నిర్ణయించింది. ఆదివారం గిండిలోని ఓ హోటల్‌లో ఆర్‌వై 2023–24 పేరిట రోటరీ క్లబ్ ఆఫ్ మద్రాసు నెక్స్‌జెన్ టీం సమావేశం జరిగింది. ఇందులో ఆదాయ పన్ను శాఖ ప్రిన్సిపల్ కమిషనర్ పి సెల్వ గణేష్ మాట్లాడుతూ, సమాజ సేవ, ప్రాముఖ్యతతో పాటు దేశ నిర్మాణంలో ఆదాయపన్ను పాత్ర గురించి వివరించారు. నెక్స్‌జెన్ 11వ అధ్యక్షుడిగా డాక్టర్ సీఏ అభిషేక్ మురళి బాధ్యతలు తీసుకోవడమే కాకుండా, 20కు పైగా గ్రంథాలయాల నిర్మాణం, కార్మికులకు పొదుపు, పెట్టుబడులపై అవగాహన కల్పించేలా ఆర్థికపరంగా శిబిరాలను నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నారు. పాఠశాలలో స్మార్ట్ క్లాస్ రూమ్‌ల ఏర్పాటు, కార్పొరేషన్ పాఠశాలలకు సహకారంగా ఆర్థిక చేయూతకు తీర్మానించారు. కార్యక్రమంలో నెక్స్‌జెన్ పాత, కొత్త నిర్వాహకులు ఐశ్వర్య, రతన్, యశ్వర్ధన్ పాల్గొన్నారు.


సుశీంద్రం: ప్రత్యేక అలంకరణలో నటరాజస్వామి


చిదంబరంలో రథోత్సవానికి హాజరైన భక్త జనం

హరహర మహాదేవ

• మార్మోగిన శివనామ స్మరణ
• నటరాజ సన్నిధిలో రథోత్సవ వైభవం
• వేలాదిగా తరలివచ్చిన భక్తజనం
• నేడు చిదంబరంలో ఆణి తిరుమంజన సేవ

సాక్షి, చెన్నై: చిదంబరం నటరాజస్వామి వారి సన్నిధిలో ఆదివారం కనులపండువగా రథోత్సవం జరిగింది. వేలాదిగా తరలివచ్చిన భక్తజనం శివనామ స్మరణను మార్మోగించారు. నటరాజ స్వామి ఓ రథంలో, శివగామసుందరి అమ్మవారు మరోరథంలో, సుబ్రమణ్యంస్వామి, వినాయకుడు, చండీశ్వర్ వేర్వేరు రథాల్లో ఆశీనులై దర్శనం ఇచ్చి భక్తులను కనువిందు చేశారు.

కడలూరు జిల్లా చిదంబరంలో వెలసిన నటరాజస్వామి ఆలయం ఆధ్యాత్మికంగా ప్రసిద్ధి చెందింది. ఇక్కడి ప్రతిఏటా ఆణి, మార్గళి మాసాలలో రెండు మార్లు ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. ఈ ఏడాదిలో తొలి బ్రహ్మోత్సవంగా ఆణి తిరుమంజనోత్సవాలు ఈనెల 17వ తేదీ నుంచి కనులపండువగా జరుగుతున్నాయి. 11 రోజుల పాటు జరిగే ఈ వేడుకలో ఇప్పటి వరకు స్వామివారు ప్రతిరోజూ చంద్రప్రభ, సూర్యప్రభ, వెండి, వృషభ, గజ, బంగారు కైలాశ వాహనాలలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఉత్సవాలలో 9వ రోజైన ఆదివారం రథోత్సవ వైభవం అత్యంత వేడుకగా జరిగింది.

రథోత్సవం..

ఈ ఉత్సవాల్లో అత్యంత ప్రాముఖ్యత రథోత్సవానికి ఉంది. ఈ ఉత్సవం కోసం ఆదివారం వేకువజామునే ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కనక సభ నుంచి మూలవిరాట్ నటరాజస్వామిని, శివగామసుందరి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి వెయ్యి కాళ్ల మండపం వద్దకు తీసుకొచ్చారు. పంచమూర్తులతో కలిసి స్వామి వారు బ్రహ్మాండ రథంపై ఆశీనులై భక్తులకు దర్శనం ఇచ్చారు. అలాగే, మరో రథంపై అమ్మవారు భక్తులను కటాక్షించారు. స్వామి అమ్మవార్ల రథాలకు ముందుగా గణపతి, సుబ్రహ్మణ్యస్వామి, చండీశ్వర్ స్వాములు వేర్వేరు రథాలలో ఆశీనులై భక్తులకు దర్శనం ఇచ్చారు. ఒకటి తర్వాత మరొకటి రథాలు ఆలయం నుంచి పురవీధుల వైపుగా కదిలాయి. శివనామ స్మరణలు మార్మోగగా, వేలాదిగా తరలివచ్చిన భక్త జనం రథంలో ఆశీనులైన స్వామి, అమ్మవార్లను దర్శించి పునీతులయ్యారు. ఒకే సమయంలో ఒక రథాన్ని మరొకటి అనుకరిస్తూ ముందుకు సాగడంతో రథోత్సవం కనులపండువగా జరిగింది. భక్తులు శివుడి, నటరాజస్వామి వేషాలలో రథాలకు ముందుగా శివనామస్మరణను మార్మోగిస్తూ అడుగులు వేశారు. ఉత్సవాల్లో ప్రధాన ఘట్టం సోమవారం జరగనుంది. వేకువజామున వెయ్యికాళ్ల మండపంలో నటరాజస్వామికి ప్రత్యేక పూజలు జరుగుతాయి. సాయంత్రం ఆణి తిరుమంజనోత్సవం జరగనుంది. రాష్ట్రం నుంచే కాకుండా, ఇతర రాష్ట్రాల నుంచి కూడా భక్తులు తరలి రానుండడంతో చిదంబరంలో గట్టి భద్రతా ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కల్గకుండా అన్ని చర్యలు తీసుకున్నారు.

సుశీంద్రంలో..

కన్యాకుమారి జిల్లా సుశీంద్రంలో దనుమలయ ఆలయంలో నటరాజస్వామిగా పరమ శివుడు కొలువై ఉన్న విషయం తెలిసిందే. ఇక్కడి ఉత్సవాలలో భాగంగా ఆణి ఉత్తరం రోజైన ఆదివారం స్వామి వారికి 16 రకాల వస్తువులతో తిరుమంజనసేవ కనులపండువగా జరిగింది. ఉదయం అభిషేక మండపంలో వేలాది మంది భక్తుల సమక్షంలో స్వామి వారికి చందనం, పాలు, పెరుగు, కొబ్బరినీరు, పన్నీరు, చెరకు రసం, పంచామృతం సహా 16 రకాల వస్తువులతో అభిషేకం జరిగింది. అనంతరం స్వామి వారికి ప్రత్యేక అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు.

కస్టడీకి అవకాశం ఇవ్వండి

• చట్టబద్ధంగానే సెంథిల్ అరెస్ట్
• కోర్టులో ఈడీ రిట్ పిటిషన్


సెంథిల్ బాలాజి

సాక్షి, చెన్నై: సెంథిల్ బాలాజీని చట్టబద్ధంగానే అరెస్టు చేశామని, ఆయన్ను విచారించేందుకు అవకాశం ఇవ్వాలని కోరుతూ ఈడీ వర్గాలు హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశాయి. ఆగ మేఘాలపై ఆదివారం కోర్టుకు పిటిషన్ రూపంలో వివరాలను సమర్పించాయి.

మంత్రి సెంథిల్ బాలాజీని మనీలాండరింగ్ కేసులో ఈడీ అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఈ సమయంలో గుండెపోటు రావడంతో ఆయనకు శస్త్ర చికిత్స అనివార్యమైంది. ప్రస్తుతం బైపాస్ సర్జరీ అనంతరం ఆయన కావేరి ఆస్పత్రిలోని ప్రత్యేక వార్డులో ఉన్నారు. ఈ పరిస్థితులలో తన భర్తను ఈడీ చట్టవిరుద్ధంగా అరెస్టు చేసినట్టు సెంథిల్‌బాలాజి సతీమణి మేఘల కోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్ విచారణ సమయంలో మేఘల తరఫున వాదనలు ముగిశాయి. ఇందుకు వివరణ ఇవ్వాలని ఈడీని హైకోర్టు ఆదేశించింది. తర్వాత విచారణ 27వ తేదీ జరగాల్సిన నేపథ్యంలో ఆదివారమే ఆగ మేఘాలపై ఈడీ వర్గాలు రిట్ పిటిషన్‌ను సిద్ధం చేసి కోర్టుకు సమర్పించడం గమనార్హం. ఇందులో సెంథిల్‌ను చట్టబద్ధంగానే అరెస్టు చేశామని వివరించారు. ఎస్‌ఎంఎస్, ఈమెయిల్ ద్వారా అరెస్టు సమాచారం ఇచ్చామని పేర్కొన్నారు. ఆయన్ను ఇంతవరకు తాము విచారించలేదని, కస్టడీకి అవకాశం ఇవ్వాలని కోర్టును కోరారు. అలాగే, అరెస్టుకు ముందుగా అధికారులతో సెంథిల్ దురుసుగా ప్రవర్తించారని, ఆయనకు వ్యతిరేకంగా అన్ని ఆధారాలు తమ వద్ద ఉన్నాయని, వాటిని తారుమారు చేసే పరిస్థితులు ఉన్నట్టు కోర్టుకు ప్రత్యేకంగా వివరించడం గమనార్హం. అదే సమయంలో మేఘల తరఫున అనుబంధంగా మరో పిటిషన్ దాఖలు చేశారు. చట్టంలో పేర్కొనలేని అంశాలతో సమాచారం ఇచ్చినట్టు ఈడీ సూచించిందని వివరించారు. అలాగే, 13వ తేదీ రాత్రే విచారణ ముగించినట్టు పేర్కొన్నారని, రెండు గంటల అనంతరం అరెస్టు చూపించారని, రెండుగంటల పాటు తన భర్తను ఎక్కడ ఉంచారో వివరాలను కోర్టుకు ఈడీ తెలియజేయాలని పిటిషన్‌లో పేర్కొనడం గమనార్హం.

విదేశాల నుంచి చెన్నైకి మేయర్ బృందం


విదేశీ పర్యటనలో మేయర్ ప్రియ, అధికారులు

• వేస్ట్ టూ ఎనర్జీ పథకానికి కార్యాచరణ

సాక్షి, చెన్నై: కార్పొరేషన్ మేయర్ ప్రియ నేతృత్వంలో విదేశాలకు వెళ్లిన అధికారుల బృందం ఆదివారం చెన్నైకు చేరుకున్నారు. కొడుంగయూరు డంపింగ్ యార్డ్‌లో ఫ్రాన్స్ దేశంలో ఉన్నట్టుగా వేస్ట్ టూ ఎనర్జీ పథకానికి కార్యాచరణ సిద్ధం చేశామని మేయర్ ప్రియ తెలిపారు.

చెన్నైను సింగారంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం విశ్వప్రయత్నం చేస్తున్నది. అయితే, చెత్త సేకరణ సమస్యగా మారింది. దీంతో వేస్ట్ మేనేజ్ మెంట్ పథకాలు ఇటలీ, ఫ్రాన్స్, స్పెయిన్‌లలో ఎలా అమలు చేస్తున్నారో అధ్యయనం చేయడానికి సీఎం స్టాలిన్ ఆదేశాలతో మేయర్ ప్రియ నేతృత్వంలోని బృందం ఈనెల 17న విదేశాలకు వెళ్లింది. మేయర్‌తోపాటు డిప్యూటీ మేయర్ మహేశ్‌కుమార్, ఆరోగ్యశాఖ అధికారులు ఈ బృందంలో ఉన్నారు. విదేశీ పర్యటనను ముగించుకుని ఆదివారం ఉదయం ఈ బృందం చెన్నైకు చేరుకుంది. తమ పర్యటన గురించి మీడియాతో మేయర్ ప్రియ మాట్లాడుతూ, వేస్ట్ మేనేజ్ మెంట్ గురించి ఈ పర్యటనలో సమగ్రంగా అధ్యయనం చేశామన్నారు. చెన్నై కార్పొరేషన్‌లో వేస్ట్ మేనేజ్‌మెంట్ సవాల్‌గా మారి ఉందన్నారు. సీఎం స్టాలిన్ చెన్నైను సింగారంగా తీర్చిదిద్దేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారని గుర్తుచేశారు. అందుకే తాము ఈ పర్యటన ద్వారా పలు అంశాలను అధ్యయనం చేశామన్నారు. ఇటలీలో ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్త ద్వారా జరుగుతున్న ప్రత్యేక విధానాన్ని పరిశీలించామన్నారు. ఈ విధానం చెన్నైలో అమలు చేయడం ద్వారా ప్లాస్టిక్ వ్యర్థాల తొలగింపునకు మార్గం లభించినట్టేనని పేర్కొన్నారు. స్పెయిన్‌లో వేస్ట్ మేనేజ్ మెంట్‌లో చెత్త సేకరణ లారీల ద్వారా జరుగుతున్నా, సేకరణ సమయంలో వేర్వేరుగా చెత్తను విభజించడం జరుగుతోందన్నారు. అలాగే, ఫ్రాన్స్‌లో వేస్ట్‌టూ ఎనర్జీ పేరిట పథకం అమల్లో ఉందని, ఇది ఎంతో ఉపయోగకరంగా ఉందన్నారు. చెన్నైశివారులోని కొడుంగయూరు డంపింగ్ యార్డ్‌లో ఈ పథకం అమలుకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నామన్నారు.

సీఎం ట్రోఫీకి వేళాయే!

• జూలై 1 నుంచి చెన్నైలో రాష్ట్ర స్థాయి పోటీలు
• 25రోజుల పాటు క్రీడా సంబరం
• 30న నెహ్రూ స్టేడియంలో ప్రారంభోత్సవం
• ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి ఉదయనిధి స్టాలిన్


ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి ఉదయనిధి స్టాలిన్

సాక్షి, చెన్నై:సీఎం ట్రోఫీ రాష్ట్ర స్థాయి పోటీల సమయం ఆసన్నమైంది. జూలై 1 నుంచి చెన్నైలో 17 చోట్ల క్రీడాసంబరాలు 25రోజుల పాటు జరగనున్నాయి. ఇందుకోసం చేసిన ఏర్పాట్లను ఆదివారం క్రీడల శాఖ మంత్రి ఉదయనిధి స్టాలిన్ పరిశీలించారు. ఈనెల 30న నెహ్రూ ఇండోర్ స్టేడియంలో ప్రారంభోత్సవ కార్యక్రమం జరగనుంది. ఈ పోటీలకు రాష్ట్ర వ్యాప్తంగా 27 వేల మంది క్రీడాకారులు తరలిరానున్నారు.

రాష్ట్ర ప్రభుత్వం మొదటి నుంచి క్రీడలకు ప్రత్యేక ప్రాధాన్యతను ఇస్తున్న విషయం తెలిసిందే. అలాగే, క్రీడాకారులను ప్రోత్సహించే విధంగా ప్రత్యేక నిధులు అందజేస్తున్నారు. అంతర్జాతీయ, జాతీయస్థాయి క్రీడలకు తమిళనాడును వేదికగా తీర్చిదిద్దేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. గత ఏడాది మహాబలిపురం వేదికగా అంతర్జాతీయ స్థాయి చెస్ పోటీలను విజయవంతం చేశారు. అలాగే, ఈనెల చెన్నైలో అంతర్జాతీయస్థాయిలో స్క్వాష్ పోటీలు విజయవంతం అయ్యాయి. తమిళనాడును జాతీయ, అంతర్జాతీయ పోటీలకు వేదికగా ఎంపిక చేసుకోవాలని, అన్ని రకాల వసతులు సమకూర్చేందుకు తాము సిద్ధం అని ఇప్పటికే సీఎం ప్రకటించారు.

జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి పోటీలు..

రాష్ట్రంలోని క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయడంతో పాటు వారికి ప్రోత్సాహాన్ని కల్పించే విధంగా ఈ ఏడాది ఫిబ్రవరిలో సీఎం ట్రోఫీ టోర్నమెంట్లకు శ్రీకారం చుట్టారు. నెల రోజులకు పైగా రాష్ట్ర వ్యాప్తంగా గ్రామీణ, తమిళ సంప్రదాయ క్రీడలు కబడ్డీ, కర్రసాములతో పాటుగా 15 రకాల అథ్లెటిక్స్‌లతో పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో 3 లక్షల మంది క్రీడాకారులు తమ ప్రతిభను చాటుకున్నారు. వీరిలో ఆయా విభాగాల వారీగా జిల్లా స్థాయిలో క్రీడాకారులను ఎంపిక చేశారు. వీరికి రాష్ట్ర స్థాయిలో పోటీలను నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. అన్ని జిల్లాల నుంచి 27 వేల మంది క్రీడాకారులు ఎంపికయ్యారు. వీరికి రాష్ట్ర స్థాయి పోటీలు జూలై 1 నుంచి 25వ తేదీ వరకు చెన్నై వేదికగా జరగనున్నాయి. ఇందుకోసం 17 మైదానాలను సిద్ధం చేశారు. సీఎం ట్రోఫీ 2023 పేరిట ఈ రాష్ట్ర స్థాయి పోటీల ప్రారంభోత్సవం ఈనెల 30న నెహ్రూ ఇండోర్‌స్టేడియంలో జరగనున్నది. క్రీడాకారులు పోటీలకు తరలి వస్తుండడంతో వారికి కావాల్సిన ఏర్పాట్లపై క్రీడాశాఖ దృష్టి పెట్టింది.

ప్రత్యేక ఏర్పాట్లు...

రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి తరలి వచ్చే క్రీడాకారులు, శిక్షణ అందించే వారు మూడు వారాలకు పైగా చెన్నైలో బస చేయాల్సి ఉంది. దీంతో వీరికి బస, భోజన వసతుల నిమిత్తం ఏర్పాట్లు చేపట్టారు. చెన్నైలోని ప్రభుత్వ అతిథిగృహాలు, ఆయా క్రీడా మైదానాల పరిసరాలలోని హోటళ్లల్లో గదులను సిద్ధం చేశారు. క్రీడాకారులకు అవసరమైన అన్ని రకాల వసతులతో 2 వేల గదులను సిద్ధం చేశారు. అలాగే మేల కోట్టైలోని క్రీడా వర్సిటీ హాస్టల్‌ను క్రీడాకారులకు కేటాయించారు. క్రీడాకారులకు మూడు పూటల ఆహారం, స్నాక్స్ వంటి వాటిని అందజేయనున్నారు. చెన్నై వేదికగా 17 చోట్ల జరగనున్న 44వ సీఎం ట్రోఫీ పోటీలను విజయవంతం చేసే విధంగా చేసిన ఏర్పాట్లను ఆదివారం క్రీడల శాఖ మంత్రి ఉదయ నిధి స్టాలిన్ పరిశీలించారు. నెహ్రూ ఇండోర్ స్టేడియం, మేయర్ రాధాకృష్ణన్, రాజరత్నం స్టేడియం ప్రాంతాలలో పర్యటించారు. మరింతగా ఏర్పాట్లు విస్తృతం చేయాలని అధికారులను ఆదేశించారు.

రాజధానిలో వీపీ సింగ్ విగ్రహం

• మాజీ ప్రధాని జయంతి సందర్భంగా సీఎం స్టాలిన్ నిర్ణయం
• ఆయన సామాజిక సేవకు గుర్తింపు


వీపీ సింగ్, సీఎం స్టాలిన్ (ఫైల్)

సాక్షి, చెన్నై: భారత మాజీ ప్రధాని వీపీ సింగ్‌కు చెన్నై రాజధాని కళాశాల ఆవరణలో విగ్రహం ప్రతిష్టించేందుకు సీఎం స్టాలిన్ నిర్ణయించారు. ఆయన జయంతిని పురస్కరించుకుని ఆదివారం ఈ ప్రకటనను సీఎం చేశారు. ప్రధానమంత్రిగా వీపీ సింగ్ 11 నెలల కాలం పదవిలో ఉన్నా, సామాజిక న్యాయం దిశగా అడుగులు వేసి అందరి మన్ననలు పొందారని గుర్తు చేశారు. ఉద్యోగాలలో గిరిజనులకు ప్రత్యేక రిజర్వేషన్లు, వెనుకబడిన సామాజిక వర్గానికి జనాభా సంఖ్య ఆధారంగా రిజర్వేషన్లు కల్పించారని వివరించారు. వీపీసింగ్‌కు తమిళనాడులో ప్రత్యేక అనుబంధం ఉందన్నారు. తన రక్త సంబంధీకులు నివసించే రాష్ట్రంగా తమిళనాడును ఆయన భావించే వారని గుర్తు చేశారు. కావేరి జలవివాదంలో, శ్రీలంకతో ఎదురైన సమస్య పరిష్కారంలో ఆయన కీలక పాత్ర పోషించడమే కాదు, దివంగత నేత కరుణానిధి సలహాలు, సూచనలు అనుసరించే వారని వివరించారు. చెన్నై విమానాశ్రయం స్వదేశీ టెర్మినల్‌కు కామరాజర్, విదేశీ టెర్మినల్‌కు అన్నా పేర్లు పెట్టాలిన కోరగానే, తక్షణం స్పందించిన వ్యక్తి వీపీ సింగ్ అని కొనియాడారు. తమిళనాడుపై ఎంతో అభిమానం కలిగిన ఆ నేతను స్మరిస్తూ బ్రహ్మాండంగా, గంభీరంగా కనిపించే విధంగా చెన్నైలో వీపీసింగ్ నిలువెత్తు విగ్రహం ప్రతిష్టించబోతున్నామని ప్రకటించారు. ఇదే ఆయనకు తమిళ ప్రజల తరఫున ఇస్తున్న గౌరవంగా పేర్కొన్నారు. ఆయన సేవలకు కృతజ్ఞతలు తెలిపే విధంగా, ఆయన గురించి భావితరాలకు తెలియజేయడం లక్ష్యంగా చెన్నై రాజధాని కళాశాలలో ఈ విగ్రహం ఏర్పాటు చేయనున్నామన్నారు.

పోలీసు అధికారులకు సీఎం పతకాలు..

మాదక ద్రవ్యాల వ్యతిరేకత దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉత్తమ సేవలను అందించిన పోలీసు అధికారులకు సీఎం పతకాలను ప్రకటించారు. ఇందుకు సంబంధించిన ప్రకటనను సీఎం స్టాలిన్ విడుదల చేశారు. మాదక ద్రవ్యాల అక్రమ రవాణా కట్టడిలో విశేష సేవలు అందించిన వారికి ఈ పతకాలను ప్రకటించారు. ఇందులో కోయంబత్తూరు ఎస్పీ బద్రినారాయణన్, తేని జిల్లా ఎస్పీ డి.ప్రవీణ్ ఉమేష్, సేలం సబ్ డివిజన్ రైల్వే డీఎస్పీ ఎం గుణశేఖరన్, నామక్కల్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఎస్ మురుగన్, నామక్కల్ గ్రేడ్ 1 పోలీస్ ఆర్ కుమార్ ఉన్నారు. అలాగే, మాదక ద్రవ్యాల కట్టడితో పాటు అవగాహన కార్యక్రమాలతో ముందుకు దూసుకెళ్లిన మదురై సౌత్‌జోన్ ఐజీ అస్రాకార్గ్‌కు ప్రత్యేక పతకం అందజేయనున్నట్టు ప్రకటించారు. వీరికి ఆగస్టు 15వ తేదీ జరిగే స్వాతంత్ర్య దినోత్సవంలో పతకాలను ప్రదానం చేయనున్నారు.

అళగిరికి పదవీ గండం తప్పదా?

• రేసులో ఐదుగురు నేతలు
• టీఎన్‌సీసీ కొత్త అధ్యక్షుడు ఎవరో?



సాక్షి, చెన్నై: తమిళనాడు కాంగ్రెస్‌కు కొత్త అధ్యక్షుడు ఎవరో అనే చర్చ పార్టీలో బయలుదేరింది. ఐదేళ్ల పదవీకాలం ముగియడంతో ప్రస్తుత అధ్యక్షుడు కేఎస్ అళగిరిని తప్పించేందుకు కాంగ్రెస్ అధిష్టానం నిర్ణయించినట్టు తెలిసింది. దీంతో పదవిని చేజిక్కించుకునేందుకు రేసులో ఐదుగురు నేతలు ఉన్నారు. రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడిగా అళగిరి ఐదేళ్ల పాటు కొనసాగారు. కాంగ్రెస్‌లో మూడేళ్లకు ఒకసారి అధ్యక్ష మార్పు జరిగేది. అయితే, అళగిరి పనితీరును మెచ్చి ఆయన్ను అదనంగా మరో రెండేళ్లు కొనసాగించారు. డీఎంకేతో సఖ్యతగా ఉంటూ వచ్చిన అళగిరి ఒక లోక్‌సభ, ఒక అసెంబ్లీ ఎన్నికలతో పాటు స్థానిక, నగర పాలక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థుల విజయానికి కృషిచేశారు. ఈ పరిస్థితులలో తమిళనాడుతో పాటు నాలుగు రాష్ట్రాలలో దీర్ఘ కాలంగా అధ్యక్షుడిగా ఉన్న వారిని చార్చేందుకు అధిష్టానం నిర్ణయించడం గమనార్హం.

ఢిల్లీకి అళగిరి..

కొత్త అధ్యక్షుడి ఎంపిక కసరత్తులను ఢిల్లీలో కాంగ్రెస్ అధిష్టానం ప్రారంభించినట్టు సమాచారం. దీంతో ఆ పదవిని దక్కించుకునేందుకు నలుగురు ఎంపీలు, ఒక మాజీ ఎంపీ ప్రయత్నాలు చేపట్టి ఉండడం గమనార్హం. ఇందులో ఎంపీలు చెల్లకుమార్, జ్యోతిమణి, తిరునావుక్కరసర్ ఉన్నట్టు తెలిసింది. అలాగే, మాజీ ఎంపీ విశ్వనాథన్ సైతం ప్రయత్నాల్లో ఉండడం గమనార్హం. తిరునావుక్కరసర్ గతంలో అధ్యక్షుడిగా పనిచేసిన అనుభవం ఉంది. రాహుల్‌గాంధీ మద్దతు కలిగిన ఎంపీ జ్యోతిమణి సైతం అవకాశం కోసం ఎదురు చూస్తున్నారు. అయితే, అధ్యక్షుడిగా ఎవరిని ఎంపిక చేసినా డీఎంకేతో సన్నిహితంగా మెలిగే నేతై ఉండాలన్న సలహాను కాంగ్రెస్ సీనియర్లు అధిష్టానానికి సూచించే పనిలోపడ్డారు. అళగిరి హుటాహుటినా ఢిల్లీకి ఆదివారం సాయంత్రం బయలుదేరి వెళ్లడంతో ఆయనకు మరో అవకాశం దక్కేనా లేదా కొత్త వారికి పదవి కట్టబెట్టేనా అన్నది వేచిచూడాల్సిందే.

చెన్నై సోమవారం, 26, జూన్, 2023 సాక్షి

క్లుప్తంగా

విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ



విద్యా సామగ్రి అందజేస్తున్న మంత్రి శేఖర్‌బాబు, కిషోర్

కొరుక్కుపేట: ఇమ్మిడి కిషోర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. ప్యారిస్‌లోని కన్యకా పరమేశ్వరి మహిళా కళాశాల ప్రాంగణంలో ఇమ్మిడి కిషోర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో దేవదాయశాఖా మంత్రి పి కె శేఖర్‌బాబు పాల్గొని 600 మంది పేద విద్యార్థులకు స్కూల్ బ్యాగ్, నోట్ పుస్తకాలు, పెన్నులు, లంచ్ బాక్స్‌లను అందజేశారు. అనంతరం అన్నదానం చేశారు. చెన్నై నేషనల్ ఆస్పత్రి ఎండీ జి సురేష్, సునీల్ సేతియా, అశోక్, కె రవికుమార్, వళ్లం రాజశేఖర్, ట్రస్ట్ సభ్యులు షర్మిల, ధీరజ్ పాల్గొన్నారు.

ఘనంగా తెలుగు తరుణి వార్షికోత్సవం



రామలక్ష్మితో రమణి, సభ్యులు

కొరుక్కుపేట: తెలుగు భాష, సాహిత్య వికాసానికి పాటుపడుతున్న తెలుగు తరుణి సంస్థ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ వేడుకలకు తెలుగు తరుణి అధ్యక్షురాలు కె.రమణి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సాహిత్యానికి విశేష సేవలను అందిస్తున్న ప్రముఖ రచయిత్రి గుమ్మడి రామలక్ష్మికి తెలుగు తరుణి తరపున శ్రీకాంత బిరుదును ప్రదానం చేశారు. రమణి మాట్లాడుతూ తెలుగు భాషను పరిరక్షించడమే లక్ష్యంగా ఈ తెలుగు తరుణి స్థాపించినట్లు తెలిపారు. మహిళ అభ్యున్నతి, మనోవికాశానికి సహాయపడు తున్నామని అన్నారు. రామలక్ష్మి మాట్లాడుతూ తెలుగు కోసం విశేషంగా కృషి చేయడం అభినందనీయమన్నారు. నృత్య గురువు అపర్ణ సుదీష్ నేతృత్వంలో సభ్యులు చేసిన సాంస్కృతిక ప్రదర్శన అలరించింది. రెయిన్‌బో ఆస్పత్రి దంత వైద్యురాలు డాక్టర్ పావని, మాజేటి జయశ్రీ, శైలజ, కోశాధికారి మాజేటి అపర్ణ పాల్గొన్నారు.

తిరుత్తణిలో భక్తుల రద్దీ



అలంకరణలో సుబ్రహ్మణ్యస్వామి



తిరుత్తణి కొండ ఆలయంలో భక్తజనం

తిరుత్తణి: తిరుత్తణి సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. తిరుత్తణి సుబ్రహ్మణ్యస్వామి ఆలయానికి ప్రతిరోజూ వేలాది మంది భక్తులు వచ్చి స్వామిని దర్శించుకుని తమ మొక్కులు చెల్లిస్తుంటారు. ఆదివారం సెలవు కావడంతో ఉదయం నుంచే కొండ ఆలయానికి భక్తుల తాకిడి పెరిగింది. మెట్ల మార్గంతో పాటు ఘాట్‌రోడ్డు మార్గంలో భక్తులు కొండకు చేరుకున్నారు. రూ.100 ప్రత్యేక దర్శన మార్గంతో పాటు ఉచిత దర్శన మార్గాలు నిండాయి. మాడ వీధుల్లో భక్తుల రద్దీ నెలకొంది. రూ.100 ప్రత్యేక మార్గంలో రెండు గంటలు, ఉచిత మార్గంలో మూడు గంటల పాటు భక్తులు వేచివుండి స్వామి వారిని దర్శించుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు 40 వేల మంది స్వామిని దర్శించుకున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

సేవాలయ విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ



సైకిల్‌ను పంపిణీ చేస్తున్న డీఆర్వో అశోకన్

తిరువళ్లూరు: సుదూర ప్రాంతాల నుంచి సేవాలయ పాఠశాలకు వచ్చే 94 మంది విద్యార్థులను గుర్తించి వారికి ఉచితంగా సైకిళ్లను డబ్ల్యూసీజీ సంస్థ అందజేసింది. తిరువళ్లూరు జిల్లా కసువ గ్రామంలో సేవాలయ స్వచ్ఛంద సంస్థ వుంది. ఇక్కడ 2500 మంది విద్యార్థులకు ఉచిత విద్య అందిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇంటి నుంచి 4 నుంచి 8 కిమీ దూరం ప్రయాణం చేసి పాఠశాలకు వచ్చే సేవాలయ విద్యార్థులు 94 మంది ఉన్నట్టు నిర్ధారించారు. వీరికి ఉయ్ ఆర్ చెన్నై సైక్లింగ్ గ్రూప్ సంస్థ ఉచితంగా సైకిల్‌ను పంపిణీ చేయడానికి ముందుకొచ్చింది. ఈ నేపథ్యంలో అర్హులైన విద్యార్థులకు ఉచితంగా సైకిళ్లను అందజేసే కార్యక్రమం ఆదివారం ఉదయం సేవాలయ సంస్థ ఆవరణంలో జరిగింది. సంస్థ అధ్యక్షుడు మురళీధరన్ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా డీఆర్వో విశాఖన్ హాజరై సైకిల్‌ను అందజేశారు. నిరుపేదలకు సేవ చేయడానికి పలు సంస్థలు ముందుకురావాలి. విద్యార్థులు సైతం సైక్లింగ్ చేయడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారని డీఆర్వో వ్యాఖ్యానించారు. సంస్థ నిర్వాహకుడు దివాకరన్, అనిల్, సేవాలయ సిబ్బంది కింగ్‌స్టన్, ఆనందన్, విజయ, నిర్మల పాల్గొన్నారు.

శ్రీకాళహస్తీశ్వర శతకం అజరామరం



వక్త పొన్నూరు వెంకట శ్రీనివాసులును సత్కరిస్తున్న జేకే రెడ్డి, మధు

కొరుక్కుపేట: భక్తి కావ్యాలలో మహాకవి ధూర్జటి రచించిన శ్రీకాళహస్తీశ్వర మాహత్మ్యం, శ్రీకాళహస్తీశ్వర శతకం అజరామరమైనవని ప్రకాశం జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు, సుమధుర సాహితీభూషణ పొన్నూరు వేంకట శ్రీనివాసులు అన్నారు. ఆంధ్రాక్లబ్‌లో ఆదివారం సాయంత్రం వేద విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో తరతరాల తెలుగు కవిత శీర్షికన ఏర్పాటుచేసిన 138వ ఉపన్యాస కార్యక్రమం జరిగింది. శ్రీకాళహస్తీశ్వర మహత్మ్యం పద్యకావ్యంపై వక్తగా పాల్గొన్న పొన్నూరు వేంకట శ్రీనివాసులు ప్రసంగించారు. పొన్నూరు వెంకట శ్రీనివాసులు తమ ఉపన్యాసం ద్వారా వినిపించి ప్రేక్షకుల అభినందనలు, కరతాల ధ్వనులు అందుకున్నారు. వేదిక కార్యదర్శి కందనూరు మధు, వేదిక అధ్యక్షుడు జేకే రెడ్డి వక్తను సత్కరించారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానా

తిరుత్తణి: నిబంధనలు ఉల్లంఘించి వాహనాలు నడిపితే జరిమానాతో పాటు కేసు నమోదు చేస్తామని ట్రాఫిక్ సీఐ జ్ఞానతి హెచ్చరించారు. తిరుత్తణిలోని చిత్తూరు రోడ్డు, చెన్నై బైపాస్, అరక్కోణం రోడ్డు సహా ప్రధాన మార్గాల్లో ట్రాఫిక్ సీఐ జ్ఞానతి ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీసులు ముమ్మరంగా వాహన తనిఖీలు చేపట్టారు. నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపిన వారికి జరిమానా విధించడంతో పాటు 18 ఏళ్ల లోబడిన వారు వాహనాలు నడపరాదని, ద్విచక్రవాహనాల్లో ప్రయాణించే ప్రతి ఒక్కరూ హెల్మెట్ తప్పనిసరిగా ఉపయోగించాలని సూచించారు. వాహనాలు నడిపే సమయంలో సెల్‌ఫోన్లలో మాట్లాడడం నేరమని అందుకు జరిమానాతో పాటు శిక్ష పడుతుందని హెచ్చరించారు.



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ సీఐ జ్ఞానతి

వైభవంగా మహాకుంభాభిషేకం





పవిత్ర పుణ్యతీర్థాలు కలశాలు, పెద్ద ఓసూరమ్మకు పవిత్ర పుణ్యతీర్థాలతో మహాకుంభాభిషేకం

పళ్లిపట్టు: పెద్ద ఓసూరమ్మ ఆలయ మహాకుంభాభిషేకం ఆదివారం ఉదయం వైభవంగా నిర్వహించారు. పళ్లిపట్టు యూనియన్ పెరమానల్లూరు పంచాయతీలోని కన్నికాపురం కుశస్థలి నదీ తీరంలో పెద్ద ఓసూరమ్మకు గ్రామీణుల విరాళాలతో నూతన ఆలయం నిర్మించారు. ఆలయ నిర్మాణ పనులు పూర్తికావడంతో శుక్రవారం నుంచి ఆదివారం వరకు మహాకుంభాభిషేకం వేడుకలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయంతో పాటు గ్రామ వీధులు విద్యుద్దీపాలతో సర్వాంగసుందరంగా అలంకరించారు. ఆలయ ప్రాంగణంలో యాగశాలలు ఏర్పాటు చేసి నిత్యహోమగుండ పూజలు చేశారు. ఆదివారం ఉదయం 10 గంటలకు మహాపూర్ణాహుతి పూజలు అనంతరం మంగళ వాయిద్యాలతో అశేష భక్తజనం నడుమ పవిత్ర పుణ్యతీర్థాల కలశాలు బయల్దేరి అమ్మవారి విగ్రహానికి మహాకుంభాభిషేకం చేపట్టి భక్తులపై పుణ్యతీర్థాలు వెదజల్లారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

దుర్యోధన వధ ప్రదర్శిస్తున్న కళాకారులు



ఆకట్టుకున్న దుర్యోధన వధ

పళ్లిపట్టు: వడకుప్పంలో ద్రౌపదీదేవి ఆలయ అగ్నిగుండ వేడుకల్లో భాగంగా ఆదివారం ఉదయం దుర్యోదన వధ ప్రదర్శన ఆహూతులను ఆకట్టుకుంది. పళ్లిపట్టు యూనియన్ వడకుప్పంలోని ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయ అగ్నిగుండ వేడుకలను ప్రతి ఏటా వడకుప్పం, స్వామినాయుడుకండ్రిగ, గొల్లకుప్పం, మునిస్వామినాయుడు కండ్రిగ గ్రామాలకు చెందిన ప్రజలు వేడుకగా నిర్వహించడం పరిపాటి. ఈ ఏడాది జూన్ 14న ధ్వజారోహణంతో అగ్నిగుండ వేడుకలు ప్రారంభమయ్యాయి. వేడుకల్లో 12వ రోజైన ఆదివారం ఉదయం దుర్యోధన వధ నాటక ప్రదర్శనకు ఆలయ ప్రాంగణంలో బంకమట్టితో దుర్యోధనుడి విగ్రహాన్ని ప్రతిష్టించారు. దుర్యోధనుడు, భీముడు వేషదారణ చేసిన కళాకారులు నాటకం ప్రదర్శించి ఆహూతులను ఆకట్టుకున్నారు. సాయంత్రం అగ్నిగుండ ప్రవేశం విద్యుద్దీపాలంకరణలో కనులవిందుగా నిర్వహించి భక్తులు అగ్నిగుండ ప్రవేశం చేసి తమ మొక్కులు చెల్లించారు. పంచాయతీ సర్పంచ్ ఎస్. శరణ్య, మాజీ సర్పంచ్ కుప్పయ్యనాయుడు పాల్గొన్నారు. ఉత్సవ వేడుకలను ధర్మకర్త ఏకనాథనాయుడు ఆధ్వర్యంలో గ్రామీణులు విజయవంతంగా నిర్వహించారు.



భారీ సంఖ్యలో పాల్గొన్న మహిళలు

మణిరత్నం చిత్రంలో శింబు?



మణిరత్నంతో శింబు

తమిళసినిమా: మల్టీ స్టార్స్‌ను సెట్ చేయడంలోనూ, రేర్ కాంబినేషన్లో చిత్రాలు చేయడంలోనూ దర్శకుడు మణిరత్నం దిట్ట. ఈయన చాలా కాలం క్రితమే రజనీకాంత్, మమ్ముట్టి, అరవిందస్వామి కథానాయకులుగా దళపతి, కార్తీక్, ప్రభు హీరోలుగా అగ్నినక్షత్రం, శింబు, అరవిందస్వామి, విజయ్‌సేతుపతి హీరోలుగా చెక్క చివంద వానం వంటి మల్టీ స్టారర్ చిత్రాలను తెరకెక్కించి సక్సెస్ సాధించారు. ఇక ఇటీవల విక్రమ్, జయంరవి, కార్తీ, శరత్‌కుమార్, ప్రకాష్‌రాజ్, విక్రమ్ ప్రభు, ఐశ్వర్య రాయ్, త్రిష వంటి స్టార్ నటినటులతో రూపొందించిన పొన్నియిన్ సెల్వన్ వంటి చారిత్రక కథా చిత్రాన్ని రెండు భాగాలుగా తెరకెక్కించి విజయాన్ని అందుకున్నారు. తాజాగా నటుడు కమలహాసన్ హీరోగా భారీ చిత్రాన్ని చేయడానికి సిద్ధమవుతున్నారు. ఇది కమలహాసన్ నటించిన 234వ చిత్రం అవుతుంది. ప్రస్తుతం ఈ చిత్రం ప్రీ ప్రొడక్షన్ కార్యక్రమాల్లో ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో మణిరత్నం మరో చిత్రానికి కమిట్ అయినట్లు వార్త సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. ఇందులో సంచలన నటుడు శింబు కథానాయకుడుగా నటించనున్నట్లు సమాచారం. ఇది ఆయన 50వ చిత్రం అవుతుందన్నది గమనార్హం. ప్రస్తుతం కమలహాసన్ నిర్మించనున్న చిత్రంలో శింబు నటించడానికి సిద్ధం అవుతున్నారు. ఇందులోని పాత్ర కోసం లండన్‌లో మేకోవర్ అవుతున్నారు. ఇది ఆయన 48వ చిత్రం అవుతుంది. దీని తరువాత ఐసరి గణేష్ సంస్థకు తన 49వ చిత్రాన్ని చేయనున్నట్లు సమాచారం. ఆ తరువాత మణిరత్నం దర్శకత్వంలో నటించే అవకాశం ఉంది. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉందన్నది గమనార్హం.



కీర్తిసురేష్

రాజకీయ రంగప్రవేశంపై ఆలోచించాలి

తమిళసినిమా: కీర్తి సురేష్ మదిలో చాలా ఆలోచనలు ఉన్నట్టు తెలుస్తోంది. ఒక పక్క నటిగా దూసుకుపోతున్నా, మరోపక్క వదంతులు వలయంలో చిక్కుకుంటున్నారు. ముఖ్యంగా ప్రేమ, ప్రేమికుడు వంటి ప్రచారం ఈమెను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఇలాంటి వార్తలు చదువుతుంటే బాధేస్తుందని కీర్తిసురేషే ఇటీవల స్వయంగా ఒక ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. ఇక కెరీర్ విషయానికి వస్తే ఈ మధ్య తెలుగులో బిజీగా నటించిన ఈ ముద్దుగుమ్మ ఇప్పుడు తమిళంలో పలు చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉన్నారు. ఈమె ఇక్కడ నటిస్తున్న చిత్రాలలో మామన్నన్ ఒకటి. ఉదయనిధి స్టాలిన్‌తో జతకట్టిన ఈ చిత్రం నిర్మాణ కార్యక్రమాలు పూర్తిచేసుకుని ఈనెల 29న తెరపైకి రానుంది. దీంతో కీర్తి సురేష్ ప్రచార కార్యక్రమాల్లో ముమ్మరంగా పాల్గొంటున్నారు. ఇటీవల ఒక ఇంటర్వ్యూలో పేర్కొంటూ మామన్నన్ ఒక రాజకీయ నేపథ్యంలో సాగే కథా చిత్రం అని చెప్పారు. ఇందులో తనది చాలా సీరియస్ పాత్ర అని తెలిపారు. సమీకాలంలో తనకు ఈ తరహా పాత్రలే వస్తున్నాయన్నారు. ఇక రాజకీయాల్లోకి వచ్చే ఆలోచన ఉందా అని అడుగుతున్నారని, ఆ విషయం గురించి ఆలోచించాలని అన్నారు. ఈ చిత్రంలో ఉదయనిధి స్టాలిన్‌తో కలిసి నటించడం మంచి అనుభవం అని పేర్కొన్నారు. ఆయన చాలా జాలీ పర్సన్ అని, సెట్‌లో నవ్వుతూ అందర్నీ నవ్విస్తూ ఉంటారని అన్నారు. తర్వాత తాను నటించిన వినోదభరితంగా కథా చిత్రం విడుదల కానుంది అని చెప్పారు. ప్రతి చిత్రంలోనూ అంకితభావంతో నటిస్తున్నానన్నారు. రాజమౌళి, శంకర్ వంటి దర్శకుల చిత్రాల్లో నటించాలని ఆశిస్తున్నట్లు కీర్తి సురేష్ పేర్కొన్నారు.

కోలీవుడ్ టాక్స్

ఐశ్వర్య అర్జున్ పెళ్లి కూతురాయనే!

తమిళసినిమా: సినిమాలో వారసత్వం అన్ని వేళలా, అందరికీ వర్కౌట్ కాదు. ప్రతిభతో పాటు అదృష్టం చాలా అవసరం. ఇందుకోసం చాలా మంది వారసులు పోరాడుతూనే ఉన్నారు. మచ్చుకో ఉదాహరణ నటుడు అర్జున్ వారసురాలు ఐశ్వర్యనే. ఈమె తండ్రి వారసత్వంతో 2013లో పట్టత్తు యానై చిత్రం ద్వారా కథానాయికగా కోలీవుడ్లో పరిచయం అయ్యారు. విశాల్ హీరోగా నటించిన ఆ చిత్రం నిరాశనే మిగిల్చింది. ఈ తరువాత ఈమెను పట్టించుకునే వారే లేకపోయారు. దీంతో తన కూతురి కోసం అర్జునే రంగంలోకి దిగి సొల్లితరవా అనే చిత్రాన్ని రూపొందించారు. 2018 విడుదల అయిన ఈ చిత్రం ఆశించిన విజయాన్ని సాధించలేదు. ఇక ఇటీవల తన కూతురు హీరోయిన్‌గా తెలుగులో ఒక చిత్రం చేయ తలపెట్టారు. అదీ నటుడు విశ్వక్‌సేన్‌తో విభేదాల కారణంగా ఆదిలోనే ఆగిపోయింది. ఇలాంటి పరిస్థితుల్లో నటి ఐశ్వర్య అర్జున్ పెళ్లి పీటలు ఎక్కడానికి సిద్ధం అవుతోందనే వార్త జోరందుకుంది. ఈమె నటుడు తంబిరామయ్య కుమారుడు, నటుడు ఉమాపతి చాలాకాలంగా ప్రేమలో ఉన్నారట. దర్శకత్వం నుంచి నటుడిగా అవతారమెత్తిన తంబిరామయ్య బిజీ నటుడు. అయితే వారసుడు ఉమాపతి పరిస్థితి ఇంకా సక్సెస్ కోసం ఎదురుచూస్తునే ఉన్నారు. రెండు మూడు చిత్రాలు చేసినా ఇంకా బ్రేక్ రాలేదు.కాగా ఉమాపతి, ఐశ్వర్య అర్జున్ ఇరుకుటుంబాల అనుమతితో పెళ్లికి సిద్ధమైనట్లు తెలుస్తోంది. దీని గురించి అధికారిక ప్రకటన త్వరలో వెలువడే అవకాశం ఉంది.



ఉమాపతితో ఐశ్వర్య అర్జున్

కలైంజర్ నగర్ చిత్ర యూనిట్



23 గంటల్లో చిత్రీకరించిన కలైంజర్ నగర్

తమిళసినిమా: ఈతరం దర్శకులు సినిమాని చాలెంజ్‌గా తీసుకుంటున్నారు. ప్రయోగాలతో గిన్నీస్ రికార్డులను సాధిస్తున్నారు. ఆ కోవలో తెరకెక్కిన చిత్రం కలైంజర్‌నగర్. దీనికి సుగన్ కుమార్ కథ, కథనం దర్శకత్వం బాధ్యతలను నిర్వహించారు. ఈయన ఇంతకుముందు పోదాం అనే చిత్రాన్ని 23 గంటల 23 నిమిషాల్లో తెరకెక్కించారు. తన రికార్డును తానే బ్రేక్ చేస్తూ 23 గంటల 7 నిమిషాలకు ముందే పూర్తి చేయడం విశేషం. కాగా ఎస్ఆర్ ఫిలిమ్ ఫ్యాక్టరీ పతాకంపై శివరాజ్ నిర్మించిన ఈ చిత్రానికి గాయత్రి సుగన్ లైన్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరించారు. ఇందులో నటుడు ప్రాజన్, నటి ప్రియాంక హీరో హీరోయిన్లుగా నటించగా, నటుడు లివింగ్ స్టన్, పుగళ్ ముఖ్యపాత్రలు పోషించారు. నరేశ్ సంగీతాన్ని, ఇళయరాజా ఛాయాగ్రహణంను అందించారు. ఈ చిత్ర మీడియా సమావేశాన్ని శనివారం సాయంత్రం చెన్నైలో ని ప్రసాద్ ల్యాబ్ నిర్వహించారు. కార్యక్రమంలో బుల్లితెర నటీనటుల సంఘం అధ్యక్షుడు దళపతి పాల్గొని చిత్ర యూనిట్‌ను అభినందించారు. ముందుగా చిత్ర దర్శకుడు సుగన్‌కుమార్ మాట్లాడుతూ పెద్ద పెద్ద దర్శకులు భారీ చిత్రాలను తెరకెక్కిస్తానని, తాను ఈ చిన్న చిత్రాన్ని భారీగా రూపొందించినట్లు చెప్పారు. ఇది పూర్తిగా స్టేజీ నృత్య కళాకారుల ఇతివృత్తంతో రూపొందించిన కథా చిత్రం అని తెలిపారు. ఇందులో మూడు పాటలు, రెండు ఫైట్స్ ఉంటాయని చెప్పారు. చిత్ర షూటింగ్‌ను 23 గంటల్లో పూర్తి చేసిన ఘనత తనది మాత్రమే కాదని దీనికి పనిచేసిన అందరికీ చెందుతుందని పేర్కొన్నారు. ప్రియాంక మాట్లాడుతూ తాను ఇంతకు ముందు నటించిన మిగమిగ అవసరం ప్రేక్షకుల మధ్య పలు అవార్డులను తెచ్చి పెట్టిందన్నారు. అలాంటిది అంతకంటే వేగంగా 23 గంటల్లో తెరకెక్కడం విశేషం అన్నారు.

చర్చకు ఫుల్‌స్టాప్ పెట్టిన రష్మిక

తమిళసినిమా: నిత్యం వార్తల్లో ఉండే నటీమణుల్లో రష్మికమందన్న ఒకరని గట్టిగా చెప్పవచ్చు. మాతృభాషలో అవకాశం కల్పించిన తొలి చిత్ర దర్శకుడి నుంచే విమర్శలను ఎదుర్కొన్న కన్నడ నటి ఈమె. టాలీవుడ్‌లో నటిస్తున్న చిత్రాలు వరుసగా విజయాలు సాధించడంతో ఒక్కసారిగా స్టార్ ఇమేజ్‌ను సొంతం చేసుకున్న నటి రష్మిక. దీంతో బాలీవుడ్ కూడా ఎగబాకింది. అయితే ప్రస్తుతం అక్కడ పరిస్థితి ఆశాజనకంగా లేదు. ఇప్పుడు మళ్లీ టాలీవుడ్‌కే తిరుగు ముఖం పట్టిందంటున్నాయి సినీ వర్గాలు. ఇకపోతే తాజాగా రష్మిక చిక్కుకున్న మరో వివాదం ఏమిటంటే ఈమెకు మొదటి నుంచి మేనేజర్‌గా ఉంటూ ఆమె ఎదుగుదలకు తోడ్పడిన వ్యక్తి మోసానికి పాల్పడ్డాడని ఆరోపణలు చేసింది. తన మేనేజర్ రూ.80 లక్షలు కాజేయంతో అతడిని తప్పించినట్లు ప్రచారం ఒక్కసారిగా వైరల్ అయ్యింది. దీనికి తాను ఎలాంటి మోసానికి పాల్పడలేదని ఆ మేనేజర్ కౌంటర్ ఇచ్చినట్లు ప్రచారం జరిగింది. ఇలాంటి పరిస్థితుల్లో రష్మిక ఎందుకొచ్చిన గొడవలే అనుకుందో ఏమో రాజీమార్గం పట్టింది. ఈ వ్యవహారంపై ఆమె ఒక ప్రకటనలో పేర్కొంటూ తాను తన మేనేజర్ పరస్పరం చర్చించుకునే విడిపోయామని తమ మధ్య ఎలాంటి వివాదం లేదని పేర్కొన్నారు. ఇకపై తామిద్దరం స్వతంత్రంగా పనిచేసుకోవాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. అలా ఈ వివాదానికి ఆమె తెరవేసింది. కాగా ప్రస్తుతం తన కాల్‌షీట్స్ వ్యవహారం రష్మికనే చూసుకుంటోంది. ప్రస్తుతం రష్మిక తెలుగులో పుష్ప–2 చిత్రంతోపాటు, నటుడు నిఖిల్‌కు జంటగా మరో చిత్రం చేస్తోంది. అదేవిధంగా ఒక తమిళ చిత్రానికి కమిట్ అయినట్లు సమాచారం.



రష్మిక మందన్న

క్లుప్తంగా

పన్ను చెల్లింపునకు డిజిటల్ కార్డులు

సాక్షి, చెన్నై: చెన్నై కార్పొరేషన్ పరిధిలో అన్ని రకాల పన్నుల చెల్లింపునకు డిజిటల్ కార్డులను పరిచయం చేయనున్నారు. ఈ పనులను కార్పొరేషన్ అధికారులు వేగవంతం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని నగర పాలక సంస్థలు, కార్పొరేషన్లు, పట్టణ పంచాయతీలు, గ్రామ పంచాయతీలను ఆన్‌లైన్ మయం చేసిన విషయం తెలిసిందే. అన్ని రకాల పన్నుల చెల్లింపుల ప్రక్రియలను ప్రస్తుతం ఆన్‌లైన్ ద్వారా జరిగే విధంగా చర్యలు తీసుకున్నారు. అలాగే, కొన్ని ప్రాంతాల్లో సిబ్బంది ఇళ్ల వద్దకే వెళ్లి వసూళ్లు చేస్తున్నారు. చెన్నైలో అయితే, మొండి బకాయిలను వసూళ్లు చేయడానికి అధికారులు ఆయా భవన యజమానుల ఇళ్లు, కార్యాలయాల వద్దకు వెళ్లి ఒత్తిడి తెస్తున్నారు. ఈ పరిస్థితులలో డిజిటలైజేషన్‌కు అనుగుణంగా పన్నుల చెల్లింపును మరింత సులభతరం చేయడానికి చెన్నైలో తొలి విడతగా డిజిటల్ కార్డుల పంపిణీకి కార్పొరేషన్ సిద్ధమవుతోంది.

ప్రాణం తీసిన ఈత సరదా


ప్రకాష్ (ఫైల్)

తిరుత్తణి: ఈత సరదా ఓ పాఠశాల విద్యార్థి ప్రాణాలు తీసింది. ఈ ఘటన ఆదివారం చోటుచేసుకుంది. ఆర్కేపేట మండలం నారాయణపురం గ్రామ పంచాయతీలోని ఎగ్గాపురం గ్రామానికి చెందిన విజయకుమార్ కుమారుడు ప్రకాష్(15). ఇతను అమ్మయార్‌కుప్పం ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి చదువుతున్నాడు. ఆదివారం సెలవు కావడంతో వారి పొలంలోని బావిలో ఈత నేర్చుకునేందుకు వెళ్లాడు. నడుంకు క్యాన్ కట్టుకుని ఈత నేర్చుకుంటుండగా క్యాన్ విరగడంతో బావిలో గల్లంతయ్యాడు. అక్కడున్న వారు కాపాడే ప్రయత్నం చేసినా మునిగిపోవడంతో అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. షోళింగర్ అగ్నిమాపక శాఖ సిబ్బంది అక్కడికి చేరుకుని బావిలో గల్లంతైన ప్రకాష్ మృతదేహాన్ని వెలికితీశారు. దీంతో విద్యార్థి తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం షోళింగర్ ప్రభుత్వాస్పత్రికి తరలించి ఆర్కేపేట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్లస్ వన్ విద్యార్థిని అదృశ్యం

తిరువళ్లూరు: పాఠశాలకు వెళ్లిన ప్లస్‌వన్ విద్యార్థిని శనివారం సాయంత్రం అదృశ్యమైంది. బాలిక తల్లిదండ్రులు మనవాలనర్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి గాలింపు చర్యలు చేపట్టారు. తిరువళ్లూరు జిల్లా ఒండికుప్పం గ్రామానికి చెందిన మహారాజ్ కుమార్తె వెన్నెల(16). స్థానికంగా వున్న ప్రభుత్వ పాఠశాలలో ప్లస్‌వన్ చదువుతోంది. ఈమె శనివారం పాఠశాలకు వెళ్లి సాయంత్రం తిరిగి రాలేదు. బాలిక ఆచూకీ కోసం బంధువుల ఇంట్లో గాలింపు చర్యలు చేపట్టినా ఫలితం లేకపోవడంతో బాలిక తండ్రి మహారాజ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మనవాలనగర్ పోలీసులు కేసు నమోదు చేసి బాలిక కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

లారీ నుంచి కిందపడి బాలుడు మృతి

తిరువొత్తియూరు: తండ్రి నడుపుతున్న లారీ నుంచి కిందపడి మృతిచెందాడు. ఈ ఘటన విరుదునగర్ జిల్లాలో చోటుచేసుకుంది. విరుదునగర్ జిల్లా పుల్లైకొరై గ్రామానికి చెందిన ముత్తుపాండి (48). ఇతను సెప్టిక్ ట్యాంక్‌ను శుభ్రం చేసే లారీని నడుపుతున్నాడు. ఇతని కుమారుడు బాల్‌రాజ్ (12). కారియాపట్టి ప్రభుత్వ పాఠశాలలో ఆరవ తరగతి చదువుతున్నాడు. ఈక్రమంలో శనివారం ముత్తుపాండి సెప్టిక్ ట్యాంక్ లారీని నడుపుతుండగా బాల్‌రాజ్ లారీ వెనుక నిలబడి వేలాడుతూ వచ్చాడు. కుమారుడిని కిందకు దిగాలని ముత్తుపాండి మందలించాడు. బాల్‌రాజ్ దిగిపోయాడని భావించి ముత్తుపాండి లారీని ముందుకు నడిపాడు. ఆ సమయంలో లారీ వెనుక నిలబడి వున్న బాల్‌రాజ్ కిందపడి మృతిచెందాడు. మృతదేహాన్ని చూసి ముత్తుపాండి కన్నీరుమున్నీరయ్యాడు. ఈ ఘటనపై పోలీసుల కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎలక్ట్రీషియన్ మృతి

• సంస్థపై చర్యలు తీసుకోవాలని భార్య ఫిర్యాదు

తిరువళ్లూరు: రక్షణ కవచం అందించకుండా పనిచేయించి తన భర్త మృతికి కారణమైన సంస్థపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మృతుడి భార్య తాలుకా పోలీసులకు ఫిర్యాదు చేసింది. తిరువళ్లూరు జిల్లా సేలై గ్రామానికి చెందిన కార్తీక్(35). ఇతను ఐటీఐ పూర్తిచేసి ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో గత 21న జేఎం భవన నిర్మాణ సంస్థ కార్తీక్‌ను ఎలక్ట్రికల్ పనుల నిమిత్తం కాకలూరుకు పిలిపించినట్టు తెలుస్తుంది. అనంతరం ఆంజనేయపురంలోని నూతన భవనంలో ఎలక్ట్రికల్ పనులు చేయాలని సూచించారు. పనులు చేస్తున్న సమయంలో హఠాత్తుగా మొదటి అంతస్తు నుంచి కిందపడి కార్తీక్ తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే సహచరులు కార్తీక్‌ను గుర్తించి తిరువళ్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అందించిన తరువాత మెరుగైన చికిత్స కోసం చెన్నై రాజీవ్‌గాంధీ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందాడు. తన భర్త మృతికి జేఎం కన్‌స్ట్రక్షన్ సంస్థే కారణమని, రక్షణ కవచం అందించకుండా పనులు చేయించడం వల్లే కార్తీక్ మృతిచెందాడని సంబంధిత సంస్థపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మృతుడి భార్య కౌసల్య తాలుకా పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

టమాటాకు రెక్కలు

• కిలో రూ.70–80 • తగ్గిన దిగుబడి



సాక్షి, చెన్నై: టమాట ధర ఆదివారం అమాంతంగా పెరిగింది. దిగుబడి తగ్గడంతో కిలోకు రోజుకు రూ.10 చొప్పున ధర పెరుగుతోంది. తాజాగా కొన్ని చోట్ల కిలో రూ.70, మరికొన్ని చోట్ల రూ.80 ధర పలికింది. వంటకాల తయారీలో టమాట తప్పనిసరి. ప్రతి ఇంటా నిత్యం టమాట వాడుతుంటారు. టమాట లేని వంటకాల్లో రుచి లేనట్టే. అందుకే మార్కెట్‌కు వచ్చే వాళ్లు తప్పనిసరిగా టమాట కొనుగోలు చేసి తీరుతారు. అందుకే ఈ టమాట తరచూ ప్రజలకు చుక్కలు చూపించే పనిలో పడింది. గత నెల వరకు టమాటకు ధర పలకలేదు. గతంలో కేజీ రూ.20లోపు ధర పలికింది. ఈ నెల మొదటి వారంలో కిలోకు మరో రూ.ఐదు పెరిగింది. నైరుతి రుతు పవనాల ప్రవేశంతో టమాట ధరకు రెక్కలు వచ్చాయి. నాలుగైదురోజులుగా ధర అమాంతంగా పెరుగుతోంది. రోజుకు సరాసరిగా కిలోకు రూ.10 వరకు టోకు వర్తకంలోనే ధర పెరుగుతుండడం గమనార్హం. చెన్నై కోయంబేడు మార్కెట్‌కు రోజుకు 85 లారీలలో 850 టన్నుల టమాట తమిళనాడుతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి తీసుకు రావడం జరుగుతోంది. అయితే, రెండు రోజులుగా కేవలం 35 లారీలలో 350 టన్నుల టమాట మాత్రమే సరఫరా అవుతోంది. ఉత్తరాదిలో పలు రాష్ట్రాలలో వర్షాల నేపథ్యంలో అక్కడి నుంచి రావాల్సిన లారీలు రాలేదు. ఇది కూడా ధర పెరుగుదలకు కారణంగా టోకు వర్తకులు పేర్కొంటున్నారు. కోయంబేడులో తొలి రకం టమాట కిలో రూ.70, రెండో రకం కిలో రూ. 60 పలికింది. చిల్లర వర్తకంలోకి వచ్చే కొద్ది ధర అదనంగా పెంచి అమ్ముతున్నారు. రానున్న రోజుల్లో టమాట ధర మరింతగా పెరగవచ్చు అని, రూ.100దాటినా ఆశ్చర్య పోక తప్పదని వర్తకులు పేర్కొంటుండడం గమనార్హం. ధర కట్టడి లక్ష్యంగా ప్రభుత్వం అప్రమత్తం కావాల్సి ఉంది. తోట పచ్చదనం దుకాణాల ద్వారా టమాట విక్రయాలకు శ్రీకారం చుట్టిన పక్షంలో బయటి మార్కెట్‌లో ధర దిగి వచ్చే అవకాశాలు ఉన్నాయి.

కనులపండువగా జలకంఠేశ్వరాలయ మహాకుంభాభిషేకం


కుంభాభిషేకంలో పాల్గొన్న పీఠాధిపతులు

వేలూరు: వేలూరు కోట మైదానంలోని జలకంఠేశ్వరాలయ మహాకుంభాభిషేకం ఆదివారం ఉదయం కనులపండువగా జరిగింది. ఈ సందర్భంగా కోట ముఖ ద్వారం నుంచి ఆలయ ప్రాంగణంతోపాటు పరిసర ప్రాంతాల్లో వివిధ రంగుల దీపాలతో అలంకరించారు. ఆలయ ప్రాంగణం పూర్తిగా రంగురంగుల పూలతో అలంకరించి యాగశాలలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కుంభాభిషేకం సందర్భంగా ఉదయం 5 గంటలకు నాల్గవ ప్రదక్షిణ పూజ, మహా పూర్ణాహుతి, పట్టువస్త్ర సమర్పణ, దీపారాధన పూజలు నిర్వహించారు. అనంతరం వివిధ పీఠాలకు చెందిన పీఠాధిపతులు పవిత్ర జలంతో నిండిన కలశాలను మంగళ వాయిద్యాల నడుమ ఆలయం చుట్టూ తీసుకెళ్లి ప్రార్థనలు జరిపారు. అనంతరం నూతనంగా నిర్మించిన స్వర్ణరథంపై, ఆలయ రాజగోపురంపై పీఠాధిపతులు కలశ నీటిని చల్లి మహాకుంభిభిషేకం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. అనంతరం భక్తులకు ఆలయ నిర్వహకులు అన్నదానం చేయడంతో పాటు ప్రసాదాలను అందజేశారు.

ఘనంగా ఎక్స్‌లెన్స్ అవార్డుల ప్రదానం



అవార్డు గ్రహీతలతో రామ్, నిర్వాహకులు

కొరుక్కుపేట: వివిధ రంగాల్లో విశిష్ట కృషి చేస్తున్న ప్రపంచ వ్యాప్తంగా 32 మంది ప్రముఖ వ్యక్తులకు 4వ ఎడిషన్ డాక్టర్ కె.సి.జి.వర్గీస్ ఎక్స్‌లెన్స్ అవార్డ్స్–2023లను ప్రదానం చేశారు. విద్యారంగంలో అగ్రగామిగా ఉన్న హిందుస్థాన్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ ఆధ్వర్యంలో ఇన్‌స్టిట్యూట్ వ్యవస్థాపక చైర్మన్ దివంగత డాక్టర్ కె.సి.జి వర్గీస్ జ్ఞాపకార్థంగా ఈ అవార్డులను అందిస్తున్నారు. శనివారం రాత్రి జరిగిన కార్యక్రమానికి హిందుస్థాన్ గ్రూప్ చైర్మన్ డాక్టర్ ఆనంద్ జాకబ్ వర్గీస్ అధ్యక్షత వహించారు. హిందూ గ్రూప్ పబ్లిషింగ్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ రామ్ పాల్గొని అవార్డులను ప్రదానం చేశారు. గౌరవ అతిథులుగా ఐక్యరాజ్య సమితి భారత రాయబారి (రిటైర్డ్)టీఎస్. తిరుమూర్తి, ఫెడరల్ రిపబ్లిక్ ఆఫ్ జర్మనీ కాన్సుల్ జనరల్ మైకేల్ కుచలేర్ హాజరయ్యారు. అకడమిక్ ఎక్సలెన్స్ అవార్డులను పంజాబ్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ రోపర్ (ఐఐటీఆర్) డైరెక్టర్ రాజీవ్ అహుజాకు, ఐఐటీ మద్రాసు మాజీ డైరెక్టర్ డాక్టర్ భాస్కర్ రామమూర్తి, తైవాన్‌లోని ఆసియా యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ షు చువాన్ లియావో, అమిత్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ పీబీ శర్మలకు, భారతీయ నేపథ్య గాయని ఉత్తర ఉన్నికృష్ణన్‌కు యూత్ ఐకాన్ అవార్డులు అందజేశారు.

పట్టా తీసిస్తానని మోసం


అరెస్టయిన నాగరాజన్

పళ్లిపట్టు: పోరంబోకు స్థలానికి పట్టా తీసిస్తానని నమ్మించి రూ.1.50 లక్షలు స్వాహా చేసిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పళ్లిపట్టు సమీపం వెలిగరం దళితవాడకు చెందిన ముత్తుకుమారుడు నాగరాజన్(39). ఇతను తాలూకా కార్యాలయం సిబ్బందిని బెదిరించినట్లు ఫిర్యాదుతో పళ్లిపట్టు పోలీసులు కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. నెడిగల్లు గ్రామానికి చెందిన గురుమూర్తి భార్య నాగమ్మాళ్(49). ఈమె పొలానికి సమీపంలోని పోరంబోకు స్థలానికి కలెక్టరేట్‌లో విధులు నిర్వహిస్తున్న తాను పట్టా తీసిస్తానని నమ్మించి నాగరాజన్ రూ.1.50 లక్షలు తీసుకున్నాడు. అయితే పట్టా రాకపోవడంతో అనుమానంతో విచారించగా నాగరాజన్ నమ్మించి మోసగించినట్లు తెలిసింది. దీంతో డబ్బులు తిరిగి ఇవ్వాలని నాగమ్మాళ్, ఆమె తమ్ముడు నాగభూషణంతో పళ్లిపట్టుకు వెళ్లి డబ్బులు అడగ్గా వారిని అసభ్య పదజాలంతో మాట్లాడి, హత్యా బెదిరింపులు చేసినట్లు తెలిసింది. ఫిర్యాదు మేరకు పోలీసులు మరో కేసు నమోదు చేశారు.

గంజాయి సాగులో మెడికోలు

• శివమొగ్గలో ముగ్గురు అరెస్టు


ఇంట్లో పెంచుతున్న గంజాయి మొక్కలు

శివమొగ్గ: సమాజంలో ఆదర్శంగా ఉండవలసిన మెడికోలు పెడదోవ పట్టారు. ముగ్గురు వైద్య విద్యార్థులు గంజాయికి బానిసై తమ అద్దె ఇంట్లో ఆ మొక్కల పెంపకం చేపట్టారు. పైగా గంజాయిని విక్రయిస్తూ చివరికి కటకటాల పాలయ్యారు. ఈ సంఘటన కర్ణాటకలో శివమొగ్గ నగరంలో చోటుచేసుకుంది. తమిళనాడు, క్రిష్ణగిరికి చెందిన విఘ్నరాజ్ (28), ధర్మపురి కడగత్తూరుకు చెందిన పాండిదొరై (27), కేరళలోని ఇడుక్కివాసి వినోద్‌కుమార్ (27) నిందితులు. వీరు ముగ్గురూ శివమొగ్గలోని ఒక ప్రైవేటు మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ చదువుతున్నారు. విఘ్నరాజ్ గంజాయి మొక్కలను తీసుకొచ్చినట్లు తెలిసింది. శివగంగా లేఔట్‌లో అద్దె ఇంట్లో కుండీలో మొక్కలను పెంచసాగాడు. మొక్కలను ఎండబెట్టి చిన్న చిన్న ప్యాకెట్లుగా చేసి వినోద్, పాండి దొరైతో కలిసి విక్రయించడం ప్రారంభించారు. ఈ వ్యవహారం తెలియడంతో శివమొగ్గ పోలీసులు దాడి చేసి ముగ్గురినిఅరెస్టు చేశారు. వారి నుంచి 227 గ్రాముల ఎండు గంజాయిని, అలాగే ఇంట్లో 1.5 కేజీల బరువైన గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత


కరం కోర్పోమ్ ఫౌండేషన్ వలంటీర్లతో అనిల్‌కుమార్ రెడ్డి

కొరుక్కుపేట: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని వేణుగోపాల్ విద్యాలయ ప్రెసిడెంట్ అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. పెయింటింగ్స్‌తో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించేలా స్థానిక మందవేల్లిలో తెలుగు మహాజన సమాజం నిర్వహణలోని వేణుగోపాల విద్యాలయలో ఆదివారం ఉదయం పెయింటింగ్ కార్యక్రమాన్ని అనిల్ కుమార్ రెడ్డి ప్రారంభించారు. కరం కోర్పోమ్ ఫౌండేషన్ (చేతులు కలుపుదాం) అనే స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు శివ్‌కుమార్, ఉమామహేశ్వరిల నేతృత్వంలో ఫౌండేషన్ వలంటీర్లు, వేణుగోపాల్ విద్యాలయ విద్యార్థులు, స్థానికంగా ఉన్న చిత్రకారులు, పర్యావరణ ప్రేమికులు కలిసి సమాజానికి సందేశం అందించే చిత్రాలను పెయింటింగ్‌గా తీర్చిదిద్దారు. ఈ ప్రాజెక్టు కోసం వేణుగోపాల్, విద్యాలయ అధ్యక్షుడు అనిల్‌కుమార్‌రెడ్డి పెయింట్‌లను స్పాన్సర్ చేశారని వెల్లడించారు. స్కూల్ సిబ్బంది శర్మ, నిర్మల,లేఖ పాల్గొన్నారు.

ప్రభుత్వ బస్సు బోల్తా

– 9 మందికి తీవ్రగాయాలు

తిరువొత్తియూరు: విల్లుపురం వద్ద శనివారం రాత్రి ప్రభుత్వ బస్సు అదుపుతప్పి బోల్తా పడిన ఘటనలో కండక్టర్ సహా 9 మందికి తీవ్రగాయాలయ్యాయి. నాగపట్నం నుంచి ప్రభుత్వ బస్సు చెన్నైకి 24 మంది ప్రయాణికులతో బయలుదేరింది. బస్సు ఈస్ట్ కోస్ట్ రోడ్డులో విల్లుపురం జిల్లా మరకానం సమీపంలోని తాలంగాడుకు వెళుతుండగా బస్సు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న 10 అడుగుల గోతిలో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో బస్సు కండక్టర్ శ్రీరామ్(57), 8 మంది ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు గాయపడ్డ వారిని ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రియురాలు ఆత్మహత్య

కొరుక్కుపేట: ఫేస్‌బుక్‌లో పరిచయమైన ప్రియుడు మోసం చేశాడని మనస్తాపానికి గురైన ప్రియురాలు ఆత్మహత్య చేసుకున్న సంఘటన కలకలం రేపింది. గూడువాంచేరి సమీపంలోని పెరుమత్తునల్లూరు పంచాయతీ పరిధిలోని పాండూరు అలమేలు మంగైనగర్‌కు చెందిన బెంజమిన్ (58). ఇతని భార్య మల్లిక (50). వీరి కూతురు భాగ్యం(19) ఓపెన్ యూనివర్సిటీలో బీసీఏ రెండవ సంవత్సరం చదువుతోంది. కొన్ని నెలలుగా ఫేస్‌బుక్‌లో ఓ యువకుడితో సన్నిహితంగా ఉంటోంది. ఆ తర్వాత వీరిద్దరూ ప్రేమలో పడ్డారు. అంతలోనే ప్రియుడికి భార్య, పిల్లలు ఉన్నారని తెలిసి తీవ్ర మనస్తాపానికి గురై శనివారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సమాచారం అందుకున్న గూడువాంచేరి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చెంగల్పట్టు ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రూ.8లక్షల టైర్లు చోరీ

–ఇద్దరి అరెస్ట్

తిరువళ్లూరు: బ్రెజిల్ దేశానికి ఎగుమతి చేసేందుకు కంటైనర్‌లో పంపిన రూ.8 లక్షల విలువ చేసే 495 టైర్లను చోరీ చేసిన కేసులో ఇద్దరిని మీంజూరు పోలీసులు అరెస్టు చేశారు. శ్రీపెరంబదూరులోని ప్రైవేటు కంపెనీ నుంచి 1,005 టైర్లతో కంటైనర్ లారీ ఎన్నూర్ నౌకాశ్రయానికి వెళ్లింది. ఎన్నూర్ నుంచి బ్రెజిల్‌కు టైర్లు వెళ్లాల్సిన వున్న నేపథ్యంలో కంటైనర్ నుంచి రూ.8 లక్షలు విలువ చేసే 495 టైర్లు మాయమైనట్టు బ్రెజిల్‌కు చెందిన కంపెనీ శ్రీపెరంబదూరులోని కంపెనీకి ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు మేరకు మీంజూరు పోలీసులు విచారణ చేపట్టారు. విచారణలో కంటైనర్ 13 గంటల పాటు వల్లూరుకు సమీపంలో ఒకే ప్రాంతంలో నిలిచినట్టు జీపీఆర్ ద్వారా నిర్ధారించారు. దీంతో పాటు కంటైనర్‌కు వేసిన సీల్‌ను పగులగొట్టకుండా ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. అనంతరం మనలి సన్నధి వీధికి చెందిన లారీ డ్రైవర్ సుబ్రమణ్యం(29)ను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. విచారణలో తిరువొత్తియూర్‌కు చెందిన ఇళమారన్ సాయంతో కంటైనర్‌ను వల్లూరులో ఆపి సీల్‌ను పగలగొట్టకుండా కంటైనర్ డోర్‌కు ఉన్న బోల్ట్‌ను తీసి టైర్లను చోరీ చేసినట్టు నేరం అంగీకరించారు. దీంతో ఇద్దరిని అరెస్టు చేసిన పోలీసులు వీరికి సహకరించిన మరో నలుగురి కోసం గాలిస్తున్నారు.

760 టన్నుల జిప్సం తొలగింపు

తిరువొత్తియూరు: స్టెరిలైట్ ప్లాంట్ నుంచి 760 టన్నుల జిప్సం తొలగించారు. తూత్తుకుడిలోని మూతపడిన స్టెరిలైట్ ప్లాంట్ నుంచి జిప్సం వ్యర్థాలను తొలగించేందుకు సన్నాహక పనులు 21న ప్రారంభమయ్యాయి. ఆ తర్వాత ప్లాంట్‌లోని గడ్డ కట్టిన జిప్సం వ్యర్థాలను ప్రొక్‌లెన్ ద్వారా పగులగొట్టారు. ట్రక్కుల్లోకి ఎక్కించేందుకు సరుకును సిద్ధం చేశారు. పిండిచేసిన జిప్సం వ్యర్థాలను లారీల్లోకి ఎక్కించి బయటకు తీశారు. దీనిని నిర్వాహక కమిటీ సభ్యులు పరిశీలించి మొదటి రోజు శుక్రవారం నాలుగు ట్రక్కుల ద్వారా 210 టన్నుల జిప్సమ్‌ను తొలగించారు. శనివారం 12 ట్రక్కుల్లో 550 టన్నుల జిప్సం బయటకు తీశారు. ప్లాంట్ నుంచి 760 టన్నుల జిప్సంను బయటకు తీశారు. ఈ చర్యలన్నింటినీ నిఘా కెమెరాల ద్వారా పర్యవేక్షిస్తున్నారు. జిప్సం వ్యర్థాలను తొలగించే పనులు కొనసాగుతున్నందున ప్లాంట్ ప్రవేశద్వారం వద్ద, పరిసర ప్రాంతాల్లో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

విద్యుత్‌షాక్‌కు గురై వృద్ధురాలు మృతి

తిరువొత్తియూరు: విద్యుత్ షాక్‌కు గురై ఓ వృద్ధురాలు మృతి చెందింది. చెన్నైలోని నెర్కుంద్రం కుమరన్ వీధి మీనాక్షి అమ్మాళ్‌నగర్‌కు చెందిన వసంతరాణి (62). ఆదివారం ఉదయం బావి నుంచి పైప్ ద్వారా నీటిని తోడేందుకు మోటార్ స్విచ్ వేశారు. ఆ సమయంలో వసంతరాణి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందింది. కోయంబేడు పోలీసులు వసంతరాణి మృతదేహాన్ని శవపరీక్ష కోసం కీల్పాక్కం ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ధర్మరాజు ఆలయంలో ఘనంగా మహాకుంభాభిషేకం


ఆలయ గోపురంపై పుణ్యజలాలను వదులుతున్న అర్చకులు

తిరువళ్లూరు: పట్టణంలో ప్రసిద్ధి చెందిన ద్రౌపదీ సమేత ధర్మరాజు ఆలయంలో మహాకుంభాభిషేకం ఆదివారం ఉదయం ఘనంగా నిర్వహించారు. తిరువళ్లూరు నేతాజీరోడ్డులోని ద్రౌపదీ సమేత ధర్మరాజు ఆలయంలో జీర్ణోద్ధరణ పనులు నిర్వహించారు. పనులు పూర్తయిన నేపథ్యంలో కుంభాభిషేకం కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగానే 23న గణపతి హోమం, లక్ష్మీహోమం, నవగ్రహ హోమం, రెండవ మూడవ కాలయాగ పూజలు నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం ఏడు గంటలకు నాల్గవ కాలపూజ, మహా సంకల్పం, విశేషహోమం, మహాపూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం పురోహితులు పుణ్యనదుల నుంచి తీసుకొచ్చిన జలాలతో ఆలయ గోపుర కలశంపై కుంభాబిషేకం నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రత్యేక దర్శనంతో పాటు ప్రసాదాలను ఆలయ నిర్వాహకులు అందజేశారు. తిరువళ్లూరు ఎమ్మెల్యే వీజీ రాజేంద్రన్, తిరుత్తణి ఎమ్మెల్యే చంద్రన్, మున్సిపల్ చైర్‌పర్సన్ ఉదయమలర్‌తో పాటు వేలాది మంది భక్తులు ద్రౌపదీ అమ్మవారు సమేత ధర్మరాజుస్వామి వారిని దర్శించుకున్నారు.


హాజరైన భక్తులు

ప్రభుత్వ బస్సులో రూ.కోటి స్వాధీనం

తిరువొత్తియూరు: తిరుపూర్ వద్ద ప్రభుత్వ బస్సులో తరలిస్తున్న రూ. కోటి నగదును విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఇది హవాలా నగదా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. తిరుపూర్ విజిలెన్స్ అధికారులు అవినాసిలోని తిరుపూర్ రోడ్డులోని కృష్ణ బేకరీ సమీపంలో ఆదివారం వాహన తనిఖీలు నిర్వహించారు. ఆ సమయంలో చెన్నై నుంచి కోయంబత్తూరు వెళ్తున్న ప్రభుత్వ బస్సులో ఇద్దరు వ్యక్తులు బ్యాగ్ చేతిలో పెట్టుకుని అవినాసిలో కిందకు దిగారు. అనుమానించిన పోలీసులు వారిని తనిఖీ చేయగా బ్యాగులో రూ.కోటి విలువ చేసే రూ.500 నోట్లు వున్నాయి. విచారణలో వారు వేలూరుకు చెందిన మహ్మద్ షికూర్ కుమారుడు ఆరీఫ్ (47,) షఫీక్ అహ్మద్ కుమారుడు అబ్దుల్ ఖాదర్ (25) అని తెలిసింది దీంతో పోలీసులు వారిని కోయంబత్తూరుకు తీసుకొని వెళ్లి విచారించారు. అనంతరం వారిని ఐటీ అధికారులకు అప్పగించారు.

మధుమేహం నియంత్రణకు విస్తృత అవగాహన


ప్రసంగిస్తున్న డాక్టర్ విజయ్ విశ్వనాథన్

సాక్షి, చెన్నై: అతివేగంగా విస్తరిస్తున్న మధుమేహం నియంత్రణ లక్ష్యంగా అవగాహన కార్యక్రమాలు విస్తృతం చేస్తున్నామని ఎంబీ హాస్పిటల్ ఫర్ డయాబెటీస్ హెడ్ డాక్టర్ విజయ్ విశ్వనాథన్ తెలిపారు. ఆదివారం మైలాపూర్‌లోని నాగేశ్వరరావు పార్క్‌లో వ్యాయామం, యోగా వంటి శారీరక శ్రమరూపంలో కలిగే ప్రయోజనాలను గురించి అవగాహన కార్యక్రమం జరిగింది. ఇందులో ఆయన ప్రసంగిస్తూ, 69 సంవత్సరాలుగా తాము ఒక బృందాన్ని ఏర్పాటు చేసి అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని గుర్తు చేశారు. మధుమేహం ఉన్న వారికి ఉత్తమ చికిత్స అందించడమేకాకుండా సంపూర్ణ ఆరోగ్య సంరక్షణకు, ఆరోగ్యకర జీవితానికి సాయం అందిస్తున్నామని వివరించారు. వ్యాయామం, యోగా వంటి శారీరక శ్రమ, ఆహార నియంత్రణ అవగాహన కార్యక్రమాలు మరింత విస్తృతం చేయనున్నామన్నారు. అలాగే, శారదా విశ్వనాథన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వ్యాక్సిన్ శిబిరాలను, సామాజిక కార్యక్రమాలను నిర్వహించనున్నామని తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

తిరువళ్లూరు: మద్యం తాగి వచ్చాడన్న కోపంతో భార్య ఇంటి నుంచి గెంటేయడంతో బయటకు వెళ్లిన భర్త అనుమానాస్పదస్థితిలో మృతి చెందిన సంఘటన పళవేర్కాడులో ఆదివారం జరిగింది. తిరువళ్లూరు జిల్లా పళవేర్కాడు సమీపంలోని కొట్టామేడు గ్రామానికి చెందిన చంద్రు(46). ఇతడికి వివాహమై భార్య అభిరామితో పాటు పిల్లలు ఉన్నారు. మద్యం అలవాటు ఉన్న చంద్రు శనివారం రాత్రి మద్యం తాగి ఇంటికి వచ్చాడు. దీంతో భార్య అభిరామి భర్తను మందలించడంతో పాటు ఇంటికి రావొద్దని బయటకు గెంటేసింది. భర్త రాత్రి ఇంటికి రాకపోవడంతో అనుమానం కలిగిన భార్య, బంధువులు గాలించగా, పళవేర్కాడులోని శ్మశాన వాటిక వద్ద అనుమానస్పద స్థితిలో మృతి చెంది ఉన్నట్టు నిర్ధారించి షాక్‌కు గురయ్యారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు తిరుపాళ్యవనం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బంగారు భవితకు పునాది విద్య

• పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల వితరణ


స్కాలర్ షిప్‌లు అందుకున్న విద్యార్థులతో సభ్యులు

కొరుక్కుపేట: విద్యార్థుల బంగారు భవితకు విద్య పునాది లాంటిదని పారిశ్రామిక వేత్త పద్మిని అన్నారు. ఈ మేరకు దక్షిణ ఇండియా వైశ్య సంఘం ఆధ్వర్యంలో కొనసాగుతున్న సేవా పథకాల్లో ఒకటైన వాసవీ విద్యానిధి క్రింద 40వ వార్షిక స్కాలర్ షిప్‌ల వితరణ కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. స్థానిక జార్జి టౌన్‌లోని సంఘం ప్రధాన కార్యాలయంలో జరిగిన ఈ వేడుకకు సంఘం అధ్యక్షుడు డాక్టర్ అజంతా డాక్టర్ కే శంకరరావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పద్మిని పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాసవీ విద్యానిధి ద్వారా తొమ్మిదో తరగతి నుంచి ప్లస్ టూ వరకు చదివే 100 మంది నిరుపేద విద్యార్థులకు స్కాలర్ షిప్‌లను, నోట్ పుస్తకాలను అందజేశారు. పద్మిని కిషోర్ విద్యానిధి కోసం రూ.25 వేలు విరాళాన్ని అందజేశారు. సంఘం సెక్రటరీ మద్ది నరసింహులు, కోశాధికారి పి రమేష్, సంయుక్త కార్యదర్శి పి అశోక్ కుమార్, వాసవీ విద్యానిధి కార్యదర్శి ఎం ప్రవీణ్ కుమార్, ఉపాధ్యక్షులు సుబ్బారావు, ఎం కాశీవిశ్వనాథం పాల్గొన్నారు.

మహిళా న్యాయమూర్తులే వాంగ్మూలం తీసుకోవాలి

తిరువొత్తియూరు: లైంగికదాడులకు గురైన బాలికల నుంచి మహిళా న్యాయమూర్తులే వాంగ్మూలం తీసుకోవాలని, దీనిపై చర్యలు తీసుకునేందుకు డీజీపీని మదురై హైకోర్టు ఆదేశించింది. కన్యాకుమారికి చెందిన ఓ వ్యక్తి తన ఆరేళ్ల కుమార్తెను లైంగికంగా వేధించాడు. ఫిర్యాదు మేరకు పోలీసులు బాలిక తండ్రిని అరెస్ట్ చేశారు. ప్రస్తుతం జైలులో ఉన్న ఆయన బెయిల్ కోసం మదురై హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను న్యాయమూర్తి ఇలందిరియన్ సమక్షంలో విచారణకు వచ్చింది. ఆ సమయంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ అన్బునిధి హాజరై, కన్యాకుమారి జిల్లా పోక్సో కోర్టులో పిటిషన్‌దారుని కేసు చార్జిషీట్ దాఖలు చేసినట్లు తెలిపారు. బాధిత బాలిక మాట్లాడుతూ ఈ కేసులో లభించిన వాంగ్మూలంలో ఏమీ జరగనట్టు తెలిపింది. అందువల్ల పిటిషనర్ ఇప్పటికే జైలులో గడిపిన రోజులను పరిగణనలోకి తీసుకొని బెయిల్ మంజూరు చేశారు. బాధిత అమ్మాయితో ఒక పురుష న్యాయమూర్తి వాంగ్మూలం తీసుకోవడం కూడా సుప్రీంకోర్టు ఆదేశాలకు విరుద్ధం. లైంగిక నేరాలకు గురైన బాలికలు, మహిళల వాంగ్మూలాలన్ని మహిళా న్యాయమూర్తులు మాత్రమే నమోదు చేయాలి. లైంగికదాడి బాధితులను మహిళా న్యాయమూర్తుల ముందు హాజరుపరిచి వాంగ్మూలాలు తీసుకునేలా చర్యలు తీసుకోవాలని పోలీసు డీజీపీ దర్యాప్తు అధికారులకు సర్క్యులర్ పంపినట్లు పిటిషన్‌లో పేర్కొన్నారు.

షేర్ ఆటో బోల్తా

–10 మందికి గాయాలు



బోల్తాపడిన షేర్ ఆటో, ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

తిరుత్తణి: షేర్ ఆటో బోల్తాపడిన ఘటనలో పది మందికి గాయాలయ్యాయి.ఈ ఘటన తిరుత్తణి శివార్లలో చోటుచేసుకుంది. రాణిపేట జిల్లా పులివలంకు చెందిన బంధువులు పదిమంది తిరుత్తణిలో బంధువు ఇంటి కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆదివారం ఉదయం పులివలం నుంచి షేర్‌ఆటోలో బయల్దేరారు. తిరుత్తణి–షోళింగర్ వెంగుపట్టు మార్గంలో తిరుత్తణికి వెళుతుండగా కన్నికాపురం మలుపు వద్ద అదుపుతప్పి ఆటో బోల్తాకొట్టింది. ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న సరస్వతి (41), వళ్లియమ్మాళ్(55), వసంత(55), సుగుణ (43), లక్ష్మి(43), పెరుమాళ్(52), మోనిక(3), యశ్వంత్(4) సహా పదిమందికి గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తిరుత్తణి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

త'లుక్'మనేలా

గ్రామీణాన్ని అందంగా తీర్చిదిద్దేందుకు 'రుడా' ప్రణాళిక

- రూ.26.84 కోట్లతో వివిధ నిర్మాణాలకు శ్రీకారం
- అందుబాటులోకి వాకింట్ ట్రాక్, బీచ్ ఫ్రంట్, జిమ్‌లు
- పనుల్లో ఎమ్మెల్యేల అభ్యర్థనలకు ప్రాధాన్యత



సాక్షి, రాజమహేంద్రవరం: తూర్పుగోదావరి, కోనసీమ జిల్లాలను మరింత సుందరంగా తీర్చిదిద్దేందుకు రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీ (రుడా) అడుగులు వేస్తోంది. ఆయా గ్రామాల్లో అందివస్తున్న వనరులను సద్వినియోగం చేసుకుంటూ ప్రజా ప్రయోజన, ఆరోగ్య రక్షణ, ఆహ్లాదకర వాతావరణం నెలకొల్పే పనులకు ప్రాధాన్యం ఇస్తోంది. మొక్కల పెంపకం, సంరక్షణతో పాటు గ్రామాల పేర్లను సూచించే నేమ్‌బోర్డులను అ. దునాతనంగా రూపొందించి ఏర్పాటు చేస్తోంది. 66 పనులకు రూ.26.84 కోట్ల నిధులు వ్యయం చేస్తోంది. ఇప్పటికే టెండర్ల ప్రక్రియ పూర్తి చేసుకుని కొన్ని పనులు పురోగతిలో ఉండగా.. మరికొన్ని టెండరు దశలో ఉన్నాయి. రాజమహేంద్రవరాన్ని ఇప్పటికే సుందరంగా తీర్చిదిద్దిన రుడా తన పరిధిలోని గ్రామాలకు పట్టణ శోభను తీసుకువచ్చేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేస్తోంది. పనులను రుడా వీసీ బాలస్వామి ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

సుందరీకరణ పనులు ఇలా..

రుడా పరిధిలో నిర్వహించే పనుల్లో సుందరీకరణ, వాకింగ్ ట్రాక్‌లు, రివిట్‌మెంట్‌తో కూడిన వాటర్ బాడీ, బీచ్ ఫ్రంట్ నిర్వహణ పనులకు మొదటి ప్రాధాన్యత కల్పిస్తున్నారు. నియోజకవర్గాల వారీగా మచ్చుకుకొన్ని పరిశీలిస్తే..

- **అనపర్తి:** బలభద్రపురంలో రూ.1.65 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టింది. ఇప్పటికే రివిట్‌మెంట్‌తో కూడిన వాటర్ బాడీ పనులు పూర్తి చేసింది. ప్రజలకు ఆహ్లాదాన్ని పంచేలా నీటితో కూడిన పార్క్, వాకింగ్ ట్రాక్, ప్రజలు సేదతీరేందుకు పచ్చదనం పెంపొందించే పనులు ప్రారంభించింది.
- **కొవ్వూరు:** గోష్పాద క్షేత్రం సమీపంలోని కొవ్వూరు కట్ట వెంబడి రివర్ ఫ్రంట్ రూపుదిద్ది భక్తులకు స్వాంతన కలిగించేందుకు కృషి చేస్తున్నారు. పచ్చదనం పెంపొందించి అందులో వివిధ జంతువుల నమూనా విగ్రహాలు వరద నీటికి తట్టుకునే స్థాయిలో తయారు చేస్తున్నారు. ఇందుకు రూ.కోటి వెచ్చించనున్నారు. రూ.32.86 లక్షలతో అధునాతన విద్యుత్ స్తంభాలు, దీపాలు అమర్చనున్నారు. 'ఐ-లవ్ కొవ్వూరు' చిహ్నాన్ని సెల్ఫీ పాయింట్‌గా ఆధునీకరించనున్నారు.
- **గోపాపురం:** దేవరపల్లి మెయిన్ రోడ్ నుంచి గోపాలపురం వరకు రూ.50 లక్షలతో సెంట్రల్ లైటింగ్ పనులు పురోగతిలో ఉండగా.. మరో

అభివృద్ధి పనుల వివరాలు (రూ.కోట్లలో)

నియోజకవర్గం	పనుల సంఖ్య	నిధులు
అనపర్తి	02	1.65
గోపాలపురం	04	1.35
కొవ్వూరు	05	1.82
నిడదవోలు	01	1.00
రాజమండ్రి రూరల్	05	2.26
రాజమండ్రి అర్బన్	24	8.74,
రాజానగరం	14	5.69
కొత్తపేట	03	2.22
రావులపాలెం	05	1.00

మరికొన్ని టెండర్ స్టేజ్‌లో ఉన్నాయి.

- **నిడదవోలు:** చిన్న కాశీ రేవు నుంచి గూడెం గేటు వరకు రహదారి నిర్మాణానికి రూ.కోటి వెచ్చించనున్నారు.
- **రాజమహేంద్రవరం సిటీ:** నగరంలో రూ.30 లక్షలతో జగనన్న ఉమెన్స్ హెవెన్, రూ.12 లక్షలతో ఆజాద్‌చౌక్, ఎల్ఈడీ లైట్లు, రూ.6 లక్షలతో పుష్కరఘాట్ వద్ద దుస్తులు మార్చుకునే గది నిర్మాణం పూర్తయింది. రూ.37.50 లక్షలతో జీఎన్‌టీ రోడ్డులో మొక్కల పెంపకం, కుండీలు, మొక్కల నిర్వహణ, రూ.2 కోట్లతో హెవలాక్ బ్రిడ్జి వద్ద రంగుల విద్యుత్ దీపాలు, రూ.2 కోట్లతో కంబాలచెరువు పార్కులో మ్యూజికల్ ఫౌంటేన్ పనులు పురోగతిలో ఉన్నాయి. మరికొన్ని టెండరు దశలో ఉన్నాయి.
- **రాజమహేంద్రవరం రూరల్:** శాటిలైట్ సిటీ డి-బ్లాక్ వద్ద రూ.50 లక్షలతో కాంపౌండ్ వాల్ నిర్మాణం, రూ.38.50 లక్షలతో కోలమూరు వద్ద అప్పన్నచెరువు పార్క్ అభివృద్ధి, రూ.47.50 లక్షలతో ధవలేశ్వరం పాంచాయతీలో ఓపెన్ జిమ్, వాకింగ్‌ట్రాక్ పనులు టెండరు దశలో ఉన్నాయి.
- **కోనసీమజిల్లా:** ఆత్రేయపురం వార్ఫ్ రోడ్డు వద్ద రూ.1.50 కోట్లతో రివర్ ఫ్రంట్, రూ.31 లక్షలతో రావులపాలెం జంక్షన్ వద్ద క్లాక్‌టవర్ అభివృద్ధికి టెండర్లు ఆహ్వానిస్తున్నారు. వాడపల్లి ఆలయం వద్ద భక్తుల సౌకర్యార్థం రూ.41.70 లక్షల వ్యయంతో ఆధ్యాత్మికను సూచించే త్రిశంకు ఆకారంలో విద్యుత్ దీపాలు అమర్చే పనులు పురోగతిలో ఉన్నాయి.
- **రావులపాలెం:** కొమరాజులంక గ్రామంలో రూ.50 లక్షలతో పార్క్, వాకింగ్ ట్రాక్ అభివృద్ధికి టెండర్లు ఆహ్వానిస్తున్నారు.

విస్తృతంగా సుందరీకరణ

పట్టణ, గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందాలనే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉద్దేశానికి అనుగుణంగా రుడా పరిధిలోని ప్రాంతాల్లో సుందరీకరణ, ఆహ్లాద వాతావరణం కల్పించేందుకు కృషి చేస్తున్నాం. స్థానికఎమ్మెల్యేల అభ్యర్థనల మేరకు, రుడా నిబంధనలకు అనుగుణంగా పనులు చేపడుతున్నాం. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అభివృద్ధి జరగడం లేదన్న ప్రతిపక్షాలు బురదజల్లుతున్నాయి. కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాలో చేపడుతున్న పనులను చూసైనా బుద్ధి వస్తుందని భావిస్తున్నాం.

-మేడపాటి షర్మిలారెడ్డి, చైర్‌పర్సన్ రుడా

రాజానగరంలో 'జిమ్'దాబాట్



రాజానగరం నియోజకవర్గంలో గాదరాడ, బూరగపూడి, శ్రీరంగపట్నం గ్రామాల్లో రూ.20.30 లక్షల వ్యయంతో యువతకు ఫిట్‌నెస్ పెంపొందించే జిమ్‌ల నిర్మాణం పూర్తయింది. విమాన ప్రయాణికులకు ఆహ్లాదకర వాతావరణం కల్పించేందుకు ఎయిర్‌పోర్ట్ రోడ్డు వెంబడి ఉన్న సెంట్రల్ లైటెనింగ్ పోల్స్‌కు రూ.55 లక్షలతో ఎల్ఈడీ మోటిఫ్ ఏర్పాటు. రూ.2 కోట్లతో కోరుకొండ జంక్షన్ వద్ద ఆర్టీసీ బస్‌స్టాప్ పునరుద్ధరణకు మార్గం సుగమం కానుంది. పుణ్యక్షేత్రం వద్ద బర్డ్స్ పార్క్, 'ఐ లవ్ రాజానగరం', గ్రామ పేరు సూచించే సైన్‌బోర్డు పనులు టెండరు దశలో ఉన్నాయి.

దేశం అవినీతి 'పంచాయతీ'

వేట్లపాలెంలో దోచుకున్న ప్రజాధనం

- చేయని పనులకు చేసినట్టు రికార్డులు
- సర్పంచ్,ఆమె భర్త మాయాజాలం
- చినరాజప్ప అనచరులే పాత్రదారులు
- ప్రాథమికంగా అవినీతి లెక్క రూ.4 కోట్లు

సాక్షిప్రతినిధి,కాకినాడ: 'ఆవు చేలో మేస్తుంటే దూడ గట్టున మేస్తుందా' అనే సామెత తెలుగు తమ్ముళ్లకు నూరుశాతం వర్తిస్తుంది. ప్రజాధనాన్ని కొల్లగొట్టడంలో వీరిది అందె వేసిన చెయ్యి. పార్టీ అధినేత చంద్రబాబు దగ్గర నుంచి చోటామోటా నాయకుల వరకు అందరిదీ అదే తీరు. పెద్దాపురం నియోజకవర్గం వేట్లపాలెంలో నిధుల స్వాహాకు టీడీపీ నేత కేరాఫ్ అడ్రస్‌గా నిలిచారు. జిల్లాలో అతి పెద్ద మేజర్ గ్రామ పంచాయతీ కావడంతో నిధులు కూడా పుష్కలమే. ఇక్కడ టీడీపీ కీలక నేతగా వ్యవహరిస్తోన్న వల్లూరి శ్రీనివాస్ ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్పకు ముఖ్య అనుచరుడు. 2017-2021 వరకు శ్రీనివాస్ భార్య శేషవేణి సర్పంచ్‌గా.. శ్రీనివాస్ ఉపసర్పంచ్‌గా పనిచేశారు. వీరి హయాంలో పంచాయతీ అధికారులు, ప్రజాప్రతినిధులు కుమ్మక్కై నిధులను దోచేశారు.

కాగితాల్లోనే పనులు

వేట్లపాలెం పంచాయతీలో జనాభా 20 వేలపై చిలుకు ఉంటుంది. ఏటా జనరల్ ఫండ్ కూడా రూ.కోటి దాటేది. ఆర్థిక సంఘం నిధులు కూడా తోడయ్యాయి. ఇదే అదనుగా ఉన్న సిమెంట్ రోడ్లనే కొత్తగా వేసినట్టు, మంచినీటి ట్యాంకులు శుభ్రం చేసినట్టు, డ్రైన్లలో పూడిక తీసినట్టు కాగితాల్లో చూపించారు. ఇంటి పన్ను, కుళాయి పన్నులు వసూలుచేసి జమచేయకుండానే నొక్కేశారు. బ్లీచింగ్, ముగ్గు, చీపుర్లు కొనుగోలు చేయకుండానే ఆర్థిక సంఘం నిధులు దారి మళ్లించారు. ఇలా వారి హయాంలో ఐదారు కోట్ల రూపాయల మేర అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపణలున్నాయి. సర్పంచ్ శేషవేణి అయినా ఉప సర్పంచ్ హోదాలో ఆమె భర్త పెత్తనం చేసి నిధులు నొక్కేశారు. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు గోలి బాబ్జీ ఫిర్యాదుతో ఇక్కడి అవినీతి బయటపడింది. ఇక్కడ కొల్లగొట్టిన ప్రజాధనంతో అక్రమార్కులు కాకినాడ, రాజమహేంద్రవరం, విశాఖపట్నం ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారంలో పెట్టారని స్థానికులు ఫిర్యాదు చేశారు.



చంద్రబాబుతో సర్పంచ్ శేషవేణి, ఉపసర్పంచ్ శ్రీనివాస్

ఇవీ చర్యలు

విచారణ అనంతరం జీవీ రమణ సస్పెండయ్యారు. ఆయన తన హయాంలో జరిగిని అవినీతి సొమ్ము పంచాయతీకి జమ చేశారు. పీఎస్ఆర్ రాజేశ్వరరావు రిటైరయ్యారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ నిలిపివేసేలా జిల్లా పంచాయతీ అధికారులు ప్రభుత్వానికి సిఫార్సు చేశారు.

పనులపై ఆరా

కాగితంపై సంతకాలు చేసి ఇచ్చే ఓచర్లు 798 గాను 59 రికార్డుల నుంచి మాయమయ్యాయి. ఎస్సీ పేటలో ఇంటర్నల్ గ్రావెల్ రోడ్డు, జేసీబీతో పారిశుధ్య పనులు , కెనాల్‌రోడ్డులో గోదావరి కాలువ నుంచి చెరువులు నింపినట్టు, కన్నయ్యకాలనీలో ఇంటర్నల్ గ్రావెల్ రోడ్డు వేసినట్టు, సాయిబాబాగుడి నుంచి పంచాయతీ కార్యాలయం వరకు రక్షిత మంచినీటి పైపులైన్ తదితర పనులు చేసినట్టు చూపించి రూ.50లక్షలు పైనే పక్కదోవపట్టించారు. వీటిలో ఏ ఒక్క పనినీ నగదు పుస్తకంలో నమోదు చేయలేదు. ఏ ఒక్క పనికి రికార్డులు కూడా లేవు. అసలు ఈ పనులు చేశారా లేదా అనే కోణంలో క్వాలిటీ కంట్రోల్ యంత్రాంగం ఆరా తీస్తోంది. ఈ రకంగా సర్పంచ్, ఆమె భర్త శ్రీనివాస్ హయాంలో రూ.4 కోట్ల వరకు అవినీతి జరిగినట్టు మధ్యంతర నివేదికలో నిర్ధారించారు. ఈ వ్యవహారాల్లో బాధ్యులైన ఇద్దరిపై క్రిమినల్ కేసులు నమోదుచేసేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధమవుతోంది.

బాధ్యులపై క్రిమినల్ చర్యలు



వేట్లపాలెం గ్రామ పంచాయతీలో అక్రమాలు వాస్తవమేనని ప్రాథమిక విచారణలో తేలింది.సమగ్ర విచారణ జరుపుతున్నాం. మధ్యతర నివేదిక ప్రకారం ఇంతవరకు రూ.4 కోట్ల మేర అవినీతి జరిగింది. నాలుగైదు రోజుల్లో పూర్తి స్థాయి నివేదిక వస్తుంది. పంచాయతీలో పలు పనులకు రికార్డులు కూడా లేవు. గత విచారణలో తేలిన దాని కంటే ఎక్కువగానే అక్కడ నిధులు దుర్వినియోగం జరిగినట్టు తాజాగా బహిర్గతమైంది. ఇందుకు బాధ్యులపై క్రిమినల్ చర్యలు తీసుకుంటాం.

-కృతికాశుక్లా,కలెక్టర్

అధికారులూ భోక్తలే

- వేట్లపాలెం పంచాయతీలో అక్రమాలపై డీఎల్‌పీఓ వై అమ్మాజీ విచారణ నిర్వహించారు.
- పంచాయతీ జనరల్ నిధులు, ఇంటి పన్ను, ఆర్థిక సంఘం నిధులు దారి మళ్లినట్టు ప్రాథమిక విచారణలో తేలింది.
- పంచాయతీ కార్యదర్శి జీవీ రమణ రూ.3.68 లక్షలు అవినీతికి పాల్పడ్డట్టు లెక్క తేలింది.
- పంచాయతీ కార్యదర్శి పీఎస్ఆర్ రాజేశ్వరరావు జనరల్ నిధుల నుంచి రూ.3.61లక్షలు, 14వ ఆర్థిక సంఘం నిధులలో రూ.6.60లక్షలు కాజేరని బయటపడింది.
- పంచాయతీ సీనియర్ అసిస్టెంట్ లక్ష్మీ సూర్యకళ ఇంటి పన్ను రూ.2.24 లక్షలు జమ చేయకుండా స్వాహా చేశారు.
- నాటి సర్పంచ్ శేషవేణి జనరల్ ఫండ్స్ రూ.3.61లక్షలు, 14 ఆర్థిక సంఘం నిధుల్లో రూ.6.62 లక్షలు దారి మళ్లించారు
- ఇలా పంచాయతీలో రూ.25 లక్షలు వరకు ప్రజాదనం దారి మళ్లినట్టుగా డీఆల్‌పీఓ తేల్చారు.

అవినీతి చిట్టా తిరగేస్తే..

ఏడెనిమిది కోట్ల రూపాయల వరకు అవినీతి జరిగితే డీఎల్‌పీఓ మొక్కుబడిగా విచారించి అక్రమార్కుల కొమ్ము కాస్తున్నారని స్థానికులంటున్నారు. వీరు కొన్ని ఆధారాలతో తాజాగా కలెక్టర్ కృతికాశుక్లాకు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ స్పందించి 2013 నుంచి రికార్డుల్ని నిశితంగా పరిశీలించి నివేదిక ఇవ్వాలని కాకినాడ రూరల్ డీఎల్‌డీఓ నారాయణమూర్తిని ఆదేశించారు. ఈ క్రమంలో ఆయన శనివారం కలెక్టర్‌కు మధ్యంతర నివేదిక సమర్పించారు. పునర్విచారణలో కీలక ఆధారాలు లభించినట్టు తెలిసింది. ఎడ్లబండి లేకుండానే ఎడ్లబండితో చెత్త సేకరించినట్టు రికార్డులు సృష్టించి లక్షలు కాజేశారని తేల్చారు. నకిలీ రశీదులతో కుళాయి, ఆస్తి పన్నులు సొమ్ము లక్షలు దిగమింగారు. పైపులైన్ వేయకుండానే వేసినట్టు, మంచినీటి ట్యాంకులు మరమ్మతుల పేరుతో రూ.2.64 కోట్లు కొట్టేశారని సమాచారం. ఉన్న సీసీ రోడ్లపై మరోసారి రోడ్లు వేసినట్టు చూపించి వరసుగా రూ.27.50 లక్షలు, రూ.17.50 లక్షలు, రూ.21 లక్షలు, రూ.26 లక్షలు, రూ.33.90 లక్షలు కాజేశారని భోగట్టా.

కొల్లేరు ప్రజలకు మంచి రోజులు

ప్రారంభానికి సిద్ధమవుతున్న సర్కారు కాల్వ వారధి

పెద్దింట్లమ్మ దేవస్థానం వద్ద అతిపెద్ద అనివేటి మండపం

కైకలూరు: కొల్లేరు ప్రజలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో మంచి రోజులు వచ్చాయి. చిరకాల కలగా మిగిలిన సర్కారు కాల్వపై వారధి ప్రారంభానికి సిద్ధమైంది. సమీప జిల్లాల్లో ఎక్కడా లేనివిధంగా పెద్దింట్లమ్మ దేవస్థానం వద్ద అతిపెద్ద అనివేటి మండప నిర్మాణం పనులు శరవేగంగా జరుగుతున్నాయి. సర్కారు కాల్వ వారధికి దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ వారధిగా పేరు ఖరారు చేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. కొల్లేరు ప్రజలను కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే గత ప్రభుత్వం భావించింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అక్కడి ప్రజల సంక్షేమానికి పెద్దపీట వేస్తోంది. కొల్లేరు ప్రజల ప్రధాన వృత్తి చేపల సాగు. ఎన్నికలకు ముందు పాదయాత్రలో ఆక్వా రైతులకు విద్యుత్ యూనిట్ చార్జీలను తగ్గిస్తానని సీఎం జగన్ మోహన్‌రెడ్డి వాగ్దానం చేశారు. అధికారంలోకి రాగానే ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారు. టీడీపీ పాలనలో యూనిట్ ధర రూ.3.85 ఉండగా జగన్ ప్రభుత్వం రూ.1.50కే యూనిట్ విద్యుత్‌ను సరఫరా చేస్తోంది. కొల్లేరు గ్రామాల్లో గడపగడపకూ మన ప్రభుత్వం నిధుల ద్వారా సీసీ రోడ్లను నిర్మిస్తున్నారు. సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలు, నాడు-నేడులో పాఠశాలల నిర్మాణాలు కొల్లేరు గ్రామాల్లో పెద్ద ఎత్తున జరుగుతున్నాయి.

వారధి కల సాకారం

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి కొల్లేరు ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. కొల్లేరు అభయారణ్య పరిధిని తగ్గిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి నివేదించారు. కొల్లేరు ఆపరేషన్ తర్వాత రూ.3,500 కోట్ల పునరావాస ప్యాకేజీని ప్రజలకు అందించారు. ప్రధానంగా కొల్లేరు ప్రజల చిరకాల కల సర్కారు కాల్వపై వారిధి నిర్మాణానికి 2009లో రూ.12 కోట్లను వైఎస్ కేటాయించారు. ఆయన ఆకస్మిక మరణం తర్వాత పనులు జరగలేదు. గత ప్రభుత్వం అంచనాలు పెంచి రూ.14.70 కోట్లు కేటాయించిన పనులను పూర్తి చేయలేదు. సీఎం ప్రత్యేక శ్రద్ధతో స్థానిక ఎమ్మెల్యే డీఎన్నార్ వారధి నిర్మాణాన్ని పూర్తి చేయించారు. తుది



పెద్దింట్లమ్మ దేవస్థానంలో నిర్మిస్తున్న అనివేటి మండపం

పనులు పూర్తికావడంతో ప్రారంభోత్సవ తేదీ ప్రకటించనున్నారు.

అతిపెద్ద అనివేటి మండపం..

ఏలూరు జిల్లా కైకలూరు మండలం కొల్లేటికోట పెద్దింట్లమ్మ దేవస్థానం అతి పురాతనమైనది. గత ప్రభుత్వ పాలనలో అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులు ఎండలో నిలబడాల్సి వచ్చేది. ఎమ్మెల్యే డీఎన్నార్ ప్రత్యేక శ్రద్ధ వల్ల ప్రజా విరాళాలు దాదాపు రూ.5 కోట్లతో సమీప జిల్లాల్లో ఎక్కడా లేని విధంగా 305 మీటర్ల పొడవు, 105 మీటర్ల వెడల్పుతో భారీ అనివేటి మండపం పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ప్రధాన పనులు పూర్తయ్యాయి. వివిధ రకాల శిల్పాలను కళాకారులు సిద్ధం చేస్తున్నారు. అదే విధంగా అమ్మవారి జాతరలో కలవబోనాలను అతి వైభవంగా నిర్వహిస్తున్నారు.

భక్తుల సంఖ్య పెరుగుతోంది

పెద్దింట్లమ్మ దేవస్థాన అబివృద్ధికి ఎమ్మెల్యే డీఎన్నార్ విశేష కృషి చేస్తున్నారు. అతిపెద్ద అనివేటి మండపం త్వరలో పూర్తికానుంది. వారధి నిర్మాణం పూర్తికావడంతో ఏలూరు జిల్లా ప్రధాన కేంద్రానికి అమ్మవారి దేవస్థానం మీదుగా వాహనాలు చేరే అవకావం ఉంటుంది. దీంతో కొల్లేరు పర్యాటకాభివృద్ధితో పాటు అమ్మవారి దేవస్థానానికి నేరుగా బస్సు సౌకర్యం ఏర్పడుతోంది.

– కేవీ.గోపాలరావు, పెద్దింట్లమ్మ దేవస్థాన ఈవో, కొల్లేటికోట



సర్కారు కాల్వపై వారధి



అయినవిల్లిలో చెండా మేళం కళాకారుల ప్రదర్శన

కోనసీమ వీధుల్లో.. కేరళ దరువు

- చెండా మేళంతో అదరగొడుతున్న స్థానిక కళాకారులు
- త్రిశూర్‌లో ప్రత్యేకంగా శిక్షణ
- ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ప్రదర్శనలు

మా ప్రదర్శన ప్రత్యేకం



వివిధ రకాల ఊరేగింపుల్లో మా ప్రదర్శన ప్రత్యేకంగా నిలుస్తోంది. వీక్షించేందుకు వచ్చే వారిలో ఎక్కువ మంది మా ప్రదర్శన తిలకిస్తారు. ఇటీవలి కాలంలో మా చెండా మేళానికి డిమాండ్ పెరుగుతోంది.

– కోటి, చెండా మేళం కళాకారుడు



అమలాపురం మెయిన్ రోడ్డులో మోత మోగిస్తున్న చెండా మేళం కళాకారులు



సాక్షి, అమలాపురం/అయినవిల్లి: కేరళతో చాలా విషయాల్లో కోనసీమకు దగ్గర పోలికలుంటాయి. ప్రకృతి అందాలు.. కొబ్బరి చెట్లు.. పచ్చని చేలు.. విస్తారమైన సముద్ర తీరంతో రెండు ప్రాంతాలూ దాదాపు ఒకేలా అగుపిస్తాయి. కోనసీమను మినీ కేరళగా కూడా అభివర్ణిస్తారు. ఆ ప్రభావమో ఏమో కానీ అరుదైన వాయిద్య కళ కేరళ చెండా మేళానికి ఈ సీమలో ఘనమైన గుర్తింపు లభిస్తోంది. దేవాలయాల వద్ద జరిగే ఆధ్యాత్మిక కార్యక్రమాలు, శుభకార్యాల సమయంలో నిర్వహించే ఊరేగింపుల్లో కేరళ చెండా మేళం అగ్రస్థానంలో నిలుస్తోంది. ఈ కళలో కేరళలో శిక్షణ పొందిన స్థానిక కళాకారులు తమ ప్రతిభా పాటవాలతో ఉమ్మడి రాష్ట్రంలో పలు ప్రదర్శనలు ఇస్తూ శభాష్ అని కితాబులందుకుంటున్నారు. కేరళ అనగానే కథాకళి, కొడియాట్టం, తెయ్యం వంటి కళారూపాలు గుర్తుకు వస్తాయి. అటువంటి వాటిలో చెండా మేళం ఒకటి. దీని ప్రదర్శనలో స్థూపాకార పెర్కషన్ వాయిద్యాన్ని వాయిస్తారు. దాని నుంచి వచ్చే లయబద్ధమైన శబ్దానికి అనుగుణంగా నృత్యం చేస్తూ వీరు చేసే ప్రదర్శన ఆకట్టుకుంటోంది. బృందంలోని మహిళా కళాకారులు పెద్దపెద్ద చిడతలతో తాళం వేస్తారు. కేరళలో 300 సంవత్సరాలకు పైగా అత్యంత ప్రజాదరణ పొందిన కళారూపం చెండా మేళం. ఇందులో 30 నుంచి 100 మంది వరకూ సభ్యులుంటారు. కేరళలోని అన్ని పండగల్లో చెండా మేళం తప్పనిసరి. కేరళతో పాటు కర్ణాటక, తమిళనాడుల్లో దీనికి విశేష ఆదరణ ఉంది. సామాజిక మాధ్యమాలు విస్తృతమైన తరువాత దీనికి దేశవ్యాప్తంగా ఆదరణ వచ్చింది.

కేరళ కళాకారులకు దీటుగా..

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా గడచిన ఒకటిన్నర దశాబ్దాలుగా ఈ కళా ప్రదర్శన జరుగుతోంది. తొలి రోజుల్లో కేరళ నుంచి వచ్చిన కళాకారులు దీనిని ప్రదర్శించేవారు. అయితే ఇది వ్యయప్రయాసలతో కూడుకొని ఉండేది. దీంతో అయినవిల్లి మండలం ముక్తేశ్వరానికి చెందిన నాయీ బ్రాహ్మణులు ఈ కళలో శిక్షణ పొంది, 30 మందితో బృందాన్ని తయారు చేశారు. స్థానికంగా ఉన్న ఎల్.గురునాథం తొలుత మంగళ వాయిద్యాలు వాయించేవారు. తరువాత తీన్‌మార్‌లోకి మారారు. వీటికన్నా కేరళ చెండాకు ఆదరణ ఉందని తెలుసుకుని ఈ బృందాన్ని తయారు చేశారు. తరువాత ముక్తేశ్వరంతోపాటు ఇదే మండలంలో అయినవిల్లి, విలస గ్రామాల్లో కూడా కేరళ చెండా బృందాలు తయారయ్యాయి. గురునాథం కేరళలోని త్రిశూర్‌లో ప్రముఖ గురువు రాజేష్ మాలా వద్ద శిక్షణ పొందారు. అనంతరం ఇక్కడకు వచ్చి, స్థానికులకు శిక్షణ ఇచ్చారు. అయితే మెరుగైన మేళంగా శిక్షణ ఇచ్చేందుకు ఏటా కొంతమందిని త్రిశూర్ పంపుతున్నారు.

త్వరలో కాంతారా ప్రదర్శన



మొదట తారసాలు, తరువాత తీన్‌మార్ వాయించే వాళ్లం. ఇప్పుడు కేరళ చెండా, తంబోళం మేళాలు ప్రదర్శిస్తున్నాం. రెండు తెలుగు రాష్ట్రాల్లో వందల కొద్దీ ప్రదర్శనలు ఇచ్చాం. ఇటీవల విశాఖ జిల్లాలో కాంతారా కళను ప్రదర్శించాము. కాంతారాను త్వరలో పూర్తి స్థాయి ప్రదర్శనగా మారుస్తాం.

– ఎల్.గురునాథం, ముక్తేశ్వరం, అయినవిల్లి మండలం

ఉమ్మడి రాష్ట్రంలో ఆదరణ

కేరళ చెండా కళను ప్రదర్శించే కోనసీమ బృందాలకు ఉభయ తెలుగు రాష్ట్రాల్లో మంచి ఆదరణ ఉంది. ఈ బృందాలు కేరళ సంప్రదాయ వస్త్రాలు ధరించి మరీ ప్రదర్శన ఇవ్వడం విశేషం. హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, గుంటూరు వంటి ప్రాంతాల్లో వీరు ప్రదర్శనలు ఇచ్చారు. సింహాచలం, అన్నవరం, అంతర్వేదితో పాటు హైదరాబాద్ మియాపూర్‌లోని శ్రీ వేంకటేశ్వరస్వామి తదితర ఆలయాల వద్ద వీరు ప్రదర్శన ఇచ్చారు. వీటితో పాటు పలు జిల్లాల్లో ఆలయాల ప్రారంభోత్సవం, రథోత్సవాలు, అమ్మవార్ల ఊరేగింపులు, తీర్థాలు, జాతర్లలో చెండా ప్రదర్శన తప్పనిసరిగా మారింది. ఇక ప్రముఖ వస్త్ర వ్యాపార సంస్థలు, కార్పొరేట్ విద్యా సంస్థల ప్రచార హోరు, పెళ్లి ఊరేగింపుల్లో కేరళ చెండా ప్రదర్శన ఉండాల్సిందే. చివరకు చిన్న పిల్లల పుట్టిన రోజులకు సైతం వీటిని ఏర్పాటు చేస్తున్నారు. ప్రతి ప్రదర్శనకు దూరం, సమయాన్ని బట్టి రూ.30 వేల నుంచి రూ.70 వేల వరకూ వసూలు చేస్తున్నారు. కేరళలో చెండా మేళం తరహాలోనే తంబోళా మేళానికి కూడా ఆదరణ పెరుగుతోంది. దీంతో స్థానిక కళాకారులు ఈ కళను సైతం నేర్చుకుని రాణిస్తున్నారు.



కేరళ చెండా మేళం ప్రదర్శన



తంబోళం మేళం

గురువాణి



మంగళకరం

భారతీయ సంప్రదాయంలో ఏదయినా ప్రారంభం చేసేటప్పుడు.. మంగళకరమైన వాక్కులతో, శబ్దాలతో ప్రారంభం జరుగుతుంటుంది. 'మంగళాదీని మంగళమధ్యాని మంగళాంతాని శాస్త్రాణి ప్రథంతే'.. అంటారు. అంటే మంగళకర వాక్కుతో ప్రారంభించాలి, మధ్యలో మంగళకరమైన వాక్కు ఉండాలి. ముగింపును కూడా మంగళకరంగా పూర్తి చేయాలి.. అని శాస్త్ర వాక్కు. అంటే జీవితం ఎప్పుడూ మంగళకరంగా, శోభాయమానంగా ఉండాలి. శాంతికి విఘాతం కలగకుండా చూసుకుంటుండాలి. అంటే ఇతరుల మనశ్శాంతికి కారణమయ్యే టట్లుగా మన ప్రవర్తన ఉండాలి.

మంగళకర వాక్కులు, శబ్దాలు ఉన్నచోట పూజనీయత ఉంటుంది. వాతావరణం కూడా పరిశుద్ధమయి, దేవతల అనుగ్రహానికి కారణమవుతుందని విశ్వసిస్తాం. ఘంటానాదంతో పూజ ప్రారంభం చేస్తాం. ఎందుకని.. ఆగమార్ధంతు దేవానాం/ గమనార్థంతు రాక్షసాం/ కురుఘంటారవంతత్ర/ దేవాతాహ్వాన లాంఛనం... అంటే రాక్షసులు అక్కడినుంచి వెళ్లిపోవాలన్నా, దేవతలు రావాలన్నా... ఘంట మోగాలి. ఆ శబ్దంలోని పవిత్రత, మంగళప్రదత్వం అటువంటిది.


బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

నాదస్వరం, షెహనాయి, మృదంగం, డోలు, శాక్సోఫోన్, మద్దెల, ఘంటలు, గజ్జెలు, ఢమరుకం, శంఖం, కొమ్ము, వేణువు, వీణ, వయోలిన్, హార్మోనియం, క్లారినెట్... ఇవన్నీ మంగళప్రదమైన శబ్దాలు చేసే సంగీత పరికరాలు. బ్యాండ్ కూడా అంతే... దానిలోని శాక్సోఫోన్ కానీ, క్లారినెట్ కానీ, ఇతర పరికరాలు కానీ అవి కూడా గురుముఖతః నేర్చుకుని వాయిస్తారు. వీటిని మోగించే కళాకారులను కూడా సమాజం సమున్నతం గా ఆదరిస్తుంది. పండిట్ రవిశంకర్, ఉస్తాద్ బిస్మిల్లాఖాన్ లను భారత రత్న వరించింది. పద్మశ్రీ, పద్మభూషణ్, పద్మవిభూషణ్... వంటి ఎన్నో ప్రతిష్ఠాత్మక పురస్కారాలను ఆయన అందుకున్నారు. 'నేను సరస్వతీ ఆరాధకుడిని' అని బిస్మిల్లాఖాన్ ప్రకటించుకున్నారు. 'యావత్ భారతదేశంలోని ప్రజలందరూ అన్నదమ్ములు, అక్కచెల్లెళ్లు..' అని ఆయన తరచుగా అంటూండేవారు. ఒకసారి అమెరికాలో కచేరీ సందర్భంగా అభిమానులు ఆయనను అక్కడే ఉండిపొమ్మని కోరగా... కాశీని, విశ్వనాథుడిని, విశాలాక్షిని, గంగమ్మను వదిలి రాలేను అని.. ప్రకటించుకున్న గొప్ప దేశభక్తుడు. సింహాచలం ఆస్థాన విద్వాంసుడు చిట్టిబాబాయిని... సంగీతనాటక అకాడమీ, కళాప్రపూర్ణ వంటి బిరుదులెన్నో వరించాయి. కాకినాడలో సత్యనారాయణ అనే గొప్ప క్లారినెట్ విద్వాంసుడు ఎందరో శిష్యులను తయారు చేసాడు.. వారందరూ కలిసి ఆయనకు గురుదక్షిణగా బంగారు క్లారినెట్ ను బహూకరించారు.

ఇటువంటి వాద్య సంగీత విద్వాంసులను కూడా గౌరవించడం, వారి కచ్చేరీలు నిర్వహించి వారిని, వారి కళను, వారి వాయిద్యాలను సమాదరించడం మన కర్తవ్యంగా భావించాలి. మంగళత్వం అనేది కోయిల కూతలో, మామిడాకులో వానచినుకులో, పసుపులో, కుంకుమలో, పువ్వులో.. కూడా దర్శించే సంప్రదాయం మనది. ఇప్పటికీ నృత్యకళను అభ్యసించిన వారు అరంగేట్రం చేయడానికి ముందు .. సభలో ఆసీనులైన పెద్దల దగ్గరకు వచ్చి, వారి చేతికి గజ్జెలు అందించి... తిరిగి వారి చేతులనుండి స్వీకరించి కాలికి కట్టుకుని వెళ్ళి ప్రదర్శిస్తుంటారు... అంత గాఢంగా మనం ఈ కళలను అభిమానిస్తాం... ఈ సంప్రదాయాన్ని నవతరం కూడా నిష్ఠతో కొనసాగించాలని కోరుకుందాం.

సంగీతం

సంస్కారానికి ఆవిష్కారం

సంగీతం మనసును, మెదడును ఒకేసారి కదిలిస్తుంది. సంగీతంవల్ల మనసులో మెదడు, మెదడులో మనసు ఒకేసారి మెదులుతూ ఉంటాయి. మనిషిలోంచి మనిషిని బయటకులాగి తనలోకి తీసుకుంటుంది సంగీతం. జీవనావసరాలకు అతీతంగా మనిషిని మనిషిని చేస్తుంది సంగీతం.

'భూమి సారం నీరు, నీటి సారం మొక్క , మొక్క సారం మనిషి , మనిషి సారం మాట, మాట సారం సంకీర్తన లేదా సంగీతం' అని ఛాందోగ్యోపనిషత్తు చెప్పింది. సంగీతం అన్నిటికన్నా గొప్పది అని ఉపనిషత్ కాలం నుంచీ నేలపై నెలకొన్న సత్యం. మనిషికన్నా సంగీతం గొప్పది కాబట్టే మనిషికి సంగీతం మేలు చెయ్యగలిగేది అయింది. 'ఆశతో బతికే వ్యక్తి సంగీతంతో నాట్యం చేస్తాడు' అని ఒక ఇంగ్లిష్ సామెత తెలియజెబుతోంది'. 'తనలో సంగీతం లేని వ్యక్తి, మధురమైన శబ్దాలతో కలిసిపోని వ్యక్తి అనసురాగానికి, కపటోపాయానికి, దోపిడికి తగిన వాడు అవుతాడు' అని ఇంగ్లిష్ కవి షేక్స్పియర్ ఒకచోట చెబుతాడు. అన్నింటికన్నా సంగీతం మనిషికి ఉన్నతమైన తోడు.

సంగీతాన్ని వింటున్నప్పుడు మనల్ని మనం ఒకసారి చూసుకుంటే మనకు మనం కనిపించం! ఇంతకన్నా మనకు జరిగే మంచి మరొకటి ఉంటుందా? సంగీతం వింటున్నంత సేపూ మనం మెరుగైన స్థితిలో ఉంటాం. మన నుంచి మనం కోలుకోవడానికి సంగీతం కావాలి.

సంగీతం మనల్ని ఎప్పుడూ మోసం చెయ్యదు! బంధువులవల్లా, స్నేహితుల వల్లా, సమాజంవల్లా మనం మోసపోతూ ఉంటాం. కానీ సంగీతంవల్ల మనం మోసపోవడం లేదు. కొన్ని రచనలు మనల్ని పాడుచెయ్యచ్చు. కొన్ని వాక్యాలు మనల్ని తప్పుడు దారి పట్టించచ్చు. కానీ సంగీతం మనల్ని పాడుచెయ్యదు.

> అద్భుతమైన అభివ్యక్తి సంగీతం: ఆస్వాదించాల్సిన ఆనందం సంగీతం. కృష్ణుడు తన పిల్లనగ్రోవి సంగీతంలో తాను ఆనందం పొందుతూ తన్మయుడు అవుతూ ఉండేవాడు. సంగీతం కృష్ణతత్త్వంలో ఒక అంశం. కృష్ణుణ్ణి సంపూర్ణ అవతారంగా చెబుతారు. ఆ సంపూర్ణ అవతారంలో సంగీతం ఒక అంశం. అంటే సంపూర్ణత్వానికి సంగీతం ముఖ్యం అని గ్రహించాలి.



సంగీతం మనల్ని తప్పుడు వాళ్లను చెయ్యదు. కొన్ని సందర్భాల్లో సాహిత్యం కొందరికి చెడుపు చేసింది. కానీ సంగీతం ఎప్పుడూ ఎవరికీ ఏ చెడుపూ చెయ్యదు.

సంగీతం సలహాలు ఇవ్వదు. సంగీతం సూచనలు చెయ్యదు. సలహాలు, సూచనలు లేకుండా సంగీతం మనతో చెలిమి చేస్తుంది. సంగీతం మనదైపోతుంది. సంగీతాన్ని వింటున్నప్పుడు మైమరిచిపోయి తనకు తెలియకుండా మనిషి నిజంగా బతుకుతాడు. సంగీతం వల్ల మనిషి బుద్ధికి అతీతంగా సిద్ధుడు అవుతాడు. మనుగడలో భాగంగా మనం మనల్ని కోల్పోతూ ఉంటాం.

మంచి మాట

సంగీతం వింటూ ఉండడంవల్ల మనల్ని మనం మళ్లీ మళ్లీ పొందచ్చు.

వయసు రీత్యా ఎదిగాక పసితనం పోయిందని మరణించేంత వరకూ మనం మాటిమాటికీ బాధపడుతూ ఉంటాం. సంగీతాన్ని వింటున్నప్పుడు తెలివి, ప్రతిభ, పాండిత్యాలు లేని స్థితిలోకి వెళ్లిపోయి మనం మనంగా కాకుండా పసితనంతో ఉంటాం.


ప్రతిమనిషికీ తెలుసు తాను కొంత మేరకు దుర్మార్గుణ్ణే అని. సంగీతాన్ని వింటున్నంత సేపూ తనసుంచీ, తన మార్గం నుంచీ మనిషి బయటకు వచ్చేస్తాడు కాబట్టి సంగీతం కాసేపైనా మనిషిని మంచిలో ఉంచుతుంది. సంగీతం విన్నంతసేపూ అనడమో, ఏదో చెయ్యడమో ఉండవు కాబట్టి మనవల్ల అవకతవకలు, అన్యాయం, అకృత్యాలు జరగవు.

శబ్దానికి సంస్కారం సంప్రాప్తిస్తే సంగీతం అవుతుంది. సంగీతం ఒక సంస్కారానికి ఆవిష్కారం. మనకూ, మన జీవనాలకూ కూడా సంస్కారం ఉండాలి. వీలైనంతగా సంగీతానికి చేరువ అవుదాం. సంగీతంలో మైమరిచిపోతూ ఉందాం. సంగీతంలో మైమరచిపోతూ ఉండడం మనం మళ్లీ, మళ్లీ పుడుతూ ఉండడం అవుతుంది. రండి, సంగీతం వల్ల మనం మళ్లీ మళ్లీ పుడుతూ ఉందాం.

– రోచిష్మాన్

తాత్త్వికథ

ఆత్మాన్వేషణ



ఓ సూఫీ జ్ఞాని చెప్తున్నారు...

మనిషి ఆత్మ భగవంతుడి నుంచి వచ్చింది. అది చివరకు భగవంతుడినే చేరుతుంది. అది అంతిమంగా భగవంతుడిని ఎప్పుడు చేరుతుందో అప్పుడే దాని ప్రయాణం ముగుస్తుంది. అప్పటి వరకూ అది ప్రయాణం చేస్తూనే ఉంటుంది. అంటే అదొక వలయం. అనేక పుట్టుకలు, అనేక మార్గాలు ఇలా ఎలాగైనా అనుకోవచ్చు. చెప్పాలంటే జీవితంలో ఏదో ఒక అన్వేషణ అంటూ ఉంటూనే ఉంటుంది. మనసు ఏదో ఒకటి కోరుతూ ఆ దిశలో పయనిస్తుంది. కానీ అది ఏది కోరుకుంటుందో ఎక్కడ తృప్తి చెందుతుందో స్పష్టత ఉండదు. దీనినే ఆ జ్ఞాని ఆత్మాన్వేషణ ప్రయాణం అని చెప్పారు. ఇదంతా వింటున్న ఓ శిష్యుడికి ఓ సందేహం కలిగింది.

"గురువుగారూ, ఆత్మ అంతిమంగా భగవంతుడిని చేరుకోవడంతో దాని ప్రయాణం ముగుస్తుందన్నారు కదా... అంటే ప్రతి ఒక్కరూ భగవంతుడిని చేరుకోవడమే అవుతుందిగా " అని అడిగాడు.

"అవును... అందులో సందేహమేముంది? కాస్తంత ముందు వెనుకలు అంతే..అంతకన్నా మరొకటి కాదు... అందరూ చివరికి భగవంతుడిని చేరుకోవలసిందే" అన్నారు జ్ఞాని.

"మరి మత పెద్దలు కొందరు మాత్రమే భగవంతుడిని చేరుకుంటున్నారని చెప్పారుగా?" అన్నాడు శిష్యుడు.

అప్పుడు జ్ఞాని "నువ్వో పని చెయ్యి. ఊళ్ళోకి వెళ్ళి, వీలున్నంతమందిని కలిసి వారి కోరికేమిటో తెలుసుకుని రా" అని సూచించారు.

సరేనని శిష్యుడు కొన్ని కాగితాలు, కలం తీసుకుని ఊళ్ళోకి బయలుదేరాడు.అనేకమందిని కలిశాడు. వారు ఏం కావాలనుకుంటున్నారో, వారి లక్ష్యమేమిటో అడిగాడు. వారి మనసు ఏది పొందితే తృప్తి పడుతుందో చెప్పమన్నాడు. వారు చెప్పినవన్నీ రాసుకున్నాడు.

జ్ఞాని వద్దకు వచ్చాడు.

"అయ్యా, ఊళ్ళో రాజు మొదలుకుని కూలీ వరకూ ఎందరినో కలిసాను. వారు చెప్పినదంతా చదువుతాను వినండి" అంటూ మొదలుపెట్టాడు...

"రాజేమో మరిన్ని దేశాలను గెలవాలనుకున్నాడు. యువరాజేమో తెలివైన యువరాణిని పెళ్ళాడాలనుకున్నాడు... ధనవంతుడేమో మరింత డబ్బు గడించాలనుకుంటున్నాడు... ఇలా ఒక్కొక్కరూ ఆశపడుతున్నారు..." చెప్తుండగానే జ్ఞాని చదవడం ఆపమన్నారు.

"అదంతా పోనివ్వు... వారిలో ఎంతమంది భగవంతుడిని చేరుకోవాలనుకుంటున్నారో వారి పేర్లు మొదట చదువు" అన్నారు జ్ఞాని.

ఒక్కరు కూడా లేరన్నాడు శిష్యుడు.

"అంటే నువ్వు కూడా లేవా ఆ జాబితాలో?" అని అతనివంక నవ్వుతూ చూశారు జ్ఞాని.

శిష్యుడు తల దించుకున్నాడు.

– జగద్రేణు

సినిమా


నాగ్ అశ్విన్, కమల్హాసన్

ప్రాజెక్ట్ కె విషయంలో ఆసక్తిగా ఉన్నాను

– కమల్హాసన్

"యాభై ఏళ్ల క్రితం నేను డ్యాన్స్ అసిస్టెంట్గా, అసిస్టెంట్ డైరెక్టర్గా చేస్తున్నప్పుడు నిర్మాణ రంగంలో అశ్వినీదత్ పేరు బాగా వినిపించేది. యాభై ఏళ్ల తర్వాత ఇప్పుడు మేం కలిసి పని చేయబోతున్నాం" అన్నారు కమల్హాసన్. ప్రభాస్, దీపికా పదుకోన్ జంటగా అమితాబ్ బచ్చన్ కీలక పాత్రలో వైజయంతీ మూవీస్ నిర్మిస్తున్న చిత్రం 'ప్రాజెక్ట్ కె'. నాగ్ అశ్విన్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రంలో ఓ కీలక పాత్రను కమల్హాసన్ చేయనున్నారనే వార్త కొన్ని రోజులుగా ప్రచారంలో ఉంది. ఈ చిత్రంలో కమల్ నటించనున్న విషయాన్ని ఆదివారం చిత్ర యూనిట్ అధికారికంగా ప్రకటించింది. ఈ సందర్భంగా కమల్హాసన్ మాట్లాడుతూ – "మా తర్వాతి తరానికి చెందిన దర్శకుడి నేతృత్వంలో అదే తరానికి చెందిన కో–స్టార్స్ ప్రభాస్, దీపికాతో కలిసి నటించబోతున్నాను. అమిత్ జీ (అమితాబ్)తో కలిసి నటించినప్పటికీ ఆయనతో ఎప్పుడు సినిమా చేసినా మొదటిసారిలానే అనిపిస్తుంటుంది. అమిత్ జీ ఎప్పటికప్పుడు తనను తాను కొత్తగా ఆవిష్కరించుకుంటారు. నేను కూడా ఆ ప్రక్రియను అనుసరిస్తుంటాను. 'ప్రాజెక్ట్ కె' విషయంలో నేను చాలా ఆసక్తిగా ఉన్నాను. నేను సినిమా అభిమానిని. అందుకే నా పరిశ్రమలో ఏ కొత్త ప్రయత్నం జరిగినా మెచ్చుకుంటాను. అలా 'ప్రాజెక్ట్ కె'ని ప్రశంసించే తొలి వ్యక్తిని నేనే కావాలనుకుంటున్నాను. మా దర్శకుడు నాగ్ అశ్విన్ విజన్ మన దేశం, ప్రపంచం మొత్తం మారుమోగుతుందని కచ్చితంగా చెబుతున్నాను" అన్నారు. "నా కెరీర్లో 50వ సంవత్సరంలో దిగ్గజ నటులు కమల్హాసన్, అమితాబ్ బచ్చన్లతో కలిసి పని చేసే అవకాశం రావడం అనేది నాకో వరం" అన్నారు అశ్వినీదత్. "లెజెండ్ కమల్హాసన్ సార్తో కలిసి పని చేయడం గౌరవంగా భావిస్తున్నాను. ఆయన్నుంచి నేర్చుకునే అవకాశం రావడం అనేది ఓ కల నెరవేరిన క్షణంలా భావిస్తున్నాను" అన్నారు ప్రభాస్. "ఎన్నో విలక్షణ పాత్రలు చేసిన కమల్ సార్తో కలిసి పని చేయడం గౌరవంగా భావిస్తున్నాను. ఆయన మా చిత్రంలోకి వచ్చి 'ప్రాజెక్ట్ కె'ని సంపూర్ణం చేశారు" అన్నారు నాగ్ అశ్విన్.



హీరోయిన్ అవుతాననుకోలేదు


– ఐశ్వర్యా మీనన్

"ఓ నటిగా నా కెరీర్ పట్ల సంతృప్తిగానే ఉన్నాను. అసలు నేను హీరోయిన్ అవుతానని ఊహించలేదు. నేను ఇంజనీర్ని, నా బ్రదర్ డాక్టర్. స్టార్టింగ్లో కొన్ని యాడ్స్ చేశాను. ఆ తర్వాత మెల్లిమెల్లిగా ఒక్కో అడుగు వేసుకుంటూ ఇప్పుడు హీరోయిన్గా రాణిస్తున్నాను. ఈ ప్రయాణం నాకు హ్యాపీగా ఉంది" అన్నారు ఐశ్వర్యా మీనన్. నిఖిల్ హీరోగా గ్యారీ బీహెచ్ దర్శకత్వంలో కె. రాజశేఖర్రెడ్డి నిర్మించిన చిత్రం 'స్పై'. ఈ చిత్రం ఈ నెల 29న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఆదివారం హైదరాబాద్లో జరిగిన విలేకర్ల సమావేశంలో చిత్ర కథానాయిక ఐశ్వర్యా మీనన్ మాట్లాడుతూ– "తెలుగులో హీరోయిన్గా నేను చేసిన తొలి చిత్రం 'స్పై'. ఈ చిత్రంలో నా క్యారెక్టర్లో చాలా షేడ్స్ ఉన్నాయి. 'రా' ఏజెంట్గా కనిపిస్తాను. ఈ సినిమాలోని కొన్ని యాక్షన్ సీక్వెన్స్ల కోసం నేను ప్రత్యేక శిక్షణ తీసుకున్నాను. గన్ను సరిగ్గా పట్టుకోవడం, షూటింగ్.. ఇలా కొత్త విషయాలు నేర్చుకున్నాను. ప్రేమకథలే కాదు.. యాక్షన్ సన్నివేశాల్లో కూడా నేను బాగా నటించగలననే విషయం నాకు 'స్పై'తో తెలిసొచ్చింది. యాక్షన్ సినిమాలు కూడా చేయగలననే కాన్ఫిడెన్స్ పెరిగింది. ఇక స్వాతంత్ర్య సమరయోధులు నేతాజీ సుభాష్ చంద్రబోస్ జీవిత రహస్యాల ఆధారంగా అనేది ఈ సినిమా బేస్లైన్ మాత్రమే. డ్రామా వేరుగా ఉంటుంది. గ్యారీగారు ఈ సినిమాలోని హీరోయిన్ పాత్రకు నన్నే అనుకున్నారట. దీంతో ఆయన స్ట్రయిట్గా వచ్చి నాకు కథ చెప్పారు. నేను చూసిన తొలి తెలుగు సినిమా 'హ్యాపీ డేస్'. అలాగే నిఖిల్ చేసిన 'స్వామి రారా', 'కార్తికేయ' చిత్రాలు కూడా చూశాను. ఆయన ప్రతి సినిమాను ఫాలో అవుతుంటాను. ప్రజెంట్ యూవీ క్రియేషన్స్లో కార్తికేయ హీరోగా నటిస్తున్న ఓ చిత్రంలో హీరోయిన్గా చేస్తున్నాను" అన్నారు.


నిరోషా

రజనీకి జోడీ?

'ఒక బృందావనం సోయగం..' అంటూ ఈత కొలనులో హొయలొలికించి, కుర్రకారు మనసుల్లోకి చొచ్చుకు పోయారు నిరోషా. 'ఘర్షణ' (1988) చిత్రంలోని ఈ పాటతో పాటు ఈ చిత్రంలో నాయికగా నిరోషాకి మంచి మార్కులే పడ్డాయి. ఇక 'సింధూరపువ్వు'లోనూ ఆమె కథానాయికగా నటించిన విషయం తెలిసిందే. ఆ తర్వాత పెద్దగా సినిమాలు చేయని నిరోషా క్యారెక్టర్ ఆర్టిస్ట్గా ఆ మధ్య ఎంట్రీ ఇచ్చారు. కాగా రజనీకాంత్ కీ రోల్ చేసిన 'లాల్ సలామ్'లో ఆయనకు జోడీగా నిరోషా కనిపిస్తారన్నది కోలీవుడ్ టాక్. విష్ణు విశాల్, విక్రాంత్ హీరోలుగా రజనీ పెద్ద కుమార్తె ఐశ్వర్య దర్శకత్వంలో ఈ చిత్రం రూపొందుతోంది. ఇందులో మొయుద్దీన్ భాయ్ పాత్రలో కనిపిస్తారు రజనీకాంత్. ఆయనకు చెల్లెలి పాత్రను జీవిత చేస్తున్న విషయాన్ని చిత్ర యూనిట్ అధికారికంగా ప్రకటించింది. భార్య పాత్రను నిరోషా చేస్తున్నట్లు వార్తలు వచ్చాయి. ఈ విషయంపై చిత్ర యూనిట్ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.


శింబు

మణిరత్నంతో మళ్లీ..

ముప్పై అయిదేళ్ల తర్వాత హీరో కమల్హాసన్, దర్శకుడు మణిరత్నం కాంబినేషన్లో ఓ సినిమా రూపొందనున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రం షూటింగ్ను ఈ ఏడాది చివర్లో ప్రారంభించే ఆలోచనలో ఉన్నారట మణిరత్నం. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన ఇతర నటీనటుల ఎంపిక జరుగుతోందని, ఇందులో భాగంగానే కథలోని ఓ కీలక పాత్ర కోసం మణిరత్నం నుంచి శింబుకు కబురు వెళ్లిందనీ టాక్. ఇక మణిరత్నం దర్శకత్వంలో వచ్చిన 'చెక్క చివంద వానం' (2018) (తెలుగులో 'నవాబ్') సినిమాలో శింబు ఓ లీడ్ రోల్లో నటించిన విషయం గుర్తుండే ఉంటుంది. మరి.. కమల్–మణిరత్నం కాంబో సినిమాలో శింబు నటిస్తారా? అనేది వేచి చూడాల్సిందే. ఇక కమల్, మణిరత్నం కాంబినేషన్లో 1987లో 'నాయగన్' (తెలుగులో 'నాయకుడు') వచ్చిన సంగతి తెలిసిందే.

ప్రేక్షకులు మరోసారి నిరూపించారు

– భరద్వాజ


కీర్తిలత, రాజా నరేందర్, రమేష్, తమ్మారెడ్డి భరద్వాజ

'బలగం' ఫేమ్ సుధాకర్ రెడ్డి, అంజి వల్గమాన్, సాయి ప్రసన్న, అభి, రూప ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'భీమదేవరపల్లి బ్రాంచి'. డా బత్తిని కీర్తిలత గౌడ్, రాజా నరేందర్ చెట్లపెల్లి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 23న విడుదలైంది. ఈ సందర్భంగా జరిగిన ఈ సినిమా సక్సెస్మీట్కు అతిథిగా హాజరైన దర్శక–నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ మాట్లాడుతూ– "ప్రజల జీవన విధానాలను, వారి ఎమోషన్స్ను బేస్ చేసుకుని కథ సిద్ధం చేసుకుంటే సక్సెస్ వస్తుందని ప్రేక్షకులు మరోసారి నిరూపించిన చిత్రమిది" అన్నారు. "ఇలాంటి కథలు మన జీవితాలను ప్రపంచానికి తెలియజేస్తాయి" అన్నారు 'బలగం' ఫేమ్ సుధాకర్రెడ్డి. "'బలగం' తరహాలోనే 'భీమదేవరపల్లి బ్రాంచి' కూడా మంచి విజయం సాధించింది" అన్నారు తెలంగాణ బీసీ కార్పొరేషన్ ఛైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్రావు. "నేటి విటీతో కూడిన మెసేజ్ ఓరియెంటెడ్ చిత్రం ఇది. ఈ సినిమాపై మాకు ఉన్న నమ్మకం వమ్ము కాలేదు" అన్నారు నిర్మాతలు.


శ్రీ విష్ణు, చిరంజీవి

కేజీఎఫ్లో బానిసల్లా చూస్తాడు!

"బాక్సాఫీస్ బాలు ఫ్యామిలీ మేము. డబ్బులు అతని దగ్గర తీసుకోండి' అనే డైలాగ్తో మొదలవుతుంది 'సామజ వరగమన' సినిమా ట్రైలర్. శ్రీ విష్ణు హీరోగా 'వివాహభోజనంబు' ఫేమ్ రామ్ అబ్బరాజు దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'సామజ వరగమన'. అనిల్ సుంకర సమర్పణలో రాజేష్ దండా నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 29న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమా ట్రైలర్ను హీరో చిరంజీవి విడుదల చేసి, చిత్ర యూనిట్కు శుభాకాంక్షలు తెలిపారు. 'వాడి దృష్టిలో ఫ్యామిలీ మెంబర్స్ అంటే.. కేజీఎఫ్లో బానిసల్లా చూస్తాడు' (వీకే నరేశ్), 'ఎప్పుడైనా ఏదైనా పనికొచ్చే పని చేశావా.. చెత్త నుంచి కూడా కరెంట్ తీస్తున్నారు' (శ్రీ విష్ణు) అనే డైలాగ్స్ ట్రైలర్లో ఉన్నాయి. "అమ్మాయిల పట్ల విరక్తి పెంచుకునే ఓ మధ్యతరగతి కుర్రాడు బాలు. అయితే రిచ్ లైఫ్స్టైల్ కోరుకునే ఓ అమ్మాయి అతని జీవితంలోకి వచ్చినప్పుడు ఏం జరుగుతుందనేదే ఈ సినిమా కథ" అనిచిత్ర యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: గోపీ సుందర్, సహనిర్మాత: బాలాజీ గుత్తా.

మన జీవితం ఓ సర్కిల్

– రిచా పనై, అర్షిణ్


రిచా పనై
అర్షిణ్

సాయి రోనక్, బాబా భాస్కర్ ప్రధాన పాత్రల్లో, హీరోయిన్స్ అర్షిణ్ మెహతా, రిచా పనై, నైనా కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'సర్కిల్'. నీలకంఠ దర్శకత్వంలో ఎమ్.వి. శరత్ చంద్ర, టి. సుమలత అన్నిత్ రెడ్డి, వేణుబాబు అడ్డగడ నిర్మించిన ఈ చిత్రం జూలై 7న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా జరిగిన విలేకరుల సమావేశంలో **రిచా పనై మాట్లాడుతూ–** "'సర్కిల్'లో ఓ పెయింటర్ పాత్రలో కనిపిస్తాను. ఈ పాత్ర బోల్డ్గా ఉంటుంది. ఈ తరం అమ్మాయిలు ఎలా ఉంటారో, ఎంత ఫ్రీడమ్ కోరుకుంటారో ఈ సినిమాలో నా పాత్ర అలా ఉంటుంది. మన జీవితం ఓ సర్కిల్ లాంటిదని నేను నమ్ముతాను. మనం ప్రపంచానికి ఏదైతే చేస్తామో అదే మనకి తిరిగి వస్తుందని నమ్ముతాను. ఇక 'యముడికి మొగుడు, చందమామ కథలు' సినిమాల తర్వాత నాకు చాలా అవకాశాలు వస్తాయిని అనుకున్నాను. కానీ అలా జరగలేదు. అయితే కొన్ని ఆఫర్స్ వచ్చినా, అవి నాకు నచ్చలేదు. ప్రస్తుతం ముంబైలో ఓ కేఫ్ రన్ చేస్తున్నాను. మంచి అవకాశాల కోసం ఎదురు చూస్తున్నాను" అని అన్నారు.

అర్షిణ్ మెహతా మాట్లాడుతూ– "మా ఫ్యామిలీలో ఐఏఎస్లు, పీహెచ్డీ హోల్డర్స్ ఉన్నారు. నేను చార్టెడ్ అకౌంటెంట్ (సీఏ)ని. అయితే యాక్టింగ్ నా డ్రీమ్. ఇందుకోసం చాలా ఆడిషన్స్ ఇచ్చాను. కొన్ని రిజెక్షన్స్ కూడా ఉన్నాయి. ఆ తర్వాత కొన్ని యాడ్స్తో పాటు బాలీవుడ్ చిత్రాల్లో కొన్ని కీలక పాత్రలు చేశాను. తెలుగులో నా తొలి చిత్రం 'సర్కిల్'. ఇందులో నేను ఓ రాయల్ ప్రిన్సెస్లా కనిపిస్తాను. ఫొటోగ్రాఫర్కు, రాయల్ ప్రిన్సెస్కు మధ్య ఉన్న లవ్స్టోరీ ఆసక్తికరంగా ఉంటుంది. మన లైఫ్ ఓ సర్కిల్లాంటిది. అదే ఈ సినిమాలో చూపించాం. ప్రస్తుతం ఒక సినిమాతో పాటు, కొన్ని వెబ్ సిరీస్లు చేస్తున్నాను" అన్నారు.



వెస్ట్ జోన్ జట్టులో పుజారా, సూర్యకుమార్

వెస్టిండీస్‌తో జరిగే టెస్టు సిరీస్ కోసం భారత జట్టులో ఎంపిక కాలేకపోయిన సీనియర్ క్రికెటర్ చతేశ్వర్ పుజారా, ముంబై ప్లేయర్ సూర్యకుమార్ యాదవ్‌దులీప్ ట్రోఫీలో బరిలోకి దిగనున్నారు. పుజారా, సూర్యకుమార్ డిఫెండింగ్ చాంపియన్ వెస్ట్ జోన్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారు. వెస్టిండీస్‌తో సిరీస్‌లో ఆడనున్న రుతురాజ్ గైక్వాడ్, యశస్వి జైస్వాల్ స్థానాల్లో వీరిద్దరిని వెస్ట్ జోన్ జట్టులోకి ఎంపిక చేశారు. ఈస్ట్ జోన్, సెంట్రల్ జోన్ జట్ల మధ్య జరిగే మ్యాచ్ విజేతతో జూలై 5 నుంచి జరిగే సెమీఫైనల్లో వెస్ట్ జోన్ తలపడుతుంది.

గోల్ఫర్ దీక్ష ఖాతాలో యూరోపియన్ టూర్ టైటిల్



భారత గోల్ఫర్ దీక్ష డాగర్ మహిళల యూరోపియన్ టూర్‌లో భాగంగా జరిగిన చెక్ లేడీస్ ఓపెన్ టోర్నీలో విజేతగా నిలిచింది. చెక్ రిపబ్లిక్‌లో జరిగిన ఈ టోర్నీలో థాయ్‌లాండ్ గోల్ఫర్ త్రిచట్ చీంగ్లాబ్ నుంచి పోటీ ఎదురైనప్పటికీ నిలకడైన ప్రదర్శనతో ఆమె గెలిచింది. హరియాణాకు చెందిన 22 ఏళ్ల దీక్షకిది రెండో టైటిల్. 2019లో దక్షిణాఫ్రికా ఓపెన్‌లో ఆమె గెలిచింది. బధిర క్రీడాకారిణి అయిన దీక్ష టోక్యో ఒలింపిక్స్‌లో, డెఫిలింపిక్స్‌లో పోటీపడింది.

భారత షూటింగ్ జట్టులో కైనన్

ప్రపంచ చాంపియన్‌షిప్, ఆసియా క్రీడలకు ఎంపిక



న్యూఢిల్లీ: హైదరాబాద్ షూటర్ కైనన్ షెనాయ్ త్వరలో జరిగే ప్రపంచ చాంపియన్‌షిప్ పోటీల్లో, ఆసియా క్రీడల్లో పాల్గొనే భారత జట్టులో ఎంపిక య్యాడు. 32 ఏళ్ల కైనన్ 2019లో చివరిసారి ప్రపంచ చాంపియన్‌షిప్‌లో... 2014లో ఇంచియోన్ ఆసియా క్రీడల్లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించాడు. ప్రస్తుతం న్యూఢిల్లీలో నిర్వహిస్తున్న ట్రయల్స్‌లో కైనన్ రాణించి భారత జట్టులో చోటు సంపాదించాడు. ఈ రెండు మెగా ఈవెంట్స్‌లో పాల్గొనే భారత ట్రాప్, స్కీట్ జట్లను ఆదివారం ప్రకటించారు. ఆగస్టు 14 నుంచి సెప్టెంబర్ 1 వరకు అజర్‌బైజాన్‌లో ప్రపంచ చాంపియన్‌షిప్ పోటీలు.. సెప్టెంబర్ 23 నుంచి అక్టోబర్ 8 వరకు చైనాలోని హాంగ్జౌ నగరంలో ఆసియా క్రీడలు జరుగుతాయి. భారత పురుషుల ట్రాప్ విభాగం జట్టులో కైనన్‌తో పాటు పృథ్వీరాజ్ తొండైమన్, జొరావర్ సింగ్ సంధూ ఎంపికయ్యారు. ట్రాప్ మిక్స్‌డ్ టీమ్‌లో కైనన్ షెనాయ్–ప్రీతి రజక్ జోడీ పోటీపడుతుంది. 2016 రియో ఒలింపిక్స్‌లో బరిలోకి దిగిన కైనన్ ట్రాప్ ఈవెంట్‌లో 19వ ర్యాంక్‌లో నిలిచాడు. ఐదుసార్లు సీనియర్ ప్రపంచ చాంపియన్‌షిప్‌లో పోటీపడ్డ కైనన్ పతకం మాత్రం గెలవలేకపోయాడు. ప్రపంచకప్ టోర్నీల్లో టీమ్ ఈవెంట్‌లో కైనన్ ఒక స్వర్ణం, ఒక రజతం, ఒక కాంస్యం సాధించాడు. 2017 ఆసియా చాంపియన్‌షిప్‌లో కాంస్య పతకం గెలిచాడు.



ప్రీమియర్ హ్యాండ్‌బాల్ లీగ్ తొలి సీజన్‌లో మహారాష్ట్ర ఐరన్‌మెన్ జట్టు విజేతగా నిలిచింది. జైపూర్‌లో జరిగిన ఫైనల్లో మహారాష్ట్ర ఐరన్‌మెన్ జట్టు 38–24తో గోల్డెన్ ఈగల్స్ ఉత్తరప్రదేశ్ జట్టుపై గెలిచింది.

అన్ని ఫార్మాట్లకు సిద్ధం: కేఎస్ భరత్



సాక్షి, సిటీ బ్యూరో: వచ్చే నెలలో వెస్టిండీస్ జట్టుతో జరిగే టెస్టు సిరీస్ కోసం సన్నద్ధమవుతున్నానని భారత జట్టు వికెట్ కీపర్, ఆంధ్ర క్రికెటర్ కోన శ్రీకర్ (కేఎస్) భరత్ వ్యాఖ్యానించాడు. రాబోయే రోజుల్లో వన్డే, టి20 ఫార్మాట్‌లలోనూ భారత జట్టులో ఎంపిక కావడమే తన తదుపరి లక్ష్యమని భరత్ తెలిపాడు. తెలుగు రాష్ట్రాల్లో ప్రఖ్యాతి చెందిన రెటీనా పెయింట్స్ దేశవ్యాప్తంగా తమ సేవలను విస్తరించడంలో భాగంగా క్రికెటర్ కేఎస్ భరత్‌ను తమ సంస్థ బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించింది. దీనికి సంబంధించి ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో భరత్ మాట్లాడుతూ... వ్యక్తిగత వృద్ధి కన్నా సంస్థ అభివృద్ధే లక్ష్యంగా పనిచేసే బృందమున్న రెటీనా పెయింట్స్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరించనుండటం తన బాధ్యతను పెంచిందని అన్నాడు. 22 ఏళ్లుగా క్రికెట్‌తో ప్రయాణిస్తున్నానని, తిరిగి చూసుకుంటే ఇక్కడి గల్లీ క్రికెట్ అనుభవాలు గుర్తుకొస్తున్నాయని భరత్ పేర్కొన్నాడు. ఆటపరంగానే కాకుండా వ్యక్తిగతంగానూ రాహుల్ ద్రవిడ్, ధోనీని అభిమానిస్తానని అన్నాడు. తనకు తెలుపు రంగు అంటే ఇష్టమని... దానికి తగ్గట్టుగానే మొదటగా టెస్ట్ క్రికెట్‌లో అరంగేట్రం చేయడం సంతోషంగా ఉందన్నాడు. ఈ కార్యక్రమంలో రెటీనా పెయింట్స్ ఎండీ రాకేష్ కూడా పాల్గొన్నారు.



సుతీర్థ-ఐహిక జోడీకి టైటిల్

ట్యూనిస్ (ట్యూనిషియా): ఏమాత్రం అంచనాలు లేకుండా బరిలోకి దిగిన భారత జోడీ సుతీర్థ ముఖర్జీ–ఐహిక ముఖర్జీ వరల్డ్ టేబుల్ టెన్నిస్ (డబ్ల్యూటీటీ) కంటెండర్ టోర్నీలో సంచలనం సృష్టించింది. ఆదివారం ముగిసిన ఈ టోర్నీలో సుతీర్థ–ఐహిక ద్వయం మహిళల డబుల్స్‌లో చాంపియన్‌గా నిలిచింది. మియు కిహారా–మివా హారిమోటో (జపాన్) జంటతో 35 నిమిషాల పాటు జరిగిన ఫైనల్లో సుతీర్థ–ఐహిక జోడీ 11–5, 11–6, 5–11, 13–11తో నెగ్గింది. విజేతగా నిలిచిన సుతీర్థ–ఐహిక జంటకు 1,000 డాలర్ల (రూ. 82 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 400 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. భారత క్రీడాకారులకు డబ్ల్యూటీటీ కంటెండర్ టోర్నీ టైటిల్ లభించడం ఇది మూడోసారి. 2019లో మనిక బత్రా–అర్చన కామత్ స్లొవేనియా డబ్ల్యూటీటీ టోర్నీలో మహిళల డబుల్స్ టైటిల్‌ను... 2021లో సత్యన్ జ్ఞానశేఖరన్–హర్మీత్ దేశాయ్ ట్యూనిషియాలో జరిగిన డబ్ల్యూటీటీ టోర్నీలో పురుషుల డబుల్స్ టైటిల్‌ను గెల్చుకున్నారు.

శ్రీలంక 'హ్యాట్రిక్'

- వరుసగా మూడో విజయంతో 'సూపర్ సిక్స్' దశకు అర్హత
- కరుణరత్నే సెంచరీ
- మూడో ఓటమితో ఐర్లాండ్ అవుట్
- ఐసీసీ వరల్డ్ కప్ క్వాలిఫయింగ్ టోర్నీ





బులవాయో: మాజీ చాంపియన్ శ్రీలంక వన్డే వరల్డ్ కప్ క్వాలిఫయింగ్ క్రికెట్ టోర్నీలో వరుసగా మూడో విజయం సాధించింది. ఐర్లాండ్ జట్టుతో ఆదివారం జరిగిన గ్రూప్ 'బి' లీగ్ మ్యాచ్‌లో శ్రీలంక 133 పరుగుల తేడాతో గెలిచి 'హ్యాట్రిక్' నమోదు చేసింది. ఈ విజయంతో శ్రీలంక 'సూపర్ సిక్స్' దశకు అర్హత సాధించింది. వరుసగా మూడో ఓటమితో ఐర్లాండ్ 'సూపర్ సిక్స్' దశకు చేరుకోవడంలో విఫలమైంది. టాస్ నెగ్గిన ఐర్లాండ్ ఫీల్డింగ్ ఎంచుకోగా... మొదట బ్యాటింగ్ చేసిన శ్రీలంక 49.5 ఓవర్లలో 325 పరుగులకు ఆలౌటైంది. ఓపెనర్ దిముత్ కరుణరత్నే (103 బంతుల్లో 103; 8 ఫోర్లు) సెంచరీ సాధించగా... సమరవిక్రమ (86 బంతుల్లో 82; 4 ఫోర్లు) అర్ధ సెంచరీ చేశాడు. వీరిద్దరు మూడో వికెట్‌కు 168 పరుగులు జోడించారు. అసలంక (30 బంతుల్లో 38; 1 ఫోర్, 2 సిక్స్‌లు), ధనంజయ డిసిల్వా (35 బంతుల్లో 42 నాటౌట్; 4 ఫోర్లు, 1 సిక్స్) కూడా రాణించారు. ఐర్లాండ్ బౌలర్లలో మార్క్ అడైర్ (4/46), మెకార్తీ (3/56), గ్యారెత్ డెలానీ (2/52) ఆకట్టుకున్నారు. 326 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఐర్లాండ్ జట్టు 31 ఓవర్లలో 192 పరుగులకు ఆలౌటై ఓడిపోయింది. శ్రీలంక లెగ్‌స్పిన్నర్ హసరంగ 79 పరుగులిచ్చి 5 వికెట్లు పడగొట్టాడు.

స్కాట్లాండ్ కూడా...

గ్రూప్ 'బి'లో భాగంగా జరిగిన మరో మ్యాచ్‌లో స్కాట్లాండ్ 76 పరుగుల తేడాతో ఒమన్ జట్టుపై నెగ్గి వరుసగా మూడో విజయం సాధించింది. ఈ గెలుపుతో స్కాట్లాండ్... ఓడిన ఒమన్ జట్టు కూడా 'సూపర్ సిక్స్' బెర్త్‌లు ఖరారు చేసుకున్నాయి. తొలుత బ్యాటింగ్ చేసిన స్కాట్లాండ్ సరిగ్గా 50 ఓవర్లలో 320 పరుగులకు ఆలౌటైంది. బ్రాండన్ మెక్‌ములెన్ (121 బంతుల్లో 136; 14 ఫోర్లు, 3 సిక్స్‌లు) భారీ సెంచరీ చేయగా... కెప్టెన్ రిచీ బెరింగ్టన్ (62 బంతుల్లో 60; 7 ఫోర్లు) అర్ధ సెంచరీ సాధించాడు. ఒమన్ బౌలర్ బిలాల్ ఖాన్ 55 పరుగులిచ్చి 5 వికెట్లు తీశాడు. 321 పరుగుల లక్ష్యాన్ని ఛేదించడానికి బరిలోకి దిగిన ఒమన్ జట్టు 50 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 244 పరుగులు చేసి ఓడిపోయింది.

అల్‌కరాజ్ తొలిసారి...

- గ్రాస్ కోర్టులపై మొదటి టైటిల్
- మళ్లీ నంబర్‌వన్ ర్యాంక్ సొంతం



లండన్: ప్రతిష్టాత్మక వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీకి సన్నాహకంగా భావించే క్వీన్స్ క్లబ్ చాంపియన్‌షిప్‌లో స్పెయిన్ స్టార్ కార్లోస్ అల్‌కరాజ్ విజేతగా నిలిచాడు. ఆదివారం జరిగిన పురుషుల సింగిల్స్ ఫైనల్లో ప్రపంచ రెండో ర్యాంకర్ అల్‌కరాజ్ 6–4, 6–4తో అలెక్స్ డి మినార్ (ఆస్ట్రేలియా)పై గెలిచాడు. 99 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో స్పెయిన్ స్టార్ ఏడు ఏస్‌లు సంధించడంతోపాటు ప్రత్యర్థి సర్వీస్‌ను రెండుసార్లు బ్రేక్ చేశాడు. గ్రాస్ కోర్టులపై అల్‌కరాజ్‌కిదే తొలి టైటిల్ కావడం విశేషం. ఓవరాల్‌గా అతని కెరీర్‌లో ఇది 11వ సింగిల్స్ టైటిల్. ఈ స్పెయిన్ స్టార్‌కు 4,77,795 యూరోల (రూ. 4 కోట్ల 26 లక్షలు) ప్రైజ్‌మనీతోపాటు 500 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. ఈ గెలుపుతో అల్‌కరాజ్ నేడు విడుదల చేసే ప్రపంచ ర్యాంకింగ్స్‌లో మళ్లీ నంబర్‌వన్ ర్యాంక్‌ను అందుకోనున్నాడు. దాంతోపాటు వచ్చే నెలలో మొదలయ్యే వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో టాప్ సీడ్‌గా బరిలోకి దిగనున్నాడు.

ఇకపై రోడ్డెక్కం... కోర్టులోనే తేల్చుకుంటాం

బ్రిజ్‌భూషణ్‌పై మారిన రెజ్లర్ల వైఖరి ● సోషల్ మీడియాకు కొన్ని రోజులు దూరం


వినేశ్

న్యూఢిల్లీ: లైంగిక వేధింపులకు పాల్పడిన భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) అధ్యక్షుడు, బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్ సింగ్‌ను అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ రెండుసార్లు నిరసన దీక్ష చేపట్టిన స్టార్ రెజ్లర్ల వైఖరి మారింది. తమకు న్యాయం దక్కేవరకు ఆయనపై పోరాటం కొనసాగుతుందని, అయితే అది కోర్టులోనే తేల్చుకుంటామని... ఇకపై రోడ్డెక్కబోమని రెజ్లర్లు ప్రకటించారు. 'డబ్ల్యూఎఫ్ఐ ఎన్నికల ప్రక్రియ ముగిశాక మాకు ఇచ్చిన హామీలు నెరవేరుస్తామని ప్రభుత్వం తెలిపింది. ఆ మేరకు మేం వేచిచూస్తాం. కానీ బ్రిజ్‌భూషణ్‌పై మా పోరాటాన్ని మాత్రం విరమించే ప్రసక్తేలేదు' అని వినేశ్ ఫొగాట్ ట్వీట్ చేసింది. అనంతరం కొన్నాళ్లపాటు సోషల్ మీడియాకు దూరంగా ఉంటామని వినేశ్‌తో పాటు సాక్షి మలిక్ తెలిపింది.

డబ్ల్యూఎఫ్ఐ ఎన్నికలపై స్టే

గువాహటి: భారత రెజ్లింగ్ సమాఖ్య ఎన్నికలు చాలాసార్లు వాయిదా పడ్డాయి. తాజాగా ఇప్పుడు గువాహటి హైకోర్టు స్టేతో మరో వాయిదా తప్పేలాలేదు. అస్సాం సంఘం తమ సభ్యత్వాన్ని గుర్తించకపోవడం, ఓటింగ్‌లో పాల్గొనే అవకాశం ఇవ్వకపోవడంతో హైకోర్టులో పిటీషన్ వేయగా వచ్చే నెల 11న జరగాల్సిన డబ్ల్యూఎఫ్ఐ ఎన్నికలపై కోర్టు స్టే విధించింది.

విద్య, ఉద్యోగ సమాచారం

ఆర్మీ నర్సింగ్ కళాశాలల్లో బీఎస్సీ నర్సింగ్ కోర్సుల్లో ప్రవేశాలు

దేశవ్యాప్తంగా ఉన్న కాలేజ్ ఆఫ్ నర్సింగ్ ఆఫ్ ఆర్మ్‌డ్ ఫోర్సెస్ మెడికల్ సర్వీసెస్(ఏఎఫ్ఎంఎస్)ల్లో 2023 విద్యా సంవత్సరానికి సంబంధించి నాలుగేళ్ల బీఎస్సీ(నర్సింగ్) కోర్సుల్లో ప్రవేశానికి అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం సీట్ల సంఖ్య:** 220
» **ఏఎఫ్ఎంఎస్, సీట్లు:** కాలేజ్ ఆఫ్ నర్సింగ్, పుణె-40,కాలేజ్ ఆఫ్ నర్సింగ్, కోల్‌కతా-30, కాలేజ్ ఆఫ్ నర్సింగ్, ముంబై-40, కాలేజ్ ఆఫ్ నర్సింగ్, న్యూఢిల్లీ-30, కాలేజ్ ఆఫ్ నర్సింగ్, లక్నో-40, కాలేజ్ ఆఫ్ నర్సింగ్, బెంగళూరు-40.
» **అర్హత:** అవివాహిత/విడాకులు తీసుకున్న/చట్టబద్ధంగా విడిపోయిన/వితంతువులైన మహిళా అభ్యర్థులు అర్హులు. కనీసం 50శాతం మార్కులతో ఇంటర్(బైపీసీ)/10+2(ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, ఇంగ్లిష్) ఉత్తీర్ణులై ఉండాలి. నీట్(యూజీ) 2023లో అర్హత సాధించి ఉండాలి. కనిష్ట ఎత్తు 152 సెం.మీ. కలిగి ఉండాలి.
» **వయసు:** 01.10.1998 నుంచి 30.09.2006 మధ్య జన్మించిన ఉండాలి.
» **ఎంపిక విధానం:** నీట్ 2023 స్కోర్, జనరల్ ఇంటెలిజెన్స్/జనరల్ ఇంగ్లిష్ టెస్ట్, సైకలాజికల్ అసెస్‌మెంట్, ఇంటర్వ్యూ, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా సీటు కేటాయిస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 04.07.2023.
» **వెబ్‌సైట్:** www.joinindianarmy.nic.in

తెలంగాణ రాష్ట్ర ఏకలవ్య ఆదర్శ పాఠశాలల్లో పీజీటీ, టీజీటీ పోస్టులు

తెలంగాణ రాష్ట్ర ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్స్ సొసైటీ(టీఎస్ఈఎస్).. 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి రాష్ట్రంలోని 23 ఏకలవ్య ఆదర్శ పాఠశాలల్లో తాత్కాలిక ప్రాతిపదికన 239 బోధన, బోధనేతర సిబ్బంది నియామకాలకు నోటిఫికేషన్ విడుదల చేసింది.

» **పోస్టులు:** పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్‌లు(పీజీటీ), ట్రెయిన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్(టీజీటీ), లైబ్రేరియన్.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీ, బీఈడీ, బీఎల్ఐఎస్సీ ఉత్తీర్ణులై ఉండాలి. » **వయసు:** 01.07.2023 నాటికి 60 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు పీజీటీలకు రూ.35,750, టీజీటీలకు రూ.34,125, లైబ్రేరియన్‌లకు రూ.30,000.
» **ఎంపిక విధానం:** విద్యార్హత మార్కులు, బోధన అనుభవం, డెమో తదితరాల ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా.
» **ఆఫ్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**30.06.2023
» **వెబ్‌సైట్:** https://fastses.telangana.gov.in

తెలంగాణ రాష్ట్రంలో మైనారిటీలకు సివిల్స్ ఉచిత కోచింగ్

తెలంగాణ రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ, తెలంగాణ మైనారిటీ స్టడీ సర్కిల్ అండ్ కెరియర్ కౌన్సెలింగ్ సెంటర్.. యూపీఎస్సీ నిర్వహించే సీశాట్ 2024(సివిల్ సర్వీసెస్)కు సంబంధించి ఉచిత శిక్షణ అందించేందుకు నోటిఫికేషన్ జారీ చేసింది.

» **అర్హతలు:** తెలంగాణ రాష్ట్రానికి చెందిన మైనారిటీ కమ్యూనిటీ(ముస్లిం, క్రిస్టియన్, సిఖ్, జైన్, బుద్దిస్ట్, పార్శీ)కి చెందిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలి.
» **మొత్తం సీట్ల సంఖ్య:** 100.
» **రిజర్వేషన్:** మొత్తం సీట్లలో మహిళలకు 33.33 శాతం,దివ్యాంగులకు 5శాతం కేటాయించారు.
» **అర్హత:** ఏదైనా జనరల్/ప్రొఫెషనల్ డిగ్రీ ఉత్తీర్ణులైన అభ్యర్థులు అర్హులు. అభ్యర్థి తల్లిదండ్రులు/సంరక్షకుల వార్షికాదాయం రూ.2 లక్షలకు మించకూడదు.
» **ఎంపిక విధానం:** ప్రవేశ పరీక్షలో సాధించిన మెరిట్ ఆధారంగా సీటు కేటాయిస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 26.06.2023.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**13.07.2023.
» **స్క్రీనింగ్ టెస్ట్ తేది:** 23.07.2023.
» **పరీక్ష కేంద్రాలు:** అన్ని జిల్లాల ప్రధాన కేంద్రాల్లోని తెలంగాణ మైనారిటీల గురుకుల పాఠశాలల్లో పరీక్ష జరుగుతుంది.
» **వెబ్‌సైట్:** www.cet.cgg.gov.in/tmreis

డీఆర్‌డీవో-ఎన్ఎస్‌టీఎల్, విశాఖపట్నంలో 62 అప్రెంటిస్‌లు

విశాఖపట్నంలోని డీఆర్‌డీవోకి చెందిన నావల్ సైన్స్ అండ్ టెక్నలాజికల్ లాబొరేటరీ (ఎన్ఎస్‌టీఎల్).. 2023–24 సంవత్సరానికి సంబంధించి అప్రెంటిస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 62
» **ఖాళీల వివరాలు:** గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌లు–28, డిప్లొమా అప్రెంటిస్‌లు–23, ట్రేడ్ అప్రెంటిస్–11.
» **స్టైపెండ్:** నెలకు రూ.8000 నుంచి రూ.9000 చెల్లిస్తారు.
» **అర్హత:** 2021, 2022–2023 సంవత్సరాల్లో సంబంధిత విభాగంలో ఐటీఐ, డిప్లొమా, బీఈ/బీటెక్ ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 28.06.2023 నాటికి 18 ఏళ్లు నిండి ఉండాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** ఎంప్లాయ్‌మెంట్ న్యూస్‌లో ప్రకటన వెలువడిన తేదీ నుంచి 15 రోజుల్లోగా దరఖాస్తు చేసుకోవాలి.
» **వెబ్‌సైట్:** drdo.gov.in

ఐసీడీఎస్ ప్రాజెక్ట్, ప్రకాశం జిల్లాలో వివిధ ఉద్యోగాలు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, ప్రకాశం జిల్లాకు చెందిన ఐసీడీఎస్ ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్.. ఒప్పంద ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 06
» **పోస్టుల వివరాలు:** జిల్లా స్థాయి ప్రాజెక్ట్ అసిస్టెంట్(డి.పి.ఎ)–01, బ్లాక్ స్థాయి ప్రాజెక్ట్ కోఆర్డినేటర్–05.
» **అర్హత:** పోస్టును అనుసరించి గ్రాడ్యుయేషన్/పీజీ డిప్లొమా ఉత్తీర్ణులవ్వాలి.
» **పని అనుభవం:** కనీసం 2 ఏళ్ల పని అనుభవం ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.18,000 నుంచి రూ.20,000 చెల్లిస్తారు.
» **ఎంపిక విధానం:** షార్ట్‌లిస్టింగ్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా.
» **దరఖాస్తులకు చివరితేది:** 28.06.2023.
» **వెబ్‌సైట్:** https://prakasam.nic.in

జీజీహెచ్ కాకినాడలో 97 స్టాఫ్ నర్స్ పోస్టులు

కాకినాడలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి కాంట్రాక్ట్ ప్రాతిపదికన స్టాఫ్ నర్స్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 97
» **పోస్టుల వివరాలు:** స్టాఫ్ నర్స్(జీఎన్ఎం)–43, స్టాఫ్ నర్స్(బీఎస్సీ నర్సింగ్)–28, స్టాఫ్ నర్స్(ఎంఎస్సీ నర్సింగ్)–26.
» **అర్హత:** జీఎన్ఎం/బీఎస్సీ(నర్సింగ్)/ఎంఎస్సీ(నర్సింగ్) ఉత్తీర్ణులై ఉండాలి. » **వయసు:** 01.07.2023 నాటికి 42 ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక విధానం:** అకడమిక్ మెరిట్, పని అనుభవం, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును కాకినాడ జీజీహెచ్ కార్యాలయంలోని నిర్దిష్ట కౌంటర్లలో సమర్పించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 30.06.2023
» **వెబ్‌సైట్:** kakinada.ap.gov.in

పీహెచ్‌డీతో అగ్రి సైంటిస్ట్

ఏఎస్ఆర్‌బీ.. అగ్రికల్చరల్ సైంటిస్ట్ రిక్రూట్‌మెంట్ బోర్డ్! అగ్రికల్చరల్ రీసెర్చ్ సర్వీసెస్ (ఏఆర్ఎస్) ఎగ్జామ్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఏఆర్ఎస్ పరీక్ష ద్వారా ఇండియన్ కౌన్సెల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్‌లో..260 సైంటిస్ట్ పోస్టుల భర్తీకి ఎంపిక ప్రక్రియ చేపట్టనుంది. అగ్రికల్చర్ సంబంధిత కోర్సుల్లో పీహెచ్‌డీ ఉత్తీర్ణులకు ఏఎస్ఆర్‌బీ ఆహ్వానం పలుకుతోంది. ప్రతి ఏటా ఏఆర్ఎస్ పరీక్షను నిర్వహిస్తున్న ఏఎస్ఆర్‌బీ.. తాజాగా 2023 సంవత్సరానికి సంబంధించి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నేపథ్యంలో.. ఏఎస్ఆర్‌బీ పోస్టులు, అర్హతలు, ఎంపిక విధానం తదితర వివరాలు..

» అగ్రికల్చరల్ రీసెర్చ్ సర్వీసెస్ పరీక్షకు నోటిఫికేషన్
» ఐసీఏఆర్‌లో సైంటిస్ట్ పోస్టుల భర్తీకి ఎంపిక ప్రక్రియ
» మొత్తం 51 విభాగాల్లో 260 పోస్టులు
» ప్రారంభ వేతన శ్రేణి రూ.57,700–రూ.1,82,400


ఏఆర్ఎస్-2023

ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్.. సంక్షిప్తంగా ఐసీఏఆర్. వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ విభాగాల్లో పరిశోధనలకు, ఆవిష్కరణలకు ప్రసిద్ధి గడించిన ఇన్‌స్టిట్యూట్. ఇందులో యువ సైంటిస్ట్‌లకు అవకాశం కల్పించాలనే ఉద్దేశంతో నిర్వహించే పరీక్ష.. అగ్రికల్చరల్ సైంటిస్ట్ ఎగ్జామినేషన్. ఏఎస్ఆర్‌బీ.. ప్రతిఏటా ఏఆర్ఎస్‌ను నిర్వహిస్తూ.. అర్హులైన అభ్యర్థులను ఐసీఏఆర్‌కు సిఫార్సు చేస్తుంది. పీహెచ్‌డీ పూర్తి చేసుకుని.. సైంటిస్ట్‌గా కొలువు సొంతం చేసుకోవాలనుకునే వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

మొత్తం పోస్టులు 260

ఈ ఏడాది అగ్రికల్చరల్ రీసెర్చ్ సర్వీసెస్ ఎగ్జామినేషన్ ద్వారా వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ విభాగాలకు సంబంధించి మొత్తం 51 విభాగాల్లో 260 సైంటిస్ట్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది. అభ్యర్థులు తాము దరఖాస్తు చేసుకునే విభాగానికి సంబంధించిన స్పెషలైజేషన్‌తో పీహెచ్‌డీలో ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది.

అర్హతలు

- నిర్దేశిత విభాగాలు/అంశాల్లో సెప్టెంబర్ 30లోపు పీహెచ్‌డీ పూర్తి చేసుకోవాలి.
- **వయసు:** జనవరి 1, 2023 నాటికి 21–35ఏళ్ల మధ్యలో ఉండాలి. ఎస్‌సీ/ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు చొప్పున గరిష్ట వయో పరిమితిలో సడలింపు లభిస్తుంది.

రెండు దశల్లో ఎంపిక ప్రక్రియ

- ఏఆర్ఎస్ ఎంపిక ప్రక్రియ రెండు దశల్లో ఉంటుంది. తొలి దశలో ఏఆర్ఎస్ రాత పరీక్ష ఉంటుంది. అందులో చూపిన ప్రతిభ ఆధారంగా.. మలి దశలో పర్సనల్ ఇంటర్వ్యూ నిర్వహిస్తారు.
- ఏఆర్ఎస్ రాత పరీక్ష పూర్తిగా డిస్క్రిప్టివ్ విధానంలో మూడు వందల మార్కులకు జరుగుతుంది. అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్న విభాగానికి సంబంధించిన అంశాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. పరీక్షకు కేటాయించిన సమయం మూడు గంటలు.

పర్సనల్ ఇంటర్వ్యూ

రాత పరీక్షలో చూపిన ప్రతిభ ఆధారంగా.. నిర్దేశిత కటాఫ్ మార్కులు పొందిన వారితో మెరిట్ జాబితా రూపొందిస్తారు. వీరిలో ఒక్కో పోస్టుకు ముగ్గురిని చొప్పున ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. ఇంటర్వ్యూకు 60 మార్కులు కేటాయించారు. ఇంటర్వ్యూలో పూర్తి చేసిన పీహెచ్‌డీ అంశం, దాని ఉద్దేశం, భవిష్యత్తు లక్ష్యం, ఆసక్తి ఉన్న పరిశోధన విభాగాలపై అభ్యర్థి దృక్పథాన్ని పరిశీలిస్తారు.

పరిశోధన ఫలితాలకూ మార్కులు

ఏఆర్ఎస్ తదుపరి దశలో సైంటిస్ట్‌లుగా ఎంపిక చేసే క్రమంలో.. అభ్యర్థులు పీహెచ్‌డీలో చేసిన పరిశోధనలు, వాటి ఫలితాలకు కూడా మార్కులు కేటాయిస్తారు. దీనికి 40 మార్కులు ఉంటాయి.

ఎంపిక ఇలా

సైంటిస్ట్ ఎంపిక ప్రక్రియలో చివరగా మొత్తం మూడు అంశాల్లో స్కోర్లను పరిగణనలోకి తీసుకుంటారు. అవి.. ఏఆర్ఎస్ పరీక్ష, పరిశోధనల ఫలితాలు, పర్సనల్ ఇంటర్వ్యూ. ఏఆర్ఎస్‌కు గరిష్టంగా 300 మార్కులు; పరిశోధనల ఫలితాలకు 40 మార్కులు; పర్సనల్ ఇంటర్వ్యూకు 60 మార్కులు చొప్పున మొత్తం 400 మార్కుల ప్రాతిపదికగా మెరిట్ జాబితా రూపొందిస్తారు. ఈ మూడు అంశాల్లో అభ్యర్థులు పొందిన మార్కులను క్రోడీకించి ఫైనల్ మెరిట్ జాబితా రూపొందించి.. తుది నియామకాలు ఖరారు చేస్తారు.

సైంటిస్ట్‌గా నియామకం

మూడు దశల్లోనూ విజయం సాధించి తుది జాబితాలో నిలిచిన వారిని ఐసీఏఆర్‌లో ఆయా విభాగాల్లో సైంటిస్ట్‌లుగా నియమిస్తారు. రెండేళ్లపాటు ప్రొబేషన్‌గా పరిగణిస్తారు. ప్రొబేషన్‌ను కూడా విజయవంతంగా పూర్తి చేసుకుంటే.. ఐసీఏఆర్‌కు సంబంధించి జాతీయ స్థాయిలో ఉన్న పరిశోధన కేంద్రాల్లో విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది.

వేతనం

సైంటిస్ట్‌లుగా ఎంపికైన వారికి పే బ్యాండ్–3 (రూ.15,600–రూ.39,100)తో కెరీర్ ప్రారంభమవుతుంది. సవరించిన వేతన స్కేల్ ప్రకారం -రూ.57,700- రూ.1,82,400గా పేర్కొన్నారు. సైంటిస్ట్‌గా కెరీర్ ప్రారంభించిన వారు తర్వాత సీనియర్ సైంటిస్ట్, ప్రిన్సిపల్ సైంటిస్ట్, డిప్యూటీ డైరెక్టర్ వంటి ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చు.

అటెంప్ట్‌లపై పరిమితి

ఏఆర్ఎస్ పరీక్షకు జనరల్ అభ్యర్థులు గరిష్టంగా ఆరు సార్లు, ఓబీసీ వర్గాల వారు తొమ్మిదిసార్లు మాత్రమే హాజరయ్యేందుకు అవకాశం ఉంది. ఎస్సీ/ఎస్టీ వర్గాల అభ్యర్థులు తమ గరిష్ట వయోపరిమితి ముగిసేలోపు ఎన్నిసార్లయినా పరీక్ష రాయొచ్చు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు తేదీలు:** జూలై 5 – జూలై 26, 2023
- **ఏఆర్ఎస్ పరీక్ష తేదీ:** అక్టోబర్/నవంబర్‌లో నిర్వహించే అవకాశం
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** http://www.asrb.org.in

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	260	62,979
నిఫ్టీ ▽	106	18,666

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు			
నాస్‌డాక్	13,493	▽	138
డోజోన్స్	33,727	▽	219
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,462	▽	40
డాక్స్	15,830	▽	158
షాంఘై (శుక్రవారం ముగింపు)	3,198	▽	42
నికాయ్	32,781	▽	483

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

చిన్న పెట్టుబడి.. పెద్ద నిధిగా మారాలంటే?




వివేక్, బలరామ్ ఇద్దరూ మంచి స్నేహితులు. కానీ, ఈక్విటీ పెట్టుబడుల విషయానికొచ్చే సరికి ఇద్దరిదీ చెరోదారి. 2002లో ఇద్దరూ ఓ చెరో నాలుగైదు స్మాల్‌క్యాప్ కంపెనీల్లో రూ. 50 వేల చొప్పున ఇన్వెస్ట్ చేశారు. 2023 జనవరి నాటికి వివేక్ ఇన్వెస్ట్ చేసిన ఐదు కంపెనీల్లో రెండు మల్టీబ్యాగర్లు అయ్యాయి. రెండు నష్టాలను ఇవ్వగా, ఒక్కటి మంచి రాబడులను ఇచ్చింది. మొత్తంగా అతడి రూ. 50వేల పెట్టుబడి 20 ఏళ్లలో రూ.18 లక్షలు అయింది. బలరామ్ నాలుగు కంపెనీల్లో మొత్తంగా రూ. 50 వేలు పెట్టుబడి పెట్టాడు. కానీ, 2023 జనవరిలో అతడి మొత్తం పెట్టుబడి రాబడితో కలసి రూ.6 లక్షలుగా మారింది. ఇద్దరి రాబడుల్లో అంత వ్యత్యాసం ఎందుకు ఉందంటే? వారు ఎంపిక చేసుకున్న కంపెనీల వల్లే. ఇక్కడ బలరామ్‌తో పోలిస్తే వివేక్ అంత భారీ రాబడులు పోగేసుకోవడం వెనుక అతడు నేర్చుకుని, తెలుసుకుని, తగినంత అధ్యయనం తర్వాత పెట్టుబడి పెట్టడం వల్లేనని చెప్పుకోవాలి. అందుకే స్మాల్‌క్యాప్ కంపెనీల్లో పెట్టుబడి ఓ కళగా నిపుణులు చెబుతారు. అన్నీ తెలుసుకుని, అవగాహనతోనే ఇన్వెస్ట్ చేయాలని సూచిస్తుంటారు.

స్మాల్‌క్యాప్ కంపెనీల్లో అధిక రాబడులు • ఎంపికలో తప్పులకు చోటు ఉండకూడదు • పొరపాటు జరిగితే పెట్టుబడికీ నష్టం
మల్టీబ్యాగర్ ఒక్కటే ఆకర్షణ కాకూడదు • ఎన్నో అంశాలు చూసిన తర్వాతే పెట్టుబడి
యాజమాన్యం దక్షత చూడాలి • పనిచేస్తున్న రంగం, వృద్ధినీ పరిశీలించాలి • రిస్క్‌కు మొదటి ప్రాధాన్యత తప్పనిసరి

స్మాల్‌క్యాప్ కంపెనీలు అంటే చాలా చౌకగా లభిస్తున్నాయనే అపోహ మనలో చాలా మందికి ఉంటుంది. కానీ, ఇది సరికాదు. రూ.16,472 కోట్ల మార్కెట్ విలువ వరకు ఇప్పుడు స్మాల్ క్యాప్ కంపెనీలుగానే పరిగణిస్తున్నారు. లోగడ రూ.8,579 కోట్ల మార్కెట్ విలువ వరకు ఇలా పరిగణించేవారు. స్మాల్‌క్యాప్ కంపెనీల్లో చాలా వరకు దశాబ్దాలుగా అదే స్థాయిలో ఉండిపోతాయి. కేవలం కొన్ని మాత్రం ఆయా రంగాల్లో లీడర్లుగా, పెద్ద స్థాయి కంపెనీలుగా అవతరిస్తాయి. వ్యాపారంలో వృద్ధి లేక అక్కడే ఉండిపోయే కంపెనీలు కూడా బోలెడు. కంపెనీ యాజమాన్యంలో సత్తా లేకపోవచ్చు. లేదా ఆ కంపెనీ చేస్తున్న వ్యాపారానికి పరిమిత అవకాశాలు ఉండొచ్చు. సవాళ్లను ఎదుర్కొనే సామర్థ్యం, మూలధన నిధుల నిర్వహణ మెరుగ్గా లేకపోవచ్చు. సాధారణంగా స్మాల్‌క్యాప్ కంపెనీల్లో ఎక్కువ ఇలాంటివే కనిపిస్తుంటాయి. కానీ, కొన్ని మార్కెట్ గుర్తింపు లేకపోవడం వల్ల కూడా తక్కువ వేల్యూయేషన్ల వద్ద లభిస్తుంటాయి. లేదంటే అప్పటి వ్యాపార స్థాయి ఆధారంగా చిన్న కంపెనీలుగా ఉండి ఉండొచ్చు. ఇలాంటి నాణ్యమైన కొన్ని ఆణిముత్యాలను ఎంపిక చేసుకోవడం వల్ల భవిష్యత్తులో మల్టీబ్యాగర్ రాబడులు సంపాదించుకోవడానికి అవకాశం ఉంటుంది.

ఇన్వెస్టర్లలో ఒక ధోరణి కనిపిస్తుంది. స్టాక్ ధర రూ.100 లోపు లేదా రూ.10-50 లోపు ఉంటే చౌక అని భావిస్తుంటారు. రేటు తక్కువలో ఉంటే ఎక్కువ స్టాక్స్ వస్తాయని, వేగంగా రెండు మూడు రెట్లు పెరుగుతాయనే అపోహ ఉంటుంది. స్మాల్‌క్యాప్ కంపెనీయే అయినా ఒక్కో షేరు రూ.5,000 ఉండొచ్చు. మరో కంపెనీ షేరు ధర రూ.10 ఉండొచ్చు. షేరు ధర కంపెనీ ఆర్థిక మూలాలనే ప్రతిఫలిస్తుందన్నది మర్చిపోవద్దు. షేరు ధర తక్కువ, ఎక్కువలో ఉండడం అన్నది చౌక, ఖరీదైన దానికి నిదర్శనం కాదు. ఉదాహరణకు.. 'ఏ' అనే కంపెనీ మూలధనం రూ.10కోట్లు. షేరు ముఖ విలువ రూ.10 అప్పుడు కోటి షేర్లు ఉంటాయి. 'బీ' అనే కంపెనీ మూలధనం కూడా రూ.10 కోట్లు. కానీ షేరు ముఖ విలువ ఒక్క రూపాయే. కనుక 10 కోట్ల షేర్లు ఉంటాయని తెలుసుకోవాలి. కేవలం పీఈ (ప్రైస్ టు ఎర్నింగ్స్ రేషియో/ఆర్జనకు షేరు ఎన్ని రెట్లు ఉంది) చూసి, తక్కువలో ఉందని కొనుగోలు చేయడం కూడా అన్ని సందర్భాల్లో సరైన ఫలితం ఇవ్వదని నిపుణులు చెబుతున్నారు. స్మాల్‌క్యాప్ అనేది పెద్ద ప్రపంచం. టాప్ 250 కాకుండా మార్కెట్లో ఉన్న మిగిలినవన్నీ కూడా స్మాల్‌క్యాప్ విభాగంలోకే వస్తాయి. అన్ని వందలు, వేల కంపెనీల నుంచి మాణిక్యాలను (చెత్త నుంచి మణి) వెలికితీయాలంటే లోతైన పరిశోధన అవసరం.



నాణేనికి రెండు వైపులు

నిఫ్టీ స్మాల్‌క్యాప్ 250 సూచీ నుంచి 10-15 ఏళ్ల కాలంలో కొన్ని మల్టీబ్యాగర్ అవుతాయి. అవి పదుల సంఖ్యలో ఉండొచ్చు. అదే సమయంలో కొన్ని ఇన్వెస్టర్ల పెట్టుబడిని కూడా హరించివేస్తుంటాయి. ఇక్కడ అగాధాలు, పర్వత శిఖరాలూ ఉంటాయి.

బాలాజీ అమైన్స్ షేరు ధర 2010 జనవరి 4న రూ.33.57. 13 ఏళ్ల తర్వాత చూస్తే ఇప్పుడు రూ.2,200 దరిదాపుల్లో ఉంది. కీ ఇండస్ట్రీస్ షేరు ధర కూడా ఇదే కాలంలో రూ.33.30 నుంచి రూ.2,200కు పెరిగింది. గ్రాన్యూల్స్ ఇండియా ధర రూ.9.09 నుంచి రూ.290కు చేరింది. నాణేన్ని మరోవైపు అదే కాలంలో 98% వరకు నష్టపోయినవీ, మార్కెట్ నుంచి కనుమరుగు అయినవీ ఉన్నాయి.

మెరుగైన అవకాశాలు

రూ.16,472 కోట్ల వరకు స్మాల్‌క్యాప్ కంపెనీల కిందకే వస్తున్నాయి కనుక ఈ విభాగంలో ఇప్పుడు పెద్ద కంపెనీలు కూడా వస్తున్నాయి. నిర్వచనం మార్చడం వల్ల స్మాల్‌క్యాప్ ప్రపంచం ఇప్పుడు మరింత విస్తృతం అయింది. మన మార్కెట్ విస్తృతి పెరిగింది. వేగవంతమైన ఆర్థిక వ్యవస్థగా, మరి కొన్ని దశాబ్దాల్లో అభివృద్ధి చెందిన దేశంగా అవతరించొచ్చు. కనుక దీర్ఘదృష్టితో ఆలోచించి, ఇప్పుడు స్మాల్‌క్యాప్ ప్రపంచంలో కొంచెం పెద్ద కంపెనీలను ఎంపిక చేసుకున్నా.. అవి జెయింట్ క్యాప్ కంపెనీలుగా మారే అవకాశాలు లేకపోలేదు. 2012 జనవరి 10 నుంచి 2022 జనవరి 10 వరకు గణాంకాలను పరిశీలించి చూస్తే.. నిఫ్టీ స్మాల్‌క్యాప్ 250 సూచీ నుంచి మూడు కంపెనీలు లార్జ్‌క్యాప్ కంపెనీలుగా అవతరించాయి. అవి చోళమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్, ఎస్‌ఆర్‌ఎఫ్, పీఐ ఇండస్ట్రీస్. ఇక స్మాల్‌క్యాప్ నుంచి మరో 21 కంపెనీలు మిడ్‌క్యాప్ కంపెనీలుగా అవతరించాయి. 72 కంపెనీలు అదే స్థాయిలో ఉంటే, 64 కంపెనీలు మైక్రోక్యాప్ (మరీ చిన్నవి)గా కరిగిపోయాయి.



ఎంపిక ఎలా..?

''చిన్న కంపెనీలు అధిక వృద్ధి సామర్థ్యాలతో ఉంటాయి. దాదాపు ఇవి అనలిస్టుల సెల్ కాల్ పరిధిలో ఉండవు. కనుక స్మాల్ క్యాప్ కంపెనీలను అధ్యయనం చేసేందుకు ప్రాథమిక పరిశోధన అవసరం. అన్ని మార్కెట్ సైకిల్స్‌లోనూ ఇవి అధిక రాబడులను ఇవ్వగలవు'' అని ఓపీసీ అస్సెట్ సొల్యూషన్స్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ అజయ్ బగ్గా పేర్కొన్నారు. ప్రముఖ మార్కెట్ అనలిస్ట్ అంబరీశ్ బలిగ అభిప్రాయంలో.. ''స్మాల్‌క్యాప్ స్టాక్ ఎంపికకు ఏ ఒక్క విధానం అంటూ లేదు. కాకపోతే నేను అనుసరించే మార్గదర్శకాలు ఏమిటంటే.. ఎంపిక చేసుకోబోయే స్టాక్ మంచి పనితీరు చూపిస్తున్న రంగానికి చెందినదై ఉండాలి. లేదా మంచి పనితీరు చూపించేందుకు అవకాశం ఉన్న రంగంలో పనిచేస్తూ ఉండాలి. ఆయా కంపెనీ ఏదైనా ఉప విభాగంలో లీడర్‌గా ఉందా అని చూస్తాను. లేదంటే లీడర్‌గా ఎదిగే అవకాశాలున్నాయా అని పరిశీలిస్తాను. ఆయా రంగం వృద్ధికి మించి పనితీరు చూపిస్తూ ఉండాలి''అని వివరించారు. ఇక స్మాల్‌క్యాప్ కంపెనీల విషయంలో లిక్విడిటీ (షేర్ల లభ్యత) కూడా కీలకమేనని అంబరీశ్ తెలిపారు. ''బ్యాలన్స్ షీటులో రుణ భారం ఎక్కువగా ఉండకూడదు. రుణ భారం ఉంటే, భవిష్యత్తులో పెరిగే నగదు ప్రవాహాల పట్ల స్పష్టత ఉండాలి. అప్పుడే ఈక్విటీ-రుణభారం నిష్పత్తి దిగొస్తుంది'' అని వివరించారు. లిక్విడిటీ తక్కువగా ఉన్నప్పుడు ఏదైనా ప్రతికూల పరిస్థితి ఏర్పడితే అది షేరు ధర పతనానికి దారితీస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.



నాణ్యతపై దృష్టి కీలకం

''స్మాల్‌క్యాప్ కంపెనీలు ఎప్పుడూ కూడా లిక్విడిటీ పరంగా సవాళ్లను ఎదుర్కొంటూ ఉంటాయి. లిక్విడిటీ తక్కువగా ఉంటే ర్యాలీ ధోరణి ఎక్కువగా కనిపిస్తుంది. అలాగే, షేరు ధర వేగంగా పడిపోయే అవకాశాలు సైతం ఉంటాయి. స్మాల్‌క్యాప్ పరంగా ఉండే కీలకమైన అంశం ఇదే. అందుకే మార్కెట్లో వాటి ధరలు మానిప్యులేషన్‌కు లోనవుతుంటాయి''అని కేఆర్ చోక్సే ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ దేవేన్ చోక్సే వివరించారు. ఇక యాజమాన్యం సమర్థత, నిజాయితీ తదితర అంశాలు కూడా ఈ విభాగంలో కీలకంగా పనిచేస్తాయని అంబరీష్ బలిగ వివరించారు. యాజమాన్యం విషయంలో కనిపించని విషయాలను వెలికితీసే ప్రయత్నం చేయాలని సూచించారు. షేరు ధర చౌకగా ఉందా లేక స్మాల్‌క్యాప్ అని కాకుండా, నాణ్యతకు సంబంధించిన అంశాలు చూడాలని నిపుణుల సూచన. యాజమాన్యానికి తగిన సామర్థ్యాలు ఉన్నాయా? కంపెనీ భిన్నంగా ఏదైనా చేయగలదా? పోటీ తత్వం లేదా టైఅప్‌ల ద్వారా భిన్నంగా ప్రయత్నించగలదా? పరిమిత మూలధన నిధులతోనే వృద్ధి చెందగలదా? భారీ వృద్ధికి అవకాశం ఉన్న రంగంలోనే పనిచేస్తుందా? అన్న అంశాలను చూడాలి. ఎంపిక చేసుకునే కంపెనీకి ఇన్ని ప్రత్యేకతలు ఉన్నప్పుడు మధ్యలో తాత్కాలికంగా ఏవైనా ఆటుపోట్లతో దారి తప్పినా.. తిరిగి మళ్లీ గాడిలో పడి దూసుకుపోయే అవకాశాలుంటాయి. యాజమాన్యం సామర్థ్యాలు, బలాలకు తోడు ఆ వ్యాపారం విస్తరణకు అవకాశం ఉందా? అప్పటికే ఆ కంపెనీలో ఇనిస్టిట్యూషన్స్ లేదా హెచ్‌ఎన్‌ఐలకు (బడా ఇన్వెస్టర్లు) వాటాలున్నాయా అనే అంశాలను కూడా పరిశీలించాలి. ఆయా కంపెనీ కస్టమర్లు, వెండర్లు, పోటీ కంపెనీలను కలసి మాట్లాడడం ద్వారా మరిన్ని విషయాలు తెలుసుకోవచ్చని అంబరీష్ బలిగ సూచించారు. పైగా అన్ని సానుకూలతలు ఉండి, కంపెనీని ఎంపిక చేసుకున్న తర్వాత ఫలితం వచ్చే వరకు వేచి చూసే ఓపిక కూడా దండిగా ఉండాలన్నది మార్కెట్ పండితుల స్వీయ అనుభవం. ఎవ్రీ డాగ్ హ్యాజ్ ఏ డే అన్న చందంగా ప్రతీ నాణ్యమైన కంపెనీకి అనుకూల తరుణం వచ్చే వరకు ఆగాల్సిందే. పైగా ఒక్కసారి పెట్టుబడి పెట్టి రిలాక్స్ అయ్యే ధోరణి స్మాల్‌క్యాప్ కంపెనీలకు అస్సలే పనికిరాదు. ఎలాంటి సానుకూలతలు చూసి, సంబంధిత కంపెనీలో పెట్టుబడి పెట్టారో.. వాటిల్లో మార్పు లేనంత వరకు పెట్టుబడులను కొనసాగించుకోవచ్చు. తేడా వస్తే బయటకు వచ్చేందుకు సిద్ధంగానూ ఉండాలి. కంపెనీ వృద్ధి పథంలో సాగుతున్నంత కాలం ర్యాలీ చేస్తున్నప్పటికీ ఆ పెట్టుబడితో కొనసాగొచ్చు. అలాంటప్పుడే అవి మిడ్‌క్యాప్, లార్జ్‌క్యాప్‌గా అవతరించగలవు. అలా మంచి పనితీరును క్రమం తప్పకుండా కొనసాగిస్తున్న సమయంలో మరింత మంది ఇన్వెస్టర్లు ఆయా కంపెనీల్లో పెట్టుబడులకు ముందుకు వస్తారు. దీంతో విస్తృతి పెరుగుతుంది.

ఫ్యూచర్ అండ్ ఆప్షన్స్ అనుకూలమేనా..?



Q & A

ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

నేను వచ్చే 15 ఏళ్లలో రూ.2.5–3 కోట్ల వరకు విలువ చేసే ఇంటిని కొనుగోలు చేద్దామని అనుకుంటున్నాను. డౌన్‌పేమెంట్ సమకూర్చుకునేందుకు... టాటా స్మాల్‌క్యాప్ లేదంటే ఎడెల్‌వీజ్ స్మాల్‌క్యాప్, మిరే అస్సెట్ మిడ్‌క్యాప్ లేదా పీజీఐఎం ఇండియా మిడ్‌క్యాప్ అన్నవి మంచి ఎంపికలేనా? – ఆదిత్య బి

మీరు ఇప్పటి నుంచి 10–15 ఏళ్లలో ఇల్లు కొనుగోలు చేయాలనే ప్రణాళికతో ఉంటే సరైన ట్రాక్‌లో ఉన్నట్టుగానే భావించాలి. ఎందుకంటే మీ పెట్టుబడులు వృద్ధి చెందేందుకు తగినంత వ్యవధి ఉంది. ఈక్విటీ ఫండ్స్‌లో మోస్తరు రాబడులకు ఇంతకాలం అనుకూలమని చెప్పుకోవచ్చు. దీంతో మీ ఇంటి కొనుగోలుకు కావాల్సిన డౌన్ పేమెంట్ మొత్తాన్ని సమకూర్చుకోవచ్చు. మీరు గుర్తు పెట్టుకోవాల్సిన విషయం ఏమిటంటే ఇంటి కొనుగోలుకు అయ్యే ధరను ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం అంచనా వేస్తున్నట్టు అయితే, దీనికి రియల్ ఎస్టేట్‌లో ఉండే సగటు ద్రవ్యోల్బణం ప్రభావాన్ని జోడించాల్సి ఉంటుంది. అప్పుడు వాస్తవ కొనుగోలు ధరపై అంచనాకు రావాలి. దీనివల్ల డౌన్ పేమెంట్ మొత్తాన్ని సమకూర్చుకునేందుకు నెలవారీగా ఎంత మేర సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్) రూపంలో ఇన్వెస్ట్ చేయాలన్న దానిపై స్పష్టత సాధించొచ్చు. సిప్ మొత్తాన్ని రెండు నుంచి మూడు ఫ్లెక్సీక్యాప్ పథకాల్లో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. ఒకటి రెండు మిడ్ అండ్ స్మాల్ క్యాప్ పథకాలను కూడా జోడించుకోవచ్చు. కాకపోతే వీటిల్లో 25–30 శాతానికి మించి కేటాయింపులు చేసుకోవద్దు. మీ రిస్క్ సామర్థ్యం, ఈక్విటీ ఫండ్స్ పట్ల మీకు ఉన్న గత అనుభవం ఆధారంగా కేటాయింపులపై నిర్ణయానికి రావాలి. గృహ రుణానికి చెల్లించే ఈఎంఐ మీ నెలవారీ ఆదాయంలో మూడింట ఒక వంతు మించకుండా చూసుకోండి. ఇందుకు గాను కావల్సినంత డౌన్ పేమెంట్‌ను ముందే సమకూర్చుకోవాలి. మరోవైపు ఇంటిని పెట్టుబడిగా చూడడం మంచి ఆలోచన కాదు. రియల్ ఎస్టేట్‌లో లిక్విడిటీ చాలా తక్కువ. ఇంటిని కొనుగోలు చేయడం, విక్రయించడం అంత సులభం కాదు. కనుక ఇంటి కొనుగోలు నివాసం కోణం నుంచే చూడాలి.

ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ అంటే ఏమిటి? వాటిల్లో ట్రేడ్ చేయవచ్చా? – యోగేష్

ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ అన్నవి రెండు ప్రముఖ డెరివేటివ్ సాధనాలు. స్టాక్స్‌లో ముందస్తుగా అంగీకరించిన ధరకు, భవిష్యత్తు తేదీపై ట్రేడ్ చేయడం. షేర్లు కొనుగోలు చేయాలంటే విలువ మేర మొత్తం ముందే చెల్లించాలి. కానీ, ఫ్యూచర్స్‌లో అయితే మొత్తం కాంట్రాక్టు విలువలో నిర్దేశిత శాతం ముందు చెల్లిస్తే సరిపోతుంది. ఉదాహరణకు ఫ్యూచర్స్‌లోని స్టాక్ కాంట్రాక్టు విలువలో 20 శాతం అనుకుంటే, అచ్చమైన ఈక్విటీలో కొనుగోలు చేసే విలువతో (క్యాష్ మార్కెట్) ఫ్యూచర్స్‌లో అదే మొత్తంతో ఐదు రెట్లు అధికంగా ట్రేడ్ చేసుకోవచ్చు. ఈక్విటీలో రూ.లక్ష కొనుగోలు చేసుకునేట్టు అయితే, అంతే మొత్తంలో ఫ్యూచర్స్‌లో రూ.5 లక్షల విలువ మేర ట్రేడ్ చేసుకోవడానికి అవకాశం ఉంటుంది. ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ ప్రధాన ఉద్దేశ్యం మీ పోర్ట్‌ఫోలియో విలువకు హెడ్జ్ చేసుకోవడమే. కానీ, చాలా మంది వేగంగా డబ్బు సంపాదించేందుకు స్పెక్యులేటివ్‌గా దీన్ని చూస్తుంటారు. ట్రేడింగ్ విజయవంతం అయితే గణనీయమైన లాభాలు వస్తాయి. కానీ, ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ ట్రేడింగ్ అన్నది ఎంతో రిస్క్‌తో ఉంటుంది. ఒక్క ట్రేడ్ బెడిసికొట్టినా అప్పటి వరకు ఎన్నో రోజులుగా సంపాదించిన మొత్తాన్ని కోల్పోవాల్సి వస్తుంది. కొన్ని మ్యూచువల్ ఫండ్స్ పథకాలు.. ఆర్బిట్రేజ్ ఫండ్స్, ఈక్విటీ సేవింగ్ ఫండ్స్, డైనమిక్ అస్సెట్ అలోకేషన్ ఫండ్స్ హెడ్జింగ్‌ను ఒక విధానంగా ఉపయోగిస్తాయి. ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ ఆకర్షణీయంగా, సులభంగా డబ్బులు సంపాదించే మార్గంగా అనిపించొచ్చు. కానీ ఇది ఎంతో రిస్క్‌తో ఉంటుంది. గ్యాంబ్లింగ్ కంటే తక్కువేమీ కాదు. ఓ ప్రముఖ ఆన్‌లైన్ బ్రోకర్ సీఈవో సైతం తమ క్లయింట్లలో కేవలం ఒక శాతం కంటే తక్కువ మందే ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్‌లో బ్యాంక్ డిపాజిట్ల కంటే ఎక్కువ రాబడులు సంపాదిస్తున్నట్టు ప్రకటించడాన్ని అర్థం చేసుకోవాలి. రిటైల్ ఇన్వెస్టర్లు ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ ట్రేడింగ్‌కు దూరంగా ఉండడమే సరైనది.

లెమన్ ట్రీ హోటల్స్ | ఐసీఐసీఐ సెక్యూరిటీస్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 95

టార్గెట్: రూ. 137

ఎందుకంటే: గత ఆర్థిక సంవత్సరం(2022–23) చివరి త్రైమాసికం(జనవరి–మార్చి)లో లెమన్ ట్రీ హోటల్స్ సంస్థ చరిత్రలోనే అత్యుత్తమ ఫలితాలు సాధించింది. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి రూ. 880 కోట్ల ఆదాయం, రూ. 450 కోట్ల నిర్వహణ లాభం(ఇబిటా) ప్రకటించింది. వార్షికంగా ఆదాయ అంచనాలను అధిగమిస్తూ 100 శాతం వృద్ధిని అందుకుంది. 50 శాతం ఇబిటా మార్జిన్లను సాధించింది. కోవిడ్-19 ప్రభావం తదుపరి గతేడాది రికవరీ సంవత్సరంగా ఆవిర్భవించింది. వెరసి ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023-24)లో ఆతిథ్య రంగ పరిశ్రమపై ప్రత్యేక దృష్టికి తెరలేచింది. 2023-27 మధ్య కాలంలో హోటల్ పరిశ్రమ సగటున 10 శాతంపైగా వార్షిక వృద్ధిని సాధించనున్నట్లు అంచనా. అయితే సరఫరాలు 4-5 శాతంస్థాయిలోనే మెరుగుపడే వీలుంది. దీంతో 2025 కల్లా అదనంగా 2,800 గదుల ఏర్పాటుపై కంపెనీ దృష్టి సారించింది. తద్వారా మొత్తం నిర్వహణలోని గదుల సంఖ్యను 11,000కుపైగా చేర్చుకునే ప్రణాళికల్లో ఉంది. ఈ ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో 669 రూములతో కూడిన ఆరికా ముంబై ఎయిర్‌పోర్ట్ హోటల్‌ను ప్రారంభించనుంది. ప్రధానంగా 2024కల్లా పూర్తికానున్న ముంబై హోటల్‌కు సంబంధించి రూ. 300 కోట్ల పెట్టుబడి వ్యయాలు పెండింగ్ ఉన్న నేపథ్యంలో 2025 నుంచి ఆర్గానిక్ రుణ భారాన్ని తగ్గించుకునేందుకు చర్యలు తీసుకోనుంది. వినియోగ వ్యయాలు మందగించడం, ఆక్యుపెన్సీలు తగ్గడం, ద్రవ్యోల్బణ వ్యయాలు, గదుల అద్దెలు నీరసించడం వంటి అంశాలను కీలక రిస్కులుగా పేర్కొనవచ్చు.



ప్రెస్టీజ్ ఎస్టేట్స్ ప్రాజెక్ట్స్ | హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 576

టార్గెట్: రూ. 630

ఎందుకంటే: రియల్టీ దిగ్గజం ప్రెస్టీజ్ ఎస్టేట్స్ ప్రాజెక్ట్స్ మార్చితో ముగిసిన గత ఆర్థిక సంవత్సరం (2022-23)లో రూ. 12,900 కోట్ల విలువైన వార్షిక ముందస్తు అమ్మకాలు సాధించింది. కంపెనీ చరిత్రలోనే ఇవి అత్యధికంకాగా.. వార్షిక ప్రాతిపదికన 24 శాతం వృద్ధిని అందుకుంది. ఇందుకు 16 మిలియన్ చదరపు అడుగుల(ఎంఎస్‌ఎఫ్) రియల్టీను ప్రవేశపెట్టడం, ముంబై మెట్రోపాలిటన్ ప్రాంతం(ఎంఎంఆర్)లో నమోదైన రూ. 2,700 కోట్ల విలువైన ముందస్తు అమ్మకాలు సహకరించాయి. ఈ నేపథ్యంలో బెంగళూరుకాకుండా ఇతర ప్రాంతాలలోని అమ్మకాలు సైతం 41 శాతానికి ఎగశాయి. అంతక్రితం ఏడాది ఇవి కేవలం 20 శాతంగా నమోదయ్యాయి. ఈ బాటలో ప్రస్తుత ఏడాది(2023-24) వార్షిక ముందస్తు అమ్మకాలలో 25 శాతం పురోగతిని అంచనా వేస్తోంది. ఇందుకు 76 ఎంఎస్‌ఎఫ్ ఆస్తుల(రియల్టీ)ను ప్రవేశపెట్టనుండటం దన్నుగా నిలిచే వీలున్నట్లు భావిస్తోంది. ప్రధానంగా ముంబై ఎంఎంఆర్, హైదరాబాద్ కీలకంగా నిలవనున్నాయి. కొత్త ప్రాజెక్టుల విడుదల తగ్గనున్నప్పటికీ బెంగళూరు నుంచి సైతం పటిష్ట అమ్మకాలు సాధించే వీలుంది. రెండు కీలక లావాదేవీల ద్వారా డీబీ రియల్టీ నుంచి బీకేసీ(రూ. 900 కోట్లు), మహాలక్ష్మీ ప్రాజెక్ట్(రూ. 200 కోట్లు)లలో మిగిలిన వాటాలను కొనుగోలు చేసింది. ఈ రెండు ప్రాజెక్టుల మొత్తం వ్యయాలు రూ. 7,500 కోట్లుకాగా.. ప్రెస్టీజ్ తాజా రూ. 1,100 కోట్లతో కలిపి రూ. 3,000 కోట్లు వెచ్చించింది. బీకేసీ ప్రాజెక్ట్ ద్వారా నెలవారీ అద్దె ఆదాయం ఒక్కో చదరపు అడుగుకీ రూ. 25 పెరిగి రూ. 350కు చేరనున్నట్లు అంచనా వేస్తోంది. దీంతో వీటి విలువ రూ. 3500 కోట్లకు చేరే వీలుంది.



గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు, సూచనలు, వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

ఆకర్షణీయంగా ఆల్టర్నేటివ్ ఫండ్స్

• ఇతర సాధనాలకు దీటుగా మెరుగైన రాబడులు
• దేశీ మదుపరుల భారీ ఇన్వెస్ట్‌మెంట్లు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ప్రత్యామ్నాయ పెట్టుబడి సాధనాలకు దేశీయంగా డిమాండ్ గణనీయంగా పెరుగుతోంది. సంప్రదాయ పెట్టుబడి సాధనాలకు దీటుగా, కొన్నిసార్లు అంతకు మించిన రాబడులు అందిస్తూ ఆల్టర్నేటివ్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్స్ (ఏఐఎఫ్) ఆకట్టుకుంటున్నాయి. దీంతో వీటిలో పెట్టుబడులపై దేశీ ఇన్వెస్టర్లలోనూ ఆసక్తి పెరుగుతోంది. మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ గణాంకాల ప్రకారం దాదాపు రెండేళ్ల క్రితం వరకు రూ. 4.5 లక్షల కోట్లుగా ఉన్న ఏఐఎఫ్‌ల నిధులు గతేడాది ఆఖరు నాటికి రూ. 7 లక్షల కోట్లకు చేరాయి. రాబోయే రోజుల్లో ఇది 4–5 రెట్లు పైగా పెరుగుతుందని పరిశ్రమ వర్గాలు అంచనా వేస్తున్నాయి. రూ. 40 లక్షల కోట్లుగా ఉన్న మ్యూచువల్ ఫండ్స్ పరిశ్రమ స్థాయికి చేరవచ్చని లెక్క వేస్తున్నాయి. కొన్నేళ్ల క్రితం దాకా ఎక్కువగా విదేశాల నుంచి పెట్టుబడులు వస్తుండగా ప్రస్తుతం 80–90% నిధులు దేశీయంగా సమీకరించినవే ఉంటున్నాయి. అత్యంత సంపన్నులతో పాటు ఒక మోస్తరు ఇన్వెస్టర్లు కూడా వీటిలో ఇన్వెస్ట్ చేస్తున్నారు.

మూడు రకాలు: ఈక్విటీలు, బాండ్లు, రియల్టీ వంటి సంప్రదాయ సాధనాలకే పరిమితం కాకుండా ఇతరత్రా మరిన్ని ప్రత్యామ్నాయ సాధనాల్లోను ఇన్వెస్ట్ చేయడం ద్వారా అధిక రాబడులను అందుకోవాలనుకునే ఇన్వెస్టర్ల కోసం ఉద్దేశించినవి ఆల్టర్నేటివ్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్లు. సంప్రదాయ ఫండ్స్‌తో పోలిస్తే భిన్నమైన వ్యూహాలతో, విభిన్న సాధనాల్లో ఇన్వెస్ట్ చేయడం ద్వారా అధిక రాబడులను ఆర్జించడం వీటి లక్ష్యం. రిస్కులు ఉన్నప్పటికీ దానికి తగ్గట్లుగా మరింత రాబడులు పొందేందుకు అవకాశం ఉండటంతో ఇన్వెస్టర్లు వీటివైపు మొగ్గు చూపుతున్నారు. ప్రస్తుతం దేశీయంగా మూడు కేటగిరీల కింద దాదాపు 4,000 పైచిలుకు ఏఐఎఫ్‌లు ఉన్నాయి. ఏఐఎఫ్‌ల్లో ప్రధానంగా మూడు రకాలు ఉన్నాయి. కేటగిరీ 1 తరహా ఏఐఎఫ్‌లు ప్రధానంగా స్టార్టప్‌లు, చిన్న .. మధ్య తరహా సంస్థలు లేదా లాభదాయకమైనవిగా ప్రభుత్వం పరిగణించే రంగాల్లోనూ ఇన్వెస్ట్ చేస్తాయి. ఇక రెండో కేటగిరీ ఫండ్‌లో ప్రైవేట్ ఈక్విటీ, డెట్ ఫండ్స్ లాంటివి ఉంటాయి. మూడో కేటగిరీలో హెడ్జ్ ఫండ్స్, స్వల్పకాలికంగా రాబడులు అందించే ఉద్దేశంతో ఏర్పాటయ్యే ఫండ్స్ మొదలైనవి ఉంటాయి. తొలి రెండు కేటగిరీల్లోని ఏఐఎఫ్ స్కీములు క్లోజ్ ఎండెడ్‌గా ఉంటాయి. కాల వ్యవధి పరిమితి కనీసం మూడేళ్లుగా ఉంటుంది. మూడో కేటగిరీ ఫండ్‌లు ఓపెన్ ఎండెడ్ లేదా క్లోజ్ ఎండెడ్‌గానైనా ఉండొచ్చు. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ (ఎన్‌ఎస్‌ఈ) ఏఐఎఫ్ బెంచ్‌మార్క్ నివేదిక ప్రకారం మూడో కేటగిరీ ఏఐఎఫ్‌లు కాల వ్యవధిని బట్టి 10 శాతం నుంచి 23 శాతం వరకు రాబడులు ఇచ్చాయి.

టెక్నాలజీతో అధిక రాబడులకు ఆస్కారం..



భూపాల్ నానావత్
షేర్స్‌బజార్ ఎండీ

సరైన వ్యూహాలు పాటిస్తే ఏఐఎఫ్‌ల ద్వారా మార్కెట్‌కు మించి రాబడులు అందుకోవడానికి ఆస్కారం ఉందని హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న షేర్స్‌బజార్ మేనేజింగ్ డైరెక్టర్(ఎండీ) భూపాల్ నానావత్ తెలిపారు. ''దాదాపు రూ. 3,900 కోట్ల ఫండ్స్ నిర్వహిస్తున్నాం. కొత్తగా మరో రూ. 1,000 కోట్ల ఫండ్‌కి నిధులను సమీకరిస్తున్నాం. ఏఐఎఫ్ 3 కేటగిరీ కింద లిస్టెడ్ కంపెనీల్లో మేము ఇన్వెస్ట్ చేస్తాము. అల్గోరిథమ్‌ల వంటి అధునాతన సాంకేతికతలతో, రోబోటిక్ సిస్టమ్‌లతో రిస్కులను సమర్థంగా ఎదుర్కొనే వ్యూహాలను అమలుపర్చడం ద్వారా ఇన్వెస్టర్లకు అధిక రాబడులను అందిస్తున్నాం. దీనితో 30 శాతం పైగా రాబడులు పొందడానికి ఆస్కారం ఉంటుంది'' అని ఆయన వివరించారు. వీటిలో రూ. కోటి నుంచి ఇన్వెస్ట్ చేయొచ్చని, హెడ్జ్ ఫండ్స్ కేటగిరీ కింద షేర్లు, బాండ్లు, డెరివేటివ్‌లు, కమోడిటీలు వంటి విస్తృత సాధనాల్లో ఇన్వెస్ట్ చేస్తున్నామని తెలిపారు. ఫిక్స్‌డ్ డిపాజిట్లు, మార్కెట్లకు మించిన రాబడులు అందించే సాధనాలేవీ లేవంటూ ఇన్వెస్టర్లలో నెలకొన్న అపోహలను తొలగించేందుకు, ఏఐఎఫ్‌లు వంటి సాధనాలపై అవగాహన పెంచేందుకు కృషి చేస్తున్నామని నానావత్ చెప్పారు.

క్లుప్తంగా...

ట్రిపుల్ ఐటీలో అడ్మిషన్ల కోసం దరఖాస్తుకు నేటితో గడువు పూర్తి

నూజివీడు: రాష్ట్రంలోని రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్జీయూకేటీ) పరిధిలోని నాలుగు ట్రిపుల్‌ఐటీల్లో మొదటి సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణకు సోమవారంతో గడువు ముగియనుంది. అడ్మిషన్లకు ఈ నెల 4న నోటిఫికేషన్ విడుదల చేయగా, 26వ తేదీ సాయంత్రం 5గంటల్లోపు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. నాలుగు ట్రిపుల్‌ఐటీల్లో కలిపి 4,400 సీట్లు ఉండగా, ఆదివారం సాయంత్రానికి 35,500ల దరఖాస్తులు వచ్చినట్లు అడ్మిషన్ల కన్వీనర్ ఆచార్య ఎస్ఎస్ఎస్‌వీ గోపాలరాజు తెలిపారు. పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. కొందరు పదో తరగతి విద్యార్థులు తమ మార్కుల రీ వెరిఫికేషన్‌కు దరఖాస్తు చేసుకున్నారని, వారు తమ మార్కులు పెరిగితే ఆ వివరాలను జూలై 5వ తేదీ సాయంత్రం ఐదు గంటల్లోపు నోటిఫికేషన్‌లో ఇచ్చిన మెయిల్ ఐడీకి మెయిల్ చేస్తే వారి దరఖాస్తు ఫారంలో అప్‌డేట్ చేస్తామని వివరించారు.

ఇద్దరు అన్నలు, మరో ఇద్దరితో కలిసి బాలికపై లైంగిక దాడి

- గర్భం దాల్చిన మైనర్
- నిందితుల అరెస్ట్
- తమిళనాడులో దారుణం

హోసూరు: తోడబుట్టిన అన్న, పెదనాన్న కొడుకు, మేనమామ, మరో యువకుడు కలిసి 17 ఏళ్ల బాలికపై అత్యాచారానికి పాల్పడి గర్భవతిని చేసిన దురాగతం ఆలస్యంగా వెలుగు చూసింది. ఈ కేసులో నలుగురిని ఊత్తంగేరి పోలీసులు శుక్రవారం సాయంత్రం అరెస్ట్ చేసి పోక్సో కేసు నమోదు చేశారు. తమిళనాడు క్రిష్ణగిరి జిల్లా ఊత్తంగేరి సమీపంలోని మారన్‌కొటయ్ గ్రామానికి చెందిన బాలిక తల్లి రెండేళ్ల కిందట కరోనా సమయంలో మృతి చెందింది. బాలిక అన్న ఇన్బరసు, తండ్రితో కలిసి నివాసముంటున్నారు. తండ్రి తాగుడుకు బానిసై ఇంటికి రాకపోవడంతో కొద్ది రోజుల క్రితం అన్న ఇన్బరసు, పెదనాన్న కొడుకు కవియరసన్, మేనమామ చంద్రశేఖరన్, ప్రభుత్వ టాస్‌మార్క్ మద్యం షాపు ఉద్యోగి తమిళ్‌వాణన్‌లు కలిసి బాలికపై అత్యాచారానికి పాల్పడేవారు. గత కొద్ది రోజులుగా బాలిక అనారోగ్యంతో బాధపడుతూ ఉండటంతో గ్రామస్థులు ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీశీలించిన డాక్టర్లు నాలుగు నెలల గర్భిణి అని నిర్ధారించారు. దీంతో కొందరు గ్రామ పెద్దలు ఈ విషయం బయటకు పొక్కకుండా పంచాయితీ చేసి పరిష్కరించాలని తీర్మానించారు. కానీ బాలిక బంధువులు క్రిష్ణగిరిలో శిశు సంక్షేమ అధికారులకు, పోలీసులకు సమాచారమిచ్చారు. వారు బాలికను విచారించగా నలుగురూ తనపై అత్యాచారానికి పాల్పడేవారని చెప్పింది. బాలిక ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ జరిపి ఇద్దరు అన్నలను, మేనమామను, ఉద్యోగిని అరెస్ట్ చేసి పోక్సో కేసు నమోదు చేశారు. బాలికను సంరక్షణాలయానికి తరలించారు.

రైలులో గంజాయి తరలిస్తున్న ముగ్గురి అరెస్ట్

- 20 కిలోల గంజాయి స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న రైల్వే సీఐ శ్రీనివాసాచారి

నెల్లూరు(క్రైమ్): కాకినాడ నుంచి బెంగళూరుకు వెళ్తున్న శేషాద్రి ఎక్స్‌ప్రెస్ రైలులో గంజాయి తరలిస్తున్న ముగ్గురిని ఆదివారం తెల్లవారుజామున రైల్వే పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి 20 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నెల్లూరు రైల్వే సీఐ కె.శ్రీనివాసాచారి ఈ కేసు వివరాలను వెల్లడించారు. కాకినాడ నుంచి బెంగళూరుకు వెళ్తున్న శేషాద్రి ఎక్స్‌ప్రెస్‌లో ముగ్గురు వ్యక్తులు గంజాయిని అక్రమంగా తరలిస్తున్నారని సమాచారం అందడంతో ఉన్నతాధికారులు ఒంగోలు, నెల్లూరు రైల్వే పోలీసులను అప్రమత్తం చేశారు. రైలులో తనిఖీలు చేపట్టి గంజాయిని తరలిస్తున్న బెంగళూరు మీనాక్షి లేఅవుట్ దొడ్డమరలో ఉంటున్న కర్నూలుకు చెందిన కె.ధనుంజయ అలియాస్ రాంబాబు, హెచ్ఎస్ఆర్ లేఅవుట్ ఇబ్బలూరు గ్రామానికి చెందిన చంద్రప్ప అలియాస్ చందు, కర్నూలు జిల్లా జోహరపురానికి చెందిన ధనరాజ్‌ను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.2.50 లక్షల విలువ చేసే 20 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కె.ధనుజయ కొంత కాలంగా కమీషన్ పద్ధతిపై బెంగళూరులోని వ్యాపారులకు గంజాయిని సరఫరా చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఇది లాభసాటిగా ఉండటంతో తమ బంధువులైన చంద్రప్ప, ధనరాజ్‌తో కలిసి గంజాయి అక్రమ రవాణా చేయడం ప్రారంభించాడు. నిందితుల నుంచి గంజాయి విక్రయదారుల వివరాలు సేకరించామని వారిపై కేసులు నమోదు చేస్తామని సీఐ తెలిపారు.

రాష్ట్రంలో మెగా క్రీడా టోర్నీకి తెరలేస్తోంది. ప్రతిభావంతులైన క్రీడాకారులను వెలుగులోకి తేవడమే లక్ష్యంగా రాష్ట్రవ్యాప్తంగా 'ఆడుదాం ఆంధ్రా' పేరుతో క్రీడా సంబరాల నిర్వహణకు ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) చురుగ్గా ఏర్పాట్లు చేస్తోంది. అక్టోబర్ 2న మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా పోటీలు ప్రారంభించేలా ప్రణాళికలు రచిస్తోంది. 17ఏళ్లు పైబడిన బాలబాలికలకు క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, కబడ్డీ, ఖోఖోతో పాటు 3కే మారథాన్, యోగా, టెన్నికాయిట్ వంటి పోటీలను నిర్వహించనుంది. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో సాంప్రదాయ క్రీడల్లోనూ పోటీలను చేపట్టనుంది. గ్రామ, వార్డు సచివాలయ స్థాయి నుంచి క్రీడాకారులను పోటీలకు ఆహ్వానిస్తోంది. మొత్తం ఐదు దశల్లో 2.99 లక్షల మ్యాచ్‌లు, ఈవెంట్స్ జరగనున్నాయి. - సాక్షి, అమరావతి



ఇక ఆడుదాం ఆంధ్రా

రాష్ట్రంలో మెగా క్రీడా టోర్నీ.. క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, కబడ్డీ, ఖోఖో విభాగాల్లో పోటీలు

- 17 ఏళ్లకుపైబడిన బాలబాలికలకు ఆహ్వానం
- గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో స్పోర్ట్స్ కిట్ల పంపిణీ
- మొత్తం ఐదు దశల్లో 2.99 లక్షల మ్యాచ్‌లు/ఈవెంట్లు
- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నేతృత్వంలో ప్రత్యేక కమిటీ పర్యవేక్షణ
- అక్టోబర్ 2న ప్రారంభించేలా కసరత్తు

15వేల గ్రామ/వార్డు సచివాలయాల పరిధిలో..



తొలుత 15 వేల గ్రామ/వార్డు సచివాలయాల పరిధిలో 1.50 లక్షల మ్యాచ్‌లు నిర్వహించనున్నారు. ఇందులో అర్హత సాధిస్తే మండల స్థాయిలో (680 మండలాల్లో) 1.42 లక్షల మ్యాచ్‌లు, వడపోత అనంతరం నియోజకవర్గ స్థాయిలో 5,250, జిల్లా స్థాయిలో 312, రాష్ట్ర స్థాయిలో 250 మ్యాచ్‌లతో పాటు ఫైనల్ పోటీలు చేపట్టి విజేతలను ప్రకటిస్తారు. పోటీల నిర్వహణకు సంబంధించి శాప్.. స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్(ఎస్‌వోపీ)ను సిద్ధం చేసి ఆయా జిల్లా కలెక్టర్లకు పంపించనుంది. ఇప్పటికే పాఠశాలల మైదానాలు, మున్సిపల్ క్రీడా ప్రాంగణాలతో పాటు పోటీలను సమర్థవంతంగా నిర్వహించేందుకు పీఈటీ, పీడీలను గుర్తించే పనిలో నిమగ్నమైంది. స్థానికంగా క్రీడల్లో గుర్తింపు పొందిన వారి సహాయంతో యువతను పెద్ద ఎత్తున పోటీలకు హాజరయ్యేలా ప్రోత్సహించనుంది.

స్పోర్ట్స్ కిట్స్ పంపిణీ..

'ఆడుదాం ఆంధ్రా' క్రీడా పోటీలకు సుమారు మూడు నెలల సమయం ఉండటంతో గ్రామ/వార్డు సచివాలయ స్థాయిలో క్రీడాకారులను గుర్తించి.. వారు మంచి తర్ఫీదు పొందేలా శాప్ ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తోంది. ఇందులో భాగంగా ఆయా సచివాలయాల పరిధిలో బాలబాలికలకు విడివిడిగా స్పోర్ట్స్ కిట్లను అందించనుంది. బ్యాడ్మింటన్ రాకెట్లు, రింగ్‌లు, క్రికెట్ కిట్, వాలీబాల్‌లు సమకూర్చనుంది. 26 జిల్లాల వారీగా ఎన్ని కిట్లు అవసరమో.. వాటి జాబితాను సిద్ధం చేస్తోంది.

సీఎస్ పర్యవేక్షణలో..

ప్రభుత్వం యువతలో క్రీడా స్ఫూర్తిని పెంచడానికి, ఆరోగ్యకర సమాజ నిర్మాణానికి 'ఆడుదాం ఆంధ్రా' కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపడుతోంది. ఏటా దీన్ని నిర్వహించేందుకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి చైర్మన్‌గా 13 మందికిపైగా వివిధ శాఖల ఉన్నతాధికారులతో రాష్ట్ర స్థాయిలో అపెక్స్ కమిటీని నియమించింది. పోటీలకు హాజరయ్యే క్రీడాకారులకు భోజన, వసతి సౌకర్యాలు కల్పించడంతో పాటు టోర్నీ నిర్వహణ, విజేతలకు బహుమతుల పంపిణీ తదితర అంశాలపై కమిటీ సమగ్రంగా అధ్యయనం చేస్తోంది. ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని గుర్తించి భవిష్యత్తులో మంచి శిక్షణ అందించనుంది. తద్వారా వారు జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో సత్తా చాటేలా తీర్చిదిద్దనుంది.

క్రీడా శక్తిని పెంపొందిస్తాం..



యువతకు చదువు ఒక్కటే కాదు.. క్రీడలు కూడా ఉండాలి. అందుకే ప్రభుత్వం 'ఆడుదాం ఆంధ్రా' ద్వారా పెద్ద ఎత్తున క్రీడా శక్తిని పెంపొందిస్తోంది. దాదాపు నెలన్నర రోజుల పాటు ఈ పోటీలు ఉంటాయి. ఆరోగ్యకర జీవనశైలికి క్రీడలు ఎంతో ఉపయోగపడతాయి. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభ కలిగిన క్రీడాకారులను వెలుగులోకి తీసుకొచ్చేందుకు ఈ క్రీడలు మేలు చేస్తాయి. ఈ పోటీల నిర్వహణలో రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ శాఖలు భాగమవుతాయి. క్రీడాకారులకు అవసరమైన స్పోర్ట్స్ కిట్లను పంపిణీ చేస్తాం. పోటీలకు క్రీడా ప్రాంగణాలను గుర్తించి అభివృద్ధి చేస్తాం. – జి.వాణీమోహన్, ముఖ్య కార్యదర్శి, క్రీడలు, యువజన సర్వీసులు

గంగమ్మకూ నీటి కష్టాలు!

హిమాలయాల్లో శరవేగంగా కరిగిపోతున్న హిమనీ నదాలు

- భూఉపరితల ఉష్ణోగ్రతలు పెరగడమే కారణం
- గంగా సహా 12 నదుల్లో నీటి కొరత ఖాయం
- ఐసీఐఎంవోడీ తాజా అధ్యయనంలో వెల్లడి



సాక్షి, అమరావతి: తన తాత ముత్తాతలకు సద్గతుల ప్రాప్తి కోసం భగీరథుడు దివి నుంచి భువికి రప్పించిన గంగమ్మకూ నీటి కష్టాలు తప్పేలా లేవు. ప్రస్తుతం జీవ నదులైన గంగ, బ్రహ్మపుత్ర, సింధు, తీస్తా సహా 12 నదుల్లో ప్రవాహం 2100 నాటికి వర్షాలపైనే ఆధారపడే పరిస్థితి రావచ్చు. మన దేశంతోపాటు పాకిస్తాన్, బంగ్లాదేశ్ సహా ఆసియా ఖండంలోని 16 దేశాల్లో 167.40 కోట్ల మంది ప్రజలకు తాగునీటికి ఇబ్బందులు తప్పవని చెబుతోంది ఇంటర్నేషనల్ సెంటర్ ఫర్ ఇంటిగ్రేటెడ్ మౌంటెయిన్ డెవలప్‌మెంట్ (ఐసీఐఎంవోడీ) సంస్థ ఈ నెల 20న విడుదల చేసిన అధ్యయన నివేదిక. ఇందుకు ప్రధాన కారణం.. ఆ జీవ నదులకు జన్మ స్థానమైన హిమాలయ పర్వతాల్లోని హిందూకుష్ శ్రేణుల్లో హిమనీ నదాలు శరవేగంగా కరిగిపోతుండటమేనని తేల్చింది. వాతావరణ మార్పులు, భూఉపరితల ఉష్ణోగ్రతలు పెరుగుతుండటం వల్లే హిమనీ నదాలు వేగంగా కరిగిపోతున్నాయని పేర్కొంది. ప్రస్తుతం హిందూకుష్ పర్వత శ్రేణుల్లోని హిమనీ నదాల పరిమాణం 2010 నాటికి 80 శాతానికి తగ్గిపోవడం ఖాయమని అంచనా వేసింది.

ఆసియా ఖండపు నీటి శిఖరం

ధ్రువ ప్రాంతాల తర్వాత భూగోళంపై అతి పెద్ద హిమనీ నదాలకు నిలయం హిందూకుష్ పర్వత శ్రేణులే కావడం గమనార్హం. హిమాలయ పర్వత శ్రేణుల్లోని హిందూకుష్ పర్వత శ్రేణుల్లోనే గంగా, బ్రహ్మపుత్రా, సింధు, తీస్తా సహా 12 నదులు పురుడు పోసుకుని మనదేశంతోపాటు పాకిస్తాన్, చైనా, మయన్మార్, బంగ్లాదేశ్ తదితర 16 దేశాల్లో ప్రవహించి సముద్రంలో కలుస్తాయి. ఈ నదులకు ప్రధాన ఆధారం హిందూకుష్ పర్వత శ్రేణుల్లోని హిమనీ నదాలే.

హిమపాతంలో గణనీయంగా తగ్గుదల

కాలుష్యంతో వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పుల వల్ల హిందూకుష్ పర్వత శ్రేణుల్లో హిమపాతం గణనీయంగా తగ్గుముఖం పడుతోందని ఐసీఐఎంవోడీ అధ్యయనంలో వెల్లడైంది. 1971 నుంచి 2000 సంవత్సరాల మధ్య హిందూకుష్ పర్వత శ్రేణుల్లో అంచనా వేసిన దానికంటే హిమపాతంలో సగటున 15 శాతం తగ్గుదల కనిపించిందని తెలిపింది. దీన్ని పరిగణలోకి తీసుకుంటే.. 2070 నుంచి 2100 సంవత్సరాల మధ్యలో అంచనా వేసిన దాని కంటే సింధూ బేసిన్‌లో 30 నుంచి 50, గంగా బేసిన్‌లో 50 నుంచి 60, బ్రహ్మపుత్రా బేసిన్‌లో 50 నుంచి 70 శాతం హిమపాతం తగ్గుతుందని అంచనా వేసింది.

శరవేగంగా కరుగుతున్న మంచు

2000 సంవత్సరం నుంచి 2009 మధ్య ఏటా సగటున 0.18 మీటర్ల మేర హిమనీ నదాల పరిమాణం తగ్గితే.. 2010 నుంచి 2019 మధ్య అది 0.28 మీటర్లకు పెరిగిందని ఐసీఐఎంవోడీ తెలిపింది. అంటే.. 2000–2009తో పోల్చితే 2010–2019 మధ్య హిమనీ నదాల మంచు కరుగుదల 65 శాతం పెరిగినట్టు స్పష్టమవుతోంది. మంచు శరవేగంగా కరుగుతుండటం వల్ల 2100 సంవత్సరం నాటికి హిందూకుష్ పర్వత శ్రేణుల్లోని హిమనీ నదాల పరిమాణం 80 శాతం తగ్గుతుందని లెక్కగట్టింది. దీనివల్ల గంగా, సింధు, బ్రహ్మపుత్ర సహా 12 నదుల్లో వర్షాకాలం తప్ప మిగతా సమయాల్లో నీటి ప్రవాహం ఉండే అవకాశాలు తక్కువని అంచనా వేసింది. ఇది ఆ నదీ పరీవాహక ప్రాంతాల్లోని 167.40 కోట్ల మంది ప్రజల జీవనోపాధులను తీవ్రంగా దెబ్బతీస్తుందని ఆందోళన వ్యక్తం చేసింది. హిమపాతం తగ్గడం వల్ల 1979 నుంచి 2019 మధ్య గంగా, బ్రహ్మపుత్ర, సింధు బేసిన్‌లలో నీటిలభ్యత తగ్గడం వల్ల 1.29 కోట్ల మంది రైతుల జీవనోపాధులు దెబ్బతిన్నాయని తమ అధ్యయనంలో తేలిందని ఐసీఐఎంవోడీ వెల్లడించింది.

నిజాయితీ రాజకీయాలతోనే దేశం బాగు

మాజీ ఉప రాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడు



అనకాపల్లి టౌన్: రైతు సమస్యల్ని తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేసిన మాజీ ఎంపీ వీవీ రమణ ప్రజల జీవితాల్లో చెరగని ముద్ర వేసుకున్నారని మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు అన్నారు. స్థానిక పెంటకోట కన్వెన్షన్ హాల్‌లో మాజీ మంత్రి దాడి వీరభద్రరావు ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన మాజీ ఎంపీ వీవీ రమణ శతజయంతి ఉత్సవాలకు వెంకయ్యనాయుడు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. నీతి, నిజాయితీలతో కూడిన రాజకీయాలు చేయడం ద్వారా దేశాన్ని బాగు చేయవచ్చన్నారు. అన్నం పెట్టే రైతును కాపాడుకోవాల్సిన బాధ్యత యువతపై ఉందన్నారు. బూతులు మాట్లాడే రాజకీయ నాయకులకు పోలింగ్ బూత్‌లోనే సమాధానం చెప్పాలన్నారు. రాజకీయాల్లో మంచి వ్యక్తులను ఎన్నుకోవాలని పిలుపునిచ్చారు.

వీవీ రమణ ధన్యజీవి: తుమ్మపాల సుగర్ ఫ్యాక్టరీ నెలకొల్పి చెరకు రైతులకు, నిరుద్యోగులకు ఉపాధి కల్పించిన మహావ్యక్తి వీవీ రమణ అని వెంకయ్యనాయుడు కొనియాడారు. మాజీ మంత్రి దాడి వీరభద్రరావు మాట్లాడుతూ.. తుమ్మపాల సుగర్ ఫ్యాక్టరీ అభివృద్ధికి 15 రోజుల్లో రూ.60 లక్షల్ని వీవీ రమణ ఖర్చు చేశారన్నారు. 1965లో దేశప్రధాని వద్దకు అనకాపల్లి నుంచి 391 మంది రైతులను తీసుకెళ్లి టీ పార్టీ ఇచ్చిన ఘనత వీవీ రమణకే దక్కిందన్నారు. రమణ శతజయంతిని పురస్కరించుకుని సావనీర్‌ను అవిష్కరించారు.

విశాఖపట్నం పోర్టు నుంచి కొత్త కంటైనర్



సాక్షి, విశాఖపట్నం: కార్గో సర్వీసుల వృద్ధిలో విశాఖపట్నం పోర్టు అథారిటీ (వీపీఏ) దూకుడు ప్రదర్శిస్తోంది. ఇందులో భాగంగా.. పోర్టులో మరో కొత్త కంటైనర్ సర్వీస్‌ను పోర్టు అధికారులు ఆదివారం సాయంత్రం ప్రారంభించారు. సింగపూర్ నుంచి మలేషియాలోని వెస్ట్ క్లాంగ్ పోర్టు మీదుగా చెన్నై నుంచి విశాఖపట్నంకు సర్వీసు ప్రారంభమైంది. ఎంవీ సఫీన్ పయనీర్ కార్గో షిప్ ఈ సర్వీసులో మొదటిసారిగా ప్రయాణం మొదలుపెట్టింది.

బియ్యం గింజపై సీఎం జగన్ చిత్రం



బియ్యం గింజపై సీఎం జగన్ చిత్రాన్ని గీచి అబ్బురపరిచాడు కర్నూలు జిల్లా ఎమ్మిగనూరుకు చెందిన సూక్ష్మకళాకారుడు బారికి చంద్రశేఖర్. కొబ్బరి పీచును ఉపయోగించి గీచిన ఈ చిత్రాన్ని చూసి స్థానికులు అభినందిస్తున్నారు. – ఎమ్మిగనూరుటౌన్

10 లక్షల జనాభాకు ఓ మెడికల్ కాలేజీ

కొత్త మెడికల్ కాలేజీల ఏర్పాటుపై ఎన్ఎంసీ ముసాయిదా మార్గదర్శకాలు

సాక్షి, హైదరాబాద్: 10 లక్షల జనాభా కలిగిన ప్రాంతంలో కొత్త మెడికల్ కాలేజీ స్థాపన కోసం దరఖాస్తు చేసుకోవచ్చని జాతీయ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) స్పష్టం చేసింది. అయితే ఇప్పటికే ఆ ప్రాంతంలో ఎలాంటి మెడికల్ కాలేజీ ఉనికిలో ఉండకూడదని పేర్కొంది. కొత్త మెడికల్ కాలేజీ స్థాపన నిబంధనలు, ఎంబీబీఎస్‌లో సీట్ల పెంపుదలకు సంబంధించి ఎన్ఎంసీ తాజాగా ముసాయిదా మార్గదర్శకాలు జారీచేసింది. 2024–25 వైద్య విద్యా సంవత్సరం నుంచి ఇవి అమలులోకి వస్తాయని పేర్కొంది. కొత్త మెడికల్ కాలేజీలకు 50/100/150 సీట్ల వరకే అనుమతి ఇస్తామని, అంతకంటే ఎక్కువ సీట్లు కేటాయించబోమని పేర్కొంది. అయితే గతంలోనే అధిక సీట్ల కోసం (150కు మించి) దరఖాస్తు చేసుకుంటే దాన్ని పరిగణలోకి తీసుకుంటామంది. కొత్త మార్గదర్శకాలకు అనుగుణంగా ఉన్న కాలేజీలకు మాత్రమే ఎంబీబీఎస్ అడ్మిషన్లు కొనసాగించడానికి అర్హత కలిగి ఉంటాయని పేర్కొంది.

గ్రామీణ ఆసుపత్రులతో అనుసంధానం

కొత్తగా అనుమతి తీసుకునే మెడికల్ కాలేజీకి అనుబంధంగా గ్రామీణ ఆరోగ్య శిక్షణ కేంద్రాలు/కమ్యూనిటీ హెల్త్/ అర్బన్ హెల్త్ సెంటర్లు ఉండాలి. ఒక్కో కేంద్రానికి 15 మంది విద్యార్థులను ఇంటర్న్‌గా పంపేలా ఉండాలి. ఈ కేంద్రాలు మెడికల్ కాలేజీ యాజమాన్యంలో లేదా ప్రభుత్వంలోని ఆరోగ్య కేంద్రానికి చెందినవిగా ఉండాలి. నగరాల్లో మినహా ఈ ఆరోగ్య కేంద్రాలు 30 కిలోమీటర్ల దూరంలో ఉండాలి.

బయోమెట్రిక్ హాజరు

మెడికల్ కాలేజీల్లో ఆధార్ ఆధారిత బయోమెట్రిక్ హాజరు వ్యవస్థను ఏర్పాటు చేయాలని ఎన్ఎంసీ సూచించింది.

తెలంగాణ

ఢిల్లీలో పొంగులేటి, జూపల్లి టీం

- నేడు ఖర్గే, రాహుల్‌తో సమావేశం

సాక్షి, హైదరాబాద్/సాక్షి, న్యూఢిల్లీ: బీఆర్ఎస్ అసంతృప్త నేతలైన మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు రంగం సిద్ధమైంది. సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు ఏఐసీసీ కార్యాలయంలో వారిద్దరూ తమ ముఖ్య అనుచరులతో కలసి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేత రాహుల్ గాంధీని కలవనున్నారు. ఇందు కోసం ఆదివారం రాత్రి 9 గంటలకు వారు ఢిల్లీ చేరుకున్నారు. ఈ కార్యక్రమం కోసం నలుగురు ఏఐసీసీ ఇన్‌చార్జీలతోపాటు 22 మంది రాష్ట్ర కాంగ్రెస్ నేతలకు ఆహ్వానం అందింది. పొంగులేటి, జూపల్లి బృందంపాటు రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, పార్టీ ముఖ్య నేతలకు ఢిల్లీకి రావాల్సిందిగా ఆహ్వానం అందింది. వీరంతా ఖర్గే, రాహుల్ గాంధీని కలసి తెలంగాణ రాజకీయాలపై చర్చించనున్నారు. ఈ సమావేశంలోనే ఖమ్మంలో పొంగులేటి బృందం పార్టీలో చేరిక, మల్లు భట్టి విక్రమార్క పాదయాత్ర ముగింపు సందర్భంగా నిర్వహించాల్సిన బహిరంగ సభ తేదీలు కూడా ఖరారు కానున్నట్లు కాంగ్రెస్ వర్గాలు వెల్లడించాయి.

డ్రగ్స్ వివాదంలోకి మా పేర్లు లాగొద్దు: సురేఖవాణి

సాక్షి,హైదరాబాద్: డ్రగ్స్ కేసులో టాలీవుడ్ నిర్మాత కేపీ చౌదరి పట్టుబడినప్పట్నుంచి డ్రగ్స్ వ్యవహారంతో తమకు సంబంధాలున్నాయంటూ మీడియా తమ పేర్లు జొప్పించడం సరికాదని, తమ కుటుంబంపై ఈ విధమైన తప్పుడు ఆరోపణలు చేయడం సరికాదని సినీనటి సురేఖ వాణి పేర్కొన్నారు. డ్రగ్స్ వ్యవహారంలో తమకు ఎటువంటి సంబంధంలేదని ఆమె స్పష్టం చేశారు. ఇలాంటి తప్పుడు ఆరోపణలు, దుష్ప్రచారం వల్ల తమ కుటుంబానికి హాని ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఫోన్ ద్వారా ఆదివారం ఆమె 'సాక్షి'తో మాట్లాడారు. సినీ, మీడియా రంగంలో స్నేహపూర్వక సంబంధాలే ఉన్నాయని, అయినా తమపై ఇలా దుష్ప్రచారం చేయడం సమంజసం కాదన్నారు.


బుల్లి దేశంలో బోలెడు భాషలు

పపువా న్యూ గినియాలో వాడుకలో 840 భాషలు

453 భాషలతో 4వ స్థానంలో భారత్	ఒకే ఒక భాష మాట్లాడే దేశంగా ఉత్తర కొరియా రికార్డు	ప్రపంచవ్యాప్తంగా 6,500కు పైగా భాషలు వాడుకలో ఉన్నట్లు అంచనా

అధిక భాషలు వాడుకలో ఉన్న టాప్-10 దేశాలు

దేశం	భాషల సంఖ్య
పపువా న్యూ గినియా	840
ఇండోనేసియా	710
నైజీరియా	524
భారత్	453
అమెరికా	335
ఆస్ట్రేలియా	319
చైనా	305
మెక్సికో	292
కామెరూన్	275
బ్రెజిల్	228



ప్రపంచంలోని ప్రతి వ్యక్తి తన ఆలోచనలను ఇతరులకు తెలియజేయాలన్నా.. ఇతరులు చెప్పేవి అర్థం చేసుకోవాలన్నా 'భాష' ముఖ్యం. ప్రపంచవ్యాప్తంగా 6,500కు పైగా భాషలు వాడుకలో ఉండగా.. అందులో 840 భాషలు పపువా న్యూ గినియా అనే చిన్న దేశంలో వాడుకలో ఉన్నట్లు వెల్లడయ్యింది. దీంతో ప్రపంచంలోనే అత్యధిక భాషలు వాడుకలో ఉన్న దేశంగా పపువా న్యూ గినియా రికార్డులకెక్కింది. ఆసియా, ఆస్ట్రేలియా ఖండాల మధ్యలో 4,62,840 కి.మీ విస్తీర్ణంలో ఉన్న ఈ దేశ జనాభా 94 లక్షలే. కానీ ఇప్పటికీ అక్కడి ప్రజలు 840 భాషల్లో మాట్లాడుకుంటూ ఉంటారు. అక్కడ ఇంగ్లిష్ అధికార భాష కాగా.. హిరిమోటు, పీఎన్‌జీ సింగ్, టోక్ పిసిన్ తదితర భాషలను ఎక్కువగా ఉపయోగిస్తుంటారు. ఇక ఇండోనేసియా 710 భాషలతో రెండో స్థానంలో నిలిచింది. నైజీరియా 524 భాషలతో మూడో స్థానంలో, భారత్ 453 భాషలతో 4వ స్థానంలో నిలిచాయి. ఉత్తర కొరియా ప్రజలు.. కొరియన్ తప్ప ఇతర భాషలను ఉపయోగించరు.ఆ తర్వాత వాటికన్ సిటీలో రెండు, ఐస్‌ల్యాండ్‌లో రెండు, దక్షిణ కొరియాలో 5 భాషలే వాడకలో ఉన్నాయి. అలాగే అత్యధిక దేశాల్లో ఇంగ్లిష్ భాషను ఉపయోగిస్తున్నట్లు వెల్లడైంది. 67 దేశాల్లో ఇంగ్లిష్, 29 దేశాల్లో ఫ్రెంచ్, 27 దేశాల్లో అరబిక్, 21 దేశాల్లో స్పానిష్, 10 దేశాల్లో పోర్చుగీస్, ఆరు దేశాల్లో జర్మన్, నాలుగు దేశాల్లో రష్యన్ భాష వాడుకలో ఉంది.

పాఠశాలల్లో పేరెంట్స్ కమిటీ సమావేశాలు

సాక్షి, అమరావతి: నూతన విద్యా సంవత్సరంలో రాష్ట్రంలోని అన్ని యాజమాన్యాల్లోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో పేరెంట్స్ కమిటీ సమావేశాలు నిర్వహించేందుకు పాఠశాల విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. సోమ, మంగళ వారాల్లో తప్పనిసరిగా సమావేశాలు ఏర్పాటు చేసి, జిల్లా విద్యాశాఖాధికారి, ఉప విద్యాశాఖాధికారి, సెక్టోరల్ మండలాధికారి, మండల విద్యాశాఖాధికారులు పాల్గొని వివరాలను నమోదు చేయనున్నారు. ఇప్పటికే ఆయా కమిటీలకు సమాచారం ఇచ్చిన స్థానిక అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేశారు. ఈ సమావేశంలో జగనన్న ఆణిముత్యాలు అవార్డుల ప్రదానం సందర్భంగా సీఎం చేసిన ప్రసంగాన్ని యూట్యూబ్ లింకు ద్వారా లేదా ఆ ప్రసంగాన్ని చదివి సభ్యులకు వినిపించనున్నారు. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలల్లో తీసుకువచ్చిన విప్లవాత్మక మార్పులు, మనబడి నాడు–నాడు, అమ్మ ఒడి, జగనన్న విద్యాకానుక, జగనన్న గోరుముద్ద, జగనన్న ఆణిముత్యాలు, ఇంగ్లిష్ మీడియంలో బోధన, సబ్జెక్టు టీచర్ల నియామకం, టోఫెల్ ప్రైమరీ, జూనియర్ శిక్షణ ద్వారా విద్యార్థులకు కలిగే లబ్ధి, ఉన్నత పాఠశాలల్లో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్, స్మార్ట్ టీవీల ద్వారా డిజిటల్ బోధన వంటి అంశాలు వివరిస్తారు. ప్రతి మండలంలో బాలికల కోసం జూనియర్ కాలేజీ ఏర్పాటు, విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు వైద్య పరీక్షలు, వంటి వివరాలను తల్లిదండ్రులకు వివరించనున్నారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza,2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22.Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943